# క్రాంతి


లోపలి పేజీల్లో...

| | |
|---|---|
| ట్రాన్స్ పసిఫిక్ భాగస్వామ్యం ...... | 6 |
| సంఘ్ శక్తుల చేతుల్లో మోడీ పాలన..... | 10 |
| నరహంతకుడు నయీం ...... | 17 |
| 5 రాష్ట్రాల బూటకపు ఎన్నికలు...... | 20 |
| బస్తర్ మిషన్ - 2016 ...... | 23 |
| తెలంగాణలో విస్థాపనల సమస్య...... | 27 |
| సీ.సీ. సందేశం ...... | 31 |
| బాక్సైట్ వ్యతిరేక పోరాటం ...... | 38 |
| రైతాంగ ఆత్మహత్యలు ...... | 40 |
| అమరవీరుల జీవిత చరిత్రలు ...... | 43 |
| కా. బొజ్జా తారకంకు జోహార్లు...... | 52 |
| మహాశ్వేతాదేవికి జోహార్లు ..... | 54 |



సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., తెలంగాణ, ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక


సంపుటి: 40 సంచిక: 1 సెప్టెంబర్ - 2016 వెల: పది రూపాయలు


## కశ్మీర్‌లో చెలరేగుతున్న ఆందోళనలకు భారత కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి!

## 'ఆజాద్ కశ్మీర్' కశ్మీర్ ప్రజల జన్మహక్కు!!

## కశ్మీర్ ప్రజల న్యాయమైన కోరికలకు మద్దతు నివ్వాలి!!!

కశ్మీర్‌లో ప్రజల ఆగ్రహజ్వాలలు హిమాలయ పర్వతాల శిఖరాగ్రాన్ని అంటుకున్నాయి. కశ్మీర్ వీధులు ప్రదర్శనలతో అట్టుడుకుతున్నాయి. జులై 8న ప్రారంభమైన ఈ ప్రదర్శనలు ఇప్పటికీ తీవ్రంగా సాగుతున్నాయి. 8 సంవత్సరాల బాలుడి నుండి పండు ముసలి వరకు, ఈ ప్రదర్శనల్లో పాల్గొంటున్నారు. లక్షలాది మంది పాల్గొనే ఈ ప్రదర్శనలపై ప్రభుత్వ బలగాలు నిత్యం కాల్పులు జరుపుతున్నాయి. కశ్మీర్ ప్రజలు ప్రభుత్వ బలగాలపై రాళ్లు విసురుతున్నారు. ఈ పోరాటాలు కశ్మీర్‌లోని ప్రతి వీధికి విస్తరించాయి. ప్రభుత్వం ఈ ప్రజల తిరుగుబాటును అణచడానికి ఆపరేషన్ "కామ్ డౌన్" చేపట్టి 10 జిల్లాల్లో కర్ఫ్యూ విధించి, ప్రతి వీధిలో సాయుధ బలగాలను నియమించింది. ఈ ఆందోళన ప్రారంభమైన తర్వాత కేంద్ర ప్రభుత్వం అదనపు బలగాలను హుటాహుటిన కశ్మీర్‌కు పంపించింది. కశ్మీర్ ప్రజా ఆందోళనను అణచడానికి 8 లక్షల సైన్యం, పారా మిలిటరీ బలగాలు పనిచేస్తున్నాయి. పారా మిలిటరీ బలగాలు జరుపుతున్న కాల్పుల్లో 90 మందికి పైగా ఆందోళనకారులు చనిపోయారు. 250 మంది అంధులయ్యారు. వేలాది మంది గాయపడ్డారు. పోలీసులు జరుపుతున్న పెలెట్ గన్స్ కాల్పుల్లో అనేక మందికి తీవ్ర గాయాలు కావడంతో పాటు కంటి చూపును కోల్పోతున్నారు. కంటి చూపు కోల్పోతున్న వారిలో 8 సంవత్సరాల పిల్లల నుండి యువకుల వరకు అనేక మంది ఉన్నారు. పోలీసులు వీరిని ప్రధానంగా టార్గెట్ చేస్తూ ఛాతి పై భాగాన కాల్పులు జరిపి గాయాలపాలు చేస్తున్నారు. కశ్మీర్‌లో పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది.



ఈసారి కశ్మీర్ ప్రజల ఆందోళన జులై 8న బుర్హాన్ ముజఫర్ వనీ అతని అనుచరుల ఎన్‌కౌంటర్ సంఘటనతో పెల్లుబికింది. బుర్హాన్ వనీ శవయాత్రలో మూడు లక్షలమంది ప్రజలు పాల్గొన్నారు. ఈ శవయాత్రలో ప్రజలు

ఈ శవయాత్రలో ప్రజలు 'ఆజాదీ కశ్మీర్' నినాదాన్ని అందుకున్నారు. ఇది కశ్మీర్ చరిత్రలో అపూర్వమైన ఘటనగా నిలిచింది. బుర్హాన్ వనీ 2010లో పోరాటకారుల్లో కలిసి ఆజాద్ కశ్మీర్ కోసం గెరిల్లా యుద్ధాన్ని ఎంచుకున్నారు. ఒక రోజు బుర్హాన్ వనీ, అతని అన్నతో కలిసి మోటారు సైకిల్‌పై వెళుతున్నప్పుడు పోలీసులు అకారణంగా నిర్బంధించి వారిని చితకబాదారు. ఈ సంఘటనకు చలించిపోయిన బుర్హాన్ వనీ 15 ఏళ్ల వయస్సులోనే హిజిబుల్ కమాండర్‌గా మారాడు. గత సంవత్సరం పోలీసులు బుర్హాన్ వనీ అన్నను అరెస్టు చేసి బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపేశారు. గెరిల్లా పోరాటాన్ని ఎందుకు చేపట్టాల్సి వచ్చిందో అంటూ బుర్హాన్ వనీ సామాజిక మాధ్యమాల్లో తమ సహచరులతో కలిసి ఫోటోలతో పాటు సందేశాన్ని పెట్టారు. అప్పట్లో యిది చాల సంచలన వార్తగా మారింది. అప్పటినుండి ఆజాదీకాశ్మీర్ కోసం సామాజిక మాధ్యమాల్లో బుర్హాన్ వనీ ప్రకటనలు కశ్మీర్ సమాజంలో మంచి ప్రభావాన్ని చూపుతూ వచ్చాయి. బుర్హాన్ వనీ దక్షిణ కశ్మీర్‌లోని పుల్‌గామ్ జిల్లాలోని త్రాల్ నివాసి. విద్యాధిక మధ్యతరగతి కుటుంబంలో పుట్టినాడు. ఆయన తాత ప్రభుత్వ ఉద్యోగిగా పని చేయగా, తండ్రి స్కూల్ హెడ్ మాస్టారుగా పని చేస్తున్నాడు. తల్లి పోస్ట్ గ్రాడ్యుయేట్. బుర్హాన్ వనీ 10వ తరగతిలో మొదటి తరగతిలో ఉత్తీర్ణుడయ్యాడు. చిన్న వయస్సులో ఉన్నత ఆశయానికి అంకితం కావడం, కశ్మీర్ ప్రజల ఆకాంక్షలపై పరిపక్వమైన రాజకీయ ప్రకటనివ్వడం, త్యాగాలకు సిద్ధపడడంతో బుర్హాన్ వనీ ఈ తరాన్ని చాలా ప్రభావితం చేశాడు. బుర్హాన్ వనీ బ్రతికి ఉన్నప్పుడే కాకుండా చనిపోయిన తర్వాత కూడ ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాడు.

**కశ్మీర్ ప్రజల ఉజ్వలమైన పోరాట వారసత్వం**

ఈసారి ప్రజ్వరిల్లిన ప్రజాందోళనల్లాగానే 2008, 2010 సంవత్సరాల్లో కూడ కశ్మీర్ అంతటా ఆందోళనలు గుప్పుమని లేచాయి. అప్పుడు కుప్‌వారా జిల్లాలో ముగ్గురు యువకులను ప్రభుత్వ బలగాలు బూటకపు ఎన్‌కౌంటర్ చేసి చంపివేసిన సంఘటన అగ్నికి ఆజ్యంపోస్తే, ఈసారి బుర్హాన్ వనీ ఎన్‌కౌంటర్ అందుకు దోహదం చేసింది. అయితే అప్పుడు, ఇప్పుడు కూడ కశ్మీర్ ప్రజల దీర్ఘకాల డిమాండ్ 'ఆజాదీ కశ్మీర్' అనే విషయం పరమ సత్యం. అందుకు ఈ రోజు ప్రదర్శనల్లో ఆజాదీ కశ్మీర్ నినాదం మారుమ్రోగుతున్నది. 'ఆజాదీ కశ్మీర్' ప్రజల ఆకాంక్ష వెనుక పెద్ద చరిత్ర ఉంది. మొట్టమొదటి సారి కశ్మీర్‌ను 1589, జూన్ 28న అక్బర్ మొఘలు సైన్యాలు ఆక్రమించాయి. మొఘలుల పరిపాలన 166 సంవత్సరాలు సాగింది. మొఘలు సైన్యాలు కశ్మీర్ ఆక్రమించిన నాటి నుండే స్వతంత్ర కశ్మీర్ ఆకాంక్ష ప్రజల్లో మొదలైంది. 1814 సంవత్సరంలో కశ్మీర్‌ను మహారాజా రంజిత్‌సింగ్ ఆక్రమించుకునే నాటికి మొఘలుల పరిపాలన తర్వాత ఆ మధ్య కాలంలో అఫ్ఘాన్‌ల పరిపాలన సాగింది. జమ్మూలోని దోగ్రా రాజు అయిన గులాబ్‌సింగ్‌కు 1846 మార్చ్ 16న జరిగిన అమృత్‌సర్ సంధి ద్వారా రంజిత్‌సింగ్ కశ్మీర్‌ను దఖలు పర్చాడు. గులాబ్‌సింగ్ బ్రిటీష్ వారితో మంచి సంబంధాలు కలిగి ఉన్నాడు. బ్రిటీష్ వారు భారతదేశాన్ని 1947 లో విడిచి పోయేనాటికి కశ్మీర్‌ను దోగ్రా రాజైన హరిసింగ్ పరిపాలిస్తున్నాడు. దోగ్రా (హిందువులు) రాజులు కశ్మీర్‌లో పరమ నిరంకుశత్వాన్ని అమలు పరిచారు. రాజా హరిసింగ్ పరిపాలన కూడా అలాంటిదే.

స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో తలెత్తిన కశ్మీర్ ప్రజల ఆందోళనకు తట్టుకోలేక రాజా హరిసింగ్ శ్రీనగర్ నుండి పారిపోయి జమ్మూ ప్రాంతంలో తలదాచుకున్నాడు. బ్రిటన్ భారతదేశానికి 'స్వతంత్రం' ప్రకటిస్తూ దేశ విభజనకు తలపెట్టినప్పుడు కశ్మీర్‌ను భారతదేశంలో భాగం చేసింది. భారతదేశంలోని 500 సంస్థానాలను నెహ్రూ ప్రభుత్వం విలీనం చేసుకునే ప్రక్రియ సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో కొనసాగింది. ఇందులో జూనాగఢ్, నైజాం, కశ్మీర్ సంస్థానాలు భారతదేశంలో విలీనం కావడానికి నిరాకరించాయి. వీటిపై నెహ్రూ ప్రభుత్వం సామ- దాన- బేధ దండోపాయాలను ప్రయోగించింది. జూనాగఢ్ సర్దార్ వల్లభాయ్‌కు తొందరలోనే లొంగిపోయినప్పటికీ నైజాం సంస్థానం పైకి భారత సైన్యాన్ని పంపి లొంగదీసుకోవాల్సి వచ్చింది. కశ్మీర్‌లో మాత్రం అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. నెహ్రూ ప్రభుత్వం కశ్మీర్ ప్రజల వ్యతిరేకతకు గురైన రాజా హరిసింగ్‌తో విలీన ఒప్పందంపై సంతకం పెట్టించుకున్నాడు. అప్పటికే కశ్మీర్‌పై పాకిస్థాన్‌లోని పఠానులు దాడి చేసి ఆక్రమించుకోవడానికి ప్రయత్నించగా, సర్దార్ వల్లభాయ్ పటేల్ కశ్మీర్ లోయకు హుటాహుటిన విమానాల్లో సైన్యాన్ని పంపి కశ్మీర్‌ను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. అప్పటినుండి కశ్మీర్ భారత, పాకిస్థాన్ దేశాల మధ్య భూభాగంగా మారింది. కశ్మీర్‌లో కశ్మీర్ లోయ, జమ్మూ, లడాఖ్ ప్రాంతాలు భారత భూభాగంలో ఉండగా, కశ్మీర్‌లోని కొంత ప్రాంతం పాకిస్థాన్‌లో భాగంగా ఉంది. దీనినే 'పాక్ ఆక్రమిత కశ్మీర్' అని అంటారు. బ్రిటన్ విభజించి పాలించే పాలసీ క్రింద భారతదేశం, పాకిస్థాన్ దేశాల మధ్య కశ్మీర్ ప్రజల స్వాతంత్ర్య ఆకాంక్ష అణచివేయబడింది. అది యిప్పటికీ ప్రజ్వరిల్లుతూనే ఉంది. అయితే 1948లో ఐక్యరాజ్యసమితి భారత్ కశ్మీర్‌లో ప్లెబిసైట్ / ప్రజాభిప్రాయం నిర్వహించాలని తీర్మానించింది. నెహ్రూ ప్రభుత్వం అందుకు అంగీకరించి తదుపరి ఆ నిర్ణయాన్ని కాలరాచింది.

'స్వతంత్ర' భారతదేశంలో కశ్మీరీ ప్రజలు 1989లో మరొక

పెద్ద ఆందోళనను చేపట్టారు. ఈ ఆందోళన గెరిల్లా యుద్ధంగా 1991 నాటికి అభివృద్ధి చెందింది. ఆజాదీ కశ్మీర్ కోసం చేపట్టిన ఈ గెరిల్లా యుద్ధంలో వేలాది మంది కశ్మీరీలు పాల్గొన్నారు. ఈ పోరాటాన్ని ప్రభుత్వం సైన్యం ద్వారా అణచివేసింది. ఈ దమనకాండ ఇప్పటికీ కశ్మీర్‌లో కొనసాగుతున్నది. మళ్లీ 2008, 2010ల్లో ప్రజా ఆందోళనలు ముందుకొచ్చాయి. ఈ ఆందోళనల్లో ప్రజలు ముఖ్యంగా యువకులు 'రాళ్లు విసిరే' పోరాట ప్రక్రియను చేపట్టారు. 1931లో ముందుకొచ్చిన తిరుగుబాటులో కశ్మీర్ వీరుడైన అబ్దుల్ కదీర్ ఖాన్ కశ్మీర్ యువకులకు "దోగ్రా బుల్లెట్లకు రాళ్లతో సమాధానం చెప్పాలని" పిలుపునిచ్చాడు. ఆ చారిత్రక పిలుపు నుండి కశ్మీరీలు భద్రతా బలగాలపై రాళ్ళు విసిరే పోరాట రూపాన్ని చేపట్టారు. దశాబ్దాల పాటు ప్రజలు జరుపుతున్న తిరుగుబాట్లలో భారత సైన్యాలు జరిపిన దాడిలో ఇప్పటికే లక్ష మంది ప్రజలు మరణించారు. వేలాది మంది గాయపడినారు. అయినప్పటికీ ప్రజల ఆజాదీ కాంక్ష ఆరిపోలేదు.

**పీ.డీ.పీ., బీ.జే.పీ సంకీర్ణ ప్రభుత్వం – ప్రజా వ్యతిరేక విధానాలు**

పీ.డీ.పీ., బీ.జే.పీ. నేతృత్వంలో ఏర్పడిన కశ్మీర్ ప్రభుత్వం ప్రజలకు కొత్త సమస్యలు తెచ్చిపెట్టింది. ఈ రాష్ట్రంతో పాటు ఇరుగు పొరుగు ప్రాంతాల్లో సంఘపరివార్ తన హిందూ రాష్ట్ర ఎజెండాను కొనసాగించడానికి పూనుకొన్నది. ఈ ఎజెండా అమలు కోసం బీ.జే.పీ. సంకీర్ణ ప్రభుత్వంలో పీ.డీ.పీ.ని నయాన భయాన లొంగదీసుకుంటున్నది. పీ.డీ.పీ. కూడ అవకాశవాద పద్ధతులను అనుసరించి బీ.జే.పీ. ఎజెండాకు లొంగిపోయి కశ్మీర్ ప్రజల ఆకాంక్షలకు ద్రోహం చేస్తున్నది. ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, కశ్మీర్ లోయలో హిందువులను స్థిరపడేలా చేయడానికి కాలనీల నిర్మాణం; గొడ్డు మాంసం వినియోగంపై నిషేధం; అధికరణ 370 రద్దు; కశ్మీర్ పతాకాన్ని రద్దు చేయడం లాంటి విధానాలు ప్రస్తుతం ఆందోళనకు ఆజ్యం పోశాయి.

కశ్మీర్ నుండి వలస వెళ్లిన కశ్మీర్ పండిట్‌లకు, మాజీ సైనికులకు ప్రత్యేక నివాస కాలనీలు నిర్మించే పనిని పీ.డీ.పీ., బీ.జే.పీ. ప్రభుత్వం ప్రారంభించింది. ఇందుకు కశ్మీర్‌లోని పది జిల్లాల్లో 7 ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించింది. ఇందుకు ఇప్పటికీ 9,01,775 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం గుర్తించింది. ఈ భూములను భారతదేశం నుండి వెళ్లే పారిశ్రామిక వేత్తలు లీజుకు కొనుగోలు చేస్తున్నారు. అందుకు ప్రభుత్వం వీరికి పెద్ద ఎత్తున రాయితీలు ఇస్తున్నది. ఈ కాలనీల పట్ల కశ్మీరీల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ఇది ప్రజల్లో చిచ్చుపెట్టి సంఘ్ పరివార్ తన లక్ష్యాన్ని నెరవేర్చుకొనే కుట్ర తప్ప మరేమి కాదని ప్రజలు భావిస్తున్నారు.

వలస వెళ్లిన హిందువులు తిరిగి వచ్చి తమ పూర్వపు ఇండ్లలోనే ఉండాలని కశ్మీరీలు కోరుతున్నారు. నామమాత్రమైన అధికారాన్ని యిచ్చిన 370 ఆర్టికల్ రద్దు పైన, తమ ఆహార అలవాట్లపై దాడిగా గొడ్డు మాంసం నిషేధం లాంటి విషయాల్లో కశ్మీరీలు ఈ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కశ్మీర్ లోయలో బీ.జే.పీ.కి ఒక్క సీటు కూడ లేదు. పీ.డీ.పీ.కే మెజారిటీ సీట్లు వచ్చాయి. పీ.డీ.పీ. కశ్మీర్ ప్రజల ఆకాంక్షలకు కట్టుబడతానని చేసిన వాగ్దానాన్ని ప్రజలు నమ్మి ఆ పార్టీకి ఓట్లు వేశారు. కాని ఆ పార్టీ బీ.జే.పీ. నాయకత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి పూర్తిగా లొంగిపోయినట్లుగా ఈ మధ్య పరిణామాలు వెలుగు చూస్తున్నాయి. పీ.డీ.పీ. నేత ముఫ్తీ మహమ్మద్ సయ్యద్ మరణం తర్వాత ఆయన కూతురు మహబూబా ముఫ్తీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు సందర్భంగా ఢిల్లీలో నరేంద్రమోడీని కలిసినప్పుడు ఆమె అధికార సర్దుబాట్ల విషయమే చర్చించింది తప్ప కశ్మీరీ ప్రజల ఆకాంక్షలు వెలిబుచ్చలేదు. అధికారానికి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ప్రభుత్వాన్ని నడుపుతున్నది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అణిచివేతలో ఎలాంటి మార్పు లేదు.

భారత ప్రభుత్వ సైన్యం, పారా మిలిటరీ బలగాల పాశవిక నిర్బంధ విధానాలు ఎప్పటిలాగానే కొనసాగుతున్నాయి. ఆందోళనలను అణచడానికి కర్ఫ్యూలు విధించడం, సోదాలు జరపడం, ఇంటరాగేషన్‌లో అమాయకుల హత్యలు, అక్రమ అరెస్టులు జరిపి తీవ్రంగా హింసించడంతో పాటు వారితో పోలీసు క్యాంపుల్లో వెట్టి పనులు చేయించుకోవడంతో పాటు, వారిని మానవ కవచాలుగా ఉపయోగించుకోవడం; యువకులను అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టి అంగవికలురను చేయడం; లాకప్పు హత్యలు చేయడం సర్వ సాధారణంగా మారి తీవ్ర నిర్బంధ విధానాలు కొనసాగుతున్నాయి. బూటకపు ఎన్‌కౌంటర్లకు లెక్క లేకుండా పోయింది.

**కశ్మీర్ ప్రజల ఆందోళన – భారత పాలకవర్గాల వైఖరి**

జులై 8న జరిగిన ఎన్‌కౌంటర్, ఆ వెంటనే ప్రజల నిరసన వెల్లువను అణచడానికి కేంద్ర ప్రభుత్వం కశ్మీర్‌లోకి అదనంగా 20 కంపెనీల బలగాలను పంపింది. ప్రజల ఆందోళనలను అణచడానికి ప్రభుత్వం బల ప్రయోగమే ఎంచుకున్నది. ప్రభుత్వం వెంటనే 10 జిల్లాల్లో కర్ఫ్యూ విధించింది. చట్టబద్ధంగా నిరవధిక కర్ఫ్యూను 55 రోజుల పాటు కొనసాగించారు. ఆ తర్వాత పాక్షికంగా సడలించారు. ప్రదర్శనకారులపైన కాల్పులు జరిపి హత్యలు చేయడం, గాయపరచడం నిత్యకృత్యమైంది. భారత హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కశ్మీర్‌ను రెండు సార్లు సందర్శించి, ప్రభుత్వ

బలగాలకు దిశా నిర్దేశం చేశాడు. పెల్లెట్ గన్స్ వాడకాన్ని, ప్రభుత్వ బలగాలు నిలిపి వేయాలనే డిమాండ్‌ను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు కోరుతున్నా కూడ కాలదన్నాడు. ఎటువంటి సంఘటనకు సంబంధించి అయినా ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల్లో ట్వీట్స్ వదిలే ప్రధాన మంత్రి మోడీ నెల రోజుల వరకు బహిరంగ ప్రకటన ఏది చేయలేదు. మొట్టమొదటిసారిగా ఆగస్టు 9న మధ్యప్రదేశ్‌లోని బాబ్రాలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ "కశ్మీర్‌లో దారి తప్పిన కొంతమంది అమాయక యువకులు ఆవేశంతో వీధుల్లోకి వస్తున్నారని, వీరికి కొంతమంది చేతికి రాళ్లు అందిస్తూ భద్రతా బలగాలపై విసరమని చెబుతున్నారని, భారతదేశంలో ప్రజాస్వామ్యం ఉన్నట్లుగానే కశ్మీర్‌లో కూడ ప్రజాస్వామ్యం అమలులో ఉందని, కశ్మీర్ అభివృద్ధికి తమ ప్రభుత్వం పాటు పడుతుందని" వ్యాఖ్యానించాడు. కాని అక్కడి ప్రజా ఆందోళనలో తలెత్తుతున్న ప్రజల డిమాండ్లు వేటిపై ప్రధానమంత్రి స్పందించలేదు.

వారం రోజులు తిరగకముందే 15, ఆగస్టు నాడు ఎర్రకోట పై నుండి ప్రధానమంత్రి మోడీ చేసిన ప్రసంగంలో కశ్మీర్ ప్రజల పోరాటాన్ని ప్రక్కదారి పట్టించడానికి పూనుకున్నాడు. ఎర్రకోటపై చేసిన ప్రసంగంలో కశ్మీర్‌లో తలెత్తిన ఆందోళనల వెనుక పాకిస్థాన్ హస్తం ఉందని, బెలూచిస్థాన్‌లో, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో (పీ.ఓ.కే.)లో, గిలిగిట్-బాల్టిస్టాన్‌లో పాకిస్థాన్ జరుపుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలకు, అత్యాచారాలకు సమాధానం చెప్పాలని ప్రకటించాడు. ఆ తర్వాత కశ్మీర్‌లో పాకిస్థాన్ చేస్తున్న కుట్రకు బెలూచిస్థాన్‌ను పాకిస్థాన్ కోల్పోవలసి వస్తుందని కూడ హెచ్చరించాడు. ఈ ప్రకటనల ద్వారా కేంద్ర ప్రభుత్వం సంఘ్ పరివార్ ఎజెండాను ముందుకు తెచ్చింది. మోడీ చేసిన వ్యాఖ్యానంపై పాకిస్థాన్ యే గాక అఫ్ఘనిస్తాన్, ఇరాన్‌లు కూడ అసంతృప్తిని వ్యక్తం చేసాయి. బెలూచిస్థాన్‌లో దశాబ్దాల తరబడి ఇండియాకు చెందిన ఇంటలిజెన్స్ సంస్థ అయిన 'రా' కార్యకలాపాలు యధేచ్ఛగా కొనసాగుతున్నాయనే విషయం సర్వ విధితమే. ఈ ప్రకటనతో మోడీ ఇరుగు పొరుగు దేశాలతో కయ్యానికి కాలుదువ్వాడు. హిందూ రాజ్య స్థాపన లక్ష్యంగా సాగుతున్న అఖండ భారత్ ఎజెండాతో పాటు అంతర్జాతీయంగా పాకిస్థాన్ - చైనా మైత్రికి సవాలు విసురుతూ దాడి రాజకీయాలను ముందుకు తెచ్చాడు.

చైనా - పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధాల నుండి లభించిన పాఠాలను ఏ మాత్రం దృష్టిలోకి తీసుకోకుండా ప్రధానమంత్రి ప్రకటనలు ఉన్నాయి. ఇవి కశ్మీరీల న్యాయమైన డిమాండ్ల అణిచివేతతో పాటు భారత ప్రజలను కూడ మరో యుద్ధంలోకి దించే ప్రమాదం ఉంది.

కశ్మీర్‌లో భారత పాలక వర్గాల విధానంలో 1948 నుండి కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ మార్పు లేదు. షేక్ అబ్దుల్లాను ఆగస్టు 9, 1953లో అరెస్టు చేసిన తర్వాత నెహ్రూ అభిమాని ఒకరు వెలిబుచ్చిన అభిప్రాయానికి నాటి ప్రధానమంత్రి నెహ్రూ యిలా సమాధానం యిచ్చాడు.

"కశ్మీర్ అంశం పై మనం అంతర్జాతీయ యవనిక మీద ఒక జూదమాడుతున్నాం. ఆ జూదంలో మనం ఎట్టి పరిస్థితుల్లోనూ ఓడిపోవడానికి వీల్లేదు. ప్రస్తుతం మనం కశ్మీర్‌లో తుపాకీ కొన మీద నిలబడి ఉన్నాం. అక్కడి పరిస్థితులు మెరుగయ్యే వరకు ప్రజాస్వామ్యం, నైతికతలు కూడ వేచి ఉండక తప్పదు" అన్నాడు.

ప్రస్తుత కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ జులై 20న ఈ విధంగా ప్రకటించింది. "దేశం పెద్ద ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నది. జాతీయ భద్రతా విషయంలో ఎలాంటి సర్దుబాటుకు వీలులేదు. మిలిటెంట్లను తీవ్రంగా అణిచివేయాలని" సెలవిచ్చింది.

పై వ్యాఖ్యలను పరిశీలిస్తే, భారత సైన్యాలు కశ్మీర్‌ను ఆక్రమించిన నాటి నుండి భారత పాలకవర్గాల విధానం ఎలా ఉందో స్పష్టంగా చూడవచ్చు. అందుకే కశ్మీర్‌లో ప్రజాస్వామ్యం ఉందని చెప్పే ప్రబుద్ధులకు కశ్మీర్ లోయలోకి వెళితేనే అర్థమవుతుందని తరచూ కశ్మీర్ ప్రజలు, ప్రజాస్వామిక వాదులు చెబుతూనే ఉన్నారు.

జాతీయ పార్టీల ఆలోచనలు యిలా ఉంటే, ప్రతిపక్ష పార్టీల, కశ్మీర్‌లోని నేషనల్ కాన్ఫరెన్స్, పీ.డీ.పీ. యితర పార్టీల విధానాల్లో కూడ అంతగా తేడాలేదు. అధికారంలో ఉన్న పీ.డీ.పీ. అధ్యక్షురాలు, ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ రాష్ట్రంలో ప్రజా ఆందోళన చెలరేగిన తర్వాత ప్రధానమంత్రి మోడీని కలిసి కశ్మీర్ పరిస్థితిపై చర్చించింది. కశ్మీర్ సమస్య మోడీ నాయకత్వంలోనే పరిష్కారం అవుతుందని బాకాలూదింది. అలాగే ప్రస్తుత అల్లర్ల వెనుక పాకిస్థాన్ పాత్ర ఉందని, కశ్మీర్‌లో 95 శాతం ప్రజలు శాంతిని కోరుకుంటున్నారని, కొంతమంది మాత్రమే హింసను ప్రేరేపిస్తున్నారని ప్రకటించింది. భద్రతా దళాలపై రాళ్ళు విసరడం, గ్రేనేడ్స్ వేయడం అనుమతించరానిదని ప్రకటన చేసింది. కాని కశ్మీర్ ప్రజల చిరకాల ఆకాంక్ష విషయంపై నోరెత్తలేదు.

మెహబూబా ముఫ్తీ ఢిల్లీ పర్యటనానంతరం నుండి కశ్మీర్ లోయలో పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్ క్రింద అరెస్టులు ప్రారంభమైనాయి. ఇప్పటివరకు వేలాది మందిని ఈ యాక్ట్ కింద అరెస్టు చేసారు. ఈ విధానాలు అన్ని పీ.డీ.పీ. కశ్మీర్ ప్రజల 'గాయాలు మాన్పే' విధానానికి వ్యతిరేకంగానే ఉన్నాయి.

నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఉమర్ అబ్దుల్లా ప్రధానమంత్రిని

రెండు సార్లు కలిశాడు. ఏ కారణంగానైన పీ.డీ.పీ. అధికారం నుండి తొలగితే, బీ.జే.పీ.తో కలిసి తాము అధికారానికి రావచ్చు అని పావులు కదపడానికే తప్ప ఈ సమావేశాల్లో కీలకమైన విషయాలు ఏవీ చర్చకు రాలేదు. కశ్మీర్‌లో కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, ప్రస్తుతం పీ.డీ.పీ. పార్టీలు అధికారంలో ఉన్నంత కాలం కశ్మీరీ ప్రజల ఆకాంక్షలను అణిచివేస్తూనే వచ్చారు.

భారత పార్లమెంట్‌లో అధికార పక్షం, ప్రతిపక్షాలన్నీ ముక్తకంఠంతో కశ్మీర్‌లో పాకిస్థాన్ ప్రమేయాన్ని ఖండిస్తూ, కశ్మీర్ భారతదేశంలో అంతర్భాగం అని ఉద్ఘాటిస్తూ, అఖిల పక్ష కమిటీలను కశ్మీర్‌కు పంపించాలని నిర్ణయించారు. ఈ అఖిలపక్ష కమిటీ సెప్టెంబర్ మొదటి వారంలో కశ్మీర్ సందర్శించింది. ఈ సందర్శన కేవలం ఒక ప్రహసనంగానే ముగిసింది. కశ్మీర్‌లో హురియత్ కాన్ఫరెన్స్‌కు చెందిన నాయకులకు ప్రభుత్వం అఖిలపక్ష కమిటీతో కలిసి చర్చించడానికి ఆహ్వానం పంపలేదు. దానితో వారు అఖిలపక్ష కమిటీని బహిష్కరించారు. ఆందోళన ప్రారంభమైన తర్వాత వారినందరిని ప్రభుత్వం గృహ నిర్బంధంలో ఉంచింది.

2000 సం॥రంలో వాజ్‌పాయ్ ముందుకు తెచ్చిన "ఇన్‌సాన్‌యత్ (మానవత్వం), జమూరియత్ (ప్రజాస్వామ్యం), కశ్మీరీయత్" అనే నినాదం ఇప్పుడు మరోమారు చర్చకు వచ్చింది. ఆ రోజు ఇన్‌సాన్‌యత్ నినాదం మాటున వాజ్‌పాయ్ పాకిస్థాన్‌తో, హిజుబుల్ ముజాహిద్దీన్, హురియత్ కాన్ఫరెన్స్ నాయకులతో చర్చల నాటకం ఆడాడు. ఈ రోజు కూడ 2000-2003 మధ్య జరిగిన రాజకీయ పరిణామాలు మళ్ళీ ముందుకు వస్తున్నాయి. ప్రస్తుతం మోడీ, రాజ్‌నాథ్ సింగ్‌లు చర్చల నాటకానికి కూడ సిద్ధంగా లేరు. సైనిక అణచివేతకే ప్రాధాన్యతనిస్తున్నారు.

ప్రస్తుతం జరుగుతున్న ప్రజా ఆందోళనపై హురియత్ కాన్ఫరెన్స్ నాయకులకు పట్టులేదు. వారంతా భద్రతా బలగాలపై రాళ్లు విసర కూడదని యువకులకు ఎప్పటికప్పుడు విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ వారు పట్టించుకోవడం లేదు. ప్రతివారం ఆందోళనకారులకు పోరాట కేలండర్ ప్రకటించబడుతున్నది. దాని ప్రకారం ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. పోరాటకారుల్లోనే కొత్త నాయకత్వం ముందుకు వస్తున్నది.

కశ్మీర్‌లో దినదినం పరిస్థితులు దుర్భరంగా మారుతున్నాయి. ప్రభుత్వం విధించే కర్ఫ్యూలతో ప్రజా జీవనం స్థంభించిపోయి ప్రజలు జీవించడమే కష్టంగా మారింది. జులై 8 నుండి వరుసగా 55 రోజుల పాటు నిరవధిక కర్ఫ్యూ కొనసాగింది. ఇది దేశంలోనే భారత పోలీసులు సృష్టించిన సరికొత్త రికార్డు. పోలీసు కాల్పుల్లో గాయపడిన వారిని అంబులెన్స్‌ల్లో హస్పిటల్‌కు తీసుకెళ్ళే సమయంలో కూడ పోలీసులు అంబులెన్స్‌లపై దాడులు చేస్తున్నారు. హస్పిటల్‌పై నిరంతరం నిఘా కొనసాగిస్తూ, గాయాలపాలైన వారికి ట్రీట్‌మెంట్ అందకుండా చేస్తున్నారు. అలాగే కశ్మీర్‌లో అచ్చవుతున్న వేలాది వార్త పత్రికలను బంద్ పెట్టడం లేదా అచ్చయిన పత్రికలను సీజ్ చేస్తున్నారు. ఇంటర్‌నెట్, మొబైల్ ఫోన్లు అన్నింటిని మూసివేశారు. చివరకు పండుగ దినాల్లో (ఈదల్ / హజా) ప్రదర్శనలు చేపడుతారనే ఉద్దేశ్యంతో కశ్మీర్ అంతటా మళ్లీ కర్ఫ్యూ విధించి నిర్బంధ చర్యలు చేపట్టారు. ఇలా ప్రభుత్వం ప్రజా ఆందోళనను అణచడానికి కఠిన చర్యలు తీసుకుంటున్నది. అయిదు జిల్లాల్లోనే జరుగుతున్న అల్లర్లను త్వరలోనే అణిచివేస్తామని నిరంతరం కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్నది. కాని ప్రజా సమస్యలపై ఎలాంటి రాజకీయ పరిష్కారానికి పూనుకోవడం లేదు.

కశ్మీర్ ప్రజలు ఆజాదీ కశ్మీర్ నినాదాన్ని యివ్వడంతో పాటు కశ్మీర్‌లో ప్లెబిసైట్ / ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని, సాయుధ బలగాల ప్రత్యేక అధికార చట్టం ఉపసంహరించాలని, కశ్మీర్ నుండి సైన్యాన్ని ఉపసంహరించాలని, 370 ఆర్టికల్‌ను పకడ్బందీగా అమలు చేయాలని కోరుతున్నారు. కశ్మీర్ సమస్య పరిష్కారానికి భారతదేశం, పాకిస్థాన్, కశ్మీర్ ప్రజల ప్రాతినిధ్యంతో కలిపి త్రైపాక్షిక చర్చలు చేయాలి. కశ్మీర్ వివాదాస్పద భూభాగంగా ఉండడం, ఐక్యరాజ్యసమితి స్థాయిలో ఇక్కడ కలుగజేసుకోవడం లాంటి చారిత్రక కారణాల వలన ఈ మూడు పక్షాలు చర్చల్లో పాల్గొనాలి. కశ్మీర్ లోని మెజారిటీ ప్రజలు దీన్ని కోరుకుంటున్నారు. కాని భారత పాలకవర్గాలు ఈ వాస్తవాన్ని నిరాకరిస్తున్నాయి. దాని మూలంగా కశ్మీర్ సమస్య పరిష్కారానికి అడుగు ముందుకు వేయడం లేదు.

**భారత ప్రజలకు పిలుపు**

భారత పాలకవర్గాలు, మీడియా కశ్మీర్ భారతదేశంలో అంతర్భాగం, సీమాంతర ఉగ్రవాదం కశ్మీర్‌లో పెను ముప్పు, జాతి ప్రయోజనాలకు వ్యతిరేకంగా అక్కడ వేర్పాటు ఉద్యమాలు జరుగుతున్నాయని, పాకిస్థాన్ నుండి ఉగ్రవాదం దిగుమతి అవుతున్నదని నిరంతరం ప్రచారం చేస్తూనే వున్నారు. కాని అక్కడి ప్రజల చరిత్ర, సంస్కృతి, జాతి భావనలు, వారి ఆకాంక్షల పట్ల ఇసుమంత సమాచారం దేశంలో ఎక్కడ దొరకదు. బీ.జే.పీ., కాంగ్రెస్ పరిపాలనలో దేశ సరిహద్దులు, జాతీయత అనే భావన కింద కశ్మీర్ ప్రజల జాతి అస్థిత్వం, ప్రజాస్వామిక ఆకాంక్షలను తొక్కి పెట్టబడ్డాయి. కశ్మీర్ ప్రజలకు న్యాయం, భద్రత గురించి భారత ప్రజలు ఆలోచించకుండా వారి మెదళ్ళకు అడ్డు తెరలు విధిస్తున్నాయి. నిరంతరం భారత ప్రజలు కశ్మీర్ న్యాయమైన ఆందోళనను సమర్థిస్తూ ముందుకు రాకుండా ఉండేలా

*(మిగతాది 9వ పేజీలో...)*

# విశాల పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో అమెరికా ఆధిపత్యానికి, దోపిడీకి

# 'ట్రాన్స్ పసిఫిక్ భాగస్వామ్య ఒప్పందం' కీలకం

రాజకీయ అంశాలకంటే ఆర్థికాంశాలే కీలకంగా మారుతున్న ప్రస్తుత ప్రపంచ వ్యవహారాల్లో 'ట్రాన్స్ పసిఫిక్ భాగస్వామ్య ఒప్పందం' (టీ.పీ.పీ.ఏ.) ముఖ్యమైనది. పసిఫిక్ మహాసముద్రం ప్రాంతంలో అమెరికాకు ఈ మహాసాగర వ్యాపార సామ్రాజ్య ఒప్పందం కీలకమైంది, వ్యూహాత్మకమైంది. ఆరు సంవత్సరాల సుదీర్ఘచర్చల అనంతరం పసిఫిక్ తీరప్రాంత 12 దేశాల వాణిజ్యమంత్రుల మధ్య ఫ్లోరిడాలో జరిగిన సమావేశంలో అక్టోబర్ 5, 2015న 'ట్రాన్స్ పసిఫిక్ భాగస్వామ్య ఒప్పందానికి' అంగీకారం తెలిపారు. ఆస్ట్రేలియా, బ్రూనై, కెనడా, చిలీ, జపాన్, మెక్సికో, న్యూజిలాండ్, పెరూ, సింగపూర్, మలేషియా, అమెరికా, వియత్నాం (మొత్తం 12 దేశాలు) తమ మధ్య వాణిజ్య సంబంధిత అంశాలైన పెట్టుబడులు, మేధో సంపత్తి హక్కులు, కార్మికులు, పర్యావరణం, వాణిజ్య ప్రత్యామ్నాయాలు, సాంకేతికపరమైన అడ్డంకులు తదితర అంశాలపై పూర్తి వివరణల కోసం 30 చాప్టర్‌లుగా విభజించి, అందులో ప్రతి అంశంపై సమగ్ర సమాచారం పొందుపరిచారు. ఈ ఒప్పందంలోని సభ్య దేశాలు జనాభా 80 కోట్లు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 40 శాతం, ప్రపంచ వాణిజ్యంలో 24 శాతం వీటి భాగస్వామ్యంగా ఉంటుంది.

చైనా ఆర్థిక వ్యవస్థను, వాణిజ్యాభివృద్ధిని అడ్డుకోవటానికి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా చేసిన వ్యూహరచన 'ఆసియా పివోట్'లో ఈ ఒడంబడిక అంతర్భాగమే. తొలుత చైనాను ఫ్లోరిడా సమావేశానికి ఆహ్వానించక పోయినప్పటికీ తర్వాత చైనాకు ఆహ్వానం పంపడానికి ప్రధాన కారణం అమెరికా కార్పొరేట్ కంపెనీలకు అనూహ్యమైన మార్కెట్‌ను చైనా పొంది ఉండటమే. చైనా బ్రిక్స్ దేశాల కలయికకే అధిక ప్రాధాన్యతనిచ్చి ఫ్లోరిడాలో పాల్గొనలేదు. ఒకవైపు ప్రభుత్వాలు ఈ ఒప్పంద విషయంలో సంతోష పడుతుండగా, ఆయా దేశాల్లో ప్రజలూ, స్వచ్ఛంద సంస్థలూ, మానవహక్కుల సంఘాలూ, పర్యావరణ సంస్థలూ మాత్రం నాలుగు గోడల మధ్య జరిగిన ఈ ఒప్పందాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఈ ఒప్పందం ట్రేడ్ యూనియన్ హక్కులకు భంగమనీ, కార్మికవర్గ వ్యతిరేక ఒప్పందం అని చెబుతున్నారు. ఇది పర్యావరణాన్ని కాలరాచే బహుళజాతి కంపెనీలకు మాత్రం బహుళ ప్రయోజనకరంగా ఉంటుందని అంటున్నారు. మరొకవైపు "టిపిపిఎ యూరప్ దేశాల భద్రతను బలహీనపరిచే వ్యూహమని'' యూరోపియన్ పార్లమెంటేరియన్ ఫాప్ హౌజర్ అంటున్నారు.

టిపిపిఏలో దక్షిణ కొరియా, ఇండోనేషియా, ఫిలిప్పైన్స్, తైవాన్ దేశాలు భవిష్యత్తులో చేరే అవకాశాలు ఉన్నాయి. ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్యం (నాఫ్తా), అమెరికా ఈయూ దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, టిపిపిఏల కలయికల వల్ల ధనిక దేశాలు ఇంకా ధనికదేశాలై వర్ధమాన దేశాలు మరింత వ్యత్యాసంతో కునారిల్లుతాయని ఆర్థిక శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఇది కేవలం ప్రపంచదేశాల మొదటిశ్రేణి 200 కార్పొరేషన్ సంస్థల ప్రయోజనాలకు మాత్రమే ఉపయుక్తంగా ఉంటుందనీ ఆందోళనకారులు అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారు. "ఒప్పందంలోని షరతులు ప్రజలకు తెలియవు. ప్రజలతో పాటు ఆయా దేశాల చట్ట సభలకు కూడా తెలియనివ్వకుండా నాలుగుగోడల మధ్య సంప్రదింపులు జరిపారు. తద్వారా ఈ ఒప్పందం వలన ఒనగూరే ప్రయోజనాలు, దుష్ప్రయోజనాలపై చర్చ జరగనీయకుండా దేశాధినేతలు సంతకాలు చేయడం దారుణం" అంటున్నారు. ఈ ఒప్పందం ఉద్యోగ భద్రత, వేతన ఆదాయం, రక్షిత ఆహారం, ఆరోగ్యానికి సంబంధించి మందుల ధరలపై నియంత్రణ లేకపోవటంతో అనేక సాంఘీక సమస్యలు ఎదురవుతాయంటున్నారు మానవహక్కుల సంఘ ప్రతినిధి క్లౌడియా రూయిజ్.

వ్యాపార, ఆర్థిక, వాణిజ్య, సాంకేతిక, పర్యావరణం మొదలైన అంశాల్లో పరస్పర సహాయ సహకారాలకు 2006లో బ్రూనై, చిలీ, న్యూజిలాండ్, సింగపూర్ దేశాలు ట్రాన్స్ పసిఫిక్ వ్యూహాత్మక ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (పి-4) పేరిట ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయి. దానిని ఇంకా విస్తృతపరిచి ఇంకొన్ని దేశాలను సభ్యులుగా చేర్చుకోవాలనే ప్రతిపాదనను అమెరికా చేసింది. దాంతో 2008 నుండి ట్రాన్స్ పసిఫిక్ ఒప్పందం కొరకు 19 సార్లు మంతనాలు జరిగాయి. ఎనిమిదేళ్లపాటు చర్చించుకున్నా అందులోని అంశాలు కాస్తయినా వెల్లడికాకుండా అత్యంత గోప్యంగా ఉండిపోయాయంటే ఆ చర్చలు అమెరికా ప్రయోజనాల కోసమే అయి ఉండవచ్చునని ఎవరికైనా అనుమానం వస్తుంది. విశాల పసిఫిక్ భాగస్వామ్య ఒప్పందం (టిపిపిఏ) పై వివిధ వర్గాలు గత కొన్నేళ్లుగా వ్యక్తం చేస్తూ వస్తున్న సందేహాల్లో నిజం ఉందని ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తున్న ఆ ఒప్పందం వివరాలు తెలియజెబుతున్నాయి. పసిఫిక్ మహా సముద్ర తీర ప్రాంతాల్లోని 12 దేశాలు కుదుర్చుకున్న ఈ ఒప్పందంపై ఇప్పుడు అనేక

అభ్యంతరాలూ, ఆందోళనలూ వ్యక్తమవుతున్నాయి. చైనా ఆర్థిక ప్రాబల్యాన్ని దెబ్బతీయడం లక్ష్యంగా అమెరికా చొరవతో చేపట్టిన ఈ చర్చలు ఆస్ట్రేలియాలోని మెల్ బోర్న్‌లో (2008)లో మొదలై అమెరికాలోని అట్లాంటాలో (2015 అక్టోబర్ 5తో) ముగిశాయి. ఆసియా పసిఫిక్ ఎకనామిక్ కార్పొరేషన్, ప్రపంచ వాణిజ్య సంస్థల విషయాలలో లాగానే టిపిపిఏ నిబంధనలు అంగీకరించేటట్లు ఖచ్చితంగా భవిష్యత్తులో చైనా మెడలను వంచుతామని అమెరికా ఆశిస్తుంది. టిపిపిఏ ఒప్పందంపై ఆయా దేశాల పార్లమెంట్‌లో కూడా ఆమోదం పొందాల్సి ఉంటుంది. అంతకుముందు ఆయా దేశాల్లో అమలవుతున్న అనేక చట్టాలను సవరించుకోవాల్సి ఉంటుంది. నోమ్ చోమ్‌స్కీ జోసెఫ్ స్టిగ్లిజ్ వంటి మేధావులైతే కార్పొరేట్ లాభార్జననూ, ఆధిపత్యాన్ని మరింతగా పెంచుకునేందుకు ఇది అమెరికా పన్నిన వ్యూహమని విమర్శిస్తున్నారు. ఇప్పటి వరకు సామ్రాజ్యవాద దేశాలతో కుదుర్చుకున్న ద్వైపాక్షిక, బహుళపక్ష ఒప్పందాలు అన్నీ అసమాన వాణిజ్య ఒప్పందాలే.

ట్రాన్స్ పసిఫిక్ పార్టనర్ షిప్ అగ్రిమెంటు (టిపిపిఏ ఒప్పందం) తమ జాతీయ ప్రయోజనాలను దెబ్బతీస్తుందని సభ్య దేశాలన్నింటా విపక్షాల నుండి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. వచ్చే నవంబర్‌లో జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అమెరికాలోనే విపక్షమైన రిపబ్లికన్ పార్టీతోపాటు అధికార డెమోక్రటిక్ పార్టీలోని కీలకమైన నాయకులు కూడా దీన్ని వ్యతిరేకిస్తున్నారు. అందులో డెమోక్రటిక్ పార్టీ తరపున అధ్యక్ష పదవి అభ్యర్థిత్వానికి పోటీపడుతున్న హిల్లరీ క్లింటన్ కూడా ఉన్నారు. అయితే, ఎన్నికల ప్రచారానికి కార్పొరేట్ విరాళాలపై ఆధారపడే అమెరికా రాజకీయ నేతలు ఎంతకాలం టిపిపిఏ ని వ్యతిరేకించగలరన్నది ప్రశ్న. అమెరికాతో పాటు చిలీ, పెరూ, వియత్నాం వంటి దేశాలలో సైతం అభ్యంతరాలున్నాయి. న్యూజిలాండ్, జపాన్, ఆస్ట్రేలియా, కెనడాలో విపక్షాలు గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. అయితే అందరి అభ్యంతరాలు ఒకే రకమైనవి కావు. తమ మార్కెట్‌కు సభ్య దేశాలనుంచి చవక ఉత్పత్తులు వచ్చిపడుతాయని, ఉన్న ఉద్యోగాలు కోల్పోవలసి వస్తుందని అమెరికాలో ఆందోళన వ్యక్తమవుతుంటే, ప్రాణావసరమైన ఔషధాల పేటెంట్లను గుప్పెట్లో పెట్టుకుని భారీయెత్తున లాభాలు ఆర్జించేందుకు సంపన్న దేశాలు పూనుకుంటాయని పేద దేశాల్లోని పౌర సమాజ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా తన ఫార్మసీ కంపెనీలైన ఫైజర్, రొచే గ్రూపు జెనెటిక్స్, జపాన్ టకేడా ఫార్మసీ కంపెనీలు ఔషధాల విక్రయాన్ని అధిక రేట్లతో అమ్ముకోవడానికి, లాభాల వేటకు ఈ ఒప్పందం చాలా తోడ్పడుతుందని అంటూంటే ఆందోళనలు ప్రారంభమైన అమెరికాలాంటి దేశాల్లో నిరసన ప్రదర్శనలు జరుపుతున్నాయి.

టిపిపిఏ ఒప్పందంలోని అంశాలు మాత్రం అమెరికాకు విపరీత ప్రయోజనాలు చేకూర్చేవిగా ఉన్నాయని అమెరికా వాణిజ్యశాఖ అధికారిక పత్రాల ద్వారా వెల్లడవుతుంది. లీడర్‌షిప్, జాబ్స్ అండ్ గ్రోత్, వాల్యూస్ ప్రధాన అంశాలుగా అనేక ఉప అంశాలను ఒప్పందంలో చేర్చింది. ఇందులో ముఖ్యంగా ప్రస్తుత అమెరికా వాణిజ్య వ్యాపార ఉద్దీపనకు, డిజిటల్ ఆధార వ్యాపారం, ఆర్థిక లాభాలు, అమెరికా చిన్న, మధ్య తరహా వాణిజ్య అభివృద్ధి, అమెరికా తయారీ, వ్యవసాయరంగ వృద్ధి, ఆటోమొబైల్ రంగ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఆహార భద్రత, బహిరంగ, స్వేచ్ఛాయుత ఇంటర్‌నెట్ వినియోగం (వ్యాపారం కోసం) తదితర అంశాలు ప్రధానంగా ఉన్నాయి. ఇవన్నీ కూడా అమెరికా, స్వప్రయోజనాలు, వ్యాపార వాణిజ్య అభివృద్ధి, ఆధిపత్యం కోసం సాగేవే అని విమర్శకులు ఇప్పటికే పేర్కొన్నారు. ఈ టిపిపిఏ అమలులోకి వస్తే ఆసియాలోని రెండు ప్రధాన దేశాలైన చైనా, భారత్‌లపై దాని ప్రతికూల ప్రభావం తీవ్రస్థాయిలో ఉంటుందని ఒక అంచనా.

టిపిపిఏ ఒప్పందం కుదిరిన తర్వాత అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా చేసిన అధికారిక ప్రకటనలో పేర్కొన్న అంశాలు విస్మయం కలిగిస్తున్నాయి. విశ్వవాణిజ్యంలో చైనా ఆధిపత్య ధోరణి, ప్రపంచాన్ని నిర్దేశించే లక్షణం అమెరికాకు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని మరీ తెగేసి చెప్పాడు. దీంతో వెనుక అమెరికా రాజకీయ, వాణిజ్య, వ్యాపార విశాల ప్రయోజనాలు ఎలా ఉన్నాయన్నది సులభంగానే అంచనా వేయవచ్చు. అంతేకాదు 21వ శతాబ్దం అంతా ఈ వాణిజ్యం, వ్యాపారం సాగుతుందని, అది అమెరికాకు ఎంతో మేలు చేకూరుస్తుందని దాపరికం లేకుండా బరాక్ ఒబామా ప్రకటించడంతో పాటు ఒప్పందం అంతిమ లక్ష్యం అమెరికా ప్రయోజనాలే అని చెప్పకనే చెప్పాడు. ఆసియాలో జపాన్‌ను ఎంపిక చేసుకోవడం వ్యూహాత్మకమే. ఇప్పటికే తూర్పు, దక్షిణ చైనా సముద్ర జలాల్లో పాగా కోసం, ఆధిపత్యం కోసం దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న జపాన్‌ను భాగస్వామిగా చేసుకొని చైనాకు వ్యతిరేకంగా అమెరికా పావులు కదిపింది. ఇప్పుడు భారత్‌ను కూడా చైనా వ్యతిరేక కూటమిలోకి లాగుతుంది.

ఆసియా పసిఫిక్ ప్రాంతంలో వాణిజ్యంపై చైనా గుత్తాధిపత్యాన్ని దెబ్బతీసే సత్తా టిపిపిఏ కి ఉందని అమెరికా బహిరంగంగా ప్రకటించింది. టిపిపిఏ కారణంగా 2025 నాటికి చైనా 4,600 కోట్ల డాలర్ల మేరకు వ్యాపారం కోల్పోతుందని అంచనా. దక్షిణ చైనా సముద్రంలో ఆగ్నేయాసియా దేశాలతో, తూర్పు చైనా సముద్రంలో జపాన్‌తో చైనా వివాదం పెట్టుకోవడంవల్లే తీర దేశాలు టిపిపిఏ ద్వారా అమెరికా కౌగిట్లోకి చేరుకున్నాయి. దీనితో

పసిఫిక్ ప్రాంతంలో చైనా పట్ల వ్యతిరేకత మరింత పెరిగిపోతుంది. టిపిపిఎ సభ్య దేశాల మధ్య ఐటీ, ఆర్థిక సేవల వ్యాపారం పెరగడం భారత్ మార్కెట్ వాటాను తగ్గించవచ్చు. రాబోయే అయిదేళ్లలో తన ఎగుమతులను రెట్టింపు (90 వేల కోట్ల డాలర్లకు) పెంచాలన్న భారతదేశ లక్ష్యానికి టిపిపిఎ గండి కొట్టవచ్చునని సింగపూర్‌కు చెందిన డిబీఎస్ గ్రూప్ పేర్కొంది. టిపిపిఎ నిర్దేశించిన పర్యావరణ, కార్మిక ప్రమాణాలను పాటించి వస్తు సేవలను ఉత్పత్తి చేయడం చైనాకే కాదు భారత్‌కు కష్టమే. ఔషధ తయారీపై టిపిపిఎ నియంత్రణలు భారతీయ ఫార్మా కంపెనీలకు తీవ్ర నష్టం కలిగించక మానవు.

ప్రస్తుతం అమెరికా వస్తు ఉత్పత్తులకు వివిధ దేశాల్లో 18 వేల రకాల పన్నులు వేయబడుతున్నాయి. ఈ ఒప్పందం ద్వారా అమెరికా ఉత్పత్తులకు పన్నుల రాయితీ లభించి తొలుత చౌకగా వస్తువులు లభ్యమైనప్పటికీ తదుపరి కాలక్రమంలో స్వదేశీ పరిశ్రమలూ, ఉత్పత్తులూ మూలనపడి భాగస్వామ్య దేశాల ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నమైపోయే ప్రమాదం పొంచి ఉంది. 'తద్వారా అప్పుల ఊబిలో కూరుకుపోయి తక్కువ ధరలకు ముడిసరుకులు విక్రయించుట ద్వారా దేశ సంపద తగ్గి ప్రజలు పేదరికంలోకి వెళ్లే ప్రమాదముంది. వాణిజ్య ద్రవ్య సంస్థల ఒప్పందాల వల్ల అంతిమంగా ప్రయోజనాలు పొందుతున్నవి బహుళజాతి కంపెనీలు మాత్రమే. ఈ ఒప్పందాల ద్వారా భాగస్వామ్య దేశాల్లోని వస్తు తయారీకి కావలసిన పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందవు. అధిక లాభాల మూలంగా అమెరికా, జపాన్ దేశాలు ఆటోమేషన్ వైపు వెళుతూ నిరుద్యోగాన్ని పెంచుతాయి. దీనికితోడు భాగస్వామ్య దేశాలలో ప్రజా సంక్షేమ రంగాలకు వ్యయం తగ్గించడం ద్వారా ఆర్థిక అసమానతలు పెరుగుతాయి.

టిపిపిఎ ఒప్పందం అమలైతే ఎలాంటి అప్రజాస్వామిక విధానాలు అమలవుతాయో అర్థం చేసుకోవాలంటే అందులోని కార్పొరేట్లు ప్రభుత్వాల మధ్య వివాద పరిష్కార ప్రక్రియ ఇన్‌వెస్టర్ స్టేట్ డిస్‌ప్యూట్ సెటిల్‌మెంట్ (ఐఎస్‌డిఎస్) నిబంధనలను గమనించాలి. ఒక దేశంలో పెట్టుబడులు పెట్టిన విదేశీ సంస్థలు తమ పెట్టుబడులకు, లాభాలకు, ఆస్తులకు సదరు దేశ చట్టాలు, విధానాలు భంగం కలిగిస్తున్నాయని భావిస్తే, వాటిని ఆ దేశం వెలుపల కోర్టుల్లో, రహస్య ట్రిబ్యునళ్లలో సవాలు చేయవచ్చు. సాధారణంగా అంతర్జాతీయ న్యాయస్థానాలు ఒక దేశం మీద మరో దేశం వేసిన దావాను మాత్రమే విచారణకు స్వీకరిస్తాయి. కానీ, ఐఎస్‌డిఎస్ కింద కంపెనీలు నేరుగా ప్రభుత్వాల మీద దావా వేయవచ్చు. ప్రభుత్వాలు మాత్రం కంపెనీల మీద దావా వేసే వీలు లేదు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఒ) నిబంధనల ప్రకారమైతే కంపెనీలు తమ దేశాల ప్రభుత్వాల ద్వారా ఇతర దేశాలపై దావాలు వేయవలసి ఉంటుంది. ప్రస్తుతం అంతర్జాతీయ ఒప్పందాల్లోని ఐఎస్‌డిఎస్ నిబంధనల ప్రకారం ప్రభుత్వాల మీద దావా వేసే అధికారాన్ని విదేశీ కంపెనీలకు ఇస్తున్నా, స్వదేశీ కంపెనీలకు ఆ అధికారం ఇవ్వలేదు. 1990 నుంచి ఇప్పటివరకు 100 దేశాల ప్రభుత్వాలపై 550 సార్లు దావా వేశారు. వీటిలో 65 శాతం కేసుల్లో బహుళజాతి కంపెనీలకు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఇంతవరకు విదేశీ ప్రభుత్వాలపై దావాలు వేసిన కంపెనీల్లో అత్యధికం అమెరికాకు చెందినవే.

ఒప్పందం అమలు ప్రారంభమయ్యాక భాగస్వామ్య ప్రభుత్వం కొత్తగా ఏవైనా నియంత్రణ చట్టాలను తీసుకొస్తే, ఆ చర్య తమ ప్రయోజనాలను దెబ్బతీస్తుందంటూ ప్రభుత్వంపై కంపెనీలు వేరే దేశాల్లోని కోర్టుల్లో, ట్రిబ్యునళ్లలో దావా వేయడానికి ఈ నిబంధన వీలు కల్పిస్తుంది. ఆ దావాల విచారణ రహస్యంగా ఉంటుంది. మరోవైపు కార్పొరేట్ పరిశ్రమలు ఏ చట్టాలనైనా ఉల్లంఘిస్తే వాటిపై చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వాలకు ఉండదు. ఆ కంపెనీల కారణంగా నేల, నీరు, పర్యావరణం కాలుష్యం బారిన పడినా నోరెత్తడం సాధ్యం కాదు. నియంత్రణలు విధించడానికి ప్రభుత్వాలకున్న సార్వభౌమాధికారాన్ని ఐఎస్‌డీఎస్ దెబ్బతీస్తుంది. ప్రజారోగ్యం, నైతిక విలువలు, ఆహార భద్రత, పర్యావరణం, జీవజాలం, సహజ వనరుల రక్షణ కోసం నియమ నిబంధనలను రూపొందించుకునే హక్కు సభ్యదేశాలకు ఉండేది. టిపిపిఎ నిబంధనల ద్వారా బహుళజాతి కార్పొరేషన్లదే పై చేయి అవుతుందన్న భయాలు వ్యక్తమవుతున్నాయి. విదేశీ కంపెనీల అక్రమాలను ఎవరైనా ఇంటర్నెట్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి మాధ్యమం ద్వారా ప్రపంచానికి వెల్లడించడానికి ప్రయత్నిస్తే అలాంటి వారిపై కేసులు పెట్టొచ్చు. ఆ సమాచారాన్ని తొలగించమని కంపెనీలు కోరినపుడు ఫేస్‌బుక్ వంటి సంస్థలు అంగీకరించక తప్పదు. కార్పొరేట్ అక్రమాలు వెల్లడి చేయడం నేరంగా టిపిపిఎ పరిగణించడంపై సర్వత్రా హాహాకారాలు రేగుతున్నాయి. ఎలాంటి వాణిజ్య ప్రయోజనము లేని ఫైల్ షేరింగ్ విషయంలో సైతం ఎవరిపైన అయినా సివిల్, క్రిమినల్ కేసులు పెట్టేందుకు టిపిపిఎ నిబంధనలు వీలు కల్పిస్తున్నాయి. ఇది అంతర్జాలంలో సమాచార వ్యాప్తికి, నవీనీకరణకు, కొత్త ఐటీ కంపెనీలకు, ప్రజా వేగులకు పిడుగుపాటు అవుతుంది.

ఇక పేటెంట్లకు సంబంధించిన నిబంధనలు మరీ కఠినంగా

ఉన్నాయి. అవి వాణిజ్య సంబంధ మేథో పరమైన హక్కుల (ట్రిప్స్‌ను) మించిపోయాయి. టిపిపిఎ అమలైతే ప్రాణావసరమైన ఔషధాల పేటెంట్లు బడా కంపెనీల వద్ద దీర్ఘకాలం ఉండిపోతాయని, వాటిని ఇతర సంస్థలు చవగ్గా ఉత్పత్తి చేయడం సాధ్యపడదని ఆ రంగంలోని నిపుణులు చెబుతున్నారు. నేడు టీకాలు, ప్రోటీన్లు, యాంటి టాక్సిన్లతో పాటు జికా, డెంగ్, ఎబోలా, క్యాన్సర్ వంటి వ్యాధుల చికిత్సకు ఔషధాలను జెనెటిక్ ఇంజనీరింగ్ ప్రక్రియలో చేస్తున్నారు. వీటిని బయో లాజిక్స్ అంటారు. ఇవి రసాయన ఔషధాలకన్నా ఎక్కువ సమర్థత కలవి. అయితే 22 రెట్లు ఎక్కువ ఖరీదైనవి. బయో లాజిక్స్‌ను అనుకరించి తయారు చేసే బయో సిమిలర్ ఔషధాలు బాగా చవక ధరలకు లభిస్తాయి. కానీ, టిపిపిఎ వల్ల బయో లాజిక్స్ తయారీ పరిజ్ఞానానికి ఎనిమిదేళ్లపాటు పేటెంట్ రక్షణ లభించడం వల్ల పేదలకు చవకగా వుండే బయో సిమిలర్స్ అందుబాటులో లేకుండా పోతాయి. పర్యవసానంగా టిపిపిఎలో భాగం కాబోతున్న మెక్సికో, వియత్నాం, చిలీ, మలేసియా దేశాల్లోని రోగులకు చావు తప్ప మరో గత్యంతరం లేని స్థితి కలగబోతున్నది.

టిపిపిఎ గుట్టును రట్టు చేసి అందులోని ప్రమాదకర అంశాలను ప్రజల ప్రయోజనం కొరకు ధ్వంసం చేయాలని విఖ్యాత ఆర్థికవేత్త జగదీశ్ భగవతి సూచించారు. దీనికి ఆయన 'డ్రాక్యులా భస్మీకరణ' అని నామకరణం చేశారు. ప్రధానంగా అయిదు గుప్త అంశాలపై నిరసనాగ్రహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ వాణిజ్య ద్రవ్య సంస్థల ఒప్పందాల వల్ల అంతిమంగా ప్రయోజనాలు పొందుతున్నవి బహుళజాతి కంపెనీలు మాత్రమే. ఈ ఒప్పందాల ద్వారా వర్ధమాన దేశాల్లోని వస్తు తయారీకి కావలసిన పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందవు. వాణిజ్య పోటీని తట్టుకోవడానికి అధిక లాభాలు పొందడానికి పారిశ్రామిక అగ్రదేశాలు ఆటోమేషన్‌వైపు వెళుతూ నిరుద్యోగాన్ని పెంచుతుంటాయి. దీనికితోడు సాంఘిక సంక్షేమానికి కోత విధించడం ద్వారా ఆర్థిక అసమానతలు పెంచుతుంది. వర్ధమాన దేశాల నుండి అగ్ర దేశాలకు మేధోవలస ద్వారా ఆయా దేశాల స్వావలంబనలు కుంటుపడుతున్నాయి. ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఈ మాదిరి ఒప్పందాల విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండి ప్రతిఘటించడం అవసరం. అమెరికా సామ్రాజ్యవాద అధిపత్యానికి వ్యతిరేకంగా గట్టిగా పోరాడాలి. సామ్రాజ్యవాదానికి ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాద అధిపత్యానికి వ్యతిరేకంగా గట్టిగా పోరాడేందుకు ప్రజలందరిని సమీకరిద్దాం. ○

*(5వ పేజీ తరువాయి)*

పాలకవర్గాలు ప్రయత్నిస్తున్నాయి. కశ్మీర్ న్యాయమైన ఆందోళన పట్ల సమర్థనతో ముందుకు వస్తున్న ప్రజలపై, ప్రజాస్వామిక వాదులపై నిర్బంధాన్ని కొనసాగిస్తూ, దేశద్రోహుల క్రింద జమకడ్తూ అక్రమ అరెస్టుకు పూనుకుంటున్నది. ఈ మధ్య జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీలో విద్యార్థులపై అమలు జరిగిన నిర్బంధాన్ని పరిశీలిస్తే ఈ వాస్తవం తేటతెల్లమవుతుంది.

ఇటీవల బీ.జే.పీ.కి చెందిన ఒక పార్లమెంటేరియన్ స్వపన్‌దాస్ గుప్త ఒక ప్రకటన చేస్తూ "కశ్మీరీల పట్ల కర్కశంగా వ్యవహరించడం వల్ల మరింత ప్రేమాభిమానాలు చూపే ప్రక్రియకు దారి సుగమమవుతుందని" అన్నారు. కశ్మీర్‌లో పాలకవర్గాల దమననీతికి ఈ వ్యాఖ్య అద్దం పడుతుంది. 1947 నుండి కశ్మీరీలపై ఈ కర్కశత్వమే అమలు జరుగుతుంది. మరి అలాంటప్పుడు కశ్మీరీలు తమ హక్కుల కోసం చేతులు ముడుచుకు కూర్చోవాలా! వారికి తోచిన పద్ధతుల్లో పోరాడాలా! అందుకే వారు ఈ కాలమంతా తమకు తోచిన పద్ధతిలోనే పోరాడడం నేర్చుకున్నారు. ఈ విషయంలో భారత ప్రజలు కశ్మీర్ ప్రజలకు వేరే గత్యంతరం లేని పరిస్థితి అని అర్థం చేసుకోవాలి. కశ్మీర్ ఒక అందమైన ప్రదేశంగా, సంపదగా మాత్రమే చూస్తూ దాన్ని మనకు కాకుండా పాకిస్థాన్, దాని ప్రేరేపిత ఉగ్రవాదుల సంస్థలు కుట్ర పన్నుతున్నారనే ప్రజా వ్యతిరేక విష ప్రచారాన్ని నమ్మకుండా, కశ్మీర్ ప్రజల జాతి ఆకాంక్షలను గుర్తించాలి.

కశ్మీరీ జాతి స్వయం నిర్ణయాధికారం, స్వయంపాలన చాల పురాతనమైన ఆకాంక్ష. స్వతంత్ర కశ్మీర్ కోసం ప్రజలు అనేక త్యాగాలు చేస్తూ పోరాటం కొనసాగిస్తున్నారు. భారత పాలకవర్గాలు ఈ పోరాటాన్ని ఫాసిస్టు నిర్బంధంతో అణచివేయ ప్రయత్నిస్తున్నాయి. భారత పాలకవర్గాలు దేశంలో వివిధ జాతులను అణిచిపెట్టి వారి ఆకాంక్షలను నొక్కి పెడుతున్నాయి. కశ్మీర్ మరియు ఈశాన్య జాతులన్నీ భారత పాలకవర్గాల అణచివేతకు గురి అవుతున్నాయి. కశ్మీర్ జాతి ప్రజల పోరాటంతో పాటు దేశంలో న్యాయబద్ధమైన అన్ని జాతి పోరాటాలకు భారత ప్రజలు మద్దతునివ్వాలి. కశ్మీరీల పోరాటం జాతి వ్యతిరేకమైనదని కేంద్ర ప్రభుత్వం భారత ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నది. భారత పాలకవర్గాల విష ప్రచారాన్ని తిప్పి కొట్టాలి. కశ్మీర్ జాతి పోరాటానికి భారత ప్రజలు సంపూర్ణ మద్దతు అందించాలి. ○

# సంఘ్ శక్తుల చేతుల్లో మోదీ పాలన
# ఫాసిజాన్ని ప్రతిఘటిస్తూ ప్రజల విశాల ఐక్య పోరాటాలు

ముప్పయి నెలల మోదీ పాలనలో మనకు మూడు విషయాలు ప్రధానంగా ముందుకు వచ్చాయి. 1. జాతీయ ప్రజాస్వామిక కూటమి పేరుతో నడుస్తున్న మోదీ పాలన అన్ని రంగాలలో సంయుక్త ప్రగతి శీల కూటమి విధానాలనే తమ విజన్ 2020 నేపథ్యంలో కొనసాగిస్తున్నది. 2. ఈ దేశంలో 'స్వాతంత్ర్యానంతర' కాలం నుండి అమలవుతున్న హిందూ అనుకూల విధానాలు మోదీ పాలనలో కరుడుగట్టిన హిందుత్వ విధానాలుగా ఘనీభవించాయి. 3. అన్ని రంగాలలో మోదీ అనుసరిస్తున్న విధానాలు దోపిడీ, పీడనలను తీవ్రం చేస్తూ ప్రజా నిరసననూ, ప్రతిఘటనను మున్నెన్నటి కన్నా బలంగా ముందుకు తెస్తున్నాయి. మోదీ పాలనను విశ్లేషించేటప్పుడు మౌలికంగా పై మూడు విషయాల ను దృష్టిలో ఉంచుకోవాలి. నిజానికి పైన పేర్కొన్న మొదటి రెండు విషయాలు ఒక రకంగా ఈ వ్యవస్థ స్వభావ వ్యక్తీకరణలు. లేదా పాలక వర్గాల స్వభావ వ్యక్తీకరణలుగా చెప్పుకోవచ్చు. వాటి ఫలితంగానే మూడో విషయం ఉత్పన్నమవుతుంది. పై మూడు విషయాల మధ్య గల అంతస్సంబంధాన్ని అర్థం చేసుకోవడం ద్వారానే గాడి తప్పకుండా మోదీ పాలనను విశ్లేషించుకోగలుతాం.

పై విశ్లేషణలోకి వెళ్లే ముందు మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న భారతీయ జనతా పార్టీ వర్గ స్వభావం, దాని భావజాలాన్ని చూద్దాం. వర్గ స్వభావ రీత్యా భాజపా దోపిడీ పాలక వర్గాలకే చెందింది. సామ్రాజ్యవాద, భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాల ప్రయోజనాలకే ప్రాతినిధ్యం వహిస్తుంది. దాని భావజాలం బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు భావజాలం. దాని మాతృ సంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్). దాని సంస్థాగత మూల పురుషుడు వినాయక్ దామోదర్ సావర్కర్. అది తన లక్ష్యం సాంస్కృతిక జాతీయవాదం అని చెబుతుంది. అంటే దాని భావం భారతీయ నాగరిగతకు వైదిక హిందుత్వమే మూలం అని వివరిస్తారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే దాని సిద్ధాంత కర్తలు, గురువులలో ఒకరైన గోల్వాల్కర్, హిట్లర్ ఆర్య జాతి సిద్ధాంత వెలుగులో శక్తి వంతమైన హైందవ జాతిని నిర్మించాలన్నాడు. వారు దేశంలోని వర్ణ వ్యవస్థను ఆర్యులు ప్రసాదించిన గొప్ప వరంగా భావిస్తారు. ఇది వారి భావజాలం. దీనిపై స్పష్టత కలిగి వుండడం ద్వారా మోదీత్వ పాలనలోని హిందుత్వ దాడుల వెనుక దాగిన అసలు లక్ష్యం అర్థమవుతుంది.

ఇప్పుడిక్కడ మనకు రెండు విషయాలు స్పష్టమవుతున్నాయి. ఒకటి, వారు రూపొందించుకున్న విజన్ - 2020. రెండవది, వారి భావజాలం. అది వారు బాహాటంగానే చెప్పుకునే సాంస్కృతిక జాతీయవాదం. వారు తమ విజన్ - 2020 ప్రకారం మన దేశాన్ని ప్రపంచంలోనే ఒక అగ్ర రాజ్యంగా నిలుపదలుచుకున్నారు. వారి విజన్ - 2020 గత వాజ్‌పేయ్ కాలంలోనే (1999-2004) రూపొందింది. పోతే సాంస్కృతిక జాతీయవాదం అంటే హిందూ సాంప్రదాయం జాతి వారసత్వం అని ప్రతి ఒక్కరు ఒప్పుకొని తీరాలి. ఈ రెండూ ఒకదానితో మరొకటి పెనవేసుకొనే వున్నాయి. ఈ రెండింటికి కార్యరూపం ఇవ్వడమే సంఘ్ శక్తుల పాలనకు దిశా నిర్దేశం అవుతున్నది.

భాజపా రూపొందించుకున్న విజన్-2020కి కార్యరూపం ఇవ్వడానికి వారికి తగిన వ్యక్తి మోదీ అన్నది 2009 నాటికే స్పష్టమైంది. ఆ దృష్టితో ఆ పార్టీ చేస్తూ వచ్చిన కృషి ఫలితంగా 2014లో స్పష్టమైన మెజారిటీతో అది అధికారంలోకి రాగలిింది. మరోవైపు కాంగ్రెస్ చరిత్రలో అది ఎన్నడూ దిగజారని స్థాయికి పడిపోయి పార్లమెంటులో ప్రతిపక్ష హోదాకు కావాల్సిన కనీస స్థానాలనైనా గెలుచుకోలేకపోయింది. కాంగ్రెస్ హయాంలో అది అవలంభించిన విధానాలు దాని పని తీరు ఆ పార్టీ ఘోర పరాజయానికి, భాజపా విజయానికి ముఖ్య కారణాలైనాయి.

భాజపా అధికారం చేపట్టడానికి కావలిసిన స్పష్టమైన మెజారిటీ దాని వద్ద వున్నప్పటికీ అది ఎన్‌డీఏ ప్రభుత్వంగానే కేంద్రంలో గద్దెనెక్కింది. మోదీ ప్రధాన మంత్రయ్యాడు. ప్రధాన మంత్రిగా మోదీ ప్రమాణ స్వీకారం చేసిన కార్యక్రమానికి సార్క్ దేశాల నాయకులను ఆహ్వానించినప్పటి నుండి ఆయన ప్రతి చర్య విజన్-2020లో భాగంగానే కొనసాగుతున్నది. దక్షిణ ఆసియాలో తమ ఆధిపత్య ధోరణికి అది ఒక వ్యక్తీకరణ.

భాజపా రూపొందించుకున్న విజన్-2020 ప్రకారం నిజంగానే భారత దేశం ప్రపంచంలో గ్రేట్ పవర్‌గా ఆవిర్భవించడానికి అవకాశాలున్నాయా? అని ప్రశ్నించుకుంటే మోదీ ఎంతటి భగీరథ ప్రయత్నం చేసినా అది పగటి కలే కాక తప్పదు. మన దేశం ఒక అగ్ర రాజ్యంగా ఎదిగి రావడానికి కావాల్సిన భౌతిక పరిస్థితులే ఈనాడు లేవు. మన దేశం అర్ధ వలస అర్ధ భూస్వామ్య దేశం. ఇలాంటి మన దేశం మొదట ఒక పెట్టుబడిదారీ దేశంగా మారకుండా అగ్రరాజ్యంగా ఎలా పరిణమిస్తుంది? అది సాధ్యం కాదు. చరిత్రలో ఎదిగి వచ్చిన అగ్ర రాజ్యాలేవీ అలా రాలేదు. అయినప్పటికీ భారత దేశాన్ని అగ్ర రాజ్యంగా మార్చడానికి సంఘ్ పాలనలో మోదీ చేస్తున్నది ఏమిటి?

1991 నుండి భారత దేశంలో అమలవుతున్న నూతన ఆర్థిక విధానాలను (ఎల్‌పీజీ) మోదీ యథాతథంగా అమలు చేస్తున్నాడు. తాను అధికారంలోకి రాకముందు తీవ్రంగా విమర్శించిన యూపీఏ విధానాలన్నింటినీ తిరిగి క్రమ క్రమంగా తన పాలనలో అమల్లోకి తెస్తున్నాడు. వాటిని అత్యంత దూకుడుగా శరవేగంగా అమలు చేయడానికి పూనుకుంటున్నాడు. యూపీఏ అనుసరించిన

విధానాలన్నీ వాస్తవంగా సామ్రాజ్యవాద సంస్థలు రూపొందించినవే కాబట్టి మోదీ వాటన్నింటినీ అమలు చేయక తప్పదు. కాకపోతే ప్రజలను మోసగించడానికి ఆయన తనదైన ఫాసిస్టు శైలిలో నడుం బిగించాడు. అందులో భాగంగా కొన్ని కొత్త పథకాలు ముందుకు తేవడం, పాత పథకాలకు పేర్లు మార్చడం, అవకాశం వున్నంత మేరకు ప్రజల మనోభావాలను సొమ్ము చేసుకోవడానికి ఆ పేర్లకు ఆధ్యాత్మికతను జోడించడం, పాత సంస్థలను ఎత్తివేయడం, కొత్త సంస్థలను ముందుకు తేవడం, అచ్ఛే దిన్ ఆయేంగే, సబ్ కే సాథ్ సబ్ కా వికాస్ లాంటి ఆకర్షణీయ నినాదాల మాటున జరుగుతోంది.

తొలుత మోదీ భారత దేశ అభివృద్ధి పేరుతో 'మేక్ ఇన్ ఇండియా' అంటూ బహుళజాతి కంపెనీలకు ఎర్ర తివాచీ పరిచి ఆహ్వానం పలికాడు. తన రెండేళ్ల పాలనలో దాదాపు 40 దేశాలు పర్యటించి ఆయా దేశాల ప్రభుత్వాధినేతలతో అనేక రంగాలలో పలు ఒప్పందాలు కుదుర్చుకుని వచ్చాడు. భారత దేశంతో వారు కుదుర్చుకున్న ఒప్పందాలన్నీ ఆధునిక టెక్నాలజీతో నడిచే పరిశ్రమలకు చెందినవి కావడం, మరో వైపు తన రెండో విడత అమెరికా ప్రయాణంలో సిలికాన్ వ్యాలీలో డిజిటల్ దిగ్గజాలతో సంప్రదింపులు జరిపి డిజిటల్ ఎకానమీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను ఆహ్వానించాడు. ఆ రకంగా తన డిజిటల్ ఇండియా పథకాలకు పూతమిచ్చాడు. ఈ రెండింటికి తాను అనుకుంటున్నట్టుగా కార్య రూపం ఇవ్వడానికి 'స్కిల్ ఇండియా' అన్నాడు. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా మన దేశానికి విదేశాల నుండి వచ్చే పెట్టుబడులకు, వారు ఏర్పర్చే ఆధునిక పరిశ్రమలకు కావాల్సిన నిపుణ కార్మికులను చౌకగా సమకూర్చడం 'స్కిల్ ఇండియా' లక్ష్యం. వీటన్నింటికీ రూపకల్పన చేసే లక్ష్యంతోనే ప్లానింగ్ కమిషన్‌ను నీతీ ఆయోగ్‌గా మార్చాడు. ఈ పథకాలన్నీ దేశ వినాశనానికే దారి తీస్తాయి తప్ప వికాసానికి ఎంత మాత్రం కావు.

మోదీ మరి కొన్ని ఆర్థిక పథకాలను ముందుకు తెచ్చాడు. బుల్లెట్ ట్రైన్స్‌ను ప్రవేశపెడుతున్నాడు. వేగవంతమైన సౌకర్యవంతమైన ఈ రైళ్లు దేశ పేద ప్రజలకు ఉద్దేశించినవి ఎంత మాత్రం కావు. వీటి ప్రయాణ కిరాయి ఇంచు మించు విమాన సర్వీసులతో సమానంగా వుంటుంది. ఇవి ఆయన డిజిటలైజేషన్‌లో భాగమే. మోదీ 'స్మార్ట్ సిటీస్' అంటూ మొదట దేశంలోని నూరు పట్టణాలను అన్ని రకాల హంగులు కల్గిన పట్టణాలుగా తీర్చిదిద్దే పథకాన్ని ప్రారంభించాడు. దీనికి దాదాపు లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు అవసరమున్నాయి. ఇందుకు గాను జపాన్, ఫ్రాన్స్, బ్రిటన్, అమెరికా మొదలైన సామ్రాజ్యవాద దేశాలు వంద పట్టణాలను పంచుకున్నాయి. ఈ పథకాలతో పాటు అమాయక ప్రజలలో భ్రమలను పెంచే స్వచ్ఛ భారత్ అభియాన్‌కు పిలుపిచ్చాడు. పల్లెలలోని గల్లీల నుండి ఢిల్లీలోని రాజమార్గాల వరకూ వీధులు శుభ్రం చేయడానికి దేశ ప్రజలంతా నడుం బిగించాలని కోరాడు. తమ సేవా కార్యక్రమాలను ప్రపంచానికి చాటుకోవడానికి ఫోటోలు తీసి అంతర్జాలం ద్వారా తనకు చేరవేయండి అంటూ యువతలో క్రేజీని నింపడానికి మన్‌కీ బాత్ ఆయనకు మంచి సాధనమైంది. స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఆయన ప్రారంభించిన నమామే గంగే (గంగా నదిని శుభ్ర పరచడం) పథకానికి జపాన్ సామ్రాజ్యవాదుల నుండి కోట్ల రూపాయలు అప్పుతెచ్చాడు. ఈ పథకానికి సాధ్వీ ఉ మాభారతి సారథ్యం వహించడం వారి ఆధ్యాత్మిక హిందుత్వ భావజాలంలో భాగమే.

దేశ ప్రధాని ప్రారంభించిన ఏ పథకాన్ని పరిశీలించినా తుదకు అది అత్యంత తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను ఈడేర్చేదే అవుతుంది తప్ప దేశ ప్రజల అభ్యున్నతిని ఆశించినది ససేమిరా కాదని సులువుగానే బోధపడుతుంది. దేశ ప్రధానిది నిరుపేద ప్రజల ఇల్లు గుల్ల చేయడంలో కూడా అందెవేసిన చెయ్యే. అందుకు ఉదాహరణలుగా చెప్పుకోవడానికి 'జన్ ధన్ యోజన', 'ఆధార్ కార్డు' పథకాలు సరిపోతాయి. జీరో నిల్వలతో బ్యాంకు ఖాతా ప్రారంభించవచ్చని ప్రధాని మనసులోని మాట ద్వారా ఊదరగొట్టాడు. అయినప్పటికీ కోట్లాది పేద ప్రజలు కడుపుకట్టుకుని సంపాదించిన స్వల్ప మొత్తాలతో బ్యాంకు ఖాతాలను ప్రారంభించి 35 వేల కోట్లకు పైగా రూపాయలు బ్యాంకులలో నిలువ చేశారట. ఇది ప్రధాని మీద ప్రేమో లేక బ్యాంకు అధికారుల దబాయింపో ప్రజల మనసుల్లోని వ్యథ వారికి తెలిస్తే కదా. జన్ ధన్ యోజనలో దాగిన అసలు నిజమేమంటే ప్రజల ప్రతి పైసా పెట్టుబడిదారులకు ఎలా ఉపయోగించాలన్నదే దాని పరమోద్దేశ్యం. జన్ ధన్ యోజనను ప్రత్యక్షంగా డబ్బు బదలాయింపు విధానంతో ముడిపెట్టారు. ఇందులో భాగంగా కోట్లాది ప్రజల బ్యాంకు ఖాతాలలోకి ప్రభుత్వ సబ్సిడీ మొత్తాలన్నీ నేరుగా చేరిపోతున్నాయి. సబ్సిడీ లబ్ధిదారులెవరైనా ఈ పథకం ప్రకారం తమ బ్యాంకు ఖాతా నుండే ఆ మొత్తాన్ని పొందాల్సి వుంటుంది. అంటే ప్రజల ఖాతాలలోకి చేరే కోట్లాది రూపాయల డబ్బు అది లబ్ధిదారుల వినియోగం లోకి వచ్చే క్షణం వరకూ పెట్టుబడిదారుల ఆర్థిక ప్రయోజనాలను నెరవేరుస్తుంది. అలా జన్ ధన్ ఖాతాలలో జమవుతున్న డబ్బు నిల్వలన్నీ అంతిమంగా పెట్టుబడిదారుల ప్రయోజనాలే ఈడేర్చుతున్నాయి.

జన్ ధన్ యోజనతో ఆధార్ కార్డును జత చేశారు. ఎన్నికలకు ముందు ఆధార్ కార్డు అవసరం ఏముందంటూ ఉపన్యాసాలిచ్చిన మోదీ, దానిని అనివార్యం చేయవద్దంటూ సుప్రీం కోర్టు ఇప్పటికీ వారిస్తున్నా అడవులలోని మారు మూల పల్లెల్లో సైతం ఆధార్ కార్డు తీసుకోకుంటే పౌర, పోలీసు అధికారులు ప్రజలను వదలడం లేదు. ఈరోజు దేశంలోని ప్రతి పౌరుడికి ఆధార్ కార్డు వుండి తీరాల్సిందే. వాస్తవంగా ఆధార్ కార్డు నిమిత్తం సేకరించే సూక్ష్మ వివరాలన్నీ తీవ్ర అభ్యంతరకరమైనవే. ప్రజలపై రాజ్యం నియంత్రణను పెంచేవే.

పై రెండింటికి తోడుగా మొబిలిటీని జత చేశారు. దీనిని ప్రపంచ బ్యాంకు సెలవిచ్చే ప్రజల వద్దకు పాలనగా అర్థం చేసుకోవాలి. జన్ ధన్ యోజన, ఆధార్ కార్డు, మొబిలిటీని కలిపి జామ్ (జేఏఎం) అంటున్నారు. అవినీతికి తావు లేని పారదర్శక జవాబుదారీ వ్యవస్థల ఆవిష్కారం కోసం జామ్ వంటి మేలైన సంస్కరణలను మోదీ సర్కార్ ప్రవేశపెట్టిందంటూ ఆయన భక్తులు తెగ ప్రచారం చేస్తున్నారు.

ఇక మధ్య తరగతి యువతను మరింత ఆకర్షించడానికి దళిత, ఆదివాసీ, మహిళల సముద్ధరణ ప్రభుత్వంగా చెప్పుకోవడానికి ఈ మధ్య ముద్రా యోజన, స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా అంటూ నూతన పథకాలను ముందుకు తెచ్చారు. దేశంలో కునారిల్లిపోతున్న తయారీ రంగాన్ని అభివృద్ధి పరచకుండా ప్రగతి పథంలో ఏ దేశ ఆర్థిక వ్యవస్థ పురోగమించలేదన్నది అతి సాధారణ విషయం. అందుకోసం ఆయన భారత దేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మలచాలంటున్నాడు. అంటే ఒకప్పుడు బ్రిటన్, ఆ తర్వాత అమెరికా, ప్రస్తుతం చైనా విశ్వ కార్ఖానా (వర్క్ షాప్)గా వుండగా ఆ స్థానాన్ని భారత దేశం కైవసం చేసుకోనున్నదంటూ మోదీ నమ్మబలుకుతున్నాడు. ప్రజల కొనుగోలు శక్తి పెరగకుండా తయారీ వస్తువులను మార్కెట్లలో కొనేదెవరు? ఇందుకు ముందుగా ప్రజల కొనుగోలు శక్తి పెరగాలి. మన్‌రేగాను ఎన్నికలకు ముందు ఎంతగానో ఎకసెక్కం చేసిన మోదీ ఇప్పుడు దాన్ని అందలం ఎక్కిస్తున్నాడు. ఇలా మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుండీ చేపడుతున్న ప్రతి చర్యా సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం 25 ఏళ్ల కింద ప్రారంభించిన నూతన ఆర్థిక విధానాలను శరవేగంగా ముందుకు తీసుకు పోయేదే.

25 సంవత్సరాల క్రితం 47 అత్యంత ప్రాధాన్యతా రంగాల్లో సంస్కరణల పథ ప్రస్థానం ప్రారంభమయింది. ఆ ప్రస్థానం మోదీ హయాంలో చరమ దశకు చేరుతున్నది. తన రెండేళ్ల పాలన వేడుకల సంబరాల్లో భాగంగా గత ఏ ప్రభుత్వం చేయడానికి సాహసించని విధంగా మోదీ దేశంలోని రక్షణ, పౌర విమాన యానం, బ్యాంకింగ్, పశు సంవర్ధన, రిటైల్, ఆహార ఉత్పత్తులు, ప్రసార సేవల సంస్థలు, ఔషధ రంగాలు లాంటి 15 రంగాలను వంద శాతం ప్రైవేటీకరించాడు. దీనితో విదేశాలకే లాభాలు తరలిపోతాయి తప్ప దేశం అంకెల గారడీలతో చూపే అభివృద్ధి రేటును చూసుకొని మాత్రం మురిసిపోవాల్సి వుంటుంది. అంతే తప్ప ప్రజల వాస్తవ జీవితాలలో మౌలిక మార్పేమీ వుండదు. ఈ రకంగా మోదీ ముందుకు తీసుకెళ్తున్న ఆర్థిక విధానాలన్నీ అంతర్జాతీయ ద్రవ్య సంస్థల కనుసన్నలలో రూపొందినవే. కేంద్రంలో, రాష్ట్రాలలో అధికారంలో ఏ పార్టీకి చెందిన పార్టీలున్నా విధానాలు మాత్రం అవే అమలవుతాయి. ఎందుకంటే ఈ పార్టీలన్నీ ఒకే తానులోని ముక్కలు. ఈ మధ్య పార్లమెంటులో, రాష్ట్రాల విధాన సభలలో ఆమోదించిన జీఎస్‌టీ బిల్లు అందుకు ఒక చక్కని ఉదాహరణ. ఈ బిల్లు చట్టంగా మారడం సామ్రాజ్యవాదులకు తక్షణం అవసరమైంది.

భారత పాలక వర్గాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలలో భాగంగా ఈ దేశంలోని రైతుల జీవితాలు అత్యంత దుర్భరంగా మారాయి. ప్రభుత్వాలు ఎన్ని మారుతున్నప్పటికీ వారి జీవితాలలో ఎలాంటి ఆశాజనక మార్పులు చోటుచేసుకోవడం లేదు. మోదీ ప్రభుత్వ హయాంలో ఆత్మహత్యలు దిల్లీ చేరాయి. మరో వైపు దేశంలో పెరుగుతున్న రైతుల ఆత్మహత్యలను ఆయా ప్రభుత్వాలు కనీస పరిగణనలోనికైనా తీసుకోని సంవేదనా రహితమైన వాతావరణం పెరుగుతున్నది. మంత్రులు, ముఖ్య మంత్రులు రైతుల ఆత్మహత్యలను అపహాస్యం చేస్తుండగా అధికారులు రికార్డు చేయడానికి కూడా నిరాకరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్రాల బడ్జెట్లలో రైతాంగానికి దొరికే సబ్సిడీలపై కోతలు పెంచుతున్నారు. రైతుల పంట భూములను, ఆదివాసుల అడవులను దళారీ నిరంకుశ పెట్టుబడిదార్లకు, సామ్రాజ్యవాదులకు సమకూర్చడానికి భూ సేకరణ బిల్లును మూడు సార్లయినా మోదీ ముందుకు తేవడం చూశాం. భూ సేకరణ బిల్లు తేవడానికి ముందు నర్మదా లోయలో 70 శాతం పంట భూములు పారిశ్రామిక కారిడార్‌కు అప్పగించారు. దేశంలో లక్షల హెక్టార్ల అడవులను ఇప్పటికే పారిశ్రామిక వేత్తలకు అప్పగించారు. కాగా మోదీ ప్రైవేటీకరణలో భాగంగా ఇలాంటి ఏ అవసరం లేకుండానే ఏకంగా అడవులనే అమ్మకానికి పెట్టే రోజులు ఎంతో దూరం లేవు.

దేశంలోని రైతుల పంటలకు గిట్టుబాటు ధరలే దొరకడం లేదు. సాలు పొడుగూతా రెక్కలు ముక్కలు చేసుకొని పైర్లు పండించే వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలే దిక్కులేవు. 365 రోజులలో అన్ని రకాల సెలవులు పోగా 195 రోజులు మాత్రమే పని చేసే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగికి రోజుకు రూ.790 దొరుకుతున్నా, ఈ రోజులలో బతుకే ఒక గండంగా వారు గడుపుతున్నారంటే ఇక వ్యవసాయ ప్రధానమైన మన దేశంలోని బడుగు రైతుల, నిరుపేద కూలీల బతుకులు ఎంత దారుణంగా సాగుతున్నాయో ఆలోచించాలి. రైతులకు ప్రభుత్వం నుండి అందే రుణ సౌకర్యం అంతంత మాత్రమే. వారు కరవు కాలంలో వాటిని చెల్లించకుండా దివాళా తీస్తుంటే ఏ బ్యాంకు, ఏ ప్రభుత్వం వారిని ఆదుకోవడం లేదు సరికదా పాత బకాయిలు చెల్లించలేదని వారి ఇళ్లల్లోకి దూరి దౌర్జన్యంగా గంజులు, ముంతలు నడి బజారుకు లాగి జప్తు చేసుకుంటారు. నిజానికి ఈ దేశంలోని బ్యాంకులకు రైతులు అప్పుపడి వున్నది అక్షరాల 72 వేల కోట్లు మాత్రమే. కానీ మరోవైపు భారత దేశంలోని దళారీ పెట్టుబడిదారులు 6 లక్షల కోట్ల రూపాయలు బ్యాంకులకు సున్నం పెట్టారు. పని చేయని ఆస్తులు (ఎన్‌పీఏ) అంటూ బ్యాంకుల రుణాలు తీర్చలేం అంటూ వారు మొండికేశారు. దానితో అన్ని బ్యాంకులూ వారి అప్పులన్నీ మొండి బకాయిల్లో చేర్చి తమ ప్రభు భక్తిని చాటుకున్నాయి.

మన దేశంలోని రైతులకు 2022 నాటికి రెట్టింపు ఆదాయం లభించేలా చేస్తానంటూ మోదీ గంభీర ఉపన్యాసాలు దంచేస్తున్నాడు. ఈ దేశంలోని రైతు సగటు ఆదాయం ప్రస్తుతం ఏటా 20 వేలు దాటడం లేదంటూ వ్యవసాయ ఆర్థిక వేత్తలు అంచనాలు వేస్తుండగా దేశంలోనే రైతు ఆత్మహత్యలలో అగ్ర భాగాన నిలిచిన మరాట్వాడా రైతులు వర్తమానంలో వారి వ్యవసాయ ఆదాయం శూన్యం కాగా 2022 నాటికి మోదీ గారు దానిని రెండు సున్నాలు చేస్తాడంటూ తమ వెతలు వెల్లబోసుకుంటున్నారు. ఇక పోతే ప్రధాన మంత్రి పంటల బీమా పథకంలోని డొల్లతనాన్ని ఛత్తీస్‌గఢ్‌లోని రైతులు బయటపెడుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా జిల్లా మహేంద్రగఢ్ రైతాంగం ప్రధాని పంటల భీమా అంటేనే అమ్మ బాబోయ్ అంటూ గుండెలు బాదుకుంటున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ప్రభుత్వం అనుమతి పొందిన ఏడు భీమా కంపెనీలు రైతాంగం నుండి ఎకరాకు రూ. 2000 చొప్పున ప్రీమియం రూపంలో 330 కోట్లు దండుకున్నాయి. కరవు కాలంలో తమనాదుకోవాలని ఆ రైతులు భీమా కంపెనీలను వేడుకుంటే ఎకరాకు పట్టుమని పది రూపాలయినా ఇవ్వడం లేదంటూ రైతులు వాపోతున్నారు. ఈ రకంగా దిన దినం దిగజారిపోతున్న దేశ రైతాంగం పరిస్థితి చూస్తుంటే మోదీ ప్రైవేటైజేషన్ హయాంలో వ్యవసాయం సంపూర్ణంగా పెట్టుబడిదారుల హస్తగతం కానున్నదని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు.

దేశానికి వెన్నెముక లాంటి వారు శ్రామికులు. శ్రామికులు అనేక వీరోచిత పోరాటాలు చేసి సమ్మె హక్కు పని గంటలు తగ్గింపు, పని స్థలాల్లో కనీస సౌకర్యాల్లాంటి పలు హక్కులను సాధించుకున్నారు. పెట్టుబడిదారుల స్వప్రయోజనాలకు ఇవి చుక్కెదురుగా వున్నాయి. అందుకే వీటిని ఏదో ఒక రూపంలో తగ్గించడానికి దోపిడీ పాలక వర్గాలు నిరంతరం కుట్రలు పన్నుతుంటాయి. మాజీ ప్రధాని ఇందిర 'గరీబీ హఠావో'తో పాటు 'శ్రమయేవ జయతే' అంది. మోదీ అధికార పగ్గాలందుకున్న కొద్ది మాసాలలోపే ఆవిడ లాగే శ్రమయేవ జయతే అంటూ తనదైన శైలిలో ముందుకు వచ్చాడు. దేశంలో మోదీ అమలు చేస్తున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల ఫలితంగా మున్నెన్నటికంటే అధికంగా కార్మికులు వీధినపడుతున్నారు. మేక్ ఇన్ ఇండియాలో భాగమైన డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియాలు నూతన సాంకేతికతను నిలుపుతున్నవి. అవి మూల ధన ఆధారిత పరిశ్రమలను స్థాపిస్తున్నాయే కానీ శ్రమ ఆధారిత పరిశ్రమలను కాదు ఇప్పటికే సంఘటిత రంగం నామమాత్రం అయిపోయి దేశంలోని 85 శాతం శ్రమ శక్తి అసంఘటిత రంగంలోనే కేంద్రీకరించబడి హైర్ అండ్ ఫైర్ విధానాలకు బలైపోతున్నారు. అంటే భవిష్యత్‌లో మోదీ పథకాలన్నీ జీవితాలను మరింత కకావికలం చేస్తాయి. గతంలో పోరాటాల ద్వారా వారు సాధించుకున్న సమ్మె హక్కు సహా కార్మికుల హక్కులన్నీ హననమవుతున్నాయి. ఇలాంటి స్థితిలో ఇకపై వారు సమరశీల పోరాటాలకు దిగాల్సిందే తప్ప మరే మార్గం మిగలలేదు.

ఇప్పటి వరకు సాగిన మోదీ పాలనలో దేశ ప్రజల జీవితాలు పెంకపై నుండి పొయ్యిలో పడిన చందంగా తయారయ్యాయి. అంతర్జాతీయ విఫణిలో చమురు ధరలు గణనీయంగా పడిపోతున్నప్పటికీ మోదీ ప్రభుత్వ పుణ్యమా అంటూ మన ప్రజలు మాత్రం వాటికి అంతగా నోచుకోవడం లేదు. మోదీ ప్రభుత్వానికి కలిసి వచ్చిన ఆ అవకాశంతో ప్రభుత్వానికి ఒనగూడుతున్న భారీ నిధులను అది సబ్సిడీల పద్దులలోకి మళ్లిస్తూ ప్రభుత్వ ఖజానాను నింపుకుంటున్నది. దేశంలో నిత్యావసర సరుకుల ధరలు మండిపోతున్నాయి. నిరు పేద ప్రజానీకానికి యేటా 150 రోజుల కూలీ దొరకకపోయినా కనీసం సగటున 15 రోజులైనా మన్‌రేగా కూలీ దొరకని దుస్థితి మరే రాష్ట్రం కన్నా అధ్వాన్నంగా మహారాష్ట్రలో వుంది. దేశంలో విద్య, ఆరోగ్య వ్యయం ఇప్పటికే ప్రమాదకర స్థాయికి పెరిగింది. మున్నెన్నటి కన్నా వేగంగా విద్య ప్రైవేటు పరం అవుతుండడంతో అది కొనలేక పోతున్న వారికి విద్య గగన కుసుమంలా మారిపోయింది. ఇలాంటి దుస్థితిలో పేద ప్రజల జీవితాలు కొనసాగుతున్నాయి. దేశంలో సంపన్నులకు పేదలకు మధ్య అంతరం అన్ని రంగాలలో పెరిగిపోతున్నది.

మహిళల విషయంలో మోదీ సర్కారు ఎన్నెన్నో సంస్కరణా పథకాలను ప్రకటిస్తున్నప్పటికీ 'బేటీ బచావో బేటీ పఢావో' ఆయన మనసులోని మాటగానే మిగిలిపోతున్నది. దేశంలో మహిళలపై అంతులేని అత్యాచారాలు జరిగిపోతున్నాయి. దేశంలోని వెయ్యి రెడ్ లైట్ ఏరియాలలో 40 లక్షలకు పైగా మహిళలు వేశ్యరికం అనే నరక కూపంలో నలిగిపోతున్నారు. చట్టాలలో సర్కార్లు ఎన్ని సవరణలు ప్రవేశపెడుతున్నా మహిళలపై పెరుగుతున్న హింసకు అవధులు లేకుండా పోతున్నది. దేశంలో మహిళలను, పిల్లలను, అమ్మివేయడం మూడు పువ్వులు ఆరు కాయలుగా వికసిస్తున్నది. ఈ మురికి కూపంలో నలుగుతున్న 'గులాబీ' జీవితాలపై దేశంలో జరుగుతున్న వ్యాపారంలో ఏటా 40 వేల కోట్లు గడిస్తున్నారు. ఈ దేహ వ్యాపారానికి బలవుతున్నది ప్రధానంగా బడుగు వర్గాల మహిళలే.

దేశంలో అనేక సమస్యల మధ్య నలుగుతున్న ఏ ఒక్కరి జీవితాలలో కూడా మోదీ చెప్పే అచ్ఛే దిన్ వచ్చే అవకాశమే లేదు. కుళ్లి కంపుకొడుతున్న దోపిడీ వ్యవస్థ లక్షణాలివి. మోదీ అధికార పగ్గాలందుకున్న మరు క్షణంలో తినను, తిననివ్వను అంటూ అనేక బీరాలు పలికాడు. కానీ తమ పార్టీ నాయకత్వంలోనే దాదాపు దశాబ్దానికి పైగా రాజ్యమేలుతున్న మధ్య ప్రదేశ్‌లో వ్యాపం (వ్యవసాయ పరీక్షా మండల్) ఛత్తీస్‌గఢ్‌లో నాన్ (నాగరిక్ ఆపుర్తి నిగమ్) లాంటి భారీ అవినీతి కుంభకోణాలు వెలుగుచూశాయి. వ్యాపం కుంభకోణం సాక్షులను సైతం మిగలకుండా చేస్తూ తమ ఫాసిస్టు స్వభావాన్ని చాటుకుంటున్నది. ఇలాంటి అనేక అవినీతి కుంభకోణాలకు మూలం మన దేశ పాలక వర్గాలు అనుసరిస్తున్న

ఆర్థిక విధానాలలోనే వుంది. వాటిని సమూలంగా నాశనం చేయకుండా ఇవేవీ ఎవరూ మార్చలేరు.

ఇకపోతే మోదీ గారి హయాంలో విశ్వవ్యాప్తంగా విస్తరిస్తుందని చెప్పబడుతున్న భారత దేశ కీర్తి ప్రతిష్టలను తప్పక పరిశీలించాలి. వాస్తవంగా ప్రపంచంలో విస్తరిస్తున్నది మన దేశ కీర్తి ప్రతిష్టలేమీ కావు. అందులో మోదీ గొప్పతనం ఏదీ లేదు. ఆచరణలో భారత దేశంలోని మూలమూలలకు విస్తరిస్తున్నది సామ్రాజ్యవాదుల, దళారీ పెట్టుబడిదారుల మూల ధనం మాత్రమే. దేశంలోని అమూల్య, అపార ప్రకృతి వనరులపై వారి డేగ కన్ను మాత్రమే. అదీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల రూపంలోనే. దీనిపై స్పష్టత వుంటే చలనశీలమైన ప్రపంచంలో చోటు చేసుకునే అనేక పరిణామాలను సరిగా విశ్లేషించుకోగలుగుతాం.

ఈమధ్య భారత దేశాన్ని పర్యటించిన ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు, మోదీ తన అభిమాన నాయకుడు అంటూ తెగ మెచ్చుకున్నాడు. నిజానికి ఆయన ప్రేమించేదంతా, లేదా అభిమానించేదంతా ఈ దేశ వనరులనే అనేది అర్థం చేసుకోవాలి. ప్రస్తుతం మోదీకి ప్రపంచ స్థాయి నాయకుల గుర్తింపు వచ్చిందని మీడియాలో మోదీ భక్తులు తెగపొగుడుతున్నారు. మోదీ తన రెండేళ్ల పాలనలో నాలుగు సార్లు అమెరికా వెళ్లాడు. శ్వేత సౌధంలో పాదం మోపాడు. వివిధ సందర్భాలలో ఏడు సార్లు ఒబామాను కల్సుకున్నాడు. కెమరూన్, ఎంజిలా మార్కెల్, ఫ్రాంసేనా హెలన్, ఝుంగ్‌పింగ్ లాంటి వాళ్లయితే పలుమార్లు భేటీ అయ్యాడు. 2002 గుజరాత్ నరమేధం ఫలితంగా అమెరికా వెళ్లడానికి అర్హత కోల్పోయి, 2005లో ఆ దేశ వీసా నిరాకరించబడిన మోదీ ఇప్పుడు ప్రపంచ స్థాయి నాయకుల సరసన చేరడానికి ఇవి ప్రమాణాలుగా చూస్తున్నారు. అవును! దోపిడీ పాలక వర్గాల కొలమానాలకు కావాల్సింది ఇంత కన్నా ఏముంటాయి? రక్తసిక్తమైన చరిత్ర నుండే పెట్టుబడి ప్రాథమిక సంచయనం జరిగిందన్న వాస్తవం తెల్సిన వారికి మోదీ గుర్తింపు వెనుక దాగిన అసలు నిజాలు తేలికగానే బోధపడుతాయి.

మోదీ గద్దెనెక్కిన తర్వాత అనేక అంతర్జాతీయ సంస్థలలో భారత దేశానికి నూతనంగా సభ్యత్వం దొరికిన మాట నిజమే. మన దేశం షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ)లో చేరింది. క్షిపణి పరిజ్ఞాన నియంత్రణ వ్యవస్థ (ఎమ్‌టీసీఆర్)లో 35వ దేశంగా ఇండియా చేరింది. ఏసియాన్ కూటమిలో సభ్యత్వం పొందింది. ఏసియాన్ సహా ఆరు దేశాల సభ్యత్వం గల ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్‌సీఈపీ)లో చేరింది. మరో వైపు 48 దేశాల న్యూక్లియర్ సరఫరా దారుల గ్రూపులో చేరడానికి అమెరికా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, జపాన్ లాంటి మహా దేశాల సమర్థన వున్నప్పటికీ ఆఖరి క్షణంలో చైనా సహా పది సభ్య దేశాలు కాలడ్డడంతో చేరలేకపోయింది. ఐక్య రాజ్య సమితి భద్రతా మండలిలో సభ్యత్వం చాలా కాలంగా పెండింగ్ జాబితాలో మిగిలి వుంది. ఇవన్నీ ఘటనలు. మారుతున్న పరిణామాలు. వీటిని దాదాపు గత పదేళ్లుగా తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న అమెరికా, యూరప్ సహా ప్రపంచ పరిణామాల నేపథ్యంలోనే పరిశీలించాలి. అమెరికా తర్వాత ప్రపంచంలో రెండవ ఆర్థిక మహా శక్తిగా ముందుకు వచ్చిన ఆసియాలోని మన దేశ పొరుగున గల చైనా నేపథ్యంలో కూడా చూడాలి. అప్పుడే ఇండియా కీర్తి ప్రతిష్టలూ, మోదీ గారి గొప్పతనం తెలిసి వస్తుంది.

మన దేశం సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను తలకెత్తుకున్నప్పటి (1991) నుండి క్రమంగా అమెరికా వైపు మొగ్గడం మరింత పెరిగింది. మోదీ ఆ క్రమాన్ని మరింతగా తీవ్రతరం చేస్తున్నాడు. అమెరికా నుండి భారత్‌కు రక్షణ ఎగుమతులు ఇప్పుడు వెయ్యి కోట్ల డాలర్లకు పెరిగాయి. భారత్‌లో అమెరికా పెట్టుబడులు 4.8 బిలియన్ డాలర్ల నుండి 28.4 బిలియన్ డాలర్లకు పెరిగాయి. భారత్ అమెరికా రక్షణ సాంకేతిక పరిజ్ఞానం వాణిజ్య ఒప్పందం (డీటీటీ) కుదిరింది. దేశ రక్షణకు 'సార్వభౌమాధికారానికి' అత్యంత ప్రమాదకరమైన సైనిక సాధన సంపత్తి సరఫరా ఒప్పందం (లాజిస్టిక్ సప్లయిస్ అగ్రిమెంట్) కుదుర్చుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరమైనాయి. ఈ ఒప్పందం ప్రకారం సైనిక సాధనాల మరమ్మత్తులు, విశ్రాంతికి అమెరికా మన దేశ భూ భాగాలను పదాతి, వాయు, నౌకా సేనల స్థావరాలను నిరభ్యంతరంగా వినియోగించుకుంటుంది. అంతే కాకుండా దీర్ఘ కాలంలో పాలక వర్గాలకు తలెత్తే భద్రతా ప్రమాదాలను సమర్థవంతంగా నివారించడానికి అమెరికా సైన్యం కూడా ఈ ఒప్పందం ప్రకారం భారత గడ్డ మీదికి దిగితీరుతుంది. నిజానికి ఈ ఒప్పందం ప్రపంచాధిపత్యం కోసం ఆర్థిక, సైనిక రంగాలలో ఎదిగివస్తున్న చైనాను ఎదుర్కోవడంలో భాగంగానే అమెరికా రూపొందించింది. గత పదమూడేళ్ల కాలంలో భారత్ అమెరికాకు ఒక వ్యూహాత్మక భాగస్వామిగా మారడంతో అది మన దేశానికి ఆర్థిక సైనిక రంగాలలో ప్రముఖ భాగస్వామి స్థాయి కల్పించింది. ఇలాంటి ఒప్పందాలు ఈనాడు అమెరికాకు చాలా అవసరం.

భారత దేశాన్ని అమెరికా తన ప్రపంచాధిపత్య రాజకీయ వ్యూహంలో ఎలా వినియోగించుకోవాలనుకుంటుందో తెల్సుకోవడం చాలా అవసరం. అమెరికాలోని 44 మంది ప్రముఖ మేధావులతో కూడిన (థింక్ టాంకర్లు) కౌన్సిల్ ఆఫ్ ఫారిన్ రిలేషన్స్ 2015 మార్చిలో తయారు చేసిన ఒక రిపోర్టులో చైనా పట్ల దాని మహా వ్యూహాన్ని స్పష్టం చేసింది. ఆ రిపోర్టు మన దేశాన్ని అమెరికాకు నాలుగవ ముఖ్య దేశంగా (కీ నేషన్)గా పేర్కొంది. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను తీవ్రతరం చేయాలని ఆ రిపోర్టులో పేర్కొన్నారు. చైనాను స్వతంత్రంగా ఎదుర్కొనేలా అన్ని నిబంధనలు సడలిస్తూ సైనిక టెక్నాలజీని ఇండియాకు బదిలీ చేస్తూ ప్రోత్సాహించాలని అందులో పేర్కొన్నారు. ఆసియాలో వర్తమాన శక్తుల సమతుల్యాన్ని కొనసాగించడానికి భారత న్యూక్లియర్

టెక్నాలజీ ఒక పెద్ద వనరు అని చెప్తూ భారత అమెరికా సైనిక సహకారాన్ని గుణాత్మకంగానే పెంచాలన్నారు. ఆ రిపోర్టులో ఇంకేం చెప్పారంటే భారత దేశం తూర్పు, ఆగ్నేయ ఆసియాలో తన బలాన్ని ప్రభావాన్ని పెంచుకునే విధానాలను గట్టిగా సమర్థించాలన్నారు. వాస్తవంగా అమెరికా మన దేశంతో కొనసాగిస్తున్న సంబంధాలను ఈ రిపోర్ట్ వెలుగులోనే అన్నది స్పష్టమవుతున్నది. ఆ పరిణామాలను ఒక్క మాటలో చెప్పాలంటే ప్రపంచాధిపత్యం కోసం అమెరికా కొనసాగిస్తున్న తన శాశ్విత యుద్ధాల ఎజెండాలో భారత్ గ్రేట్ పవర్‌గా ఎదిగి పోవడమేమో గానీ అత్యంత సన్నిహితంగా ఒదిగిపోతూ మందుగుండు పాత్ర పోషించనున్నదని ఘంటాపథంగా చెప్పవచ్చు.

భాజపా నాయకత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడి కేంద్రంలో మోదీ గద్దెనెక్కిన తర్వాత దేశంలో కాషాయ శక్తులు అడ్డూ అదుపూ లేకుండా విజృంభిస్తున్నాయి. భారత రాజ్యం తొలి నుండీ హిందూ మత అనుకూల విధానాలను అవలంభిస్తున్నప్పటికీ భాజపా పాలనలోని రాష్ట్రాల్లో గత కొంత కాలంగా హిందుత్వ శక్తులు పెట్రేగిపోవడం చూస్తున్నాం. అయితే గడిచిన 30 నెలల మోదీ కాలంలో దేశ వ్యాప్తంగా ఈ శక్తులు తమ కాషాయ ఉగ్ర రూపాన్ని మరింత దూకుడుగా చూపుతున్నాయి. సాంస్కృతిక జాతీయవాదం పేరుతో వారు చేసేదంతా దేశంలోని మత మైనారిటీలపై దాడే. దేశ చరిత్రను తమకు అనుకూలంగా వక్రీకరించడమే. ఈనాటి విద్యా ప్రణాళికను కాషాయీకరించడమే.

దేశంలోని అనేక రాష్ట్రాలలో గోహత్య నిషేధం చాలా సంవత్సరాలుగా అమలులో వున్నప్పటికీ ఈ మధ్య కాలంలో హిందుత్వ శక్తుల ఆగడాలకు అఖ్లాక్ లాంటి వాళ్లు బలైపోతున్నారు. బ్రాహ్మణీయ హిందూ భావజాలాన్ని దేశంలో హేతువాదులు చాలా కాలంగా ఎదుర్కొంటున్నప్పటికీ నరేంద్ర దాబోల్కర్ లాంటి వాళు ్ళ మహారాష్ట్రలో హతులవ్వడం కాషాయ శక్తుల విజృంభణ ఫలితమే. చరిత్ర వాస్తవాలను వెల్లడించే కల్బుర్గి లాంటి లౌకిక శక్తులను సైతం కర్ణాటకలో మోదీత్వ శక్తులు ఉపేక్షించడం లేదు. గోవింద్ పన్సారే లాంటి వామపక్ష భావాలు గల వయోవృద్ధ కమ్యూనిస్టు నాయకులను మహారాష్ట్రలో హిందుత్వ శక్తులు హత్య చేశాయి. విశ్వ విద్యాలయాల్లో కాషాయ శక్తులు హిందూత్వాన్ని కాదంటే రోహిత్ వేముల లాంటి యువ పరిశోధక విద్యార్థులను ఆత్మహత్య రూపంలో హత్య చేశాయి. ఎఫ్‌ఐటీటీ లాంటి సంస్థలలో చౌహాన్ లాంటి కరుడుగట్టిన హిందుత్వ శక్తులను నియమించడం, మద్రాస్‌లోని పెరియార్, అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను నిషేధించడం, ఢిల్లీలోని జేఎన్‌యూలో అఫ్జల్‌గురు స్మృతి సభ జరుపుకున్నందుకు కన్హయ్యకుమార్, ఉమర్ ఖలీద్, అనిర్బన్ లాంటి విద్యార్థి నాయకులపైనే కాకుండా ఎస్‌ఏఆర్ గిలానీ లాంటి లౌకిక ప్రజాస్వామిక మేధావులపై కక్షసాధింపు చర్యలకు దిగడం ఢిల్లీ అధికార అండతో సాగుతున్నదే. వీటన్నింటికి నిరసనగా దేశంలోని కళాకారులూ, రచయితలూ, పాత్రికేయులూ, గాయకులూ, శాస్త్రజ్ఞులు సహా లబ్ధ ప్రతిష్టులైన అనేక శక్తులు గతంలో తామందుకున్న ప్రభుత్వ పురస్కారాలను మోదీజీ సర్కారు మొహాన తిప్పికొట్టారు.

ఈ రోజు ఈ దేశంలోని ప్రతి పౌరుడు దేశాన్ని ప్రేమించడం, యావత్తు దేశ ప్రజలను గౌరవించడం, దేశ వనరులను సామ్రాజ్యవాదుల విచ్చలవిడి లూటీ నుండి కాపాడుకోవడం దేశ భక్తికి ఏమాత్రం కొలమానం కాకుండా పోయింది. వారు భారత మాతా కీ జై అంటున్నారా లేదా అన్నదే దేశభక్తికి కొలమానమై స్థిరపడింది. నిజానికి ఇది క్షుద్ర దేశ భక్తికే సంకేతం. కాషాయ పాలనలో ప్రజల పక్షాన నిలిచి నిత్యం ఆలోచించే మెదళ్లను కటకటాల వెనక బంధిస్తున్నారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ 90 శాతం అంగవికలుడు ప్రొఫెసర్ సాయిబాబా మహారాష్ట్ర జైలులో అత్యంత ఘోరమైన జీవితాన్ని గడపాల్సి వచ్చింది. ఉస్మానియా యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ కాశీం ప్రభుత్వ పాశవిక చట్టాల సంకెళ్లలో నిందితుడయ్యాడు. వీళ్లే కాకుండా నిర్భయంగా నిజాయితీగా తమ భావాలను వ్యక్తీకరించే కవులూ, రచయితలూ, కళాకారులూ, మేధావులూ ప్రాణాంతకమైన కాషాయ ఉగ్రవాద పడగ ఛాయల్లో జీవిస్తున్నారు.

దేశంలోని ముస్లిం ప్రజలను వేధించడం, హింసించడం, అవమానించడం ఎంతగానో పెరిగిపోయింది. క్రైస్తవులు కూడా అదే దుస్థితిలో వున్నారు. వారి చర్చిలపై దాడులు జరుగుతున్నాయి. క్రైస్తవ సన్యాసినులపై కాషాయ శక్తులు అత్యాచారాలకు పాల్పడుతున్నారు. దేశంలోని దళితులపై జరుగుతున్న అగ్రవర్ణాల దాడులకు కాషాయ ఉగ్రవాదం నాయకత్వం వహిస్తున్నది. సమాజంలో వారిపై నేటికీ ఏహ్యమైన అంటరానితనం కొనసాగుతున్నది. ఇందులో మోదీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లో దళితులపై 92 రకాల నిషేధాలు అమలులో వున్నాయి. దళితులపై జరుగుతున్న అత్యాచారాలకు, హత్యాకాండకు జూలై 11న గుజరాత్‌లోని ఊనాలో జరిగిన హిందుత్వ శక్తుల దాడి వారి గోరక్ష సిద్ధాంతంలోని మూర్ఖత్వాన్ని బట్టబయలు చేసింది. ఆ ఘటనపై యావత్తు రాష్ట్ర దళిత ప్రజానీకం తమ తీవ్ర నిరసనను వ్యక్తం చేస్తూ ఇకపై చచ్చిన పశువుల కళేబారాలను మోయడాన్నే తామిక చాలించుకుంటామని వారు ప్రతిజ్ఞలు చేస్తున్నారు. అంతేకాదు వాళు ్ళ నేరుగా దేశ ప్రధాన మంత్రిని స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియాలు కాదు భూమి కావాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ దేశంలో దళితుల సమస్య భూమి సమస్యే. నిచ్చెన మెట్ల కుచ్చితమైన కుల వ్యవస్థ కొనసాగుతున్న మన దేశంలో దళితుల సమస్య సామాజిక ఆత్మగౌరవ సమస్యే.

మన దేశంలోని ఆదివాసులను హిందూ మతంలో కలుపుకోవడానికి దీర్ఘ కాలంగా జరుగుతున్న రాజ్య విధానాలకు తోడు సంఘ్ శక్తులు దేశ వ్యాప్తంగా తీవ్రం చేసిన ఘర్ వాపసీ

సహా అనేక హింసాత్మక చర్యలు ఆదివాసులుగా వారు తమ అస్థిత్వాన్నే కోల్పోయే ప్రమాద స్థాయికి చేరాయి. దేశంలో హిందూ మత ఆధ్యాత్మిక వేడుకలైన కుంభమేళాలు పుష్కరాలు ఎన్నడూ లేని స్థాయిలో ప్రత్యక్షంగా లాభాపేక్షతో రాజ్యం నిర్వహణలో జరుగుతున్నాయి.

మోదీ పాలనలో పెరుగుతున్న పెట్టుబడి దాడి తీవ్రత, కాషాయ శక్తుల దాడులు దేశంలోని రైతులను కార్మికులను విద్యార్థి యువజన ఉద్యోగ మేధావులను ఐక్యమయి తీరాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాయి. దళితులు ఆదివాసులు మత మైనారిటీలు విశాల ప్రజా రాశుల్లో భాగంగా తమపై పెచ్చరిల్లుతున్న దాడులకు వ్యతిరేకంగా పిడికిళ్ళెత్తుతూ గళాలు విప్పుతున్నారు. ఆదివాసులు, రైతులు విస్థాపనకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు చేపడుతున్నారు. గతంలో పశ్చిమ బంగలోని సింగూరు నుండీ విప్లవ ప్రజా పోరాటాల ఫలితంగా నానో కార్ల తయారీ పరిశ్రమను గుజరాత్‌కు తరలించుకు పోయిన టాటా తాజాగా ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో గల లోహండిగూడ వద్ద నిర్మించతలపెట్టిన స్టీల్ ప్లాంట్‌ను పదేళ్లుగా విప్లవ ప్రజలు సాగనివ్వకపోవడంతో మూసేసుకోక తప్పలేదు. దంతెవాడ జిల్లాలో గల ధుర్లి నుండి ఎస్సార్ ఉడాయించాడు. మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలలో భారీ పెట్టుబడులు కార్యరూపం దాల్చకపోతుండడంతో మోదీ సవాలుగా తీసుకుంటున్నాడు. మావోయిస్టు ఉద్యమ రాష్ట్రాలను తరచుగా పర్యటిస్తున్నాడు. ఆపరేషన్ గ్రీన్‌హంట్ – మూడవ దశలో లక్షలాది బలగాలను మోహరిస్తునే ప్రజలపై ఊచకోతను ప్రోత్సహిస్తూ ఢిల్లీ ఎర్రకోట బురుజులపై నుండి వామపక్ష ఉగ్రవాదాన్ని సహించేది లేదంటున్నాడు. కశ్మీర్‌లో ప్రజలు తమ ప్రియమైన నాయకుడు, యువతకు ఆదర్శాల హీరో అయిన బుర్హాన్ వనీని భారత సాయుధ బలగాలు అంతమొందించిన తర్వాత గతంలో ఎన్నడూ లేని స్థాయిలో ప్రజలు 'ఆజాద్ కశ్మీర్' అంటూ వీధుల్లో కొస్తున్నారు. ఖాకీలపై రాళ్లు రువ్వడమే కాదు. వీలయిన చోట ఖాకీల ఆయుధాలను స్వాధీనం చేసుకుంటున్నారు. పదుల కొద్ది కశ్మీరీయులు అనువులు కోల్పోతున్నా, వేలాది ప్రజలు క్షతగాత్రులవుతున్నా వారు పోరాడుతూనే వున్నారు.

మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు తమ సమస్యలపై పోరాడని రాష్ట్రం లేదు. కర్ణాటకలో ఓ వైపు రైతాంగం, మరోవైపు పోలీసులు కూడా తమ సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా సామూహిక సెలవుల రూపంలో పోరాటానికి దిగారు. మోదీ ప్రభుత్వం విప్లవోద్యమం సహా ప్రజా పోరాటాలన్నింటినీ శాంతి భద్రతల సమస్యగానే పరిగణిస్తున్నది. మోదీ ముప్పయి నెలల ఫాసిస్టు పాలన దేశంలోని ప్రజాస్వామిక, ప్రగతిశీల, లౌకిక శక్తులను; కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, ఉద్యోగ, మేధావులను, మహిళలను; ఆదివాసీ, దళిత, మత మైనారిటీలను సమైక్య పోరాటాల వైపు నెడుతుంది. విడిపోయే హక్కుతో సహా జాతుల స్వయం నిర్ణయ అధికారం కోసం పోరాడుతున్న ప్రజలను మరింత సమరశీలంగా పోరాడేలా చేస్తున్నది. మరోమాటలో చెప్పాలంటే ప్రజా హిత శక్తులకు ప్రజా వ్యతిరేక ప్రభుత్వ అనుకూల శక్తులకు మధ్య వేగంగా సమీకరణలు జరిగిపోతున్నాయి. ఇది విప్లవాల యుగమన్న సత్యాన్ని ఫాసిస్టు కాషాయ పాలనకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా పోరాటాలు మరింత స్పష్టంగా ముందుకు తెస్తున్నవి. పోరాడడానికి సాహసిద్దాం. విజయాలను సాధిద్దాం. ○

---

***(22వ పేజీ తరువాయి)***

వారి ఆర్థిక రాజకీయాలు, పాలనా విధానాలు నడుస్తున్నాయి.

ఈ ఎన్నికల సందర్భంలో దేశ వ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొన్నాయి. రోజు రోజుకు రైతాంగ ఆత్మహత్యలు, నిర్వాసిత సమస్యలు, పని కోసం వలసలు పెరిగాయి. ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి ఎన్నికల పార్టీలకు కార్యక్రమం లేదు. ప్రజల్ని జాతి, కులం, మతం పేర చీల్చడం, ఆర్థిక ప్రయోజనాల ప్రలోభాలకు గురి చేయడం, సారామత్తులో ముంచడం ద్వారా అబద్ధాలతో, కుట్రలతో ఎన్నికల ప్రహసనం నడిపి దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్న చందంగా రాష్ట్రాల పాలనను తమ చేతుల్లోకి తీసుకున్నారు. పార్లమెంటరీ ఎన్నికల ప్రజాస్వామ్యం దోపిడీ వర్గాల ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుంది. పీడిత వర్గాలపై దోపిడీ అణచివేతలను కొనసాగిస్తుంది.

వారసత్వ పాలన, నూతన ఆర్థిక విధానాలు, హిందూ ఓటు బ్యాంకు రాజకీయాలు, అవకాశవాద పొత్తులు, సామ్రాజ్యవాద, బహుళజాతి సంస్థలు ఇచ్చే కమీషన్లకు పోటీ పడడం మరియు ప్రజా ఉద్యమాలను రక్తపు టేరుల్లో ముంచెత్తడం కొనసాగుతున్నది. పార్లమెంటరీ ప్రజాస్వామిక ఎన్నికల్లో బూటకత్వం తప్ప మరొకటి ఏమున్నది. 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు మరోసారి మళ్ళీ మళ్ళీ అదే బూటకత్వాన్ని మరింత స్పష్ట పరుస్తున్నాయి. ప్రజలకు వ్యవస్థ మార్పుకై పోరాడడం తప్ప మరో దారిలేదు. ○

## ప్రజా గెరిల్లా సైన్యం:

**రోజు వారి జీవితంలో, యుద్ధ చర్యల్లో ప్రజాగెరిల్లా సైన్యం గెరిల్లా యుద్ధ మౌలిక నియమాలు- రహస్యం, వేగం, నిరంతర అప్రమత్తత, స్థల మార్పిడి, దృఢ సంకల్పం, ధైర్య సాహసాలతో పోరాడడం-పాటించాలి.**

## ఈ హంతక ప్రభుత్వాలు 'నయీం' లాంటి వాళ్ళను సృష్టిస్తాయి. అంతమొందిస్తాయి

## ఈ ఫాసిస్టు రాజ్యాన్ని కూల దోయడం ద్వారానే

## 'నయీం' లాంటి నరహంతకులను లేకుండా చేయగలం

నల్లదండు ముఠా నాయకుడు, అత్యంత కిరాతకుడు, గ్యాంగ్‌స్టర్ అయిన మహమ్మద్ నయిమోద్దీన్ (నయీం) మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ లోని మిలినీయనమ్ అపార్ట్‌మెంట్‌లో ఆగస్టు 8 ఉదయం జరిగిన పోలీసు కాల్పుల్లో హతమయ్యాడు. నయీంగా పేరు మోసిన ఈ హంతకుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలియని ప్రజలెవరు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఈ కాల్పుల అనంతరం టీ.వీ. ప్రసారాల్లో, వార్తా పత్రికల్లో నయీం గురించిన వార్తలు పుంఖాను పుంఖాలుగా వెలువడుతున్నాయి. పోలీసులు జరుపుతున్న విచారణలో కోట్లాది రూపాయల నగదు, బంగారం, వెండి, భూకబ్జాల డాక్యుమెంట్లు, డైరీలు, కంప్యూటర్లలో సెటిల్మెంట్లు వివరాలతో పాటు 22 ఇండ్లు, వాడి ఇతర అకృత్యాల వివరాలు చాల వాటిని పోలీసులు ప్రకటించారు. ఈ వార్తలు బయటికొచ్చిన వెంటనే టీ.డీ.పీ. మాజీ మంత్రి ఉమా మాధవరెడ్డి ఈ కేసులో నన్ను ఇరికించాలని ప్రభుత్వం చూస్తున్నదని ప్రకటన చేసింది. ఒకప్పటి రాష్ట్ర పోలీసు ఇంటలిజెన్స్ అధిపతి శ్రీరాం తివారీ మాట్లాడుతూ మావోయిస్టుల అణిచివేతకు నయీంను ఉపయోగించుకొన్నామని ఒకటి రెండు సార్లు కలిసానని ప్రకటించాడు. మాజీ డీ.జీ.పీ., ప్రస్తుత బీ.జే.పీ. నాయకుడైన దినేశ్‌రెడ్డి తాను డీ.జీ.పీ.గా ఉన్న సమయంలో నయీమోద్దీన్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించామని, స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు తాను ఆదేశాలు కూడ జారీ చేశానని, కాని అప్పటి ప్రభుత్వాలు నయీంను పట్టుకొనే విషయంలో అంతగా ఆసక్తి చూపలేదని, నయీంతో మాజీ డీ.జీ.పీ.లకు సంబంధాలు వున్నాయని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని అందమైన అబద్ధాన్ని చెప్పాడు. "అయితే నయీంతో ఎస్.ఐ.బీ., డీ.ఐ.జీ.లకు సంబంధాలున్నాయని ఒప్పుకున్నాడు. ఈ చీకటి సామ్రాజ్యంతో రాజకీయ నాయకులకు, ఎం.ఎల్.ఏ.లకు, పోలీసు అధికారులకు గల సంబంధాలపై పత్రికల్లో వస్తున్న వార్తలు ప్రజలను అబ్బుర పరుస్తున్నాయి.

నయీం ఎన్‌కౌంటర్ తర్వాత ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసి, దర్యాప్తుకు ఆదేశించింది. సిట్ దర్యాప్తులో 72 కేసులు నమోదు చేశామని, 80 మందిని అరెస్టు చేశామని, హైదరాబాద్‌తో సహా నల్గొండ, రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో ఈ కేసులు వెలుగు చూశాయని సిట్ ఉన్నతస్థాయి సమావేశంలో చర్చకు వచ్చినట్లుగా అధికారులు చెబుతున్నారు.

అయితే అధికారికంగా ప్రభుత్వం ఇప్పటివరకు నయీంతో రాజకీయ నాయకులు, పోలీసు అధికారులకు గల సంబంధాలను బయట పెట్టక పోవడంతో విభిన్న వర్గాల నుండి సోషల్ మీడియాలో 12 మంది రాజకీయ నాయకులు, 21 మంది పోలీసు అధికారుల పేర్లు బహుళ ప్రచారంలో ఉన్నాయి.

నయీం అనే నల్లదండు ముఠా నాయకుడు, నేర సామ్రాజ్యంలో ఇంతగా ఎదగడానికి వెనుక రాజ్యం ఏ పాత్ర వహించిందో తెలుసుకోవలసి ఉంది. పోలీసులు, రాజకీయ నాయకులు చివరకు న్యాయస్థానాలు కూడ యిందుకు ఎలా సహకరించాయో కూడ వివరంగా తెలుసుకోవాలి.

రాజ్యం తన నాలుగు స్తంభాల ద్వార ప్రజా ఉద్యమాలను, తిరుగుబాట్లను అణిచివేస్తుంది. వీటితో పాటు స్వయంగా కొన్ని వ్యవస్థలను రూపొందించుకుంటుంది. ప్రైవేట్ వ్యక్తులను, గ్యాంగులను చేరదీస్తుంది. వీరి ద్వారా విప్లవకారులపై, ప్రజాస్వామిక వాదులపై దాడులు చేయిస్తుంది. ఈ దాడుల్లో రాజ్యం హస్తం లేనట్లుగా ప్రచారం చేసుకుంటుంది. ఇలాంటి విధానాల ద్వారానే ఈ నల్లదండు ముఠాలు ఉనికిలో వస్తాయి.

యాంటీ ఇన్‌సర్జన్సీ, ఎల్.ఐ.సీ. పాలసీలో భాగంగా ప్రపంచమంతటా పాలకవర్గాలు ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చాయి. సామ్రాజ్యవాదులు, ముఖ్యంగా ఇజ్రాయిల్ అనేక దేశాల్లోని పోలీసు అధికారులకు ఈ శిక్షణను యిస్తున్నాయి. పాలస్తీనా ఉద్యమాన్ని అణచడానికి అమెరికా, బ్రిటన్‌ల సహకారంతో ఇజ్రాయిల్ ఈ విధానాన్ని అతి క్రూరంగా అమలు చేస్తున్నది. ఇలాంటి విధానాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పోలీసులు 80 వ దశకం నుండి అధ్యయనం చేయడం ప్రారంభించారు. అందులో భాగంగా స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్యూరోను, గ్రేహౌండ్స్ కమాండో బలగాలను వ్యాస్ నాయకత్వంలో తీర్చి దిద్దారు. ఈ రాష్ట్రంలోనే గాక దేశవ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేయడంలో భాగంగా ఈశాన్య రాష్ట్రాల్లో పంజాబ్, కశ్మీర్‌ల్లో ముందుకు వచ్చిన గెరిల్లా పోరాటాన్ని అణచడానికి ప్రయోగించారు. ప్రస్తుతం మావోయిస్టు నాయకత్వంలో జరుగుతున్న దండకారణ్య, బీహార్, జార్ఖండ్ పోరాటాలను అణచడానికి ఈ ఎత్తుగడలను ప్రయోగిస్తున్నారు. ఈ ఫాసిస్టు క్రూర దమనకాండలో భాగంగా నల్లదండు ముఠాలను ఏర్పాటు చేసి విప్లవకారులను హత్యలు చేయించడం జరుగుతున్నది. కశ్మీర్‌లో కుక్కేప్యార్ నాయకత్వంలో యిలాంటి ముఠాలు ఏర్పడి పనిచేశాయి. పంజాబ్, ఈశాన్య రాష్ట్రాల్లో ఈ విధమైన ముఠాలను ఏర్పరిచింది.

ఛత్తీసగఢ్‌లో ఉద్యమం నుండి దిగజారిపోయిన వారితో జిల్లా బలగాలను ఏర్పాటు చేసి విప్లవకారులపై దాడులు చేయడమే గాక సల్వాజుడుం లాంటి పరమ నిరంకుశ హత్యాకాండలో రాజ్యం అనుసరించిన హేయమైన పద్ధతులు నాగరిక సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాయి. రాజ్యం ప్రయోగించిన వ్యక్తులు, సంస్థలు జరిపే ఈ హత్యాకాండ సమాజాన్ని భయకంపితుల్ని చేస్తుంది.

80వ దశకంలో సీ.పీ.ఐ.(ఎం.ఎల్.) పీపుల్స్‌వార్ నాయకత్వంలో జరుగుతున్న విప్లవోద్యమం పాలకవర్గాలకు కలవరం పుట్టించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యమాన్ని అణచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అనేక నిర్బంధ విధానాల్ని చేపట్టాయి. ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రయోగశాలగా ఎంచుకొని నిర్బంధాన్ని వివిధ పద్ధతుల్లో అమలు చేశాయి. అందులో భాగంగా కోవర్ట్ ఆపరేషన్‌లు నిర్వహించడం, నల్లదండు ముఠాలను సృష్టించి చీకటి హత్యలు చేయడం ప్రారంభించాయి. అలా 1993 నవబంర్ 18న మొదటిసారి కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో ఆర్గనైజర్ (దళ కమాండర్) అయిన భూపతిని, యిద్దరు సహచరులను వారు నిద్రలో ఉండగా చంపి, ఆయుధాలాతో సహా లొంగిపోయిన కత్తుల సమ్మయ్య ఉదంతంతో ప్రారంభించి, నల్లగొండ జిల్లాలో 1998 ఏప్రిల్ 4న సోమ్లానాయక్ అనే కోవర్ట్ నిద్రలో ఉన్న కృష్ణపట్టి దళ నాయకుడుతో పాటు నల్గురు కామ్రేడ్స్‌ను కాల్చి చంపాడు. కరీంనగర్ జిల్లాలో 1998 ఏప్రిల్ 11 రాత్రి కరీంనగర్ జిల్లా కార్యదర్శి, స్పెషల్‌జోన్ కమిటీ సభ్యుడైన మల్కాపురం భాస్కర్‌ను నిద్రలో ఉండగా కాల్చిచంపిన జడల నాగరాజు అనే కోవర్టు రాత్రికి రాత్రే పారిపోయి పోలీసుల రక్షణలో చేరాడు.

ఈ కోవర్టు ఆపరేషన్లను ప్రభుత్వం బాహటంగా సమర్ధిస్తూ వీరందరికి భారీ నజరానాలను యివ్వడంతో పాటు వారికి రక్షణ కల్పించింది. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కోవర్టు ఆపరేషన్లను సమర్ధిస్తూ బాహాటంగా ప్రకటనలు యిచ్చాడు. 2004 సం॥లో పీపుల్స్‌వార్ పార్టీకి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చర్చలు జరుగుతున్న సందర్భంలోనే వరంగల్-ఖమ్మం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ యాదన్నపై కోవర్టు లక్మన్ చేసిన దాడిలో యాదన్న గాయపడగా ఇద్దరు కామ్రేడ్స్ అమరులైనారు. చర్చలను రద్దు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించిన నిర్బంధంలో నిజామాబాద్ జిల్లా మానాలలో కోవర్టు ఆపరేషన్ చేపట్టి అతి పాశవికంగా జిల్లా కార్యదర్శి కామ్రేడ్ రమేష్‌తో పాటు 13 మందిని హత్య చేసింది. ప్రభుత్వం యిలాంటి కోవర్టు హంతకుల పైన హత్యానేరం మోపకుండా బహుమతులు యివ్వడంపైన పౌరహక్కుల సంఘం నాయకుడు బాలగోపాల్ కోర్టులో వాజ్యం వేయగా, 2002 ఫిబ్రవరి 6న కోర్టు యిచ్చిన తీర్పుతో ఈ వ్యవహారంలో న్యాయస్థానం జోక్యం అవసరం లేదని కొట్టివేసింది. రాజ్యం తన అంగాలను అన్నింటిని సమన్వయించి ఎలా అణచివేత కొనసాగిస్తుందో ఈ ఉదాహరణ చక్కగా బహిర్గత పరుస్తున్నది.

నయిూమోద్దీన్ వ్యాస్ హత్య కేసులో ముద్దాయిగా జైలు జీవితం కొనసాగిన కాలంలోనే పోలీసులతో సంబంధాలు పెట్టుకొని, క్రమంగా పోలీసులకు నమ్మినబంటుగా మారాడు. జైలునుండే తన కుటుంబానికి ఆదేశాలు యిచ్చి మహబూబ్‌నగర్ జిల్లాలో ఈదన్నను హత్య చేయించాడు. ఈ వ్యవహారం జైలు కమ్యూన్‌లో చర్చకు రాగానే కమ్యూన్ కమిటీ నయిూంను కమ్యూన్ నుండి బహిష్కరించింది. అప్పటినుండి నయిూం పోలీసులకు మరింత దగ్గరవుతూ పార్టీపై కక్ష పెంచుకున్నాడు. జైలు నుండే నల్లగొండ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ దివాకర్‌ను హత్య చేయడానికి కుట్ర పన్నాడు. ఈ ప్రయత్నాలు బెల్లి లలితకు తెలిసాయని ఆమెను 1999 మే లో పరమ కౄరంగా హత్య చేయించాడు. జైలు నుండి వచ్చిన నాలుగైదు నెలల్లోనే అప్పటి రంగారెడ్డి జిల్లా ఎస్.పీ. సురేందర్ బాబు గైడెన్స్‌లో పౌరహక్కుల సంఘం సంయుక్త కార్యదర్శి కామ్రేడ్ టి. పురుషోత్తంను 1999 నవంబర్ 23న పట్టపగలు హత్యచేశాడు. ఇలా విప్లవ కారులను బహిరంగంగా హత్య చేయడంతో రాజ్యం, పోలీసులు నయిూంను మరింతగా ఉపయోగించుకోవడం ప్రారంభించారు. అప్పటి నుండి నయిూం గ్యాంగ్ చేతిలో ఆజంఅలీ, కనకాచారి, మన్నెం ప్రసాద్, కళింగరావు, గంటి ప్రసాదం, ఆకుల భూమయ్య వంటి విప్లవ ప్రజా సంఘ నాయకులను హత్యలు చేసాడు. తన చీకటి కార్యకలాపాలకు అడ్డంకిగా ఉన్న మరెందరినో హత్యలు చేశాడు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్న కాలంలో యధేచ్ఛగా నయిూం హత్యాకాండ కొనసాగింది. గ్రీన్‌టైగర్స్, క్రాంతి సేన పేర్లతో హత్యాకాండ, బెదిరింపులు నిత్యం జరుగుతూ వచ్చాయి. నయిూం కార్యకలాపాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోనే కాక, ఛత్తీస్‌గఢ్, ఒడిశా ప్రాంతాలకు విస్తరించాయి. మావోయిస్టులను అణచడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన ఐ.జీ. కల్లూరితో కూడ సంబంధాలు ఉన్నాయని వార్తలు వచ్చాయి. ఎస్.ఐ.బీ. దేశవ్యాప్తంగా విప్లవకారులపై నిఘాపెట్టి అరెస్టు చేసి నాయకత్వాన్ని హత్యలు చేయడానికి నయిూం ముఠాను వాడుకున్నట్లుగా నిర్ధారణ అవుతున్నది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వలన రియల్ ఎస్టేట్ వ్యాపారం విస్తరించింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలతో పాటు చుట్టు ప్రక్కల ప్రాంతాలు లాండ్ సెటిల్‌మెంట్లకు కేంద్రాలుగా మారాయి. రాజకీయ నాయకులు, పోలీసు అధికారులు ఈ సెటిల్‌మెంట్లు చేపట్టి కోట్ల రూపాయలు వెనుకేసుకునే పథకంలో భాగంగా

నల్లదండు ముఠా నాయకులను ఉపయోగించుకోవడం ప్రారంభించారు. అందులో భాగంగా నయీం, బయ్యపు సమ్మిరెడ్డి, జడల నాగరాజు లాంటి వారిని రంగంలోకి దింపారు. ఈ రంగంలో నయీం తన మాఫియా సామ్రాజ్యాన్ని విస్తరించాడు. తన సామ్రాజ్యానికి అడ్డు వచ్చిన వాళ్లను తొలగించాడు. అందులో భాగంగా బయ్యపు సమ్మిరెడిని హత్య చేసాడు. నయీం చచ్చిన తర్వాత తమ భూములను అన్యాయంగా ఆక్రమించుకొన్నాడని పేద రైతులు ఎందరో బహిరంగంగా ప్రకటిస్తున్నారు. తమ వారిని కిడ్నాప్ చేసి మాయం చేసాడని బాధితులు చెబుతున్నారు. నయీం చేసిన హత్యలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి.

తెలుగుదేశం, కాంగ్రెస్ పాలనలోనే గాకుండా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తెలంగాణ రాష్ట్ర సమితి (టీ.ఆర్.ఎస్.) అధికారానికి వచ్చిన రెండేళ్ళ పాటు నయీం తన కార్యకలాపాలను తిరుగు లేకుండా కొనసాగిస్తూ వచ్చాడు. టీ.ఆర్.ఎస్. పార్టీలో ఉన్న నల్లగొండ జిల్లా రాజకీయ నాయకులు నయీంతో సంబంధాల్లో ఉన్నారు. గత ప్రభుత్వాల్లో పోలీసు అధికారిగా నయీంతో సంబంధాలు ఉన్న ఎస్.ఐ.బీ. చీఫ్ శివధర్ రెడ్డిని నయీం సంఘటన తర్వాత బదిలీ చేసింది. నిజానికి చంద్రశేఖర్ రావు ముఖ్యమంత్రి కాగానే నల్లగొండకు చెందిన ఈ పోలీసు అధికారిని విశాఖ పట్నంలో పోస్టింగ్ నుండి ఏరికోరి తెచ్చుకున్నాడు. గత రెండేళ్ళుగా ఈ ప్రభుత్వంకు చెందిన రాజకీయ నాయకులు, పోలీసు అధికారులు నయీంను వాడుకోవడం జరుగుతూనే ఉంది.

ఈ కాలంలో నయీం భూసెటిల్మెంట్లలో, భూములు కొనుగోలులో టీ.ఆర్.ఎస్. ప్రభుత్వానికి సవాలుగా మారాడు. సోలీపేట రాం లింగారెడ్డి, ఈటెల రాజేందర్, వేముల వీరేశం, పైళ్ళ శేఖర్ రెడ్డి లాంటి మంత్రులు, ఎం.ఎల్.ఏ.లకు బెదిరింపులు వచ్చినా ప్రభుత్వం స్పందించలేదు. దాంతో నయీం మాత్రం మరింత రెచ్చిపోయి ముఖ్యమంత్రి కే.సీ.ఆర్.కు సమీప బంధువులైన రామేశ్వర్‌రావుతో పాటు ఏం.పీ. విశ్వేశ్వరావు లాంటి వారికి బెదిరింపులు రావడం, యాదాద్రి భూముల్లో నయీం దందాలు నడపడంతో కే.సీ.ఆర్. నయీంను తొలగించి వేయడానికి నిర్ణయం తీసికోకతప్పలేదు.

అంతేగాక సోహ్రబుద్దీన్, కేసర్ బీ ఎన్‌కౌంటర్‌లో సీ.బీ.ఐ. దర్యాప్తులో ఏకైక సాక్షి నయీం కూడ కావడం వలన అమిత్ షా, నరేంద్ర మోడీలు ఎప్పటికైనా యిరుకాటంలో పడే అవకాశం ఉన్న కారణంగా బీ.జే.పీ.కి నయీంను తొలగించడం అవసరం కాగా, టీ.ఆర్.ఎస్. బీ.జే.పీ.కి రోజు రోజు దగ్గర కావడానికి ప్రయత్నిస్తుండడం వలన నయీంను తొలగించే పనికి వెంటనే ముఖ్యమంత్రి పూనుకోవాల్సి వచ్చింది.

ఒక వ్యవస్థ పెంచి పోషించిన వ్యక్తి, ఆ వ్యవస్థకే ముప్పుగా మారినప్పుడు తొలగించుకోక తప్పదు. అధికారంలో ఉన్నవారికి ఈనాటి పరిస్థితుల్లో ప్రమాదంగా మారినపుడు పాలకవర్గం నయీంను ఎన్‌కౌంటర్‌లో చంపించింది. కాని నయీంను చేరదీసిన పాలకవర్గాలు గత 26 ఏళ్ళుగా రాష్ట్రంలో ఎంత విధ్వంసం సృష్టించాయో చెప్పనక్కరలేదు.

పాలకవర్గాలు నయీంను అడ్డు తొలగించుకొన్నప్పటికీ, ఆ వ్యవస్థకు అలాంటి వ్యక్తులు అవసరం ఉండనే ఉంటుంది. అందుకే మళ్ళీ క్రాంతి సేన అంటూ బెదిరింపులు వస్తూనే ఉన్నాయి. ఈ బెదిరింపుల ద్వారా నయీంను వదిలించుకొన్న సందర్భంలో సమాజంలో తొలగిపోతున్న భయవాతావరణాన్ని అలాగే నిలిపి ఉంచడానికి పాలకవర్గాలు చేస్తున్న మరో ప్రయత్నం తప్ప వేరేమి కాదు. అసలు మావోయిస్టులను, ప్రజాసంఘాల నాయకులను హత్యలు చేసిన వారిని ఇప్పటివరకు అరెస్టు చేయకుండా వదిలి పెడుతున్నారు.

అంతే కాకుండా ప్రజల్లో గందరగోళం సృష్టించడానికి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ జిల్లాల ఐ.జీ. కల్లూరిని హత్య చేయడానికి మావోయిస్టులు నయీంతో డీల్ కుదుర్చుకున్నారనే నమ్మశక్యంగాని విష ప్రచారాన్ని మీడియాలో పోలీసులు ప్రచారంలో పెట్టారు.

ఈ వ్యవస్థయే నయీం లాంటి హంతకులను సృష్టిస్తుంది. అక్కర తీరిపోగానే అంతం చేస్తుంది. కాని ఎప్పుడూ నల్లదండు ముఠాలను సృష్టిస్తూ ఉంటుంది. ఈ రాజ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి, దాన్ని అంతం చేయడం ద్వారానే ఇలాంటి దుర్మార్గాలను అంతం చేయగలమని ప్రజలంతా గుర్తించాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పౌర, ప్రజాస్వామ్య హక్కులను, విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి పాలకవర్గాలు నడిపిన ఈ క్రూర విధానాలు ఎంతటి విధ్వంసం సృష్టించాయో ప్రజలందరికీ నయీం ఉదంతం వలన మరో మారు అవగాహన అయింది.

కాబట్టి ప్రజలందరూ ముక్తకంఠంతో ఈ ప్రభుత్వ ఫాసిస్టు విధానాలు ఖండించాలి. వీటికి వ్యతిరేకంగా పోరాడాలి. నయీం మాఫియా ముఠాతో హత్య చేయబడిన విప్లవ కారుల హత్యలపై, పౌర హక్కుల సంఘాల నాయకుల హత్యలపై, ప్రజాస్వామిక వాదుల హత్యలపై న్యాయ విచారణ జరిపించాలి. నయీం ముఠా లూటీ చేసిన పేద ప్రజల ఆస్థులు వారికి తిరిగి యిప్పించాలని, ఈ నేర సామ్రాజ్యానికి సహకరించిన రాజకీయ నాయకులపై, పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, నిష్పక్ష పాత విచారణ కోసం సిట్ స్థానంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరపాలని ప్రజలంతా డిమాండ్ చేయాలి. ○

## పార్లమెంటరీ ప్రజాస్వామ్య బూటకత్వాన్ని
## 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు మరోసారి చాటాయి

గత ఏప్రిల్, మే మాసాల్లో అసోం, పశ్చిమబెంగాల్, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు జరిగి నూతన ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. **అసోంలో** బీ.జే.పీ. నాయకత్వంలోని ఎన్.డీ.ఏ. కూటమి గెలుపును బీ.జే.పీ. ఘన విజయం సాధించినట్లుగా మీడియా పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. ఈశాన్య రాష్ట్రాల్లో బీ.జే.పీ. స్థిరపడడానికి దారి సుగమం అయినట్లుగా ఆ పార్టీ నాయకత్వం భావిస్తున్నది. అసోంలో కాంగ్రెస్ వరుసనే 3 సార్లు (2001, 2006, 2011) అధికారంలోకి వచ్చి 15సం॥రాలలో అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలే దాని ఓటమికి ప్రధాన కారణం. బీ.జే.పీ. అసోంలో ముందునుండే పాగావేసి ప్రజల్లో గతంనుండి ఉన్న చొరబాటు సమస్యను కేంద్రం చేసుకొని ప్రచారం చేయడంతో పాటు, అదే సమస్య పరిష్కారంలో భాగంగా ఏర్పడి నేడు బలహీనపడిన ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకుని ఒక కూటమిగా ఎన్నికల్లో పాల్గొనడంతో విజయం సాధించగలిగింది.

1970, 80 దశకాల్లో అసోంలో విద్యార్థి యువజనులు విదేశీ చొరబాట్లకు నిరసనగా మిలిటెంట్ పోరాటాలు నిర్వహించారు. అందులో నుండి పుట్టుకొచ్చిన ఏ.ఏ.ఎస్.యు. (ఆల్ అసోం స్టూడెంట్స్ యూనియన్), ఏ.జీ.పీ.(అస్సాం గణ సంగ్రామ పరిషత్) లు తర్వాత కాలంలో ఎన్నికల్లో గెలిచి ఆ పోరాటాన్ని పక్కన పెట్టారు. దోపిడీ పాలక వర్గాల పంచన చేరి ప్రజల న్యాయమైన డిమాండ్స్‌ను ఎన్నికల్లో ఓట్లు దండుకునే నినాదంగా కుదించివేసారు. అదే ఎత్తుగడతో వచ్చిన బీ.జే.పీ. కి వీరు, వీరితో పాటు బీ.డీ.ఎఫ్. (బోడో పీపుల్స్ ఫ్రంట్) మద్దతు ఇవ్వడంతో అసోంలో కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతను వినియోగించుకోగలిగారు. కాంగ్రెస్ కన్నా బీ.జే.పీ.కి ఓట్లు తక్కువగా వచ్చినా సీట్లు మాత్రం ఎక్కువే వచ్చాయి. 2011 నాటి అసెంబ్లీలో బీ.జే.పీ.కి 4 స్థానాలు మాత్రమే ఉండగా ఇప్పుడు 60 స్థానాలు వచ్చి మొత్తం 86 సీట్లతో ఎన్.డీ.ఏ. అధికారాన్ని చలాయిస్తుంది. ఏ.జీ.పీ. 1985 లోను, 1996 లోను అధికారంలోకి వచ్చి అసోం ప్రజల తక్షణ సమస్య అయిన చొరబాటు సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపలేదు. ఇప్పుడు బీ.జే.పీ. అధికారానికి వచ్చినా అసోం ప్రజల, అందులో భాగంగా బోడో ప్రజల సమస్యకు మౌలిక పరిష్కారం వారి వద్ద లేదు.

జాతుల సమస్య పరిష్కారం కాకుండా వలసల సమస్య, చొరబాట్ల సమస్య పరిష్కారం కావు. జాతుల సమాఖ్య ఏర్పడడం, కలిసి పని చేయడం ద్వారా పరస్పర సహకారంతో మాత్రమే ఈ సమస్య పరిష్కరించబడుతుంది.

**పశ్చిమ బెంగాల్**లో మమతా బెనర్జీ నాయకత్వంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఈసారి ఒంటరిగానే పోటీ చేసి తిరిగి అధికారంలోకి వచ్చింది. సీ.పీ.ఐ.(ఎం.) పార్టీ నాయకత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్ 34 సం॥రాల పాలనలో సంపాదించుకున్న ప్రజా వ్యతిరేకత ఈసారి కూడ తృణమూల్ కాంగ్రెస్‌కు అనుకూలించింది. కాంగ్రెస్ నుండి 1997లో విడిపోయిన మమత బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ అనే ప్రాంతీయ పార్టీని పెట్టింది. 2011 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి లెఫ్ట్ ఫ్రంట్‌ను తొలిసారి ఓడించింది. ఇప్పుడు 2వ సారి కాంగ్రెస్ వెళ్లి సీ.పీ.ఐ.(ఎం.)తో చేరిన సందర్భంలో కూడా గెలిచింది. గతంతో పోల్చుకుంటే 184 (2011), 211 (2016) 27 సీట్లు అధికంగా గెలుచుకుంది. ఎన్నికల విశ్లేషకులు మెజారిటీ తగ్గినా టీ.ఎం.సీ. అధికారంలోకి వస్తుందని అంచనా వేసారు. మరింత మెజారిటీ పెంచుకుని అధికారాన్ని తిరిగి పొందింది. టీ.ఎం.సీ. ఈ ఎన్నికల్లో వేల కోట్ల రూపాయల చిట్‌ఫండ్ కుంభకోణం, కాంట్రాక్టర్ల అవినీతివలన కుప్పకూలిన ఫ్లై ఓవర్ బ్రిడ్జీ సమస్య, ప్రజలపై అణిచివేత విధానాల కారణంగా ప్రజల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత వచ్చినా, ప్రైవేటు విద్య, వైద్యంకు పెద్ద పీట వేయడం, ఆర్థిక వ్యత్యాసాలు మరింతగా పెరగడం, ఎన్నికల వాగ్దానాలు నెరవేర్చకపోయినా అవేవి ఈసారి ఎన్నిక కావడానికి ఆటంకం కాలేదు.

28 శాతం ముస్లింల ఓట్లు ఉన్న బెంగాల్‌లో ఇమామ్‌లకు నెలవారిగా గౌరవ వేతనం పెంచడం, ఆహార భద్రతను ఎక్కువ మంది పేదలకు విస్తరించడం లాంటి చర్యలు టీ.ఎం.ఎస్. చేసినా ప్రజల మౌలిక సమస్యలకు పరిష్కారం వైపు దృష్టి పెట్టలేదు. అలా మౌలిక సమస్యలైన విద్య, వైద్య, ఉపాధి కల్పించడం బూర్జువా పార్టీల విధానం కాదు.

**తమిళనాడు**లో జయలలిత నేతృత్వంలోని అన్నా డీ.ఎం.కే. రెండవసారి వరుసగా అధికారంలోకి వచ్చింది. వరుసగా అధికారంలోకి వచ్చినా గతంలో సాధించినన్ని సీట్లు తిరిగి సంపాదించలేకపోయింది. గతంలో 234 సీట్లలో 149 స్థానాలు గెలిస్తే ఇప్పుడు 133 స్థానాల్లోనే గెలిచింది. జయలలిత అవినీతి కేసుల్లో కోర్టులు క్లీన్‌చిట్ ఇవ్వడంలో కేంద్రంతో కుదిరిన బేరసారాలు ఫలితాలనిచ్చాయి. ఏ.ఐ.డీ.ఎం.కే. బీ.జే.పీ.తో చేసుకున్న లోపాయికారి ఒప్పందాలు బీ.జే.పీ. దక్షిణ భారతదేశంలో పాగా వేయడానికి సహకరించాయి. జయలలిత ఎన్నికలను దృష్టిలో వుంచుకుని చేసిన సామాజిక కార్యక్రమాలు, ఇచ్చిన హామీలు

ఫలితాలనిచ్చాయి. అమ్మా టిఫిన్ సెంటర్లు, 70 సంవత్సరాల స్వతంత్ర భారతంలో తమిళులకు ఎంత తిండి పెట్టాయో తెలియదు గాని వారి దయనీయ ఆకలి ఆక్రందనలు మాత్రం జయలలితకు తిరుగులేని ఓట్ల బ్యాంకుగా ఉపకరించాయి.

ఉత్పత్తి పెంచాలి, ఉపాధి కల్పించాలి, ఉద్యోగాలివ్వాలి, ప్రజల జీవన ప్రమాణాలు అభివృద్ధి చేయాలి లాంటివి పక్కన బెట్టి అమ్మ అన్నం పెట్టింది. అమ్మ రుణం తీర్చుకోవాలి అనే విధంగా మీడియాలో ప్రచారం జరిగి అమ్మకు ఓట్లు పడ్డాయి సీట్లు వచ్చాయి. అధికారం తిరిగి దక్కింది. ప్రజలకు జయలలిత అవినీతి కనబడలేదు. లక్షల కోట్ల రూపాయల 2 జీ స్పెక్ట్రమ్ కుంభకోణం ముందు అది చాల చిన్నదైపోయింది. కోర్టుల మీద ప్రజలకున్న భ్రమలు జయలలిత పై పడ్డ అవినీతి మచ్చ తొలగి పోయినట్లు భ్రమింపజేసింది. ఆకలితో ఉన్నవాళ్ళు పోరాడడం కన్నా అడుక్కు తినడం, దోచుకోవడం గొప్పదిగా, విలువైనదిగా, మహత్కార్యంగా మార్చి వేశారు పాలకులు. ఈ ఆకలికి, దరిద్రానికి, దోపిడీ అణిచివేతలే కారణమన్న జ్ఞానం సన్నగిల్లింది. ఒకపూట ఆకలి తీర్చడంతోను, మద్యం సీసా తోను, కలర్ టీ.వీ., గ్రైండర్, మిక్సీ లాంటి హామీలతోను ఎన్నికల్లో ఓట్లు సంపాదించే పాలకపార్టీలు ప్రజల పట్ల నైతిక బాధ్యత వహించి ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరిస్తారా? పరిష్కరించరు. పరిష్కరించలేరు. అలా పరిష్కరించాల్సిన అవసరం లేకుండానే ఎన్నికల రాజకీయాలు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పరిఢవిల్లు తున్నాయని బహిరంగంగా వాళ్లు చాటుతున్నారు. ప్రజల చుట్టూ పరుచుకున్న అబద్ధాల ఊబి, పీకల్లోతుల్లోకి లాక్కుపోయిన ఎన్నికల ఊబి నుండి బయట పడకుండా ఈ పాలక వ్యవస్థ కట్టుదిట్టమైన చట్టాలు చేస్తుంది. రాజ్యం, చట్టం, న్యాయం అన్ని ఈ ఎన్నికల ప్రజాస్వామ్యం అనే ఊబిలోకి నెట్టేవే. ప్రసార, ప్రచార మాధ్యమాలన్నీ ఈ వ్యవస్థను కాపాడేవే. ఎంత అవినీతి చరిత్ర ఉన్నా, ఎంతటి నిరంకుశ పోకడలున్నా, గెలుపు, ఓటముల బరిలో నిలిచేది వారే, గెలిచేది వారే. దోపిడీ వ్యవస్థ వారినే పరిపాలకులను చేస్తుంది. ప్రజల ప్రజాస్వామిక వ్యవస్థ పోరాడి సాధించాల్సి ఉంటుంది. అది పీడిత ప్రజల రాజ్యం. అది ప్రజల్ని పాలకుల్ని చేస్తుంది. అది మాత్రమే దోపిడీ అణిచివేతలు లేని రాజ్యాన్ని తెస్తుంది.

**కేరళలో** 1965 నుండి సంకీర్ణాలే అధికారంలో ఉన్నాయి. ఇప్పుడూ అదే జరిగింది. భవిష్యత్ కూడా అలాగే కొనసాగవచ్చు. ప్రతీసారి అధికారంలోకి వచ్చే కూటములు క్రమం తప్పకుండా మారుతూనే ఉన్నాయి. కాంగ్రెస్ నాయకత్వంలోని యు.డీ.ఎఫ్. కూటమి 47 స్థానాలకు పరిమితం కాగా సీ.పీ.ఐ.(ఎం.) నాయకత్వంలోని ఎల్.డీ.ఎఫ్. కూటమి 91 స్థానాలు సంపాదించి ప్రభుత్వాన్ని ఏర్పరిచింది. సోలార్ కుంభకోణం, మద్యం ముడుపుల కుంభకోణాలు, అలాగే న్యాయశాస్త్ర విద్యార్థినిపై అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటన లాంటివి ప్రజల్లో యు.డీ.ఎఫ్. పాలన పట్ల తీవ్ర వ్యతిరేకతను తెచ్చాయి. అధికార పార్టీకి వ్యతిరేక ఓటింగ్ సరళిలో భాగంగా ఈ సారి ఎల్.డీ.ఎఫ్. కూటమి అధికారంలోకి వచ్చింది.

కేరళలో 1960 నుండి భారతీయ జనసంఘ్ మత రాజకీయాలను నిర్వహిస్తున్నది. జనసంఘ్ 1980 లో బీ.జే.పీ.గా రూపుదాల్చి అధికారం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తుంది. గత 4 దశాబ్దాల కృషి ఫలితంగా పట్టణాల్లో ప్రభావాన్ని వేయగలిగింది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పాల్గొంటూ ఓట్ల శాతాన్ని పెంచుకోవడంతో పాటు కొన్ని మున్సిపాలిటీలలో సీట్లు కూడా సంపాదించింది. 2014 లోకసభ ఎన్నికల్లో బీ.జే.పీ. గాలి వీచి 10 శాతం సంపాదించినా కాంగ్రెస్ వ్యతిరేకతను సీట్ల రూపంలోకి మార్చుకోగలశక్తి రాలేదు. అయితే ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారి ఒక సీటు సంపాదించి అసెంబ్లీలోకి అడుగు పెడుతుంది.

బీ.జే.పీ. మత రాజకీయాలతో పాటు కుల రాజకీయాలను నడుపుతుంది. కేరళలో 23 శాతంగా ఉన్న ఎజవా కులానికి చెందిన నటేషన్ నాయకత్వంలోని భారత దర్మన్ జనసేన (బీ.డీ.జే.ఎస్.)తో పొత్తు పెట్టుకుని ఈసారి ఎన్నికల్లో పాల్గొన్నది. ఎజవా కులానికి చెందిన సంఘ సంస్కర్త నారాయణ గురు సమాధిని ప్రధాని మోడీ గత డిసెంబర్‌లో సందర్శించడం కూడా ఇందులో భాగమే. అప్పుడే బీ.సీ. నేత ఆర్. శంకర్ విగ్రహాన్ని కూడా మోడీ ఆవిష్కరించాడు. బీ.జే.పీ. హిందూ మత ప్రాతిపదికన ఓట్ల రాజకీయాల్లో స్థానాన్ని సంపాదించితే, ఆర్.ఎస్.ఎస్. విద్వేషపూరిత మత భావజాలాన్ని పటిష్టపరిచేందుకు చురుకుగా పనిచేస్తుంది. ఇప్పుడు కేరళ ప్రజలు మూడో కూటమి ప్రభావంలోకి వెడుతున్నారు. అక్కడ ఇప్పుడు ఆర్.ఎస్.ఎస్. జాతీయ భావాల్ని రెచ్చగొడుతుంది.

ప్రధాని నరేంద్రమోడీ యుద్ధోన్మాదంతో విద్వేషపూరిత పాకిస్థాన్ వ్యతిరేక ప్రచారాన్ని కేరళలోని కాళికట్‌లో జనసంఘ్ స్థాపకుడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ శతజయంతి సభనుండే ప్రారంభించాడు.

**పుదుచ్చేరి** ఒక కేంద్ర పాలిత ప్రాంతం. అసెంబ్లీలో 30 స్థానాలున్నాయి. గతంలో అధికారంలో ఉన్న పార్టీకి ఈసారి ఎన్నికల్లో సీట్లు తగ్గి, ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్‌కు సీట్లు 7 నుండి 15కు పెరిగాయి. మెజారిటీ లేదు కనుక 2 సీట్లు సంపాదించుకున్న డీ.ఎం.కే. మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పరిచింది. గతంలో అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి కూడా కాంగ్రెస్

పార్టీకి చెందిన వాడే. 2011 అసెంబ్లీ ఎన్నికలకు ముందు దాని నుండి విడిపోయి ఏ.ఐ.ఎన్.ఆర్.సీ.ని ఏర్పాటు చేసి ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఏ.ఐ.డీ.ఎం.కే.తో కలిసి పోటీ చేసి గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసాడు. 2014 పార్లమెంటు ఎన్నికల్లో బీ.జే.పీ. తో జతకట్టిన ఏ.ఐ.ఎన్.ఆర్.సీ. ఇక్కడ గెలిచినా అతి పెద్దగా ప్రభావం చేయగలిగింది ఏమి లేదు. ఎవరితోను పొత్తు పెట్టుకోలేదు. ఒంటరిగానే పోటీ చేసి 7 సీట్లు సంపాదించి ప్రతిపక్షంలో కూర్చున్నది.

2014 లోకసభ ఎన్నికల్లో బీ.జే.పీ. అత్యధిక సీట్లు సంపాదించి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి దఫా జరిగిన ఢిల్లీ, బీహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీ.జే.పీ.కి ఆశించిన విధంగా సీట్లు రాలేదు. సరికదా వారి అంచనాలను తారు మారు చేసాయి. బీ.జే.పీ. అతి విశ్వాసంతో, అతి అంచనాలతో ఉందని ప్రాంతీయ పార్టీలను తక్కువ అంచనా వేస్తుందని అందరికీ అర్థమయ్యింది. బీ.జే.పీ. ఆ ఎన్నికల ఫలితాల నుండి గుణపాఠం తీసుకుని తన వ్యూహాన్ని మార్చుకుంది. ప్రాంతీయ పార్టీలతో కలిసి ఎన్నికల పొత్తులు ఏర్పరిచింది. రెండవ సారి జరిగిన 5 రాష్ట్రాల లోను ఆ ప్రయత్నాలు కనబడతాయి. అసోంలో ఒక పథకం ప్రకారమే పని చేసి అక్కడ నిరంతరం రగులుతున్న చొరబాటు సమస్యను ప్రధానం చేసింది. ఈశాన్య భారతాన్ని అఖండ భారత వ్యూహంలో భాగంగా కైవసం చేసుకునే దానిలో అసోంను కీలకమైనదిగా భావించింది. ముందుగా మంత్రాంగం నడిపి అరుణాచల్ ప్రదేశ్ కాంగ్రెస్‌లో చీలిక తెచ్చి అధికార సంక్షోభం సృష్టించింది. అక్కడ రాష్ట్రపతి పాలన తెచ్చింది. అక్కడ కీలు బొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పరిచి బయటినుండి మద్దతును ఇస్తుంది. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం అనేక పథకాలను ప్రవేశపెడుతుంది. 15 సం॥రాల కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, స్థానిక సమస్యల తీవ్రత, ప్రాంతీయ పార్టీలతో పొత్తు, కేంద్రంలో బీ.జే.పీ. అధికారంలో ఉ ఒడడం, ముందస్తుగా చేసిన ప్రయత్నాలు ఫలించి బీ.జే.పీ. కూటమి అసోంలో అధికారానికి రావడానికి తోడ్పడింది. 2014లో లోకసభ ఎన్నికల్లో 2015 మున్సిపాలిటీ ఎన్నికల్లో, ఇప్పటి అసెంబ్లీ ఎన్నికల్లో ఒక పథకం ప్రకారం అధికారం చేజిక్కించుకునే దీర్ఘకాలిక దృష్టితో చేసినవేననేది స్పష్టం. హిందూ ఓటు బ్యాంకును సమీకరించుకునే దీర్ఘకాలిక ఎత్తుగడతోనే చేస్తుంది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీ.జే.పీ.కి 3 సీట్లు వచ్చాయి. కేరళలో ఒక సీటు వచ్చింది. అన్ని రాష్ట్రాల్లో, పట్టణాలను కేంద్రం చేసుకుని గ్రామాలకు విస్తరించే విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తుంది. ప్రజల మధ్య వైరుధ్యాలను, ప్రజల వెనుకబాటు తనాన్ని, ప్రజల్లోని మత విశ్వాసాల్ని, మూఢ నమ్మకాల్ని మలుచుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తుంది.

కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారాన్ని కోల్పోవడంతో పాటు అన్ని రాష్ట్రాలలోను తన పరిస్థితిని నిలుపుకోలేని బలహీన పరిస్థితుల్లో ఉంది. కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా అనుసరించిన దోపిడీ, అణచివేత విధానాల కారణంగా ప్రజలనుండి దూరం అయ్యింది. పార్టీకి నాయకత్వం కొరత కొట్టొచ్చినట్లు కనబడుతుంది. ఒక్క కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో తప్ప మిగిలిన 4 రాష్ట్రాల్లో కాంగ్రెస్ పరిస్థితి బలహీనంగానే కాదు, దయనీయంగా మారుతుంది. ఎన్నికల ప్రజాస్వామ్యంలో వ్యతిరేక ఓటు మీద ఆశ పెట్టుకుని కాలం గడిపే పరిస్థితికి కాంగ్రెస్ బలం దిగజారిపోయింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు రెండు రాష్ట్రాల్లో తిరిగి అధికారంలోకి వచ్చిన ప్రాంతీయ పార్టీలు తమకు ప్రజల్లో పెరిగిన బలంతో అధికారంలోకి రాలేదనేది స్పష్టం. అధికారం మార్చుకున్న కేరళ పరిస్థితి గాని, అసోంలో నూతన ప్రభుత్వం గాని ప్రజల్లో పెరిగిన బలానికి చెందినది కాదు. కాంగ్రెస్ పాలనకు ప్రజలు వేసిన వ్యతిరేక ఓటు మాత్రమే.

ఎన్నికల్లో పార్టీల మధ్య పొత్తులు అధికారం కోసమే. వారి ఆరాట పోరాటాలు అన్నీ గెలుపు కోసం మాత్రమే. సిద్ధాంత రాజకీయాలు, ప్రజల సమస్యలకు పరిష్కారం వారి విధానాలు కావు. కాబట్టి పార్టీల మధ్య మిత్రుత్వాలు, శత్రుత్వాలు వెంట వెంటనే మారిపోతాయి. ఒకే పార్టీ ఒక రాష్ట్రంలో మిత్రుత్వాన్ని, మరో రాష్ట్రంలో శత్రుత్వాన్ని కలిగి ఉంటుంది. పశ్చిమ బెంగాల్లో కాంగ్రెస్ సీ.పీ.ఐ.(ఎం.)తో మిత్ర కూటమిలో ఉంది. కేరళలో సీ.పీ.ఐ.(ఎం.)కు శత్రు కూటమిగా ఉంది. అన్ని పార్టీల పరిస్థితి ఇదే. గెలిచిన పార్టీలు గతంలో మిత్ర కూటమిలో ఉండి ఇప్పుడు శత్రు కూటమిలో ఉన్నవే. పశ్చిమ బెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్ గాని, తమిళనాడులో డీ.ఎం.కే. గాని వాటి చరిత్ర చూస్తే ఇదే విషయం స్పష్టమవుతుంది. ఎన్నికల పొత్తులు సీట్లు గెలిచే ఎత్తుగడే తప్ప మరొకటి కాదు. జాతీయ పార్టీ, ప్రాంతీయ పార్టీలు అన్ని అవకాశవాద కలయికలతోనే ఉన్నాయి. కనుక ఒక రాజకీయ విధానం, నీతి, నియమం, నైతికత పాటించాల్సిన అవసరం లేదు. ఎన్నికల విధానమే ఫార్సు కాబట్టి ఎవరు ఎంతగా దిగజరితే అంత ఎక్కువ లాభం. దేశం, ప్రజలు, ప్రజాస్వామిక సాంప్రదాయాలు, విలువలు వారికి పట్టవు. దేశ సంపదను కొల్లగొట్టి దోచిపెట్టడం ద్వారా వారికి లభించే కమీషన్ల మీదనే వారి ఆశ; అదే విధానంగా అన్ని పార్టీలు పోటీ పడి పని చేస్తున్నాయి. పోరాడుతున్న ప్రజలపై అణచివేత చర్యలను పూర్తి ఐక్యతతో అమలు చేస్తున్నాయి. ఆర్థిక వ్యత్యాసాలు పెరిగి వర్గ వైరుధ్యాలు మరింతగా పెరిగే విధంగా

*(మిగతాది 16వ పేజీలో...)*

## దేశవ్యాప్తంగా అమలు జరుగుతున్న గ్రీన్‌హంట్‌లో భాగంగా దండకారణ్యంలో విప్లవోద్యమాన్ని అణచివేయడానికి "బస్తర్ మిషన్-2016"

గతంలో రెండు జనజాగరణ అభియాన్‌లను, సల్వాజుడుం అభియాన్‌ను, గ్రీన్‌హంట్ అభియాన్ రెండు దశలను ఓడించిన దండకారణ్య ప్రజలు ఇపుడు గ్రీన్‌హంట్ 3వ దశను, అందులో భాగంగా బస్తర్ మిషన్-2016ను దీర్ఘకాల ప్రజా యుద్ధంలో భాగంగానే ఓడిస్తున్నారు. 2016 చివరికి విప్లవోద్యమాన్ని అణచివేస్తామని, బస్తర్ నుండి మావోయిస్టులను లేకుండా చేస్తామని చెప్పిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ లక్ష్యాన్ని 2018కి పొడిగించుకున్నాయి. గత 3 దశాబ్దాలుగా మావోయిస్టుల అణచివేతను తమ లక్ష్యంగా ప్రకటించడం, అది సాధ్యం కాక ఇలా పొడిగించడం దోపిడీ పాలక వర్గాలు కొనసాగిస్తునే ఉన్నారు. ప్రజల మౌలిక సమస్యలను మావోయిస్టులే పరిష్కారం చేయగలరని ప్రజలు విశ్వసిస్తున్నారు. ఆ బాటలోనే నడుస్తున్నారు. బస్తర్ మిషన్-2016 పేరుతో అసలు బస్తర్‌లో ఏం జరుగుతుంది.? వివరాల్లోకి వెడితే వాస్తవం అర్థమవుతుంది.

అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం నుండి సామ్రాజ్యవాద బహుళ సంస్థల్ని కాపాడడంలో భాగంగా భారత బడా భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాల ప్రభుత్వం ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలను వేగంగా అమలు చేసే కార్యక్రమాలను చేపట్టింది. మోడీ నాయకత్వంలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్.డి.ఎ. ప్రభుత్వం 'మేకిన్ ఇండియా, 'డిజిటల్ ఇండియా' ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం, పబ్లిక్ సెక్టార్‌ను పూర్తిగా అమ్మివేయటం లాంటి విధానాలతో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్ని ఆహ్వానిస్తూ దేశ ప్రాకృతిక సంపదను, కూడబెట్టిన ప్రజల ఆస్తిని (పబ్లిక్ సెక్టార్‌ని), ప్రజల శ్రమ శక్తిని కొల్లగొట్టి, దోచిపెట్టడానికి సాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే 'మేకిన్ ఛత్తీస్‌గఢ్', 'మేకిన్ మహారాష్ట్ర' ముందుకొచ్చాయి. పెద్ద మైనింగ్ ప్రాజెక్టులు, బహుళార్థ సాధక బడా డామ్‌లు, రోడ్లు వెడల్పు చేయటం అందులో భాగంగానే అర్థం చేసుకోవాలి. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాచివేస్తూ, కార్మిక చట్టాలను మార్పు చేయటం, సాగు భూములను రైతాంగం నుండి బలవంతంగా లాక్కోవటం, ఆదివాసుల్ని విస్థాపితుల్ని చేసి మైనింగ్ పనులు మొదలు పెట్టడం ద్వారా ప్రజలను ఉపాధి నుండి దూరం చేసి జీవించడమే కష్టంగా మార్చి వేస్తున్నారు.

సామ్రాజ్యవాద బహుళ జాతి సంస్థలకు అవసరమైన లక్షల హెక్టార్ల భూమిని రైతాంగం నుండి కాజేయడానికి 'భూ సేకరణ చట్టం తేవడానికి మోడీ ప్రభుత్వం అనేక సార్లు తీవ్ర ప్రయత్నం చేసింది. దేశ వ్యాప్తంగా ప్రజల్లో వ్యతిరేకత రావటంతో దానిని ఉపసంహరించుకున్నారు. కార్మిక చట్టాల్లో జరుగుతున్న మార్పులను నిరశిస్తూ దేశ వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతునే ఉన్నాయి. మైనింగ్ లాంటి సమస్యలతో ప్రత్యక్షంగా ప్రభావితం అవుతున్న ఆదివాసీ ప్రజానీకం తమ జీవన్మరణ సమస్యల కోసం ఆందోళనలు చేపడుతున్నారు. అనేక దశాబ్దాలుగా దండకారణ్యంలో ఆదివాసీలు విస్థాపనకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు.

దండకారణ్యంలో జీవనదులు, జలపాతాలు, అత్యంత విలువైన వృక్షసంపద, ఔషధ మొక్కలు, జంతువులు, అరుదైన పక్షి జాతులతో పాటు భూమిలో కోట్ల టన్నుల ఇనుము, బొగ్గు, బాక్సైట్, రాగి, సున్నం లాంటి విలువైన ఖనిజాలు వున్నాయి. ఖనిజాల ఉత్పత్తిలో ఛత్తీస్‌గఢ్ 9వ స్థానంలో వుంది.

ప్రభుత్వానికి వేలకోట్ల రూపాయల రాయల్టి ప్రతి సంవత్సరం వస్తుంది. భారత దళారీ దోపిడీ పాలక వర్గాలు సామ్రాజ్యవాద బహుళ జాతి సంస్థలతో పాటు మన దేశంలోని దళారీ బడా బూర్జువా వర్గానికి చెందిన టాటా, జిందాల్, ఎస్సార్, నెకోజాయ్ స్వాల్, వేదాంత, మిత్తల్, రిలయన్స్ సంస్థలకు రైతుల, ఆదివాసుల భూములను, నదీజలాలను, అడవులను, భూగర్భ ఖనిజ వనరులను కారు చౌకగా కట్టబెట్టాలని చూస్తున్నారు.

అందుకే అక్కడ ప్రజల నిరసనను, విప్లవోద్యమాన్ని అణచడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. 2015 మే 9న నరేంద్ర మోడీ దంతెవాడకు వచ్చి మావోయిస్టులకు 'ఆయుధాలు వదలండి-నాగళ్ళు పట్టండి' అని ఒక పక్కన సలహా యిచ్చాడు. మరో పక్కన పైన చెప్పిన కార్పొరేట్ సంస్థలకు ఉపయోగపడే విధంగా 24 వేల కోట్ల రూపాయల అభివృద్ధి పథకాలు ప్రకటించాడు. ఇంకో పక్కన మావోయిస్టు ఉద్యమాన్ని త్వరగా అణిచివేయమని పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చాడు. వెంటనే కేంద్రంలో నక్సలైట్ల వ్యవహారాల కోసం ప్రత్యేక అధికారిగా విజయ్‌కుమార్ నియామకం జరిగింది. సరికొత్త వ్యూహ రచనలు మొదలై అన్ని రకాల కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాల ముఖ్యులతో అనేక దఫాలుగా సమావేశాలు జరిగాయి. అదనంగా 6 నెలల్లో 8 బెటాలియన్ల అర్ధసైనిక బలగాలను బస్తర్‌లో మోహరించారు. కొత్తగా అనేక క్యాంపులు వేశారు. 2015 సెప్టెంబర్ నుండి డిసెంబర్ వరకు నాలుగు నెలల్లో 40 మంది విప్లవ ప్రజల్ని పోలీసులు హత్యగావించారు. సామూహిక దాడులు, అత్యాచారాలు చేసారు.

అరెస్టులు చేసి, బెదిరించి, సరెండర్లు చూపించి ఒక భయ భీతావహ వాతావరణాన్ని సృష్టించారు.

జగదల్‌పూర్ కేంద్రంగా ఐ.జి. కల్లూరి నేతృత్వంలో కలెక్టర్, ఎస్.పి., వాళ్ళు సృష్టించిన 'సామాజిక ఏకతామంచ్' కలిసి 2016 లో బస్తర్‌ను నక్సలైట్ల ముక్తి ప్రాంతంగా మార్చాలంటూ మోడీ, రమణ్‌సింగ్‌ల ఆదేశాలను అమలు చేయాలని పథకాలు వేశారు. అదే బస్తర్ మిషన్-2016. రాజ్యాంగం ద్వారా ఏర్పరుచుకున్న న్యాయవ్యవస్థ, చట్టాలు బస్తర్‌లో ఏ మాత్రం పని చేయవు.

**బస్తర్‌లో పోలీసు హత్యలు, దాడులు**

ఎన్‌కౌంటర్ పేరిట అమాయక ఆదివాసుల్ని పట్టుకుని కాల్చి చంపటం సర్వ సాధారణ మయింది. దీనికి నాలుగు దశాబ్దాలలో కొన్ని వందల వాస్తవ సంఘటనలను చూపవచ్చు. ఇటీవలి కాలంలో 6 నెలల పాటు జరిగిన సంఘటనలను కొన్నిటిని చూస్తే కూడా వాస్తవాలు తెలుస్తాయి. 2015 జూలై 29న దర్భ డివిజన్‌లోని నేహాడీ గ్రామంలోనికి ప్రవేశించిన 400 మంది పోలీసులు సి.ఎన్.ఎం. కళాకారులను 19 మందిని ఒక ఇంట్లో వేసి తగలబెట్టడానికి ప్రయత్నించినారు. ఆ ఘటన నుండి తప్పించుకున్న కళాకారులపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపితే ఏమ్లా పొదియాల్ అక్కడికక్కడే మరణించాడు. మిగిలిన వారిని అరెస్టు చేసి పట్టుకుని పోయారు. సెప్టెంబర్ 26న పూంబాడ్ గ్రామానికి చెందిన పొట్టావి మంగును తీవ్రంగా చిత్రహింసలు పెట్టి, నాలుకను కోసి హత్య చేశారు. అక్కడే అంతకు ముందు విచక్షణా రహితంగా జరిపిన కాల్పుల్లో రుక్ని అనే 15 ఏళ్ళ బాలిక చనిపోయింది. నవంబర్ మొదటి వారంలో జేగురుగొండ ఏరియాలో దొడ్డి అర్జున్ అనే యువకుడ్ని పట్టుకుని కాల్చి చంపారు. నవంబర్ 2వ తేదీన నారాయణ్‌పూర్ జిల్లా ధనోరా ఏరియాలో కొడేలి గ్రామానికి చెందిన బామన్ అనే యువకున్ని పొలం నుండి తీసుకెళ్ళి 15 రోజులు చిత్రహింసలు పెట్టి, చంపి ఆత్మహత్య చేసుకున్నట్లు కట్టుకథ అల్లారు.

నవంబర్ 3వ తేదీన సుకుమా జిల్లా దోర్నపాల్ ఏరియా అర్లంపల్లి గ్రామ యువకులు దూది భీమా, వెట్టి లచ్చు, సోడి మూయ లను పోలీసులు హత్య చేశారు. నవంబర్ 27న మాడ్ డివిజన్‌లో అనేక గ్రామాలలో దాడులు చేశారు. ఆల్‌వేడకు చెందిన మోటు అనే ఆదివాసీ రైతుని, వెడమ మెట్టకి చెందిన రేంగు అనే ఆదివాసీ యువకున్ని మాటుగాసి కాల్చి చంపారు. డిసెంబర్ 17న నారాయణ్‌పూర్ జిల్లా ధనోరా ఏరియాలోని మడమనారు గ్రామంలో సన్నారు కచలాం అనే 38 ఏళ్ళ రైతుని కాల్చి చంపారు. బేనూరు ఎల్.ఒ.ఎస్. కమాండర్ చనిపోయాడని, 8 లక్షల రివార్డు వుందని అబద్ధాలు ప్రకటించారు. నిజానికి అతను ఆ గ్రామానికి గాయితా (భూమి పూజారి)గా వున్నాడు. ఇవన్నీ 2015లో చేసిన బూటకపు హత్యలే.

2016 జనవరి 1వ తేదీన కుతుల్‌లో మున్నా, లక్కు, జనవరి 4న వెడమ గ్రామస్థుడు జైతు కొర్రాంను, జనవరి 11న సేంద్ర యువకుడు వినోద్‌ను, జనవరి 15న పెదజోజోరు యువకులు ఓయం మున్నా, మజ్జి బుద్రాం, మడకం పాండు, 14 ఏళ్ళ బాలిక ఓయం తులిసి, మరొక యువతి ఓయం మోతి, జనవరి 18న తుమ్మిరిగుండ గ్రామం జరీనాను, జనవరి 27న లాక్‌పల్లి గ్రామంపై దాడి చేసి బాల్‌సింగ్, కన్కి, మాసా అనే ముగ్గుర్ని, జనవరి 30న వంజాం శాంతి, సరియం పొజ్జే, జనవరి 31న చింతగుప్ప కుంజామి లింగా, ఇదే జనవరిలో ఈకుం గ్రామం సోడి సోనాల్, సింగారం నుండి మడకం రాజు, ఈతంపార నుండి మడకం మాడా ఇలా ఒక్క నెలలోనే 19 మందిని పట్టుకుని చిత్రహింసలు పెట్టి, అత్యాచారాలు చేసి హత్య గావించారు. వాళ్ళు నక్సలైటు నాయకులని రివార్డులు ప్రకటించి లక్షల రూపాయలు పంచుకుని తిన్నారు.

మొత్తంగా బస్తర్ మిషన్-2016 పేరుతో జనవరి నుండి ఇప్పటి వరకు బస్తర్‌లోని 7 జిల్లాలు, మహారాష్ట్రలోని గడ్‌చిరోలిని కలుపుకుని పదుల సంఖ్యలో సామాన్య ప్రజలను బూటకపు ఎన్‌కౌంటర్లలో హత్యలు గావించారు. వీరిలో మహిళలు వున్నారు. సెప్టెంబర్ 28న వాడే ప్రకటించిన లెక్క 99 మంది. 45 మంది మహిళలపై సామూహిక అత్యాచారాలు చేశారు. సంతల మీద దాడులు చేసి, ప్రజల్ని అరెస్టు చేసి, సరెండర్లు చూపించారు. వాళ్ళ నేరాల రికార్డు అడిగిన జడ్జి ప్రభాకర్ గ్వాల్‌ను పదవి నుండి తొలగించారు. పోలీసులు చేస్తున్న చట్ట వ్యతిరేక చర్యల్ని ప్రశ్నించినందుకు రమణ్‌సింగ్ ప్రభుత్వం ఆయన్ని తొలిగించింది.

బస్తర్‌లో దాడులకు పాల్పడుతున్న బలగాలలో రాష్ట్రానికి చెందిన డి.ఎఫ్, ఎస్.టి.ఎఫ్, డి.ఆర్.జి. బలగాలు వున్నాయి. కేంద్రానికి చెందిన కోబ్రా, సి.ఆర్.పి.ఎఫ్., ఐ.టి.బి.పి, సి.ఐ.ఎస్.ఎఫ్, బి.ఎస్.ఎఫ్. లాంటి అర్ధ సైనిక బలగాలు వున్నాయి. అమెరికా, ఇజ్రాయిల్‌లలో తయారయిన మానవరహిత (డ్రోన్స్) విమానాలతో, ఇస్రో యిచ్చే సమాచారంతో దాడులు చేస్తున్నారు. తెలంగాణ సరిహద్దుల్లో చేసిన జాయింట్ ఆపరేషన్‌లో తెలంగాణ గ్రేహౌండ్స్, మహారాష్ట్ర సరిహద్దుల్లో చేసిన సంయుక్త దాడుల్లో సి-60 బలగాలు, ఒరిస్సా సరిహద్దుల్లో జరిగే సంయుక్త దాడుల్లో ఎస్.ఒ.జి. బలగాలతో కలిసి అనేక దాడులకు పాల్పడుతున్నారు. ఈ ప్రభుత్వ సాయుధ బలగాలు విచ్చలవిడిగా గ్రామాలపై విదేశీ సైనికుల్లాగా నిత్యం దాడులు చేస్తున్నారు. కనపడ్డ వారిపై కాల్పులు, అరెస్టులు,

అత్యాచారాలు కొనసాగిస్తున్నారు. ప్రజలు కష్టపడి అడవిలో ఏరుకున్న చింతపండు, ఇప్పపువ్వు, పండించిన ధాన్యాన్ని, పప్పు దినుసుల్ని, దాచుకున్న డబ్బులను దోచుకెళ్ళడం, కోళ్ళను, మేకల్ని తినటం సర్వ సాధారణ విషయంగా మారింది.

**మహిళలపై అత్యాచారాలే ఆయుధంగా మిషన్-2016**

గతంలో 2015 అక్టోబర్ 19 నుంచి 21 వరకు బీజాపూర్ జిల్లా బాసగూడెం ఠాణా పరిధిలోని పెద్ద గెల్లూరు, చిన్న గెల్లూరు, బుడిగిన్, పెగిడెపల్లి, గుండం గ్రామాలపై దాడి చేసి ప్రజల్ని విచక్షణారహితంగా కొట్టారు. పోలీసుల అమానుషత్వానికి గురైన వారిలో 40 మంది మహిళలు వున్నారు. 14 ఏళ్ళ ఒక బాలిక, ఒక గర్భవతితో సహ నలుగురిపై పోలీసులు లైంగిక అత్యాచారానికి పాల్పడ్డారు. గర్భవతి మహిళను పక్కన వున్న చెరువులో ముంచుతూ, తీస్తూ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై ప్రజాసంఘాల, ప్రజాస్వామిక వాదుల నుండి పెద్ద ఎత్తున నిరసన వెల్లువెత్తింది. ఈ అన్యాయాన్ని, అణచివేతను మహిళలు వ్యతిరేకిస్తూ బీజాపూర్ జిల్లా ఎస్.పి.కి, కలెక్టరుకు విన్నవించారు. ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్‌తో సహా అందరు కలిసి నిజ నిర్ధారణ కమిటీ వేసి అత్యాచారాల వాస్తవాలను మీడియాలో వివరించారు. దోషులైన పోలీసులను శిక్షించాలని కోరారు.

ఈ అలజడి కొనసాగుతున్న క్రమంలోనే మిషన్-2016 లో భాగంగా జనవరి 6న సుకుమా జిల్లా కున్నా గ్రామంపై దాడి చేసి స్త్రీ, పురుషుల్ని, పిల్లల్ని, వృద్ధుల్ని తీవ్రంగా కొట్టి హింసించారు. 9 మంది మహిళలపై సామూహిక అత్యాచారం చేశారు. బిడ్డ తల్లినని చెప్పినందుకు ఒక మహిళ రొమ్ముల్ని రాక్షసంగా పిండి చూశారు. రమణ్‌సింగ్ తమకు స్వేచ్ఛని యిచ్చాడని, ఎదిరిస్తే తూటాలతో కాలుస్తామని మాట్లాడారు. ఇదే జనవరి 11 నుండి 17 మధ్య వారం రోజులు 200 మంది పోలీసులు ఆవపల్లి ఠాణా పరిధిలో నేంద్ర, గొట్టుం గ్రామాలలో దాడులు చేసి గ్రామాల్ని దోచుకున్నారు. కనపడ్డ వారిని కొట్టారు. 22 మంది మహిళల్ని తీవ్రంగా కొట్టారు. ఇక్కడ కూడా తొమ్మిది మంది మహిళలపై సామూహిక అత్యాచారం జరిపారు. 'పౌరహక్కుల సంయుక్త సంస్థ' (సి.డి.ఆర్.ఒ.), 'మహిళలపై లైంగిక హింస-రాజ్యహింసను వ్యతిరేకించే కమిటీ' జనవరి 18 నుండి 20 వరకు ఈ గ్రామాలను సందర్శించి ఈ దారుణాన్ని ఖండిస్తూ పీడిత మహిళలతో మాట్లాడారు. అత్యాచారాలకు పాల్పడ్డ పోలీసులపై ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేశారు. బాధిత మహిళలు ఠాణా దగ్గరికి వెళ్ళి కొద్ది రోజులు అక్కడే వుండి కొట్లాడి ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేయించారు.

ఈ అత్యాచారాలను ఖండిస్తూ సుక్మాలో, బీజాపూర్‌లో ప్రజలు ర్యాలీ తీశారు. బస్తర్ కమీషనర్‌కు విన్నవించుకున్నారు. ప్రజాస్వామిక సంస్థలు, ఆదివాసీ సంస్థలు దోషులైన పోలీసులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ దాడులు, అత్యాచారాలు, హత్యల పరంపర కొనసాగిస్తూ బస్తర్‌లోని కుంట ఏరియాలో గుంపాడు గ్రామంపై దాడి చేసి కనిపించిన వారిని కొట్టడమే కాక, ఇడిమే అనే మహిళను సామూహికంగా అత్యాచారం చేసి హత్య చేశారు. పశ్చిమ బస్తర్‌లో గంగులూరు ఏరియాలో 'ఉంగి' అనే గర్భవతి మహిళలపై సామూహిక అత్యాచారం చేసి, హత్య చేశారు. ఈ రకంగా బలగాలు గ్రామాలపై దాడులు చేసినపుడు అత్యాచారాలు, హత్యలు కొనసాగుతూనే వున్నాయి. ప్రజల్ని పక్కదారి పట్టించే విధంగా రాష్ట్ర మానవాధికార కమీషన్, జాతీయ షెడ్యూల్ తెగల కమీషన్ రెండూ కూడా అత్యాచారాలు చేసిన పోలీసుల పహారాలోనే, వారి సమక్షంలోనే బాధిత మహిళల నుంచి వివరాలు సేకరించారు. వాస్తవంలో జరిగింది ఏమిటంటే ఆ తరువాత అత్యాచారాలకు పాల్పడ్డ జవాన్లకు, అధికార్లకు అవుటాఫ్ టర్న్ ప్రమోషన్లు, రివార్డులు వచ్చాయి.

అంతకు ముందే డిసెంబర్ 22న జగదల్‌పూర్‌లో పోలీసు యంత్రాంగం సంఘ్ పరివార్ శక్తులు, బాడా వ్యాపారులు, కాంట్రాక్టర్లు, సామ్రాజ్యవాద బహుళ జాతి సంస్థల ఏజెంట్లు, దళారీ రాజకీయ నాయకులు లంపెన్ గ్యాంగుల్ని కలుపుకుని 'సామాజిక ఏకతా మంచ్' బ్యానర్‌పై ర్యాలీ నిర్వహించారు. బస్తర్ ఐ.జి. ఎస్.ఆర్.పి. కల్లూరి, ఆర్.ఎస్.ఎస్., బి.జె.పి. నేతలు నాయకత్వం వహించారు. మావోయిస్టుల్ని బస్తర్ నించి తరిమి వేయటం, ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రతిష్టించటం లక్ష్యంగా ప్రకటించుకుని ఈ రాజ్యాంగేతర గూండా గ్యాంగు తన కార్యకలాపాలు కొనసాగిస్తున్నది.

ఒక బూటకపు ఎన్‌కౌంటర్ విచారణ సందర్భంగా కోర్టుకు సాక్షులను హాజరు పరిచిన నేరానికి జగదల్‌పూర్ నుండి తన ఇంటికి వస్తున్న సామాజిక కార్యకర్త, ఆప్ పార్టీ నేత సోనీ సోరీపై ఫిబ్రవరి 20న బంజారా ఘాట్ వద్ద మోటర్ సైకిల్‌ని ఆపి ఆమె ముఖంపై కెమికల్ దాడి చేశారు. పోలీసులు చేయించిన ఈ దాడిని రాష్ట్రంలో, దేశంలో, అనేక ఇతర దేశాల్లో ప్రజాస్వామిక సంస్థలు, వివిధ రాజకీయ పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఫ్రీలాన్స్ జర్నలిస్టు జగదల్‌పూర్‌లో నివాసం వుంటున్న మాలినీ సుబ్రహ్మణ్యం ఇంటిపై పోలీసులు 'సామాజిక ఏకతామంచ్' కార్యకర్తల పేరుతో దాడి చేశారు. సామాజిక కార్యకర్త బేలా భాటియా కిరాయికి వుంటున్న ఇంటి యజమానిని బెదిరించి ఇల్లు ఖాళీ చేయించారు. రచయిత్రి అరుంధతీరాయ్ దిష్టిబొమ్మని తగుల బెట్టారు. లీగల్ ఎయిడ్ గ్రూప్

మహిళా వకీళ్ళను బెదిరించి ఆదివాసీలకు న్యాయ సహాయం అందకుండా అనేక అడ్డంకులు కలిగించారు.

గతంలో దర్భ బ్లాక్‌లో స్థానిక విలేకర్లు సోమారునాగ్, సంతోష్ యాదవ్‌లను, ఈ మార్చిలో దంతెవాడలో ప్రభాత్ సింగ్, దీపక్ జైస్వాల్‌లను అరెస్టు చేసి యు.ఎ.పి.ఎ. కింద కేసులు పెట్టి జైల్లో పెట్టారు. బి.బి.సి. విలేఖరి అలోక్ పుతుల్ అడమాల్ బూటకపు ఎన్‌కౌంటర్ గురించి వాస్తవాలు సేకరిస్తున్నందుకు బెదిరించి జగదల్‌పూర్ నుండి రాయ్‌పూర్‌కి తరిమేశారు. బస్తర్‌లో ప్రజాస్వామ్యాన్ని రక్షించండి అని కాంగ్రెస్ పార్టీ ఫిబ్రవరి 16న ప్రదర్శన జరిపితే దాన్ని అడ్డుకోడానికి పోలీసులు లాఠీ చార్జి చేసి ప్రదర్శకులను గాయపర్చారు. సామాజిక ఏకతా మంచ్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన ప్రొఫెసర్ నందినీ సుందర్‌కు వ్యతిరేకంగా మహిళా ఏకతా మంచ్ పేరుతో ర్యాలీ జరిపారు. ఆమె దిష్ట బొమ్మను తగుల బెట్టారు. రాజ్యం పథకం ప్రకారం ప్రశ్నించే గొంతును నొక్కేస్తుంది.

బస్తర్ విలేఖర్లపై దాడులు గురించి ఎంక్వయిరీ చేయడానికి ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా నుండి సీనియర్ విలేఖరి వినోద్‌వర్మ నాయకత్వంలో ఒక టీం బస్తర్‌లో పర్యటించి విస్తృత రిపోర్టు సమర్పించింది. "బస్తర్‌లో ప్రజాస్వామ్యము, పౌరహక్కులు లేవు. పోలీసు ఆఫీసు నుండి విడుదలయిన ప్రకటనలను పేస్ట్ చేయడమే రిపోర్టర్ల పని. ఈ హద్దుదాటిన రిపోర్టర్లు, విలేఖర్లు పోలీసుల కోపానికి అసహనానికి, బెదిరింపులకు, దాడులకు బలవుతున్నారని నివేదికలో రాశారు. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఒక వివరమైన రిపోర్టును విడుదల చేస్తూ "బస్తర్‌లో పోలీసుల రాజ్యం నడుస్తున్నది. పౌరహక్కులు కాలరాచి వేయబడుతున్నాయని" చెప్పింది.

సెప్టెంబర్ 17న జగదల్‌పూర్‌లో ఐ.జీ., ఎస్.పీ.ల నాయకత్వాన అగ్ని (ఏజీఎన్ఐ) ఆధ్వర్యంలో మావోయిస్టు వ్యతిరేక ప్రదర్శన జరిగింది. ఇది ప్రజల భాగస్వామ్యం లేని పోలీసుల బలప్రదర్శనగా తుస్సుమంది. సోనీ సోరి చేసిన తిరంగయాత్రకు జవాబుగా బడిపిల్లల్ని తెచ్చి చేసిన ప్రదర్శనలో 'మావోయిస్టులను తరిమివేయండి' అని నినదించారు. అగ్ని (యాక్షన్ గ్రూప్ ఫర్ నేషనల్ ఇంటిగ్రేసీ) దేశవ్యాపిత సంస్థగా నిర్మాణమవుతున్న మరో సల్వాజుడుం తప్ప మరొకటి కాదు. ఇది ప్రజల మధ్య చీలికలు తెచ్చే, చట్ట వ్యతిరేక సంస్థ తప్ప మరొకటి కాదని పరిశీలకుల విశ్లేషణ.

**ఎయిర్ స్ట్రైయిక్ డ్రిల్స్ ప్రాక్టీస్-ఎయిర్ స్ట్రిప్‌కు అనుమతి**

ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర సాయుధ బలగాలు, ఎయిర్ ఫోర్స్ గరుడ కమాండోలు, గ్రేహౌండ్స్ బలగాలతో కలిసి 2015 అక్టోబర్ 13న తెలంగాణ బార్డర్‌లోని బీజాపూర్ జిల్లా తాళ్ళగూడెం పరిధిలో కర్రెగుట్టలపై 3 ఎమ్.ఐ.-17 హెలికాప్టర్ల ద్వారా ఎయిర్ స్ట్రైక్ డ్రిల్స్ చేశారు. రాయ్‌పూర్ నుండి ఒక పత్రికా ప్రకటనను వాళ్ళే విడుదల చేసి ప్రపంచానికి చాటారు.

మరల ఏప్రిల్ 1న సుకుమా జిల్లా కిస్తారం దగ్గర వీరపురం వద్ద ఎయిర్ స్ట్రైక్ డ్రిల్స్ అభ్యాసం చేశారు. బీజాపూర్‌లోని ఇంద్రావతి నేషనల్ పార్క్‌లో ఎయిర్ స్ట్రిప్ నిర్మించడానికి వారికి పర్మిషన్ కూడా వచ్చింది. ప్రభుత్వం నిర్వహించిన ఎయిర్ స్ట్రైక్స్ డ్రిల్స్‌ను దేశంలో వివిధ సామాజిక సంస్థలు, పౌరహక్కుల సంస్థలు తీవ్రంగా ఖండించాయి. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం మోదీ ప్రభుత్వం బస్తర్ ప్రజలపై ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో అన్యాయమైన యుద్ధం చేస్తున్నదని అవి తీవ్రంగా నిరసన తెలిపాయి. ఈ ఎయిర్ స్ట్రైక్ డ్రిల్స్‌కు వ్యతిరేకంగా మావోయిస్టులు ఏప్రిల్ 15న దండకారణ్యంలో బంద్‌ను నిర్వహించారు.

పరిస్థితిని సమీక్షంచే నెపంతో కేంద్ర హోం మంత్రి ఏప్రిల్ 16న రాయ్‌పూర్‌ను సందర్శించారు. దానికి ముందు రోజున ఏప్రిల్ 15న జగదల్‌పూర్‌లో బస్తర్ ఐ.జి. శివరాం ప్రసాద్ కల్లూరి నాయకత్వంలో ఏర్పడిన 'సామాజిక ఏకతా మంచ్'ను ప్రజలు, వివిధ సంస్థలు, ప్రజాస్వామిక వాదుల నుండి వచ్చిన వ్యతిరేకత కారణంగా రద్దు చేసారు. గతంలో సల్వాజుడుం, ఎస్.పి.ఓ. వ్యవస్థలను రద్దు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పటంతో ఆ రూపంలో అది రద్దు అయినప్పటికీ కోయకమాండో, డి.ఆర్.జి.ల రూపంలో నూతన అవతారం ఎత్తినట్లే, ఈ 'సామాజిక ఏకతా మంచ్, కూడా రద్దు చేసినప్పటికీ మరో రూపం తీసుకుంటుంది. బస్తర్ ప్రజలపై క్రూరమైన హింస, అత్యాచారాలకు పాల్పడటం ద్వారా మావోయిస్టు ఉద్యమాన్ని అణచటం లక్ష్యంగా అర్ధ సైనిక బలగాల మోహరింపు కొనసాగుతున్నది. అంతరంగిక భద్రతలో వారికి ఇది మొదటి ప్రాధాన్యతా అంశం కనుక దేశవ్యాప్తంగానే ఒక పథకం ప్రకారం ప్రజలపై అణచివేత, నిర్మూలనా దాడులకు పాల్పడుతున్నారు.

కేంద్రంలో ప్రభుత్వాలు మారినా పాలక వర్గ విధానాలలో మార్పు లేదు. కాంగ్రెస్ పాలనలోను, రమణ్‌సింగ్ అధికారంలోనూ ఛత్తీస్‌గఢ్‌లో ప్రభుత్వ విధానాలలో మార్పు రాలేదు. పాలక వర్గాల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా దండకారణ్యంలో ప్రజలు అసలైన ప్రజల అభివృద్ధి కోసం దోపిడీ, అణచివేతలకి వ్యతిరేకంగా సంఘటితంగా, మిలిటెంట్‌గా పోరాడుతున్నారు. ప్రజలు రాజ్యాధికార నిర్మాణాలను (క్రాంతికారి జనతన సర్కార్‌లను)

*(మిగతాది 55వ పేజీలో...)*

# తెలంగాణలో రోజురోజుకు పెరుగుతున్న విస్తాపిత సమస్య

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న ప్రాజెక్టులు, ఇతర నిర్మాణాలు, ఓపెన్‌కాస్ట్ గనుల కారణంగా వేలాది మంది నిర్వాసితులు అవుతున్నారు. దక్షిణ తెలంగాణను మందుల కంపెనీలకు, ఉత్తర తెలంగాణను ఓపెన్‌కాస్ట్‌ల పేరిట సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారు. ఇప్పుడు మల్లన్నసాగర్ ముంపు సమస్య పాలకులు సృష్టిస్తున్న నిర్వాసిత సమస్యనే. ఖమ్మం జిల్లాలో హరితహారం పేరుతో అటవీ భూములలో చెట్లు నాటి ఆదివాసులను బతుకునుండి దూరం చేస్తున్నారు.

**మల్లన్నసాగర్ భూసేకరణను** వ్యతిరేకిస్తూ జరుగుతున్న నిరహారదీక్షలు 4వ నెలలో కూడ కొనసాగుతున్నాయి. వారికి సంఘీభావంగా అన్ని రాజకీయ పార్టీలు (టీ.ఆర్.ఎస్. మినహా) అన్ని రకాల ప్రజా సంఘాలు నడుం బిగించాయి. ఉద్యమాన్ని అణచటానికి ప్రభుత్వం కుట్రలు పన్నుతుంది. మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నది. అణచివేత ప్రతిఘటనకు దారి తీస్తుందన్న సత్యాన్ని చాటుతూ వెల్లువెత్తుతున్నది విస్తాపన వ్యతిరేక ఆందోళన.

మల్లన్న సాగర్‌లో నిర్మించే రిజర్వాయర్ నిర్మాణం వలన అక్కడ ముంపుకు గురవుతున్న 21 (14 పెద్ద, 7 చిన్న) గ్రామాల ప్రజలకు ఏ మాత్రం ఉపయోగం లేదు. ఎటువంటి పరోక్ష సంబంధం కూడా లేదు. అది మరెక్కడో ఉన్న ప్రజల డిమాండ్ కూడా కాదు. అలా అని అదేదో ముందునుండి ఉన్న పథకం కూడా కాదు. ఇప్పటికిప్పుడు తక్షణం ప్రజల్ని 2 పంటలు పండుతున్న పచ్చటి భూముల నుండి విస్తారమైన జల సంపద నుండి, అటవీ సంపద నుండి, వందల సం॥లుగా స్థిరపడిన జీవితాల నుండి, స్థిరపడి కొనసాగుతున్న సామాజిక సంబంధాల నుండి, విశాలమైన పర్యావరణ సమతుల్యం నుండి ఒక్కసారిగా ప్రజల్ని నెట్టివేయడాన్ని, ప్రజల జీవితాలతో పాలకులు చెలగాటమాడడాన్ని తెలంగాణ ప్రజలు ముఖ్యంగా స్థానికులు జీర్ణం చేసుకోలేకపోతున్నారు. ప్రభుత్వ విధానాలతో రైతులలో భయందోళనలు నెలకొన్నాయి. చెరువు నీటి నుండి బయటకు విసిరేసిన చేపల్లా, భూమినుండి పెకిలించి వేసిన చెట్లలా వారికి భవిష్యత్ కనబడడం లేదు. అగమ్య గోచరమయిపోయింది.

కే.సీ.ఆర్. ఫాంహౌజ్ ప్రాంతానికి నీరు తీసుకెళ్లడానికి ఈ మల్లన్న సాగర్ నిర్మాణం చేపడుతున్నట్లు స్పష్టమవుతుంది. ఇంకా అక్కడి ప్రజల చర్చలలో అసలు వాస్తవ పరిస్థితి మరింత లోతుగా ఉంది. పాత ప్రణాళిక ప్రకారం తడ్కపల్లి చెరువు 1.5 టీ.ఎం.సీ. ల జలాశయంగా నిర్మాణం కావలసి ఉండగా అది నీటి పారుదల శాఖ మంత్రి (కే.సీ.ఆర్. మేనల్లుడు హరీష్‌రావు) అత్తగారి ఊరు కావడంతో అక్కడ ముంపు లేకుండా చేయడానికి ప్రాజెక్టు స్థలాన్ని ఏటిగడ్డ కిష్టాపూర్ – వేములగట్టు ప్రాంతానికి మార్చడాన్ని ప్రజలు తప్పు పడుతున్నారు. ఇప్పుడు కొత్తగా వేసుకున్న పథకం ప్రకారం ప్రతిపాదిస్తున్న మల్లన్న సాగర్ నీళ్ళు ముఖ్యమంత్రికి చెందిన వందల ఎకరాల భూములు, ఎంతో విలువైన ఫార్మ్‌హౌస్ కు వెడతాయి. ఆ రిజర్వాయర్‌కు ఒక ప్రక్కన ముఖ్యమంత్రి కొడుకు (కే.టీ.ఆర్.) నియోజకవర్గం, ఇంకోక పక్కన హరీష్‌రావు నియోజకవర్గం ఉన్నాయి. ఈ ప్రాంతంలో వారికి సొంతంగానూ, బినామీ పేర్లతోను భూములున్నాయి. వారి ఆశ్రితులకు భూములున్నాయి. ఆ భూములకు నీరందించడం, ఆ భూములను పరిశ్రమలకు అమ్ముకొని సొమ్ము చేసుకోవడం, ఇంకా ఆ పరిశ్రమలకు నీరు అందించడం కోసం ఈ ప్రాజెక్టు తలపెట్టారని అందరూ భావిస్తున్నారు. కే.సీ.ఆర్. దీర్ఘకాల పథకంతో సొంత ప్రయోజనాల కోసం మార్చినదే ఈ రీడిజైనింగ్ అంటున్నారు.

వివరమైన ప్రాజెక్టు నివేదిక (డీ.పీ.ఆర్.) లేకుండా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడం అంటే కాంట్రాక్టులు, కమీషన్ల కోసమేననేది స్పష్టమే అని కూడా అంటున్నారు. ఈ ప్రాజెక్టు రీడిజైనింగ్ వలన ప్రజలపై 50 వేల కోట్ల రూ॥ల భారం అధికంగా పడుతుందని, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి ఆ గ్రామాల్లో భూములను గుంజుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టుల ఖర్చులు పెంచుతున్నారు. పాలకులు నిర్వాసితులకు మాత్రం నష్టపరిహారం పెంచడం లేదు. వారి జీవనాధారం గురించి ఆలోచించడం లేదు అంటూ ఆందోళన చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జలయజ్ఞం పేరుతో తలపెట్టిన అనేక నీటి పారుదల పథకాలతో జరిగినది జలయజ్ఞం కాదనీ, 1 లక్షా 86 వేల కోట్ల రూ॥ల మాయఅని 2012 లోనే బహిరంగమయ్యింది. పెట్టుబడుల అనుమతలు లేకుండానే 24 ప్రాజెక్టులు ప్రారంభించారు. వాటిలో 21 ప్రాజెక్టులకు అటవీశాఖ, 18 ప్రాజెక్టులకు పర్యావరణ శాఖల నుండి అనుమతుల్లేవు. 4 ప్రాజెక్టులకు అసలు సాధ్యతా అనుమతులే లేవు. 16 ప్రాజెక్టులకు కేంద్ర జలసంఘం అనుమతుల్లేవు అని 'కాగ్' అనే రాజ్యాంగబద్ధ సంస్థ చెప్పింది. ఏ పనీ జరగకుండానే సగం నిధులు అంటే 90 వేల కోట్ల రూ॥లు రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు తినేసారు. అటువంటి జలయజ్ఞ కొనసాగింపుగానే నేడు కే.సీ.ఆర్. ఆ

కాంట్రాక్టర్లను మార్చకుండా డిజైన్ మార్చి, పేరు మార్చి, ఖర్చును విపరీతంగా పెంచి తన కుటుంబ స్వప్రయోజనాలు, తన వర్గానికి చెందిన ఆంధ్ర, తెలంగాణ కాంట్రాక్టర్ల ప్రయోజనాలు నెరవేర్చుకోవాలని చూస్తున్నాడు.

ప్రాణహిత-చేవేళ్ళ ఎత్తిపోతల పథకంపై ఎల్లంపల్లి దిగువన మల్లన్నసాగర్ వంటి భారీ రిజర్వాయర్లు కొత్తగా నిర్మించాల్సిన అవసరం లేదని సాంకేతిక నిపుణులు సశాస్త్రీయంగా వివరిస్తున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మల్లన్నసాగర్ లాంటి 50 టీ.ఎం.సీ.ల నీటి నిల్వ స్థాయిలో నిర్మాణాన్ని చేపట్టడాన్ని టీ.హనుమంతరావు లాంటి సీనియర్ ఇంజనీర్లు సమర్థించడం లేదు. ఇప్పటికే ప్రతిపాదించిన రిజర్వాయర్ల ద్వారా నీటిని పంపిణి చేయగలిగితే మెట్ట ప్రాంతానికి కూడా నీరు అందించగలమని వాళ్ళు చెపుతున్నారు. తడకపల్లిని మల్లన్నసాగర్ చేయనవసరం లేదంటున్నారు. అనేక రకాల ప్రత్యామ్నాయాలుండగా సాగుభూముల్ని, పచ్చగా బతుకుతున్న గ్రామ సీమల్ని నీట ముంచాల్సిన అవసరం లేదని అంటున్నారు. 50 టీ.ఎం.సీ.ల భారీ ప్రాజెక్టుల వలన నిర్మాణ వ్యయం పెరగడంతో రిజర్వాయర్ కట్టడాల భద్రతా, నీటిని నిలువ సామర్థ్యాల సమస్య, లోతట్టు ప్రాంతాలకు కలిగే ప్రమాదాలు, నీటి నష్ట శాతం ఇలా అనేక సమస్యలు ఉంటాయంటున్నారు. గోటితో చేసే పనికి గొడ్డలితో నాశనం చేసుకోనక్కరలేదని హితవు పలుకుతున్నారు. సముద్ర మట్టానికి తడకపల్లి చెరువు 1663 అడుగులు (506 మీటర్లు) ఎత్తున వుంది. దానికన్నా మల్లన్నసాగర్ ఇంకా ఎత్తున ఉంది. 70 కి.మీ. దూరం పెంచి 900 అడుగులు ఎత్తు పెంచి అంత ఎత్తున్న రిజర్వాయర్‌లోకి నీరు తెచ్చి నిలువ చేసే పథకం ఆచరణలో అమలు కావడం కష్టం, ఆచరణ సాధ్యం కాదు అంటున్నారు. ఈ పథకం ప్రజల డబ్బును వాటాలు వేసుకు తినే పథకం అని, భూములు లాక్కోని బహుళజాతి సంస్థలకు అమ్ముకునే పథకమని అంటున్నారు.



టీ.ఆర్.ఎస్. ప్రభుత్వం ముంపు బాధితుల నష్టపరిహారం విషయంలో లోగడ ఉన్న విధానాలను అమలు చేయడం లేదు. 2013 చట్టంలో ఉన్న భూమికి బదులు భూమి ఇవ్వడం, పునరావాస కేంద్రాల నిర్మాణం లాంటి ప్రధానాంశాలు ఏవీ పాటించడం లేదు. ఆ ప్రాజెక్టు నిర్మాణం చేస్తే సామాజికంగా కలిగే ప్రభావం, పర్యావరణానికి జరిగే నష్టం, సవివవరమై ప్రాజెక్టు రిపోర్టులు తయారు చేయకుండా, గ్రామసభల్లో చర్చించి తీర్మానాలు చేయకుండా రైతాంగానికి, ఇతర సామాజిక వర్గాలకు నష్టం చేసే విధంగా అన్యాయమైన జీ.వో.123 తెచ్చి బలవంతంగా భూసేకరణ చేస్తున్నారు. ఇందుకు రైతాంగాన్ని చీల్చడం, ఆశ చూపడం, ప్రాజెక్టుతో సంబంధం లేని ప్రాంతాల రైతాంగాన్ని రెచ్చ కొట్టి ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించడం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు కట్టడానికి మంత్రి హరీష్‌రావు నైతికతను పక్కనబెట్టి కుట్ర పద్ధతుల్ని, అణిచివేత విధానాలను దగ్గరుండి అమలు చేస్తున్నాడు. ఎవరి అభివృద్ధికి, ఎవరు త్యాగం చేయాలి? ఇంతకాలం ప్రజలు త్యాగాలు చేస్తే దోచుకు బలిసిన వారికోసం ఇంకా ఎంత కాలం త్యాగాలు చేయాలి? అని మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మెదక్ జిల్లా కొముురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్ పేర జరిగే ప్రాజెక్టు నిర్మాణం వలన తోగుట్ట మండలంలో 11, కొండపాక మండలంలో 10 చిన్న, పెద్ద గ్రామాలు మొత్తం 21 గ్రామాలు ప్రభావితమవుతాయి. 3వేలకు పైగా ఇండ్లు, 20 వేలకు పైగా ఎకరాల సాగు భూమి, ప్రజా జీవితాలు, వారి ఉపాధి, స్థిర చరాస్థులు, వారి భవిష్యత్ అన్ని తీవ్రంగా ప్రభావితమవుతాయి. వేల ఎకరాల అటవీ భూమి, అటవీ సంపద కూడా ముంపుకు గురై పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. మాకు నష్టపరిహారంగా డబ్బులు ఇస్తే సరిపోతుందా? ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, పర్యావరణ పరంగా తాము నష్టపోతున్నాం. సహజమైన ప్రకృతి నుండి, సామాజిక జీవనం నుండి, రాజకీయ కార్యకలాపాల నుండి, విద్యా, విజ్ఞాన, సంస్కృతి, వికాసాల నుండి గెంటి వేయబడుతున్నాం. మేం మరో చోట స్థిరపడినా అది పరాయిపంచన బతకడమే కదా అంటున్నారు. తమ బతుకులు వలస కూలీల, వేతన శ్రామికుల పరిస్థితికి దిగజార్చుతున్న పాలకుల మీద ఆగ్రహావేశాలతో ప్రజలు పోరాటాల్లోకి కదులుతున్నారు.

**ఓపెన్‌కాస్ట్ విధ్వంసం**

1990ల నుండి తవ్విన ఓపెన్‌కాస్ట్‌ల వలన తెలంగాణ బొందలగడ్డగా మారింది. ప్రజలు సాగు భూములను, నివాస స్థలాలను, ఉపాధిని కోల్పోయారు. అనేక మంది ప్రజలు జబ్బుల బారిన పడ్డారు. తెలంగాణ వస్తే ఓపెన్‌కాస్ట్ గనులు ఉండవని నమ్మి అన్ని రకాల విబేధాలను విడిచి కలిసి కట్టుగా పోరాడి తెలంగాణను సాధించుకున్నారు. ఇప్పుడు మరో 14 ఓపెన్‌కాస్ట్

గనులు తవ్వకం మొదలయ్యింది. 'ఇక్కడే గుడిసేసుకొని, కుర్చీ వేసుకుని కూర్చుంటాను. నేను బతికుండగా ఓపెన్‌కాస్ట్‌లను కానివ్వను' అన్న కేసీఆర్ ఎన్నికల మాట, టీ.ఆర్.ఎస్. మానిఫెస్టోలోని అంశాలన్నీ నీటి మూటలయ్యాయి. సమైక్య రాష్ట్రంలోని కష్టాలే ఇప్పుడూ కొనసాగుతున్నాయి. ఇప్పుడు మరిన్ని కొత్త ప్రాంతాలకు విస్తరించాయి. పర్యావరణ పరిరక్షణ ఇప్పుడు హరితహారం పేరుతో మొదలై అటవీ భూముల్ని, మిగిలిన పంట భూముల్ని, ఆదివాసుల నివాస గ్రామాల్ని దురాక్రమించడంగా మారి పోయి మరోసారి నిర్వాసిత జనాభాను పెంచుతుంది. పాలకులు ఎవ్వరైనా ఒకటేనని, తెలంగాణ వచ్చినా ప్రజల బతుకులు మారలేదని గతంలో కోస్తా వాళ్లు చేసిందే ఇప్పుడు తెలంగాణ పాలకులు 'బంగారు తెలంగాణ' పేరిట ప్రజలను ఘోష పెడుతున్నారు. ఓపెన్‌కాస్ట్‌లున్న ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలలోని 5 పార్లమెంటు స్థానాలు, 10 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసిన రాజకీయ పార్టీల నాయకులందరూ ఓపెన్‌కాస్ట్‌లు రద్దు చేస్తాం అన్నారు. ఎన్నికలయ్యాక ప్రజల్ని బోడి మల్లయ్యలను చేసారు. ఓపెన్‌కాస్ట్‌లకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలను అరెస్టులు చేసి దొంగ కేసుల్లో ఇరికిస్తున్నారు.

తెలంగాణలో సింగరేణి కోల్ బెల్ట్ బొగ్గు దోపిడీకి గురవుతుంది. వందలాది గ్రామాలు, వేలాది కార్మికులు, లక్షలాది ప్రజల జీవితాలు మసకబారాయి. 35 భూగర్భ గనులు, 17 ఉపరితల గనుల ద్వారా 2015 నాటికి 52.54 మిలియన్ టన్నుల బొగ్గును వెలికి తీసింది సింగరేణి కోల్‌బెల్ట్. 2016 సంవత్సరానికి 60 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం నిర్ణయించుకుని మరో 14 ఓపెన్‌కాస్ట్‌లను అదనంగా ప్రారంభించింది.

ఓపెన్‌కాస్ట్‌ల వల్ల భూగర్భంలో నీటి నిలువ శాతం తరిగిపోయింది. దీనివలన భూకంపాలు వస్తున్నాయి. దట్టమైన అడవులు నాశనమయ్యాయి. పర్యావరణం దెబ్బతిన్నది. ప్రజల ఆరోగ్యాలు క్షీణించాయి. ఇలా ఎన్నో రకాల సమస్యలున్నా గాని ప్రజల ఘోషను ప్రభుత్వం వినదు. అధ్యయన నివేదికల్లో ప్రజల జీవితాలకు కలిగే నష్టం వివరించినా పట్టించుకోరు పాలకులు. ప్రజల్ని నివాస స్థలాల నుండి తరిమికొట్టి, కాదంటే చావు అంచుల్లోకి నెట్టేసారు. స్థానిక సంపదను సామ్రాజ్యవాదులకు దోచిపెట్టడంలో అన్ని రాజకీయ పార్టీలవారు పోటీ పడి ముందుంటున్నారు.

ఇప్పుడు ప్రతీ ఓపెన్‌కాస్ట్‌కు భారీ యంత్రాలు తెచ్చారు. 25 కోట్ల నుండి 250 కోట్ల రూ॥లకు మైనింగ్ ఖర్చును పెంచారు. 3 వేల మంది కార్మికులు పని చేసే చోట కేవలం 250 మందికి పనిని కుదించారు. వేలాది కార్మికులను తొలగించారు. సింగరేణిలో ఒకప్పుడు 1 లక్ష 17 వేల మంది కార్మికులుండేవారు. ఇప్పుడు కేవలం 58,837 మంది అంటే 50శాతం కార్మికులను తొలగించారు.

ఒక్కో ఓపెన్‌కాస్ట్‌ను దాదాపు 12 వేల ఎకరాల విస్తీర్ణంలో 400 మీటర్ల లోతు తవ్వుతారు. దీని వలన సుమారు 20 కి.మీ. పరిధిలో భూగర్భ జలాలు అడుగంటిపోతాయి. 1 టన్ను బొగ్గుకు 10 క్యూబిక్ మీటర్ల (10×1 1/2 టన్నుల మట్టి) మట్టిని అంటే 15 టన్నుల మట్టిని తొలగించవలసి ఉంటుంది. కొన్ని చోట్ల మండలాలే (ఉదాహరణకు తాడిచర్ల మండలం. తాడిచర్లలో 2 ఓపెన్‌కాస్ట్‌లున్నాయి) లేకుండా పోయే ప్రమాదం ఉంది. ఆ కారణంగా కూడా ఆయా మండలాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

తెలంగాణ కొత్త రాష్ట్రంలో టీ.ఆర్.ఎస్. ప్రభుత్వం కార్మిక వ్యతిరేక ధోరణిని, సింగరేణి మేనేజిమెంట్ అనుకూల వైఖరిని అనుసరిస్తున్నది. 700 రోజులుగా వి.ఆర్.ఎస్. కార్మికులు నిరసన దీక్షలు చేస్తున్నా పరిష్కరించడం లేదు. మీరు ముందుగా రిటైరైతే మీ పిల్లలకు సింగరేణిలో ఉద్యోగాలు దొరుకుతాయని సింగరేణి యాజమాన్యం నమ్మబలకడంతో వేలది మంది కార్మికులు ఉద్యోగ విరమణ చేసారు. 2,800 మంది కార్మికులు తమ పిల్లలకు ఉద్యోగాలు రాకపోవడంతో వారి భవిష్యత్‌కోసం ఆరాటపడుతున్నారు. పోరాటాలు చేపడుతున్నారు. 1981 నాటి చారిత్రక సమ్మె ఫలితంగా సింగరేణి కార్మిక సమాఖ్య సాధించిన విజయం ద్వారా కార్మికుల పిల్లలకు ఆనాడు ఉద్యోగాలు లభించాయి. తెలుగుదేశం ప్రభుత్వం జాప్యం చేసినపుడు 1998లో కార్మికులు పోరాడి మరల పిల్లలకు ఉద్యోగాలు సంపాదించుకున్నారు.

1998 నుండి సింగరేణి యాజమాన్యం జీ.వో.ల మీద జీ.వో.లు విడుదల చేస్తూందే తప్ప వీ.ఆర్.ఎస్. తీసుకున్న కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు కల్పించలేదు. గుర్తింపు పొందిన కార్మిక సంఘాలతో లోపాయికారి ఒప్పందం చేసుకుని వీ.ఆర్.ఎస్. కార్మికులు 2 లక్షల రూ॥లతో సరిపెట్టుకోవాలని బలవంతం చేస్తున్నారు. బెదిరిస్తున్నారు. కాదని పోరాటాలు చేస్తున్న కార్మికుల కుటుంబాలపై అణచివేత చర్యలను చేపట్టారు. ఇప్పుడున్న సమస్య పరిష్కారానికి టీ.ఆర్.ఎస్. పార్టీ కార్మికులకు ఇచ్చిన వాగ్దానాన్ని గాలికి వదిలి వేయడంతో మందమర్రి సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు 700 రోజులుగా (అక్టోబర్ 8, 2014 నుండి) కార్మికులు నిరసన దీక్షలు కొనసాగించారు. 4 జిల్లాల వీ.ఆర్.ఎస్. కార్మికుల ఉమ్మడి పోరాటం చివరకు విజయవంతమయ్యింది. డిపెండెంట్ కార్మికుల పిల్లలకు ఉ

ద్యోగాలివ్వడానికి టీ.ఆర్.ఎస్. ప్రభుత్వం అంగీకరించింది.

**హరితహారం పేరుతో** ఆదివాసుల భూములు స్వాధీనం చేసుకుంటున్న తెలంగాణ ప్రభుత్వ విధానాలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాలలో అటవీ భూభాగం ఎక్కువ. ఇక్కడ ఆదివాసీ ప్రజలు అధిక సంఖ్యలో జీవిస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో పోడు వ్యవసాయ విధానం అమలులో ఉంది. లక్షల సంఖ్యలో ప్రజల జీవన విధానంగా ఉన్న పోడు వ్యవసాయాన్ని నేరంగా భావించడం, అదే పర్యావరణ విధ్వంసానికి ప్రధాన కారణంగా చూపి ఆదివాసీ రైతాంగాన్ని పూర్తిగా ఆ భూముల నుండి ఖాళీ చేయించడం చేస్తున్నది ప్రభుత్వం

ఖమ్మం జిల్లాలో ఇల్లెందు, టేకులపల్లి, చంద్రుగొండ, కొత్తగూడెం మండలాలలో ఫారెస్టు డిపార్ట్‌మెంటు పోలీసుల సహకారంతో ఆదివాసీ రైతాంగాన్ని భూముల నుండి ఖాళీ చేయించి పంట భూములను, అడవిని ట్రాక్టర్లు, బుల్‌డోజర్లతో నాశనం చేస్తున్నారు. ప్రభుత్వ చర్యలను అడ్డుకుంటున్న ప్రజలపై లాఠీచార్జీ చేస్తున్నారు. మహిళలను జుట్టుపట్టి గుంజుతున్నారు. బట్టలు చింపివేస్తున్నారు. అడవిలో ఆదివాసీ పంట పొలాల్లో యుద్ధ బీభత్సాన్ని సృష్టిస్తున్నారు. అక్కడ ఉద్యమిస్తున్న ప్రజల్ని అరెస్టు చేసి పీ.డీ. చట్టం, ఆయుధాల చట్టం క్రింద నేరారోపణ చేసి జైలుకు పంపిస్తున్నారు. హరితహారం పేర లక్షల సంఖ్యలో జామాయిల్ (నీలగిరి), ఈతచెట్లు నాటి భూమి సారాన్ని నాశనం చేయాలని చూస్తున్నారు.

ఇప్పటికే రాష్ట్రంలో లక్షలాది ఎకరాల అటవీ భూములు, సాగు భూములు ప్రభుత్వం స్వాధీనం చేసుకుని సెజ్ లను ఏర్పరిచింది. మరల ఇప్పుడు ఆదివాసుల సాగుభూములను కబ్జా చేస్తున్నది ప్రభుత్వం. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు.

జాతీయ అటవీ విధానం ప్రకారం 33 శాతం అటవీ ప్రాంతం ఉంటే చాలు. పర్యావరణ సమస్య ఉన్న చోట కొత్తగా మొక్కలు నాటాలి. కానీ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోనే అత్యధికంగా అడవి ఉన్న ఖమ్మం జిల్లాలో హరితహారం పేరుతో వేలాది ఎకరాలలో అడవులు నరికి, పంట భూములు నాశనం చేసి కొత్తగా మొక్కలు నాటడాన్నిఏ విధంగా అర్థం చేసుకోవాలి. ఖమ్మం జిల్లా సగం (48.9 శాతం) అటవీ ప్రాంతమే. ఆ తర్వాత ఆదిలాబాద్‌లో 44.9 శాతం అటవీ భూమి ఉంది. మహబూబ్‌నగర్, వరంగల్, కరీంనగర్‌లలో అడవులున్నాయి. మిగిలిన జిల్లాలలో అడవులు తక్కువ. అక్కడ హరితహారం అంటే ఎవరైనా హర్షిస్తారు. అటవీ భూములను హరితహారం పేరుతో ఆక్రమించి, పోడు వ్యవసాయం చేసే ఆదివాసీ రైతాంగాన్ని సాగు భూముల నుండి ఖాళీ చేయించడం వెనుక పాలకవర్గాల కుట్ర ఉంది. ఆ భూముల్లో విలువైన ఖనిజ సంపద ఉంది. ఆ సంపదను కాజేయడానికి, ఆ భూములను బహుళ జాతి సంస్థలకు అమ్ముకోవడానికి చేస్తున్న కుట్ర తప్ప మరొకటి కాదు.

**ఎవరు అభివృద్ధి నిరోధకులు? ఎవరు పర్యావరణ విధ్వంసకులు? భూముల్లో పంటలు పండించి ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేసే ఆదివాసులా? పంట పొలాల్ని, అడవులను విధ్వంసం చేసే పాలకులా?**

మల్లన్నసాగర్ కోసం పదుల గ్రామాలను, అడవిని, వేల ఎకరాల పంట భూములను నీట ముంచడం పర్యావరణం రక్షించడానికేనా? అండర్‌గ్రౌండ్ మైనింగ్ ఎక్కువ ఖర్చుతో కూడినదని యంత్రాలు తెచ్చి ఓపెన్‌కాస్ట్‌ల ద్వారా బొందల గడ్డగా తెలంగాణను మారుస్తున్న పాలకులు చేస్తున్నది పర్యావరణ పరిరక్షణా? రాష్ట్రాభివృద్ధా? ఎవరు అభివృద్ధి చేస్తున్నారు? ప్రజల్ని పీడించి, హింసించి పచ్చని బతుకుల నుండి దూరం చేసి బహుళజాతి సంస్థలకు రాష్ట్రంలోని సర్వ సంపదలను, శ్రమశక్తిని కారు చౌకగా అమ్ముకునే పాలకులు ప్రకృతి విధ్వంసకులు, సమాజ అభివృద్ధికి వినాశకులు.

కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాలు రెండూ తెలంగాణకు అన్యాయం చేశాయన్న కే.సీ.ఆర్. కూడా అధికారంలోకి వచ్చిన 2 సం॥లలో అదే మార్గంలో తెలంగాణ ప్రజలకు అన్యాయం చేస్తున్నాడు. కే.సీ.ఆర్. అధికారంలోకి వచ్చాక విస్థాపన సమస్య అనేక రెట్లు పెరిగింది. పాలకవర్గాల విధ్వంసకర, అభివృద్ధి నిరోధక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలకు మద్దతుగా నిలబడదాం. భుజం భుజం కలిపి పోరాడుదాం. భూమి, భుక్తి సమస్యలకు విముక్తి లక్ష్యంగా జరిగే నూతన ప్రజాస్వామిక విప్లవమే పరిష్కారం అని గుర్తిద్దాం. అంతిమ విజయం ప్రజలదే. ○

**క్రాంతిని ఈ సైట్లో చూడొచ్చు, డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 2006 నుంచి అన్ని సంచికలు, 1994-2004 మధ్య కాలంలో వెలువడిన కొన్ని సంచికలు కూడా ఇందులో వున్నాయి.**

http://www.bannedthought.net/India/Kranti/index.htm

# సీ.పీ.ఐ. (మావోయిస్టు) 12వ వార్షికోత్సవాలను దేశవ్యాప్తంగా విప్లవోత్సాహంతో జరుపుకుందాం!

**ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!**

మనం మన పార్టీ 12వ ఆవిర్భావ వార్షికోత్సవాలను గొప్ప ఉత్సాహంతో జరుపుకోబోతున్నాం. మన పార్టీకి, విప్లవ ప్రజానీకానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన రోజు సెప్టెంబర్ 21. 12 యేండ్ల క్రితం 2004 సెప్టెంబర్ 21 నాడు దేశంలోని రెండు ప్రధాన విప్లవ ప్రవంతులు విలీనమై భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆవిర్భవించింది. పార్టీ ఆవిర్భావ దినాన్ని పురస్కరించుకొని మన కేంద్రకమిటీ పార్టీ శ్రేణులన్నింటికీ, ప్రజా విముక్తి గెరిల్లా సైన్య కమాండర్లకూ, యోధులకూ, పార్టీ సానుభూతిపరులకూ, నూతన ప్రజాస్వామిక ప్రజా ప్రభుత్వాల నాయకత్వానికీ–సభ్యులందరికీ, విప్లవ ప్రజాసంఘాలకూ, ఉద్యమ ప్రజానీకానికీ హార్థిక విప్లవాభినందనలు తెలుపుతున్నది. మన పార్టీ నేతృత్వంలో దేశంలో సాగుతున్న ప్రజాయుద్ధానికి అంతర్జాతీయ స్థాయిలో మద్దత్తును కూడగట్టే ఉద్యమాన్ని నిర్వహిస్తున్న వివిధ దేశాల మావోయిస్టు పార్టీలకూ, సంస్థలకూ ఈ సందర్భంగా మన సిసి హార్థిక విప్లవాభినందనలు తెలుపుతున్నది.



మన పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న విప్లవోద్యమంలో దేశవ్యాప్తంగా పార్టీ 11వ వార్షికోత్సవాల నుండి ఇప్పటి వరకు 150 మందికి పైగా మన ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలు తమ విలువైన ప్రాణాలను అర్పించారు. వీరిలో స్పెషల్ ఏరియా/స్పెషల్ జోన్/రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్స్ చిరాగ్ (పూర్వీ బీహార్–పూర్వోత్తర్ ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా), వసంత్ (ఒడిశా), లచ్చన్న (ఎస్‌జడ్‌సి ఆల్టర్నేట్ సభ్యుడు, డికె) వంటి రాష్ట్ర స్థాయి పార్టీ నాయకత్వం నుండి సాధారణ సభ్యుల వరకూ, డివిజనల్ కమిటీ కార్యదర్శి కామ్రేడ్ రవి (ఈస్ట్ డివిజన్, ఏఓబి), జోనల్/డివిజనల్ కమిటీ సభ్యులు కామ్రేడ్స్ సతీష్ (దక్షిణ్ జోన్, బిజె), రమ (సీంద్రి లింగో, కళింగనగర్ డివిజన్, ఒడిశా), సునీల్ (మాడ్ డివిజన్, డికె), రజిత (ఉత్తర గడ్చిరోలి డివిజన్, డికె), సోనీ (దక్షిణ బస్తర్, డికె), పిఎల్‌జిఏ ప్లాటూన్ కమాండర్ల నుండి ప్రజా మిలీషియా సభ్యుల వరకూ, విప్లవ ప్రజా ప్రభుత్వాల, ప్రజా సంఘాల నాయకత్వం నుండి సాధారణ ప్రజల వరకూ ఉన్నారు. నక్సల్‌బరీ సాయుధ రైతాంగ విప్లవోద్యమం నుండి నేటి వరకూ అమరులైన వేలాది మంది వీరయోధులందరినీ సంస్మరించుకుంటూ, మనంతో భుజం–భుజం కలిపి ప్రజాయుద్ధ సమరాన శత్రువుతో సాహసోపేతంగా పోరాడుతూ ఆశయ సాధనలో ఈ సంవత్సర కాలంలో అసువులు బాసిన వీరయోధులందరినీ మన పార్టీ 12వ ఆవిర్భావ వారోత్సవాల సందర్భంగా పేరు పేరునా స్మరించుకుంటూ వినమ్రంగా తలవంచి జోహార్లర్పిద్దాం.

ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేసే లక్ష్యంతో వివిధ దేశాలలో మావోయిస్టు పార్టీలు, సంస్థలు, గ్రూపుల నాయకత్వంలో సాగుతున్న ఉద్యమాలలో నేలకొరిగిన వీరయోధులకూ, మన దేశ విముక్తికై సాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవానికీ, మన పార్టీకీ సన్నిహితంగా ఉంటూ విప్లవ విజయాన్ని కోరుకుంటూ తుదిశ్వాస విడిచిన కామ్రేడ్ బిడి శర్మ వంటి మిత్రులకూ, కామ్రేడ్ బొజ్జా తారకం వంటి నిజమైన ప్రజాస్వామికవాదులకూ మన సిసి విప్లవ జోహార్లు అర్పిస్తోంది.

పార్టీ 11వ స్థాపనా వార్షికోత్సవాల తర్వాత గత 10 నెలల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల, ప్రజావ్యతిరేక సామాజిక, ఆర్థిక, రాజకీయ, సైనిక, సాంస్కృతిక, పర్యావరణ విధానాలకు వ్యతిరేకంగా, ప్రత్యేకించి సామ్రాజ్యవాదుల దన్నుతో ఫాసిస్టు పాలకవర్గాలు అత్యంత దుర్మార్గంగా, క్రూరంగా అమలు చేస్తున్న ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా మన పార్టీ నాయకత్వాన పార్టీ క్యాడర్లు, పిఎల్‌జిఏ పోరాట యోధులు, విప్లవ ప్రజా కమిటీలు, విప్లవ ప్రజాస్వామిక సంస్థలు, దేశ ప్రజలు, ప్రత్యేకించి ఉద్యమ ప్రాంతాల ప్రజలు కొనసాగించిన ప్రతిఘటనా యుద్ధంలో నేలకొరిగిన వీరుల త్యాగాలు అత్యంత విలువైనవీ, త్యాగపూరితమైనవీ, ఆదర్శనీయమైనవీ, అనుసరణీయమైనవీ. వీళు అసమానత, వివక్ష, మనిషిని మనిషి దోచుకునే వీలులేని ఒక నూతన, న్యాయమైన సమాజం కోసం తమ అమూల్యమైన ప్రాణాలు ధారపోశారు. మన పార్టీ 12వ స్థాపనా వార్షికోత్సవాల సందర్భంగా అమరవీరులు చూపిన బాటలో ముందుకు సాగుతామనీ, ఒక నూతన ప్రపంచ సాధన కోసం వారి ఆశయ పరిపూర్తికై దృఢసంకల్పంతో, త్యాగనిరతితో సాహసోపేతంగా పోరాడుతామనీ బిగిపిడికిళ్లెత్తి ప్రతిన బూనుదాం. అమరుల బంధుమిత్రులకు ప్రగాఢ సంతాపం తెలుపుతూ వీరందరికీ మా పార్టీ అండగా ఉంటుందని కేంద్రకమిటీ హామీ ఇస్తోంది.

ప్రజాయుద్ధంలో గాయపడిన మన సహయోధులు త్వరగా కోలుకొని వీరంతా తిరిగి విప్లవోద్యమంలో క్రియాశీలంగా పనిచేస్తారని మన సిసి ప్రగాఢంగా విశ్వసిస్తోంది. ఈ అమరుల త్యాగాల ఫలితంగా సాధించిన విజయాలను మన పార్టీ 12వ స్థాపనా వార్షికోత్సవాల సందర్భంగా పార్టీ శ్రేణులు, పిఎల్‌జిఏ బలగాలు, విశాల ప్రజారాసుల ముందుంచి, ప్రజాయుద్ధంలో వారందరి క్రియాశీల, సమరశీల పాత్రను పెంపొందించడానికి కృషి చేద్దాం.

డికె-బిజెలను విముక్తి ప్రాంతాలుగా మార్చడంలో భాగంగా పిఎల్‌జిఏను పిఎల్ఏగా, గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా పెంపొందించే కేంద్ర కర్తవ్య సాధన కోసం, పార్టీనీ, ఉద్యమాన్నీ, ప్రజలనూ-విప్లవ ప్రజా ప్రభుత్వాలను కాపాడుకోవడానికి దోపిడీ పాలక వర్గాల పోలీసు, అర్ధ సైనిక బలగాలతో మరిన్ని విజయాలు సాధించడం కోసం మన పార్టీ నాయకత్వంలో ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం పోరాడుతున్నది. మరోవైపు ప్రజల మనసులను, హృదయాలను గెలుచుకునేందుకు ఎల్ఐసీ వ్యూహంతో శత్రు బలగాలు వివిధ రూపాల్లో రాజ్యహింసనూ, తెల్ల బీభత్సాన్నీ కొనసాగిస్తున్నాయి. గ్రామాలపై, ప్రజలపై పెద్దెత్తున దాడులు చేస్తూ ప్రజల్ని ఊచకోతలు కోయడం, మహిళలపై అత్యాచారాలు చేయడం, ప్రజల ఆస్తులనూ, పంటలనూ ధ్వంసం చేస్తున్నాయి. ప్రజల్లో చీలికలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ప్రజల్లో నూతన ప్రజాస్వామిక, సమ సమాజ ఆకాంక్షలు, సమిష్టితత్వం లేకుండా చేయడం కోసం వారిపై ఉక్కుపాదాన్ని మోపుతున్నాయి. ఉద్యమ ప్రాంతాల్లో రాజ్య ఉగ్రవాదాన్ని, పోలీసు రాజ్యాన్ని బయట ప్రపంచం దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించిన స్వతంత్ర పత్రికా విలేకరులపై 'మావోయిస్టు' ముద్ర వేసి అక్రమంగా కుట్ర కేసులలో వారిని ఇరికించి అరెస్ట్ చేయడం, తరిమివేయడం చేస్తున్నాయి. ఆపరేషన్ గ్రీన్ హంట్‌లో భాగంగా శత్రు బలగాలు సాగిస్తున్న ఈ విప్లవ ప్రతీఘాతుక యుద్ధాన్ని మన పార్టీ నేతృత్వంలో ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం విప్లవ ప్రజానీకం మద్దతుతో వివిధ ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్ల ద్వారా ఎదుర్కొంది. కాలా పహాడ్ (పలామూ, ఝార్ఖండ్), దబ్బకుంట (సుక్మ, ఛత్తీస్‌గఢ్), మాలేవాడ (దంతేవాడ, ఛత్తీస్‌గఢ్), చక్కర్‌బాంధా (ఔరంగాబాద్, బీహార్) వంటి చోట్ల చెప్పుకోదగిన స్థాయిలో శత్రు బలగాలను దెబ్బతీసింది. వందలాది చిన్న, మధ్యస్థాయి, పెద్ద చర్యలను నిర్వహించడం ద్వారా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణా, ఏఓబి, ఝార్ఖండ్, పశ్చిమ బంగ్, పశ్చిమ కనుమలు మొదలైన అన్ని రాష్ట్రాలలో పిఎల్‌జిఏ యోధులు తమ ప్రతిఘటనను కొనసాగిస్తున్నారు. ఈ సంవత్సర కాలంలో పిఎల్‌జిఏ సాగించిన ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్లు, చర్యల్లో దేశవ్యాప్తంగా వివిధ గెరిల్లాజోన్లు, ఎర్రప్రతిఘటనా ప్రాంతాల్లో 60 మందికి పైగా పోలీసులు మరణించగా, సుమారు 140 మంది పోలీసులు గాయపడ్డారు.

మన పార్టీ చేపట్టిన రెండేళ్ల బోల్షెవీకరణ (అధ్యయన - అన్వయింపు) కేంపెయిన్ ఆశించిన దిశలో ఒక మేరకు సత్ఫలితాలను ఇస్తున్నదనీ ఆయా స్థాయిల పార్టీ కమిటీలు తమ తమ పార్టీ ప్లీనాలలో సమీక్షించాయి. కొన్ని చోట్ల ఆ కేంపెయిన్‌ను మరో యేడాది కాలం పెంచుకోవాలన్న నిర్ణయాలు జరిగాయి. ఈ యేడాది కాలంలో ప్రధానంగా ఉన్నత స్థాయి నాయకత్వ శ్రేణులు తమ సిద్ధాంత, రాజకీయ స్థాయిని పెంచుకోవడానికి, వేగంగా మారుతోన్న పరిస్థితులకు తగిన విధంగా తాము బోల్షెవీకరణ చెందడానికి వినియోగించుకోవాలని నిర్ణయించుకున్నాయి. ఇందులో భాగంగానే సామాజిక పరిశోధన జరపాలని నిర్ణయించుకున్నాయి. గత దశాబ్ద కాలంలో ఉత్పత్తి సంబంధాలలో చోటుచేసుకున్న పరిణామాలను తులనాత్మకంగా అధ్యయనం చేయడానికి క్షేత్ర స్థాయిలో పూనుకున్నారు. తాము సేకరించుకున్న క్షేత్ర స్థాయి వర్గ విశ్లేషణ నివేదికలను నాయకత్వ శ్రేణులు సమిష్టిగా చర్చించాయి. విప్లవోద్యమ ప్రాంతాలలోని ప్రజల జీవన ప్రమాణాలు గత పదేళ్లలో మెరుగయ్యాయనే అంచనాకు వచ్చాయి.

2011 నుండి దండకారణ్యంలో మన పార్టీ నిర్మిస్తోన్న వివిధ స్థాయిల విప్లవ ప్రజా కమిటీల (క్రాంతికారీ జనతన సర్కార్ల) నాయకత్వంలో భూమి 'సమతలీకరణ-మళ్ల నిర్మాణం-సాగునీటి సౌకర్యం కల్పించి ఉత్పత్తిని పెంచే' సహకార ఉద్యమం నడుస్తోంది. ప్రతి యేటా ఈ కేంపెయిన్ 15-20 రోజులు నడుస్తోంది. క్రాంతికారీ జనతన సర్కార్లు పని చేస్తోన్న ప్రాంతంలో ఇది వర్గ ప్రాతిపదికపై కొనసాగుతూ ఒక విప్లవ సంప్రదాయంగా మారి ప్రజల హృదయాలను గెలుచుకుంది. 2016 జనవరి-ఫిబ్రవరి మాసాలలో ఈ కేంపెయిన్‌ను దెబ్బతీయడానికి పోలీసు, అర్ధ సైనిక బలగాలు తీవ్రమైన దాడులకు పూనుకున్నాయి. పని స్థలాలపై పోలీసులు కాల్పులు జరిపి ఇద్దరు గ్రామస్థులను హత్య చేసి, ఇద్దరని గాయపర్చారు. అయినప్పటికీ, విప్లవ ప్రజానీకం పట్టుదలతో తమ కేంపెయిన్‌ను ప్రజా రాజ్యాధికార దినం (ఫిబ్రవరి 10) నాటికి పూర్తి చేసుకొని తమ లక్ష్యాలను సాధించుకున్నారు. తీవ్రతరమైన దాడుల మధ్య కూడా సగటున రోజుకు లక్షన్నర మంది స్త్రీ-పురుష రైతాంగం ఈ కేంపెయిన్‌లో పాల్గొనడం దాన్ని ప్రజా స్వభావాన్ని తెలియజేస్తున్నది. ఈ కేంపెయిన్ ఒడిశా, ఏఓబీ, ఇతర ఉద్యమ ప్రాంతాలలో కొనసాగుతున్నది.

గత కొద్ది సంవత్సరాలుగా విప్లవోద్యమానికి ఎలాంటి వనరులు అందకుండా చేయడానికి శత్రువు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. అయినప్పటికీ మన జనతన సర్కార్లు గత మూడేళ్లలో (2013, 2014, 2015) వ్యవసాయం, ప్రజల విద్య, ప్రజా వైద్యం, జనతన సర్కార్ల రక్షణ, కుటీర పరిశ్రమలపై ప్రధానంగా కేంద్రీకరించాయి. అలాగే అరెస్టయిన వారి విడుదల, అడవుల పెంపకం-సంరక్షణ, కుటుంబాలకు ఆర్థిక సహాయం లాంటి ప్రజా అవసరాలపై జనతన సర్కార్లు దృష్టి పెట్టాలి. గత రెండేళ్లుగా మన పోరాట ప్రాంతాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్న ప్రాంతాల ప్రజలను ఆదుకోవడానికి విప్లవ ప్రజా సంఘాలు, విప్లవ ప్రజా కమిటీలు కరువు సహాయక చర్యలు చేపట్టాయి. వీటికి తోడు అన్ని సెక్షన్ల ప్రజల నుండి ముఖ్యంగా ఉద్యోగస్థుల, ప్రజాస్వామికవాదుల, విప్లవ సానుభూతిపరుల నుండి వివిధ రూపాలలో చందాలు సేకరించి కరువు పీడిత ప్రజలకు పంపిణీ చేస్తున్నాయి.

విప్లవోద్యమ ప్రాంతాలలో ముఖ్యంగా తూర్పు, మధ్య భారతదేశంలో లక్షలాది ప్రజలను, ప్రత్యేకించి ఆదివాసులను నిర్వాసితులను చేసే గనుల తవ్వకాలు, పెద్ద డ్యాములు, అభయారణ్యాలు, మెగా స్టీల్ ప్లాంట్లు, థర్మల్ విద్యుత్ ప్లాంట్లు, ఓపెన్ కాస్ట్ గనుల తవ్వకాలు, రైలు మార్గాల నిర్మాణం వంటి

అనేక భారీ పరిశ్రమల కోసం టాటా, ఎస్సార్, మిత్తల్, జిందల్, నెకో, వేదాంత, పోస్కో తదితర బహుళజాతి కంపెనీలు, కార్పొరేట్ ఘరానాలతో కలిసి కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు కుదుర్చుకున్న వందలాది ఎంఓయులకు వ్యతిరేకంగా, ఇందుకోసం ఈ ప్రాంతాలలో మోహరించిన వేలాది సాయుధ బలగాలకు వ్యతిరేకంగా ప్రజా ప్రతిఘటనోద్యమాలు తీవ్ర స్థాయిలో కొనసాగుతున్నాయి. వీటి ఫలితంగా ఇందులో అనేక ఎంఓయులు అమలుకాకుండా నిలిచిపోయాయి. దక్షిణ భారతదేశంలోని తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాల సరిహద్దులలో విస్థాపన వ్యతిరేక ఉద్యమాలు ఊపిరి పోసుకుంటున్నాయి. దేశంలో నిర్వాసిత సమస్య ప్రజల అస్తిత్వ సమస్య, ముఖ్యంగా అటవీ ప్రాంతాలలోని మూలవాసుల జీవన్మరణ సమస్య. అంతిమంగా ఇది భూమి సమస్యే! అందుకే మోదీ ప్రభుత్వం ముందుకు తెచ్చిన ప్రజావ్యతిరేక భూ సేకరణ చట్టాన్ని ఉపసంహరించుకునేలా చేసేందుకు దేశవ్యాపితంగా ప్రజలు క్రియాశీలంగా ఉద్యమించారు. అందువల్లనే విస్థాపన వ్యతిరేక ఉద్యమాలను దెబ్బతీయడంలో భాగంగా ఒడిశాలో ప్రభుత్వ కిరాయి సాయుధ బలగాలు ప్రజలను క్రూరంగా హత్య చేస్తున్నాయి. ఈ ప్రజా పోరాటాలకు విశాల ప్రాతిపదికపైన ప్రజాహిత శక్తులతో, సంస్థలతో కలిసి మన పార్టీ నాయకత్వం వహిస్తోంది.

మన విప్లవోద్యమ ప్రాంతాలలో ఈ సంవత్సర కాలంలో ప్రజాస్వామిక సంస్థలు, మత మైనారిటీ, దళిత, ఆదివాసీ ప్రజలు బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా సమైక్యంగా ముందుకు వస్తున్నారు. రాజ్యం అండతో కాషాయ ఉగ్రవాదం (సంఘ్ ముఠా) భారత రాజ్యాంగం రూపొందించిన అన్ని చట్టాలకు అతీతంగా, బహిరంగంగా తన ఆధిపత్య హత్యా రాజకీయాలను కొనసాగించడాన్ని విప్లవ ప్రాంతాలలోని ప్రజలు సహించడం లేదు. మరోవైపు దేశవ్యాప్తంగా బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా విద్యార్థులు, కార్మికులు, మహిళలు, విప్లవ రచయితలు, కళాకారులు, గాయకులు, అభ్యుదయ పాత్రికేయులు ప్రజలను జాగృతులను చేయడం కోసం కృషి చేస్తున్నారు. ఈ ఉద్యమాలకు మన పార్టీ అండగా నిలిచింది. వాటిని సమైక్య ఉద్యమాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నది.

భారత దోపిడీ పాలకవర్గాలు దేశ అంతర్గత భద్రతకు మావోయిస్టులే అతిపెద్ద ప్రమాదమని దశాబ్దం క్రితమే ప్రకటించాయి. మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలలోని ప్రజలపై యుద్ధాన్ని ప్రకటించాయి. దేశంలోని 16-17 రాష్ట్రాల్లో దాదాపు ఐదు లక్షల పోలీసు, అర్ధ సైనిక బలగాలను మోహరించాయి. ఆకాశంలో డ్రోన్‌లు, రెండు డజన్లకు పైగా వాయుసేన హెలికాప్టర్లు ఉద్యమ ప్రాంతాల గగనతలంపై పహరా కాస్తున్నాయి. 2015 చివరి నాటికి విప్లవోద్యమ ప్రాంతాలపై వైమానిక దాడులకు కేంద్రం అనుమతిచ్చింది. భారత విప్లవోద్యమంపై ప్రభుత్వ దాడిలో దీనిని ఒక మలుపుగానే చెప్పుకోవాలి. వాయుసేనకు చెందిన గరుడ కమాండోలు వైమానిక దాడుల రిహార్సల్స్‌ను కొనసాగిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. పోలీసులు పోరాట ప్రజలను బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చి చంపడం పెరిగిపోయింది. మహిళలపై పోలీసు అత్యాచారాలకు అడ్డూ-ఆపూ లేకుండా పోయింది. కిరాయి పోలీసు మూకలు ఉద్యమ ప్రాంతాల్లో తమ చేతికి చిక్కిన ప్రజలను ఒంటికి ఉప్పు, కారం అద్దుతూ తీవ్రమైన చిత్రహింసలకు గురిచేస్తున్నారు. జబ్బలకు తాడుకట్టి వాహనాలకు ముడివేసి రోడ్లపై ఈడ్చుకుపోతున్నారు. మహిళల రొమ్ముల నుండి పాలు పితికి అవమానిస్తున్నారు. దండకారణ్యంలోని దక్షిణ బస్తర్‌లో చిన్న గెల్లూరు, పెద్ద గెల్లూరు, బుడిగిన్, పెగడపల్లి, కున్నా తదితర గ్రామాల్లో మహిళలపై అమానవీయ అత్యాచారాలకు పాల్పడ్డారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ పోలీసు ఐజీ ఎస్‌ఆర్‌పీ కల్లూరి నాయకత్వంలో కేంద్ర, రాష్ట్ర కమాండో, పోలీసు బలగాలు దండకారణ్యంలోని బస్తర్ ప్రాంతంలో పాశవిక చర్యలకు పాల్పడుతున్నాయి. పోలీసులు అరెస్టు చేసిన వారి వివరాలైనా సంబంధీకులకు చెప్పడం లేదనీ ఆమ్నెస్టీ తప్పుపట్టినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడమే లేదు. ఈ ఫాసిస్టు చర్యలకు వ్యతిరేకంగా గత కొంత కాలంగా దేశంలోను, అంతర్జాతీయంగాను ప్రజాస్వామికవాదులు కదులుతున్నారు. దేశంలోని మేధావులు, ప్రజాస్వామిక శక్తులు, పౌర-మానవహక్కుల కార్యకర్తలు, ఆదివాసీ హితోభిలాషులు, పాత్రికేయులు, రచయితలు, న్యాయవాదులు, మహిళా సంఘాలు, భాజపా మినహా స్థానికంగా పని చేస్తున్న వివిధ పార్లమెంటరీ రాజకీయ పార్టీలు ఈ చర్యలను ఖండిస్తూ, నిజ నిర్ధారణ రిపోర్టులతో ప్రజల ముందుకు వస్తుంటే రమణ్‌సింగ్, మోడీలు, వారి పోలీసులు భరించలేకపోతున్నారు. ఆమ్‌ఆద్మీపార్టీ నేత్రి సోనీసోడీపై పోలీసు గూండాలు భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. నక్సల్ డీజీ డీఎం అవస్థి ప్రజల పక్షాన నిలుస్తోన్న యావత్తు శక్తులనూ మావోయిస్టు శక్తులుగానే పేర్కొంటూ తమ పోలీసు బలగాల మనోబలాన్ని దిగజార్చడానికే వీరంతా తప్పుడు ప్రచారం చేస్తున్నారని కొట్టిపారేస్తున్నాడు. ఇంతే గాదు, పోలీసు చర్యలను తీవ్రంగా తూర్పారబడుతూ తన పరిధిలో వారించిన సుక్మా జిల్లా సెషన్స్ జడ్జ్ ప్రభాకర్ గ్వాల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం కోర్టు తీర్పులు వెలువరించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగం నుండి తొలగించింది. తన ప్రాణాలకు ఈ పోలీసు వ్యవస్థ నుంచి ముప్పు పొంచి వుందని ఆయన ప్రజల ముందుకు వచ్చాడు.

ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బీహార్, ఝార్ఖండ్, పశ్చిమ బంగ్, అసోం, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, కేరళ, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో పోరాట ప్రాంతాలంతటా రాజ్యహింస, తెల్ల బీభత్సం మున్నెన్నడూ లేని స్థాయిలో కొనసాగుతోంది. ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశ ప్రజాహిత శక్తులను ఐక్యం చేయడానికి కావలసిన భౌతిక ప్రాతిపదికను ఏర్పరుస్తున్నది. దీనిపై ఆధారపడి ఈ సంవత్సర కాలంలో కార్మికులు, రైతాంగం, విద్యార్థులు, మహిళలు, విప్లవ మేధావులు, ప్రజాస్వామిక, దేశభక్తయుత, ప్రజాహిత శక్తులతో, ఆదివాసీ శ్రేయోభిలాషులతో సమైక్యమవుతూ ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు

వ్యతిరేకంగా ప్రజా ప్రతిఘటనా ఉద్యమాలను, ప్రజా ఉద్యమాలను నిర్మించేందుకు పార్టీ కృషి చేసింది.

భారత పాలక వర్గాలు ముఖ్యంగా గత రెండేళ్లుగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ముసుగులో అధికారంలో వున్న బ్రాహ్మణీయ హిందూ మతోన్మాద శక్తులు మరోమాటలో రాజ్య ఉగ్రవాదం, 'కాషాయ ఉగ్రవాదం' సామ్రాజ్యవాదుల దన్నుతో దేశంలోని విప్లవోద్యమంపై అత్యంత దూకుడుగా క్రూరంగా దాడి చేస్తున్నాయి.

ప్రపంచ ప్రజల నెంబర్ వన్ శత్రువు అమెరికా సామ్రాజ్యవాదం మున్నెన్నడూ లేని రీతిలో ఇంటా-బయటా తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నది. అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచంలోనే అత్యధిక రుణగ్రస్త దేశంగా 20 లక్షల కోట్ల డాలర్ల అప్పుల ఊబిలో కూరుకుపోయింది. ప్రపంచ పోలీసుగా అమెరికా తన ప్రపంచ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి ప్రపంచంలోని 70 దేశాలలో ముఖ్యంగా వ్యూహాత్మక ప్రాంతాలలో ఏటా వంద బిలియన్ డాలర్లను వెచ్చిస్తూ లక్షలాది అమెరికా సైనికులతో వందలాది సైనిక కేంద్రాలను (మిలటరీ బేసులు) నిర్వహిస్తూ అనేక దేశాల ప్రజల ఆక్రోశానికి గురవుతోంది. అంతర్జాతీయంగా తనకు పోటీదారుగా ముందుకు వస్తున్న చైనాను దెబ్బతీయడానికి అమెరికా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. దక్షిణ చైనా సముద్రంలో ఉద్రిక్తతలను కొనసాగించడానికి పలు సైనిక చర్యలను చేపట్టింది. ఉత్తర ఆఫ్రికా, పశ్చిమాసియా ప్రాంతంలోని దాదాపు 20 పైగా అరబ్బు దేశాలలోని సహజ సంపదలను కొల్లగొట్టడానికి అమెరికా, చైనా, రష్యాలతో పాటు వివిధ సామ్రాజ్యవాదుల మధ్య పోటీ పెరుగుతున్నది. ఈ ప్రాంతంలో ప్రజల పరిరక్షణ, నియంతలను గద్దె దింపడం, 'ఉగ్రవాద' గ్రూపులను నియంత్రించే పేరుతో అమెరికా, ఫ్రాన్స్, నాటో సైన్యాలు ఏళ్ల తరబడిగా యుద్ధ జ్వాలలలో ఆ దేశాలను ధ్వంసం చేస్తున్నాయి. 2011 నుండి సిరియాలో కొనసాగుతున్న యుద్ధంలో ఐక్యరాజ్యసమితి ఇస్తున్న అంచనాల ప్రకారం ఇప్పటికే మూడు లక్షలకు పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఆ యుద్ధంలో సామ్రాజ్యవాద దేశాలు అనుసరిస్తోన్న విధానాల మూలంగా లక్షలాది సిరియావాసులు శరణార్థులుగా యూరప్‌కు వలస వెళ్లక తప్పడం లేదు. ఆ క్రమంలో వారు అనేక బాధలు అనుభవిస్తున్నారు. ఎందరెందరో మధ్యధరా సముద్రంలో జరుగుతున్న ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోతున్నారు. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్, పాలస్తీనా, యెమన్, ఇరాక్, లిబియా, సోమాలియా, సిరియా, ఫిలిప్పైన్స్ దేశాలలో అమెరికాతో పాటు సామ్రాజ్యవాద దేశాలు కొనసాగిస్తున్న డ్రోన్ దాడులలో వందలాది మంది పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ రకంగా అమెరికా అనుసరిస్తున్న విధానాల మూలంగా అది రోజు రోజుకూ ప్రపంచ ప్రజల ఆగ్రహానికి మరింత తీవ్రంగా గురవుతున్నది.

అమెరికా అంతర్గతంగా అనేక సమస్యలతో సతమతమవుతోంది. ప్రజా సంక్షేమ నిధులపై పెద్ద ఎత్తున కోత విధించక తప్పడం లేదు. దేశంలో అన్ని సెక్షన్ల ప్రజలు తమ సమస్యలపై సమ్మెలకు దిగుతున్నారు. నాలుగు కోట్ల మంది (దాదాపు 12 శాతం) ప్రభుత్వ ఆహార కూపన్‌లపై బతుకులు వెళ్లదీస్తున్నారు. ఉద్యోగుల వేతనాలు చెల్లించడానికి కొన్ని సందర్భాలలో ప్రభుత్వం కొత్త అప్పులు చేయాల్సి వస్తోంది. అమెరికాలో శతాబ్దాలుగా నివసిస్తోన్న ఆఫ్రికా జాతి ప్రజలు తీవ్ర వివక్షకు గురవుతున్నారు. ఒక్క 2015లోనే అక్కడ దాదాపు 600కు పైగా నల్ల జాతి పౌరులను పోలీసులు హత్య చేశారు. నల్లజాతి ప్రజలు అక్కడ ప్రతీకార జ్వాలలతో రగిలిపోతున్నారు. అమెరికా పోలీసు అధికారులపై వారు సాయుధ దాడులకు కూడా దిగుతున్నారు. అక్కడి వివక్షతను ఖండిస్తూ అమెరికా ప్రజలు వేల సంఖ్యలో అనేక పట్టణాలలో ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఈ రకంగా అమెరికా సమాజంలో ప్రజల అశాంతి నానాటికి తీవ్రతరమవుతోంది.

ఇతర సామ్రాజ్యవాద, పారిశ్రామిక దేశాల పరిస్థితి కూడా అమెరికా కన్నా మెరుగ్గా ఏమీ లేదు. గ్రీసు రుణ సంక్షోభం నుండి బయటపడలేకపోతోంది. ఫ్రాన్స్‌లో కార్మికుల సమ్మెలు ఒకవైపు, ఐఎస్ఐఎస్ పోరాటకారుల దాడులు మరోవైపు సాగుతూ ప్రభుత్వ విధానాలు ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నాయి. నిరుద్యోగం, పెన్షన్ నిధుల కోత, ప్రజా సంక్షేమ నిధుల కోతతో ప్రజలు సతమతమవుతున్నారు. యూరోపియన్ యూనియన్ నుండి బ్రిటన్ బయటకి రావడం అక్కడి ప్రజల ఆకాంక్షలను వ్యక్తం చేస్తున్న మాట ఎంత నిజమో ఆ సమాజంలో పెరుగుతున్న మితవాద శక్తుల ప్రాతినిధ్యాన్ని అది వ్యక్తం చేస్తోంది. యూరప్‌లోనూ ప్రజలు తమ సమస్యలపై సంఘటితం కావడం, పోరాటాలకు పూనుకోవడం పెరుగుతోంది.

ఫలితంగా ప్రపంచ సామ్రాజ్యవాద వ్యవస్థ సంక్షోభం మరింత తీవ్రతరమవుతూ, సామ్రాజ్యవాద శక్తుల మధ్య తీవ్ర ఘర్షణకు దారితీస్తూ, ఇది ప్రపంచ మార్కెట్‌ను పునర్విభజించే పోటీని మరింత తీవ్రతరం చేయక తప్పదు. సామ్రాజ్యవాదుల మధ్య జరిగే ఈ పోటీ కార్మికవర్గం, పీడిత ప్రజలు, పీడిత జాతుల్లోని విప్లవ శక్తులలో మరో వెల్లువకు అనుకూల పరిస్థితుల్ని సృష్టిస్తుంది.

సామ్రాజ్యవాద దేశాలలో 2008 నుండి ఎడతెరిపి లేకుండా కొనసాగుతోన్న ఆర్థిక, ద్రవ్య సంక్షోభం మన దేశం సహా ప్రపంచ దేశాలన్నింటినీ అతలాకుతలం చేస్తూ తీవ్ర సామాజిక అశాంతిని సృష్టిస్తున్నది. దీని ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా పెంపొందుతున్న కార్మికవర్గం, పీడిత ప్రజలు, పీడిత జాతుల ఉద్యమాలను, ప్రజలను, ప్రజా రాజకీయాలను అణచివేసేందుకై సామ్రాజ్యవాదులు ఫాసిజం, మతం, దేశభక్తిలను కలగలపి ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో వున్న హిందుత్వ శక్తులు ఒకవైపు సాంస్కృతిక జాతీయవాద ఉన్మాదాన్ని రెచ్చగొడుతూ ఫాసిస్టు చర్యలకు పాల్పడుతూ, మరోవైపు సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను ఈడేర్చడానికి విజన్-2020ని అమలు చేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేస్తున్నాయి.

గతంలో భాజపా నాయకత్వంలో ఎన్‌డీఏ కూటమి కేంద్రంలో అధికారం చెలాయించినపుడు 'షైనింగ్ ఇండియా' అన్నట్లుగానే మోదీ గద్దెనలంకరించిన మరుక్షణం నుండి 'మేక్ ఇన్ ఇండియా' అనే ప్రచారాన్ని లంకించుకున్నారు. మోదీ అండ్ కో విజన్-2020లో భాగంగా స్మార్ట్ సిటీ, స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, ముద్రా యోజన, డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా తదితర పథకాలను ముందుకు తెచ్చింది. వీటిని శక్తివంతంగా అమలు చేయడానికి మోదీ యావత్ భారతదేశ ఆర్థిక వ్యవస్థనే రూపుదిద్దే లక్ష్యంతో సామ్రాజ్యవాదుల, బడా దళారీ బూర్జువా, భూస్వాముల ప్రయోజనాలను నెరవేర్చే లక్ష్యంతో ప్లానింగ్ కమిషన్ స్థానంలో 'నీతి' (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రాన్స్‌ఫర్ ఇండియా-భారత పరివర్తనా జాతీయ సంస్థ) ఆయోగ్‌ని ఏర్పర్చింది. ఈ నిధులతో రూపొందించిన ప్రణాళికలలో విడదీయరానివే 'మావోయిస్టు విముక్తి ప్రణాళికలు'. ఈ ప్రణాళికల నిధులను మన పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న విప్లవోద్యమాన్ని అణచివేయడం కోసం ఉపయోగిస్తున్నారు. మోదీ ఇప్పటికి 40కి పైగా దేశాలల్లో పర్యటించి ఆ దేశ నాయకులతో మన దేశ సంపదలను చిత్తానుసారం కొల్లగొట్టడానికి వందలాది అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నాడు. మోదీ అధికారంలోకి వచ్చాక భారత ఆర్థిక వ్యవస్థను అమెరికా సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థకు బలంగా కట్టివేయడమనేది వేగంగా జరుగుతోంది.

కేంద్రంలో భాజపా అధికార పగ్గాలు చేపట్టాక దేశంలోని హిందూత్వ శక్తులు తమ చిత్తానుసారంగా వ్యవహరిస్తున్నాయి. దేశంలోని ఏ మతం వారైనా 'హిందూ సంప్రదాయం జాతి వారసత్వం' అని నిర్ద్వంద్వంగా ఒప్పుకొని తీరాలని తీవ్ర ఒత్తిడిని తీసుకు వస్తున్నాయి. విద్యను కాషాయీకరణ చేయడమనేది చాలా కాలంగా భాజపా పాలిత రాష్ట్రాలలో కొనసాగుతున్నది. ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ పాలించిన గుజరాత్ రాష్ట్రంలోని పాఠశాలల్లో సావర్కర్ సిద్ధాంతాలను బోధించడంలో భాగంగా 'భారతీయుల నాగరికతకు వైదిక హిందూత్వమే మూలం' అంటూ ఐదో తరగతి పిల్లలకు చెబుతున్నారు. పదో తరగతి పిల్లలకు ఈ దేశంలోని వర్ణ వ్యవస్థ 'ఆర్యులు ప్రసాదించిన గొప్ప వరం" అని చెబుతున్నారు. హిందూత్వ భావజాలాన్ని ప్రచారం చేయడానికి సంఘ్ అనుబంధ సంస్థ విద్యా భారతి తీవ్రంగా కృషి చేస్తున్నది. గత రెండేళ్లుగా ప్రభుత్వ అధికారాన్ని, వివిధ సంస్థలను, వేదికలను ఉపయోగించుకుంటూ విద్యను కాషాయీకరణ చేయడంలో హిందూత్వశక్తులు నిమగ్నమయ్యాయి. చిన్నారుల మెదళ్లలోకి తప్పుడు వ్యాఖ్యానాలతో కూడిన చరిత్రను చొప్పిస్తూ భావితరాలను కరడు గట్టిన బ్రాహ్మణీయ భావజాలంతో ముంచెత్తుతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలో ఈ ప్రమాద తీవ్రత రోజు రోజుకూ మరింతగా పెరుగుతోంది.

దేశ జనాభాలో 40 శాతంగా ఉన్న దళితులు, ఆదివాసీలు, మత మైనార్టీలతో బ్రాహ్మణవాదాన్ని ఆమోదింపజేయడానికి కాషాయశక్తులు వీరిపై ప్రాణాంతక దాడులు జరుపుతున్నాయి. రాజ్యం నీడలో హత్యాకాండ పెచ్చరిల్లుతున్నది. ఇతర మతాలలోకి పోయిన వారిని 'ఘర్‌వాపసీ' తంతు ద్వారా హిందువులుగా మార్చడానికి దాడులు చేస్తున్నారు. ఇందుకోసం 'సంఘ్ పరివార్'లో భాగంగా అనేక సంఘాలు పని చేస్తున్నాయి. ఎప్పటికప్పుడు నూతనంగా మరెన్నో పుట్టుక వస్తున్నాయి. ఇవన్నీ 'సామాజిక సుహృద్భావం' నినాదాన్ని ఎత్తుకుంటున్నారు. కేంద్రంలో మోదీ, మహారాష్ట్రలో దేవేంద్ర ఫడ్నవీస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి బీఆర్ అంబేద్కర్‌ను ఆకాశానికి ఎత్తుతూ వారే దళితుల ఉద్ధారకులుగా తెగ ప్రచారం చేస్తున్నారు. గుజరాత్‌లో అగ్రవర్ణాలు చేసిన దాడులకు వ్యతిరేకంగా దళితులు రాష్ట్రవ్యాప్తంగా సంఘటితమై సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం ఆందోళన సాగిస్తున్నారు. దేశవ్యాప్తంగా అన్ని సెక్షన్ల ప్రజలు ఈ దాడులను ఖండిస్తూ తీవ్ర నిరసనను తెలుపుతున్నారు. గుజరాత్‌లో దళిత రచయితలు ప్రభుత్వ అవార్డును తిప్పికొట్టడం ప్రారంభమైంది.

దేశంలోని ఆదివాసులను హైందవీకరించే ప్రక్రియ దీర్ఘకాలంగా సాగుతున్నది. అడవుల నుండి వారిని తరిమివేసే చర్యలు తీవ్రమయ్యాయి. మోదీ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ రంగాలను సంపూర్ణ ప్రైవేటీకరణ చేస్తున్నట్టే అడవులను కూడా అమ్మకానికి పెట్టే ప్రక్రియ చేపడుతోంది. దేశంలోని ఆదివాసులను ఉద్దేశిస్తూ భారత రాజ్యాంగంలో రాసుకున్న షెడ్యూల్‌లను, తర్వాతి కాలంలో ఆయా ప్రభుత్వాలు ముందుకు తెచ్చిన ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం, పెసా, నూతన అటవీ చట్టం, ఛోటానాగపూర్ కాస్తకారీ కానూన్ వంటి వాటిని వర్తమాన ప్రభుత్వాలు తుంగలో తొక్కుతూ 30 సంవత్సరాలుగా స్థిరపడిన ఆదివాసీయేతరులకు ఆదివాసీలుగా గుర్తింపు నిచ్చే చట్టం (ఝార్ఖండ్) వంటి నూతన చట్టాలను రూపొందిస్తూ, ఆదివాసులను అడవుల నుండి దూరం చేస్తూ సహజ సంపదలను కొల్లగొడుతున్నారు. ఆదివాసీలను తమలో విలీనం చేసుకోవడానికి హిందూత్వ శక్తులు సాంస్కృతిక దాడిని తీవ్రతరం చేశాయి. గుజరాత్‌లో మోదీకి ముందు కాలంలోని ఆదివాసీ చౌదరి, భీల్, గామిత్‌లందరి పేర్ల ముందు ఇప్పుడు హిందూ చేరిపోయింది. ఆదివాసీ పేర్లకు చివరన సర్వత్రా 'రాం' చేర్చబడుతోంది. ఆదివాసీ ప్రాంతాలలో ఏర్పరుస్తోన్న ఆశ్రమ పాఠశాలల్లో హిందూ స్తోత్రాల పఠనానంతరమే భోజనం చేయాల్సి వస్తోంది. ఆదివాసీలను తమ పరివార్‌లో భాగం చేసే లక్ష్యంతో వనవాసి సంఘాలను ఏర్పరుస్తున్నారు. ముస్లింలకు వ్యతిరేకంగా గుజరాత్‌లో కాషాయ బ్రిగేడ్ సృష్టించిన 2002 నాటి ప్రజా మారణకాండలో, 2008లో కందమాల్‌లో (ఆదివాసీ) క్రైస్తవులపై కొనసాగించిన భారీ హత్యాకాండలో ఒక సెక్షన్ ఆదివాసులను విస్తృతంగా వాడుకున్నారు. ఇప్పుడు విప్లవోద్యమం కొనసాగుతోన్న ప్రాంతాలలో సేంద్ర, సల్వాజుడుం సహా కమాండో బలగాలలో ఆదివాసీలను చేర్చుకొని అణచివేత దాడులలో వారిని ముందు పెడుతున్నారు. తాజాగా అర్ధసైనిక బలగాలలో వీరితో ప్రత్యేక బెటాలియన్‌లను ఏర్పర్చాలని ఎన్‌డీఏ ప్రభుత్వం నిర్ణయించింది. దేశవ్యాప్తంగా వీరి చర్యలను ఆదివాసీ ప్రజానీకం వ్యతిరేకిస్తోంది. ఆదివాసీ మేధావులు,

(్రేయోభిలాషులు, ప్రజాస్వామికవాదులు, నిజమైన లౌకికవాదులు ఆదివాసుల పక్షం వహించి వారి పోరాటాలకు అండగా నిలుస్తున్నారు.

దేశంలోని ముస్లిం ప్రజల పట్ల 1947 నాటి దేశ విభజన నుండి హిందూత్వ శక్తులు దాడులు కొనసాగిస్తూనే వున్నవి. గత రెండు సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా పెచ్చరిల్లిన అనేక మత ఘర్షణలకు మూల కారకులు ప్రధానంగా హిందూ మతోన్మాద శక్తులే.

మోదీ గద్దెనెక్కిన తర్వాత గతంలోని హిందూ మతోన్మాద నేరగాళ్లంతా నిర్దోషులుగా కటకటాల నుండి సగర్వంగా బయటికి వస్తున్నారు. సాధ్వీ ప్రజ్ఞా ఠాకూర్ మొదలు గుజరాత్‌లోని 2002 నాటి గుల్బర్గ్ సొసైటీ కేసుపై తాజాగా వెలువరించిన తీర్పులో గజ నేరగాళ్లందరినీ నిర్దోషులుగా వదలిపెట్టడం వరకు 'రాజ్యం' అగ్రకుల, హిందూ మతోన్మాద శక్తులను రక్షిస్తూ వస్తున్నదని ప్రజలకు స్పష్టమైంది.

దేశంలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలు గోమాంసాన్ని నిషేధించాయి. ఈ సాకుతో ఈ మధ్య హిందూ మతోన్మాద శక్తులు తప్పుడు ఆరోపణలతో ముస్లింలపై అనేక చోట్ల తీవ్రమైన దాడులు చేస్తున్నాయి. అనేక మంది ముస్లిం యువతను ఉగ్రవాదులుగా, వేర్పాటువాదులుగా, ఐఎస్ఐఎస్ ఏజెంట్లుగా పేర్కొంటూ తప్పుడు కేసులు మోపుతూ కటకటాల పాలు చేస్తున్నారు. నిజానికి ఈనాడు దేశ అంతర్గత భద్రతకు తీవ్ర ప్రమాదకర శక్తులుగా 'కాషాయ ఉగ్రవాదం' పరిణమించిదన్న వాస్తవాన్ని ప్రజలు గ్రహిస్తున్నారు.

రాజ్యహింసకు నిలయంగా మారిన తూర్పు, మధ్య భారతదేశంలోని విప్లవోద్యమ ప్రాంతాల్లో ప్రజాస్వామ్యాన్ని ఆనవాళ్లు కూడా లేకుండా చేయడానికి రాజ్య ఉగ్రవాదం అత్యంత క్రూరంగా దాడి చేస్తున్నది. బిజెపి నాయకత్వంలోని ఫాసిస్టు మోదీ ప్రభుత్వం మావోయిస్టుల పేరుతో, మావోయిస్టు సానుభూతిపరులనే పేరుతో రాజకీయ ప్రత్యర్థులను నిర్మూలించడం, ప్రజల్లో భయోత్పాతం సృష్టించడం ఈ పోలీసు రాజ్యపు లక్ష్యాలు. రాజ్యహింసను ధ్వంసం చేసి దేశంలో సరైన రాజకీయ ప్రత్యామ్నాయంగా విప్లవోద్యమం బలోపేతమైనప్పుడు ఈ రాజ్యాన్ని కూల్చి నిజమైన ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పగల్గుతాము.

సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గ, బడా భూస్వామ్య వర్గ ప్రయోజనాలను నెరవేర్చుతున్న భారత పాలకవర్గాలు విప్లవోద్యమంపై, ప్రజలపై అమలు చేసే నిర్బంధం, చుట్టివేత-నిర్మూలనా దాడి, తెల్లబీభత్సానికి సంబంధించిన మౌలిక విధానం ఎటువంటిదంటే అది ఏవో కొన్ని మామూలు నిర్బంధ రూపాలకు పరిమితం కాదు. సైద్ధాంతికంగా, రాజకీయంగా దాడి చేయడం దాని రూపాల్లో అత్యంత ముఖ్యమైంది. సైద్ధాంతిక, మానసిక యుద్ధంతో సమన్వయించకుండా అమలు చేసే నిర్బంధం, చుట్టివేత-నిర్మూలనా దాడి, తెల్లబీభత్సాల వల్ల ఆశించిన ఫలితాన్ని వాళ్లు సాధించలేరు.

సామ్రాజ్యవాదులు, వారి తొత్తులైన భారత పాలకవర్గాలు విప్లవకారులపై, ప్రజలపై నిర్బంధాన్ని అమలు చేయడం కోసం, వారిలో భయోత్పాతాన్ని సృష్టించడం కోసం ఎటువంటి పద్ధతులను అనుసరించినా, సైద్ధాంతికంగా ఎటువంటి ఒత్తిడిని తీసుకొని వచ్చినా, వాటి వెనుక లక్ష్యం స్పష్టమే : వారి అధికారాన్ని నిలబెట్టుకోవడం, తమ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ప్రజలు సాగించే పోరాటాన్ని అణచివేయడం, ప్రజా పోరాటాల్ని అంతం చేయడం, తమ అర్ధవలస-అర్ధ భూస్వామ్య వ్యవస్థను ప్రజల చేత ఆమోదింపజేయడం లేదా లొంగివుండేలా చేయడం. వారి ఎల్ఐసి పాలసీ అంతస్సారం ఇదే. ఇందులో భాగంగా వాళ్లు అనేక వైవిధ్యపూరితమైన విధానాల్ని వారు అమలు చేస్తారు. వాళ్లు తమ విధానాల్ని సమర్థవంతంగా అమలు చేయగలుగుతారా లేదా; అవి ఫలితాన్ని సాధిస్తాయా లేదా అనేదానితో సంబంధం లేకుండా - వాళ్లు అమలు చేసే ఈ విధానాలు నిర్ణయాత్మకమైనవి కాజాలవనే విషయాన్ని మాత్రం మనం గట్టిగా చెప్పగలం. ఇందుకు భిన్నంగా, వాళ్లు ఎవరినైతే రూపుమాపాలనుకుంటున్నారో, వారి (విప్లవకారుల, ప్రజల) సైద్ధాంతిక రాజకీయ బలం, పటిష్టమైన వారి విధానాలే నిర్ణయాత్మకంగా ఉంటాయి. వారి వ్యవహార శైలి, దృక్పథాల ద్వారా ఇది స్పష్టంగా కనపడుతుంది. అందువల్ల శత్రు విధానాలు కాక విప్లవకారుల విధానాలే నిశ్చయాత్మకమైనవి.

వర్గ శత్రువులు నిజానికి అంత బలమైనవారు కాదు. ఎందుకంటే ఇది వర్గ యుద్ధం, ఔను! ఇది వర్గ యుద్ధం. ఇది పీడకులకూ, పీడితులకూ; దోపిడిదార్లకూ, దోపిడికి గురయ్యేవారికీ; ధనికులకూ, పేదలకూ; పొట్టనిండిన వారికీ, ఆకలితో అల్లాడేవారికీ; సామ్రాజ్యవాదం, భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గాలకూ కార్మిక-కర్షక తదితర పీడిత-తాడిత ప్రజలకూ మధ్య జరిగే యుద్ధం. ఇది న్యాయానికీ, అన్యాయానికీ మధ్య జరిగే యుద్ధం. వ్యక్తిగత ఆస్తి వల్ల, దోపిడి వల్ల, సమాజం వర్గాలుగా చీలిపోవడం వల్ల ఈ యుద్ధం ఆరంభమైంది. వ్యక్తిగత ఆస్తి, దోపిడి, వర్గాల అంతంతోనే అది అంతమవుతుంది. వర్గాల ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా వర్గ యుద్ధం అనేది ఒక భౌతిక వాస్తవం. వర్గాలు ఈ యుద్ధాన్ని ఆపలేవు. ఈ వాస్తవాన్ని అర్థం చేసుకున్నవారే యుద్ధాల్ని అంతం చేసే వర్గ రహిత కమ్యూనిస్టు సమాజ స్థాపనకై నడుం బిగించి, అందుకు అనుగుణంగా తమ సిద్ధాంతాన్ని, రాజకీయాలను, కార్యాచరణను మలుచుకోగలుగుతారు. వర్గ స్పృహ, వర్గ చైతన్యం అంటే ఇదే. దోపిడి పాలకవర్గాలు, ప్రజా పీడకులు, వారి సాయుధ బలగాలు ప్రతి ఒక్క దశలోనూ "పర్వతాల్ని, అడవుల్ని తుడిచిపెడతాం, నక్సల్స్ రహిత రాజ్యం, మావోయిస్టులు ఎన్నటికీ విజయం సాధించలేరు" అంటూ రంకెలు వేస్తారు. కానీ, అందులో వారు ఎన్నటికీ విజయం సాధించలేరు. ఇందుకు భిన్నంగా విజయం లేదా ఓటమి అనేది అడవుల్లో-పర్వతాల్లో, మైదానాలు-పట్టణాల్లో పోరాడుతున్న పీడిత ప్రజల నిర్ణయాత్మకత, లక్ష్యాలు, ఆకాంక్షలపై ఆధారపడి ఉంటుంది. మాలెమా సిద్ధాంతం ఇది విప్లవాల యుగం అని చెబుతున్నది.

పాలకవర్గాలు సైతం "21వ శతాబ్దం తిరుగుబాట్ల శతాబ్దం"గా పేర్కొంటూ విప్లవాలను అణచివేసేందుకై ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఎందుకంటే వాళ్లు ప్రజలకు ఆకలి, దారిద్ర్యం, అన్యాయం మాత్రమే మిగిల్చారు. వారి దోపిడి ఆర్థిక వ్యవస్థే ఇందుకు మూలకారణం. దీనికి వ్యతిరేకంగా ప్రజలు తిరగబడి తీరుతారని పాలకవర్గాలకు బాగానే తెలుసు. ప్రస్తుత ఆధునిక సమాజంలో వారి "ప్రజాస్వామ్య" ప్రభుత్వాలు ప్రజల్ని పక్కదారి పట్టించేందుకే తప్ప ప్రజల ఏ ఒక్క మౌలిక సమస్యను పరిష్కరించవు. వాటి లక్ష్యం ప్రస్తుత దోపిడి వ్యవస్థను నిలబెట్టడం, పీడిత ప్రజల ఆగ్రహాన్ని, వారు చేపట్టే విప్లవకర హింసను అణచివేయడం. ఇందుకోసం మన మావోయిస్టు ప్రజాశక్తుల బలహీనతలను నిరంతరం అధ్యయనం చేస్తూ వాటిపై ఆధారపడి విప్లవాన్ని దెబ్బతీయాలని చూస్తారు. పాలకవర్గాలకు తమ బలహీనతలు ఏమిటో కూడా తమకు తెలుసు. వాటిని తొలగించుకునేందుకు వారు ప్రయత్నిస్తారు కానీ, అందులో వారు ఎన్నడూ విజయం సాధించలేరు. వారి దోపిడి ప్రయోజనాలే ఇందుకు కారణం. మనకు మన గురించి, మన బలహీనతల గురించి, మనం ఎవరికి వ్యతిరేకంగా పోరాడుతున్నదీ మనకు బాగానే తెలుసు. మన బలహీనతల్ని మనం తప్పక సరిచేసుకోగలుగుతాం. అందువల్లనే వాళ్లు ఎన్నడూ మనల్ని, విశాల ప్రజారాశులను ఓడించలేరనీ, విముక్తి కోసం సాగుతున్న ప్రజాయుద్ధాన్ని అంతం చేయలేరనీ, మనం తప్పక విజయం సాధిస్తామనీ మనం చెబుతాం. భారతదేశంలో సామ్రాజ్యవాదులు, వారి తొత్తులైన బడా భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాలు తమ దోపిడీ, పీడన, అణచివేతలను కొనసాగించడానికి కార్మిక, కర్షక, మధ్యతరగతి పీడిత ప్రజలపై సిద్ధాంత, రాజకీయ, సైనిక, సామాజిక, సాంస్కృతిక రంగాలలో ప్రయోగిస్తున్న బహుముఖ యుద్ధాన్ని ఎదుర్కొనే శక్తి ప్రజాయుద్ధానికే ఉంది. వర్గశత్రువులు ఎంతటి గట్టి యుద్ధాన్ని రుద్దినా, వారిని నిర్మూలిస్తూ, వెనక్కి తరిమే వరకూ, పీడిత ప్రజల విముక్తి సాధించేంత వరకూ ప్రజాయుద్ధం కొనసాగుతూనే ఉంటుంది.

లెనిన్‌ని ఉటంకిస్తూ మావో "పోరాడేందుకూ సాహసించండి! గెలుపు సాధించేందుకు సాహసించండి!" అంటూ ఆయన ఇలా విశదీకరించారు "పోరాడేందుకూ సాహసించడం" మాత్రమే సరిపోదు, "గెలుపు సాధించేందుకు సాహసించడం" కూడా అవసరం. "గెలుపు" సాధించాలంటే మనలో ఒక విలక్షణమైన నిర్ణయాత్మకత, ధైర్యం ఉండాలి. ఇందుకోసం ఒక ప్రత్యేకమైన ఆకాంక్ష అవసరం. విప్లవాన్ని విజయవంతం చేసేవరకూ, అందులోని అంతుచిక్కని విషయాలను, సవాళ్లతో పాటు ముందుకు వచ్చిన ఆకాంక్షల్ని పరిపూర్తి చేసేంతవరకూ, ఈ దోపిడి వ్యవస్థ చితి నుంచి నూతన ప్రజాస్వామిక వ్యవస్థను, ఆ తర్వాత సోషలిస్టు-కమ్యూనిస్టు వ్యవస్థను సృష్టించేంత వరకూ ముందుకు పురోగమించాలి. నిర్ణయాత్మకత, ధైర్యం - ఇవి ఎలా ఉండాలంటే, విప్లవాన్ని విజయవంతం చేసే మార్గాన్ని అంతటినీ చూడగలిగే విధంగా, కోట్లాది ప్రజల జీవితాలను మాత్రమే కాక, నేడు భూతలంపై విలువైన మానవ జీవితపు ఉనికినే ధ్వంసం చేస్తున్న సామ్రాజ్యవాద వ్యవస్థను, భారతదేశం వంటి వెనుకబడిన దేశాల్లోని అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థలను కూలదోసి-తుడిచిపెట్టగలిగే విధంగా ఉండాలి.

భారత విప్లవోద్యమం ఎదుర్కొంటున్న ప్రస్తుత కఠిన పరిస్థితుల్ని అధిగమించేందుకూ, అంతర్జాతీయంగా, జాతీయంగా విప్లవానికి అనుకూలంగా పెంపొందుతున్న అద్భుత పరిస్థితిని వినియోగించుకునేందుకూ రానున్న సంవత్సర కాలంలో ఈ కింది కర్తవ్యాలను చేపడదాం:

★ **ఆపరేషన్ గ్రీన్ హంట్ మూడవ దశను, అందులో భాగంగా సాగుతున్న బస్తర్ మిషన్-2016, సరండా యాక్షన్ ప్లాన్ వంటి పథకాలను ఓడించండి! కేంద్ర కర్తవ్యం అమలులో భాగంగా ప్రజాయుద్ధంలో మరిన్ని విజయాలు సాధించే లక్ష్యంతో పురోగమించండి!**

★ **అన్ని స్థాయిల పార్టీ కమిటీలను బోల్షివీకరణ క్యాంపెయిన్ ద్వారా పటిష్టపరచండి!**

★ **మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం మరియు చారిత్రాత్మక నక్సల్‌బరి సాయుధ తిరుగుబాటుకు చెందిన 50వ వార్షికోత్సవాలను, ప్రపంచాన్ని కుదిపివేసిన రష్యన్ సోషలిస్టు విప్లవ శతాబ్ది వార్షికోత్సవాలను, అంతర్జాతీయ కార్మికవర్గ మార్క్సిస్టు మహోపాధ్యాయులు కార్ల్‌మార్క్స్ ద్వి శతాబ్ది జయంతి ఉత్సవాలను గొప్ప విప్లవోత్సాహంతో, విప్లవ స్ఫూర్తితో నిర్వహించండి!**

★ **నూతన ప్రజాస్వామిక విప్లవ ప్రధాన అంతస్సారంగా ఉన్న విప్లవకర భూసంస్కరణలపై కేంద్రీకరించండి!**

★ **సామ్రాజ్యవాద నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా విస్థాపన తదితర రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యలపై లాల్‌గఢ్, నారాయణపట్నా ఉద్యమాల మాదిరిగా పెద్దెత్తున ప్రజల్ని రాజకీయ ఆందోళనల్లోకి సమీకరించండి! వాటిని ప్రజాయుద్ధంతో జోడించండి! విప్లవ, ప్రజాస్వామిక సంఘాలు, శక్తులు, వ్యక్తులు మరియు విశాల ప్రజారాసులను సమీకరిస్తూ విశాల ప్రాతిపదికన బలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించండి!**

★ **బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా విప్లవ శక్తులను, ప్రజాస్వామికవాదులను, ప్రగతిశీల శక్తులను, సంస్థలను, మైనార్టీ ప్రజలను, లౌకికవాదులను కలుపుకొని బలమైన సమరశీల ఉద్యమాన్ని నిర్మించండి!**

★ **ఆదివాసీ, దళిత, మహిళా, మతపరమైన మైనారిటీల సమస్యలపై కేంద్రీకరించి ఉమ్మడి వేదికలపై ప్రజల్ని సంఘటితం చేస్తూ విశాల ప్రజా ఉద్యమాన్ని నిర్మించండి!**

★ **ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించండి! మానవ హక్కుల్ని తీవ్రంగా ఉల్లంఘించే యూనిఫారంలో ఉన్న శత్రు బలగాలకూ, మఫ్టీలో ఉన్న వారి విప్లవ ప్రతీఘాతక సంస్థలకూ వ్యతిరేకంగా పోరాడండి!**

★ **కశ్మీర్, నాగా, మణిపురీ, అసోం, బోడో తదితర జాతుల విడిపోయే హక్కుతో సహా స్వయంనిర్ణయాధికార హక్కు కోసం జరుగుతున్న పోరాటాన్ని బలపర్చండి!**

★ **ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలకు మద్దతు ఇవ్వండి! వాటి నుంచి భారత విప్లవానికి మద్దతును సమీకరించండి!**

○

ఆంధ్ర-ఒడిశా బార్డర్

# బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఆదివాసీలకు అండగా నిలబడదాం

## జల్, జంగల్, జమీన్, ఆత్మగౌరవం, అధికారంకై పోరాడదాం

విశాఖ మన్యంలో 1990వ సంవత్సరం నుండి దళారీ పాలకవర్గాలు (దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వాములు) బాక్సైట్ గనులు తవ్వాలని ప్రయత్నిస్తున్నప్పటికీ, ఆదివాసీ ప్రజల ప్రతిఘటనతో అది వాయిదా పడుతూ వస్తున్నది. ప్రస్తుతం అరకు, జెర్రల గ్రూపులలో ఉన్న సుమారు 503 మిలియన్ టన్నుల బాక్సైట్‌ను చంద్రబాబు ప్రభుత్వం ఐ.టి.డి.ఎ, గిరిజన సొసైటీల ద్వారా తవ్వించి అన్‌రాక్, రస్‌అల్‌ఖైమా గ్రూపుకు అందించాలని చూస్తున్నది. అలాగే ఎ.పి.ఎమ్.డి.సి (ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్) ద్వారా కూడా తవ్వకాలు జరిపించడానికీ ప్రయత్నిస్తున్నది.

ఇటీవల దీనికి కేంద్రప్రభుత్వం అన్ని రకాల అనుమతులు మంజూరు చేసింది. తదనుగుణంగా రాష్ట్రప్రభుత్వం జీ.వో నెం.97ను జారీ చేసి, బాక్సైట్ తవ్వకాలకు దారి సుగమం చేసింది. ఈ జీ.ఒలో మైనింగ్ పనులు చేపట్టడానికి ఎ.పి.ఎమ్.డి.సికి భూమిని బదలాయింపు చేసే ప్రక్రియ ఉంది. దానితో "ఆదివాసీ ప్రాంతంలో ఆదివాసేతరులకు భూ బదలాయింపు చేసే అధికారం ప్రభుత్వానికి లేదని చెప్పిన **సమతా జడ్జిమెంట్** మరల తెరపైకి వచ్చింది.

ఆదివాసీలు జీవించే హక్కును హరించే బాక్సైట్ తవ్వకాల వలన 4,500 కుటుంబాలు నిర్వాసితులవుతారు. అలాగే అరకు ప్రాంతంలోని చిట్టెంగొంది, రక్తకండి కొండల్లో తవ్వకాలు చేపడితే ఆంధ్ర ప్రజలతో పాటు ఒడిశా ప్రజల జీవితాలు అల్లకల్లోలం కావడం ఖాయం. అరకు ప్రాంతానికి ఆనుకొని వున్న పొట్టంగి బ్లాక్‌లోని 5 పంచాయితీల (నందక, సొంబాయ్, పేటూరు, హంపవల్లి, గొల్లూరు) పరిధిలో వేలాది కుటుంబాలు వీధిన పడతాయి. జర్రెల బ్లాక్‌లో తవ్వకాల వలన మల్కనగిరి జిల్లా కుడుముల గుమ్మ బ్లాక్ పరిధిలోని రోళ్ళగెడ్డ, బోడ్‌పొదర్ పంచాయితీలకు చెందిన 70 గ్రామాల ప్రజలు విస్థాపితులు కానున్నారు. జర్రెల, అరకు బ్లాకులలో బాక్సైట్ తవ్వకాల మూలంగా 1,607 హెక్టార్ల అడవి విధ్వంసం కానుంది. ఎందుకంటే బాక్సైట్ గని పని విధానంలో భూమి పొరలను తలక్రిందులు చేయడం వల్ల ప్రాణికోటి నివాస యోగ్యమైన, సారవంతమైన భూమి పైపొర నాశనమైపోతుంది. సహజసిద్ధమైన సెలయేర్లు, వాగులు, వంకలు, నదులు, తమ దిశను మార్చుకుంటాయి, లేదా నాశనమైపోతాయి. సహజ సిద్ధంగా ఏర్పడ్డ కొండలు, గుట్టలు కనుమరుగైపోతాయి. బాక్సైట్ గనుల్లో తవ్వి తీసిన ఎర్రమట్టి దిబ్బలు మిగులుతాయి. నీటిపారుదల లేక వ్యవసాయం కుంటుబడుతుంది. తాగడానికి గుక్కెడు మంచినీళ్ళు కరువైపోతాయి. అలాగే బాక్సైట్ గనుల కింద పెద్దఎత్తున అడవులు విధ్వంసం చేయడం వల్ల అరుదైన వృక్ష జాతులు, అడవి జంతువులు, విలువైన వనమూలికల ఉనికికి ప్రమాదం ఏర్పడుతుంది. ఒక చోట బాక్సైట్ గని ఉంటే చుట్టూ 25 కి.మీటర్ల పరిధిలో భూగర్భ జలాలు ఇంకిపోతాయి. ఫలితంగా మానవ నివాసయోగ్యం కాని మరుభూమిగా మారిపోతుంది. ఈ అడవుల నుండే ఆదివాసీలు 35 రకాల అటవీ ఉత్పత్తులు తీసుకుంటున్నారు. అవన్నీ ఇప్పుడు పోతాయి. అటువంటి మన్యం మూలవాసుల బతుకుల్లో బాక్సైట్ గనుల విషం చిమ్మబోతోంది. వాళ్ళ బతుకుల్లో టన్నుల కొద్ది మట్టి కొట్టి, వారి అడవుల్లోని సంపదలను దేశ, విదేశీ బహుళజాతి సంస్థలకు కట్టబెట్టడమే నరేంద్ర మోడీ, చంద్రబాబు ప్రభుత్వాలకు పరమావధిగా మారిపోయింది. వాళ్ళ భూముల్లో, అడవుల్లో సంపదలుండటమే నేరమైంది. ఆ సంపదను కాజేయడానికి ఆదివాసీ రక్షణ చట్టాల ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. చంద్రబాబు ఏకంగా 100 పోలీసు ఔట్‌పోస్టులను ఏర్పాటు చేసైనా బాక్సైట్ తవ్వితీరుతామని ప్రకటించి వున్నాడు. ఆదివాసీల సంక్షేమం కోసం పాటుపడవసిన రాజ్యం వారి జీవితాలనే పూర్తిగా అంతం చేసే విధంగా వ్యవహరిస్తుంది.

ఆదివాసీల మనోభావాలకు విఘాతం కలిగించే రీతిలో బాక్సైట్ తవ్వకాలు చేపట్టబోమని, మెజారిటీ ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగానే ప్రభుత్వం నడుచుకుంటుందని, ఎన్నికల్లో వాగ్దానం చేసిన చంద్రబాబు అధికారంలోకి రాగానే మాట మార్చేసాడు. ఎందుకంటే రాష్ట్ర విభజనతో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగిందనీ, రాష్ట్ర భవిష్యత్ అగమ్యగోచరంగా తయారయిందనీ దాన్నుండి గట్టెక్కించాలంటే తప్పకుండా బాక్సైట్ తవ్వి తీరాల్సిందేననీ, మరోమార్గం లేదని ప్రకటించాడు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలంటే, ఆదివాసీలు కూడా ఎంతో కొంత త్యాగానికి సిద్ధం కావాలంటాడు. అభివృద్ధి అంటే ప్రకృతి వనరులు, వృక్షసంపద, జంతుసంపద నాశనం చేయడం కాదు. అలాగే ధనిక వర్గం ఆదాయ అవకాశాలను మెరుగుపర్చడం కోసం పేద ప్రజలను బలిపెట్టడం కాకులను కొట్టి గెద్దలకు వేయడం లాంటిదే. ఆంధ్ర భూస్వామ్య, దళారీ బడా బూర్జువా వర్గాల, కార్పోరేట్ సంస్థల సూపర్ లాభాల కోసం ఆదివాసీలను బలిపశువులను చేయడమే. స్వర్ణాంధ్ర నిర్మాణం మూలంగా లాభపడేది సింగపూర్, జపాన్, అమెరికా వంటి సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలు, దేశీయ బడా పెట్టుబడుదారులు మాత్రమే. స్వర్ణాంధ్ర మూలంగా

ఆర్థికంగానూ, భౌతికంగానూ మన్యం ప్రాంతానికి ఏ మాత్రం ఉపయోగం లేదు. పైగా మన్యం భూములు, అడవులు ధ్వంసం కాబడతాయి. ప్రజలు నిర్వాసితులవుతున్నారు.

ఖనిజ వనరులు వారసత్వ సంపద. అవి ప్రకృతిలో ఎన్నో వేల, లక్షల సంవత్సరాల పరిణామ క్రమ ఫలితంగా ఏర్పడ్డాయి. వాటిని మన పూర్వికులు జాగ్రత్త చేసి కాపాడుకుంటూ మనకు ఇచ్చారు. అట్లాగే మనం కూడా బాధ్యతగా ఇవ్వాలి కదా ! కానీ అభివృద్ధి పేరుతో మన పాలకులు ధ్వంసం చేస్తున్నారు. ఈ పరిణామం మరిన్ని ప్రకృతి విలయాలకు దారి తీస్తుంది. ప్రపంచబ్యాంకు అభివృద్ధి నమూనా అంటేనే విధ్వంసం. ప్రజా జీవనాన్ని కబలించడం, ప్రజా సంక్షేమాన్ని, వారి అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడం, మన్యంలో బాక్సైట్ తవ్వకాల వలన నష్టపోయే ఆదివాసీ ప్రజానీకం ఇందుకు మినహాయింపు కాదు. ఇది ప్రకృతి ప్రళయం కాదు. సహజ ప్రకృతి విధ్వంసం కాదు. ఇది సాక్షాత్తు సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువాలు సృష్టించే మానవ విధ్వంసం. ఈ విధ్వంసంలో నాశనమయ్యే ఆదివాసీ ప్రజల జీవనం, భవిష్యత్తు పాలకులకు పట్టవు.

చంద్రబాబు ప్రభుత్వం బాక్సైట్‌పై శ్వేతపత్రం విడుదల చేసిన విషయం మనకందరికి తెలిసిందే. అంతే కాకుండా గత కాంగ్రెస్ ప్రభుత్వం గనుల కంపెనీలకు లీజుకివ్వడానికి దోహదం చేస్తూ జారీ చేసిన జీ.వో 222ను రద్దు చేస్తున్నామని కూడా ప్రకటించారు. బాక్సైట్ విషయంలో చంద్రబాబు ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలో గనుల తవ్వకం ప్రాంతం చుట్టూ మానవ జీవితం గానీ, వణ్యప్రాణులు గాని లేవని అవాస్తవాలు రాసారు. తెలుగుదేశం నాయకుల కిడ్నాప్ సందర్భంగా చంద్రబాబు ఆదివాసీల అభిమతానికి భిన్నంగా నడుచుకోజాలమని ప్రకటించాడు. కానీ ఆ ప్రకటన తడిఆరక మునుపే బాక్సైట్ తవ్వకాలకు గ్రీన్‌సిగ్నల్ తెలియజేస్తూ, జీ.ఒ నెం. 97ను జారీ చేసారు. అంటే తమ పార్టీ నాయకుల విడుదల కోసమే ఆ ప్రకటన చేసారనేది స్పష్టమవుతున్నది. 1999లో చంద్రబాబు అధికారంలో వున్నప్పుడు రెండుసార్లు, అటు తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వున్న సమయంలో మూడుసార్లు ప్రజాభిప్రాయ సేకరణ జరిపిన సమయంలో మెజారిటీ మన్యం ప్రజలు తమ వ్యతిరేకత నమోదు చేసినప్పటికీ, వాటికి ఏ మాత్రం విలువ ఇవ్వలేదు. పైగా ప్రజల వ్యతిరేకతను అణచడానికి సాయుధ బలగాలను దించి, అక్రమ అరెస్టులు చేసి ఆదివాసీలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. భిన్నాభిప్రాయాలను ఏ మాత్రం సహించలేని ప్రభుత్వం నిజంగా ప్రజల అభిమతానికి అనుగుణంగా నడుచుకుంటున్నట్టా? లేదనే చెప్పవచ్చు. పాలకవర్గాలు ప్రజానీకానికి నీతులు చెబుతున్నాయి. కానీ ఆచరణలో మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాయి. బాక్సైట్ విషయంలో చంద్రబాబు మాట్లాడుతున్న మాటలకూ, ప్రకటనలకు, కార్యాచరణకు పొంతన కుదరటం లేదు.

గతంలో 2014 ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినం రోజు చంద్రబాబు ఆదివాసీలను ఉద్దేశించి "మీరు కొండలు దిగి రండి, మిమ్మల్ని లక్షాధికారులను చేస్తాను" అని మాట్లాడాడు. మరొక మంత్రి అయ్యన్నపాత్రుడు "కొండల్ని చూసుకొని వుంటే మీకు ఒరిగేదేమిలేదనీ, ఆ కొండల్ని తొలచి బాక్సైట్ వెలికితీయడం వలన మీ జీవితాలు మెరుగుపడతాయని" అన్నాడు. ఆదివాసీల జీవితంలో ఇంత విధ్వంసం సృష్టించే బాక్సైట్ తవ్వకాల నిర్ణయానికి, బూర్జువా రాజకీయ పార్టీలన్నీ ఆమోదాన్ని ప్రకటితంగానో, అప్రకటితంగానో తెలిపే వున్నాయి. రివిజనిస్టు పార్టీలైన సి.పి.ఐ, సి.పి.ఎమ్. బాక్సైట్ వ్యతిరేక ఫోజు పెట్టినా చివరకు వాళ్ళనుసరించే వైఖరి కూడా రాజీ ధోరణియే. ఇది అంతిమంగా పాలకవర్గాల ప్రయోజనాలే ఈడేర్చుతుంది.

శ్రీకాకుళం – కోరాపుట్ డివిజన్, నందపూర్ ఏరియా కమిటీ పరిధిలో బాక్సైట్ వ్యతిరేక పోరాట నాయకత్వాన్ని నయానా, బయానా లొంగదీసుకొని డబ్బులు ముట్ట జెప్పి లోబర్చుకునే ప్రయత్నం చేసారు. అంతటితో ఆగక మన పార్టీ నాయకత్వాన్ని నిర్మూలించాలనే కుట్రలో భాగంగా గ్రామాల్లో దళం వస్తే అన్నం, కూరల్లో విషం కలపమని విషం బాటిల్ ఇచ్చారు. ఇది మచ్చుకు మాత్రమే. ఇలాంటి సంఘటనలు బాక్సైట్ వ్యతిరేక పోరాట ప్రభావిత ప్రాంతాల్లో కోకొల్లలు. ఇది ముమ్మాటికీ బాక్సైట్ వ్యతిరేక పోరాటాన్ని నిర్వీర్యం చేయడానికే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నది. మరొకపక్క బాక్సైట్ తవ్వకాలు చేపట్టే వారికి పూర్తి భద్రత కల్పిస్తామనీ, ప్రభుత్వం అనుమతిస్తే మన్యం అంతటా పోలీసు ఔట్ పోస్టులు ఏర్పాటు చేస్తామని విశాఖ జిల్లా ఎస్.పి కోయ ప్రవీణ్ ప్రకటించాడు. అంటే సాయుధ బలగాలతో బలప్రయోగం ద్వారా ప్రజలను అణచిపెట్టి, బాక్సైట్ ఖనిజ సంపదను కొల్లగొట్టేందుకు విశ్వప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బాక్సైట్ గనుల ఖిల్లా కోరుకొండకు ముఖద్వారమైన ఆర్‌జీ కొత్తూరులో పోలీసు ఔట్‌పోస్టు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. అలాగే విశాఖ జిల్లా పెదబయలు ఏరియా పరిధిలోని రూడకోటలో పోలీస్ ఔట్‌పోస్టు నిర్మాణపనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. మదగరువులో మరో పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటుకై ప్రయత్నాలు చేస్తున్నారు. కోరాపుట్ జిల్లా, పొట్టంగి బ్లాక్ పేటూరు వద్ద ఒక బి.ఎస్.ఎఫ్ క్యాంపు ఏర్పాటయ్యింది. అలాగే గొల్లూరు గ్రామ పంచాయితీ పరిధికి చెందిన దిగువ గొల్లూరు వద్ద కూడా బి.ఎస్.ఎఫ్ క్యాంపు ఏర్పాటు చేసారు. పైన పేర్కొన్న పోలీసు ఔట్‌పోస్టుల ప్రతిపాదనలను 18-2-2016న విశాఖపట్నంలో మూడు రాష్ట్రాల

***(మిగతాది 51వ పేజీలో...)***

# వ్యవసాయంలో సంక్షోభానికి, రైతాంగ ఆత్మహత్యలకు దోపిడీ పాలకవర్గాలదే బాధ్యత.

# రైతుల ఆత్మహత్యలకు వ్యవసాయ విప్లవమే పరిష్కారం

భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశం. దేశానికి వెన్నెముక, అన్నదాత రైతు అంటూ పాలకవర్గ పార్టీల నాయకులు ఎన్నో ముఖస్తుతి మాటలు వల్లిస్తున్నారు. వాస్తవంగా రైతుకు కష్టం వస్తే ఆదుకునే దిక్కు లేక ఆత్మహత్య చేసుకొని ప్రాణాలొదులుతున్నారు. దేశవ్యాప్తంగా గత 20 సం॥లలో లక్షలాది మంది రైతులు సాగు భారాన్ని తట్టుకోలేక వీధుల పాలైనారు. దాదాపు మూడు లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ ఒక్క సంవత్సరంలోనే దేశవ్యాప్తంగా 12 వేల 360 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారంటే పరిస్థితి ఎంత దిగజారిందో అర్థమవుతుంది. ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఈ సంవత్సరం అనావృష్టి తోడై పంటలు సరిగా పండక రైతుల ఆత్మహత్యలు పెరిగి పోయాయి. చిన్నపాటి ఒడిదుడుకులను కూడా తట్టుకోలేని దుర్భర పరిస్థితిలో రైతులు నేడు వ్యవసాయం చేస్తున్నారు. రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో జరుగుతున్నాయి. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మారుస్తానన్న ముఖ్యమంత్రి ఆత్మహత్యల్లో రెండో స్థానానికి తీసుకొచ్చి బలవన్మరణాల తెలంగాణగా మార్చాడు.

రైతాంగాన్ని పాలకులు ఎంత సంక్షోభంలోకి నెట్టారనే దానికి దేశ, రాష్ట్ర రాజధానుల నడి వీధుల్లో రైతులు చేసుకున్న ఆత్మహత్యలే సాక్ష్యం. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన రైతు గజేంద్ర సింగ్ (41) ఆమ్ ఆద్మీ పార్టీ నిర్వహించిన భూసేకరణ వ్యతిరేక ర్యాలీలో పాల్గొనడానికి ఢిల్లీ వచ్చి తన ఆవేదనను ఆత్మహత్య రూపంలో వెల్లడించాడు. నిజామాబాద్ జిల్లాకు చెందిన రైతు లింగయ్య (48), మెదక్ జిల్లాకు చెందిన జగ్గోళ్ళ మల్లేశం (58)లు అప్పుల భారం మోయలేక హైదరాబాద్ నడి బొడ్డున ఆత్మహత్యలు చేసుకున్నారు. ఒక వైపు రైతుల ఆత్మహత్యలు నానాటికి పెరిగి పోతుంటే వారికి భరోసా ఇవ్వాల్సిన పాలకులు ఈ ఆత్మహత్యలకు గత ప్రభుత్వ విధానాలే కారణమంటూ బాధ్యత నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వాధికారులతో తప్పుడు రిపోర్టులు తయారు చేయించి ఆత్మహత్యలకు అప్పులు కారణం కాదు అనారోగ్యమే కారణం అంటున్నారు. అవి రైతాంగ ఆత్మహత్యలు కావని రైతులను అవమాన పరిచే వ్యాఖ్యానాలు చేస్తున్నారు. మరో పక్క విపక్షాలు రాజకీయ లబ్ధికోసం ప్రయత్నం చేస్తున్నాయి. తెలంగాణ సమాజం రైతాంగ ఆత్మహత్యల పట్ల తల్లడిల్లి పోతుంటే పాలకులు విదేశీ పర్యటనల్లో మునిగి తేలుతున్నారు.

ఈనాడు వ్యవసాయ రంగం ఇంత సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి దోపిడీ ప్రభుత్వాలు ఆరున్నర దశాబ్దాలుగా అమలు చేస్తున్న విధానాలే కారణం. 1960 దశకంలో వ్యవసాయ ఉత్పత్తిని పెంచే పేరుతో భారత రైతాంగం చైనా విప్లవ ప్రభావానికి గురికాకుండా చేయడానికి దేశంలో హరిత విప్లవాన్ని ప్రారంభించారు. సంకర విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగు మందులు సామ్రాజ్యవాద కంపెనీల ద్వారా దేశంలోకి ప్రవేశించాయి. వీటి వాడకం కోసం ప్రభుత్వం ఇచ్చిన రాయితీలు ప్రధానంగా భూస్వాములు, ధనిక రైతాంగం ఉపమోగించుకున్నారు. ఉత్పత్తి పెరిగిన మాట వాస్తవమే కాని లాభపడింది సామ్రాజ్యవాద కంపెనీలు ప్రధానంగా అమెరికా కంపెనీలు, దేశీయ భూస్వాములు, దళారీ పెట్టుబడిదారులు. సాధారణ రైతాంగానికి హైబ్రిడ్ విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకానికి అలవాటు చేశారు. ఫలితంగా సహజ సిద్ధమైన దేశీయ వ్యవసాయ విధానం, భూసారం దెబ్బ తిన్నది. హరిత విప్లవంలో కూడ రైతులకు భూమి దక్కలేదు. తనకు తెలిసిన వ్యవసాయానికి తాను పరాయి వాడయ్యాడు. సామ్రాజ్యవాద బహుళ జాతి కంపెనీలు, దళారీ నిరంకుశ పెట్టుబడితో కలిసి దేశీయ వ్యవసాయ రంగ వ్యాపారంలో తిష్టవేశాయి. దేశీయ మార్కెట్ పెరగకుండా చేశారు.

ప్రధానంగా 1991 నుంచి కేంద్ర ప్రభుత్వం దేశంలో ప్రవేశ పెట్టిన నూతన ఆర్థిక వ్యవసాయ విధానాలు (సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ) వ్యవసాయరంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టి వేశాయి. సామ్రాజ్యవాద బహుళ జాతి కంపెనీల పెట్టుబడిని దేశంలోకి ఆహ్వానించడానికి తలుపులు బార్లా తెరిచారు. అప్పటి నుండి విదేశీ పెట్టుబడులు మన దేశంలోకి విచ్చల విడిగా వచ్చి స్థానిక వనరులను, వ్యవసాయ ఉత్పత్తులను దెబ్బ తీశాయి. అలాగే సంప్రదాయ విత్తనాలపై దాడి చేశాయి. పంటకు జీవం అయిన విత్తనాలు రైతు చేతిలో లేకుండా పోయాయి. ఈ పెట్టుబడులు ప్రపంచీకరణకు అనుకులంగా వ్యవసాయ రంగాన్ని మార్చి వేశాయి. దీని ఫలితంగా రైతులు అనివార్యంగా బహుళ జాతి కంపెనీలు తయారు చేసిన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులపై ఆధార పడాల్సి వచ్చింది.

ఉమ్మడి వనరు అయిన విత్తనాన్ని సరుకుగా మార్చి మార్కెట్ మయం చేశాయి. అనేక ఇతర విత్తన సంస్థలు ఈ వ్యాపారంలోకి వచ్చి రైతాంగాన్ని భారీగా దోచుకున్నాయి. ప్రధాన పంటల విత్తనాల సరఫరాలో విదేశీ కంపెనీల వాటా 30 నుంచి 80 శాతం పెరిగింది. పత్తి విత్తనాల్లో ఒక్క మోన్‌శాంటో విదేశీ బహుళజాతి కంపెనీ వాటానే 95 శాతం. బహుళజాతి కంపెనీలు రైతుల్ని నిలువు దోపిడీ చేస్తున్నాయి. దీని ఫలితంగా విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల ఖర్చులు భారీగా పెరిగాయి. వ్యాపార పంటలు పెరిగాయి. రసాయనిక ఎరువుల వినియోగం కూడా భారీగా పెరిగింది. రసాయనిక ఎరువులు వేసినా గాని పంటలు పండని పరిస్థితి తలెత్తింది. వాటి కోసం రైతులు అనివార్యంగా అప్పులు చేయవల్సిన పరిస్థితి వచ్చింది. నూతన వ్యవసాయ విధానంతో బ్యాంకులు రైతులకు అప్పులు ఇవ్వడం నామమాత్రమై పోయింది. అవి కూడ భూస్వాములు, ధనిక రైతులకే ఎక్కువగా అందుతున్నాయి. దాంతో సాధారణ రైతులు అప్పుల కోసం వడ్డీ వ్యాపారుల, సరుకు కొనుగోలుదారుల మీద ఆధారపడాల్సి వస్తున్నది. వీరు రైతును అన్ని విధాలా ముంచుతున్నారు. విదేశాల్లో ప్రభుత్వాలు రైతులకు యిచ్చే సబ్సిడిలతో పోల్చితే మన ప్రభుత్వాలు యిచ్చే సబ్సిడిలు నామ మాత్రమే. ఈ అరకొర సబ్సిడిలతో రైతులు పండించిన పంటలు మార్కెట్‌లో విదేశీ ఉత్పత్తుల పోటీని తట్టుకోలేక పోతున్నాయి. మరో పక్క సామ్రాజ్యవాద కార్పొరేట్ సంస్థలు మన ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి, మన రైతుల పంటలకు గిట్టుబాటు ధర పెంచకుండా అడ్డుకొంటున్నాయి. తమ వ్యవసాయ ఉత్పత్తులను తక్కువ ధరలకు తెచ్చి మన దేశంలో గుమ్మరిస్తున్నారు. దీని ఫలితంగా ఇక్కడి రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర దక్కక క్రమంగా వ్యవసాయం రైతులకు మోయలేని భారంగా తయారైంది.

ప్రపంచీకరణ విధానంలో ముఖ్యమైనది ప్రైవేటీకరణ. ప్రభుత్వాల దోపిడీ అనుకూల విధానాలతో గత ఇరవై ఏళ్ళలో ప్రాథమిక అవసరాలైన విద్య, వైద్య రంగాల్లో ప్రైవేటీకరణ పెరిగిపోయింది. మరో పక్క ఉద్దేశ్య పూర్వకమైన నిర్లక్ష్యంతో ప్రభుత్వ విద్యాలయాలు, ఆస్పత్రులను మూతపడేట్లు చేస్తున్నారు. సాధారణ రైతుల కుటుంబాలు తమ పిల్లలకు మంచి విద్య, వైద్యం కావాలన్నా, పెళ్ళిళ్ళు చేయాలన్నా అప్పులు చేయక తప్పని పరిస్థితి. కాలం బాగుండి పంటలు బాగా పండితే సరైన గిట్టుబాటు ధర వుండదు. పంటలు పండక పోతే ఆదుకునే దిక్కుండదు. తెచ్చిన అప్పులు తీర్చే మార్గం లేక ఏమీ చేయలేని రైతులు ఆత్మహత్యలతో ప్రాణాలొదులుతున్నారు. మరోపక్క కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కొరకు పాలకవర్గాలు దేశంలోని లక్షలాది ఎకరాల పంట భూములను, అటవీ భూములను భూ సేకరణ పేరుతో బలవంతంగా స్వాధీనం చేసుకొని వారికి అప్పజెప్పుతున్నారు. రైతాంగాన్ని, ఆదివాసులను విస్థాపితుల్ని చేస్తున్నారు. భూములు కోల్పోయిన రైతులు తమ భూమిలో తామే కూలీలుగానో లేక రోడ్డు పక్కన బీక్షాటనతోనో బ్రతుకులు వెళ్ళదీస్తున్నారు. ఒకనాడు తన కాళ్ళపై తాను నిలబడి తలెత్తుకొని గౌరవంగా బ్రతికిన రైతుకు నేడు పరులపై ఆధారపడి బ్రతకాల్సిన స్థితి దాపురించింది. వ్యవసాయం రైతుకు బతుకు తెరువు కాలేక రైతులు వ్యవసాయాన్ని వదిలేసే పరిస్థితిని దళారి ప్రభుత్వాలు, పాలక వర్గాలు కల్పించాయి.

వ్యవసాయం, ఆహార ధాన్యాల ఉత్పత్తి ఈ 20 ఏళ్ళలో గణనీయంగా పడిపోయింది. ఒక్కొక్క సారి నిత్యావసర సరుకుల ధర చుక్కలనంటుతున్నది. పెరిగిన ధరలు ఇక ఎప్పటికీ దిగే ఆశలేదు. ధరలు దించడానికి దళారీ ప్రభుత్వాలు వ్యవసాయన్ని అభివృద్ధి చేసే చర్యలు చేపట్టకుండా ఆహార ధాన్యాలు, నిత్యావసరాలను సామ్రాజ్యవాద దేశాల నుండి దిగుమతి చేస్తున్నాయి. 70 శాతం జనాభా భూమిపై ఆధారపడి బతికే వ్యవసాయాధారిత భారత దేశంలో రైతు బలవంతంగా ప్రాణాలు తీసుకునే పరిస్థితి దాపురించడానికి దళారీ ప్రభుత్వాలు, దోపిడీ పాలక వర్గాలు అమలు చేస్తున్న తప్పుడు విధానాలే కారణం. ఈ వాస్తవాన్ని ప్రభుత్వమే నియమించిన జయతీఘోష్ కమీషన్ గతంలోనే తేల్చి చెప్పింది. వ్యవసాయాన్ని ఈస్థితి నుండి బయట పడేయడానికి ఏమి చర్యలు చేపట్టాలో కూడా చెప్పింది. కాని ఉద్దేశ్యపూర్వకంగా వ్యవసాయాన్ని నాశనం చేసి దానిపై ఆధారపడి బ్రతికే కోట్లాది ప్రజల్ని సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల పెట్టుబడికి చౌక శ్రామికులుగా తయారు చేయబూనుకున్న దళారి ప్రభుత్వాలు జయతీఘోష్ కమిషన్ నివేదికను బుట్టదాఖలు చేశాయి. వ్యవసాయంపై ఆధారపడి బ్రతుకుతున్న రైతులు బలవన్మరణాలకు గురవుతుంటే దళారీలంతా విలాసవంతమైన జీవితాలను గడుపుతున్నారు. సమాజం రైతులకు ఎంత ధైర్యాన్నీ, ఓదార్పును యిచ్చినా ఆత్మహత్యల వైపు నుంచి వారి దృష్టిని మరల్చలేక పోతున్నది. అంటే దళారీ పాలకుల విధ్వంసక విధానాలు రైతాంగాన్ని ఎంతగా కోలుకోలేని స్థితికి నెట్టేశాయో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ విధ్వంసక విధానాలను దళారీ పాలకులు అభివృద్ధి నమూనాగా ప్రచారం చేస్తూ బాకాలూదుతున్నారు.

ఈ అభివృద్ధి (విధ్వంసక) నమూనాలోనే వ్యవసాయ సంక్షోభానికి మూలం వుంది. ఈ సంక్షోభం నుండి వ్యవసాయాన్ని బయట పడేయాలంటే యుద్ధ ప్రాతిపదికన భూ సంస్కరణలు అమలు చేయాలి. చిన్న, మధ్య రకపు నీటి వసతులపై కేంద్రీకరించాలి.

దేశీయ, సంప్రదాయ వ్యవసాయ విధానాలను ప్రోత్సహించి వాణిజ్య పంటల మోజు నుంచి రైతులను ఆహార పంటలు పండించేలా ప్రోత్సహించాలి. బ్యాంకులు, ప్రైవేట్ రుణాల మాఫీ బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలి. రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు ఖచ్చితంగా అమలు చేయాలి. అవసరమైన సబ్సిడీలు తదితర తక్షణ చర్యలు ప్రభుత్వం చేపట్టాలి. అన్నింటి కంటే ముఖ్యంగా రైతులు పంటల ధరలను తామే నిర్ణయించుకునే విధంగా రైతులతో కూడిన ఒక వ్యవస్థను ఏర్పరచాలి.

ఈ అభివృద్ధి (విధ్వంసక) నమూనాలో ఇదంతా సాధ్యమేనా? దోపిడీ వ్యవస్థలో, దళారీ ప్రభుత్వాల పాలనలో ఇది ఎన్నటికీ సాధ్యం కాదు. మరి రైతు దుస్థితికి పరిష్కారం ఎక్కడ? అది ప్రత్యామ్నాయ ప్రజా అభివృద్ధి నమూనాలో, జనతన సర్కార్ అధికారంలో సాధ్యం. దాన్ని నేడు దండకారణ్యంలోని ప్రజానీకం మావోయిస్టు పార్టీ నాయకత్వంలో అమలు చేస్తున్నారు. అది బీజ రూపంలోనే వున్నప్పటికీ వెనుకబడిన వ్యవసాయం నుంచి కొత్త పద్ధతులు నేర్చుకుంటూ క్రమంగా ఉత్పత్తి పెంచే వైపు అడుగులేస్తున్నది. ఇక్కడ రైతులు ఇతరులపై ఆధారపడటం లేదు. ఆత్మహత్యలు లేవు. అందరికీ భూమి, ఇల్లు లభించే విధంగా జనతన సర్కార్ కృషి చేస్తున్నది. ప్రజలు సమిష్టిగా వేలాది ఎకరాల భూమిని చదును చేసి కాల్వలు, చెరువులు తవ్వి, తమ విత్తనాలు తామే ఉత్పత్తి చేసుకొంటున్నారు. సహకార పద్ధతిలో స్వావలంబనతో కూడిన వ్యవసాయాన్ని జనతన సర్కార్ అభివృద్ధి చేస్తున్నది.

ఇది అనుకున్నంత తేలికగా ఏదో కొద్ది రోజుల్లో సాధ్యమైంది కాదు. 35 సంవత్సరాల వర్గ పోరాటం ద్వారా ఇది సాధ్యమైంది. కార్మిక వర్గ పార్టీ నాయకత్వంలో పి.ఎల్.జి.ఎ., జన మిలీషియాల అండతో ప్రజలు సాధించిన ఫలితాలను కాపాడుకొంటున్నారు. వీటన్నింటిని ధ్వంసం చేసి దండకారణ్యంలోని అమూల్యమైన ప్రకృతి వనరులను, ఖనిజ సంపదలను దోచుకొని పోవడానికి సామ్రాజ్యవాదులు దళారీ పాలక వర్గాలు సాగించిన జన జాగరణ్ అభియాన్, సల్వాజుడుం-1 మారణకాండలను ఎదుర్కొని ఓడించారు. 2009 నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న గ్రీన్‌హంట్ ఆపరేషన్, ఇప్పుడు సల్వాజుడుం-2 దాడులను ఎదుర్కొంటున్నారు. ఆ విధంగా వాళ్ళు యుద్ధంలో ఉన్నారు. యుద్ధం మధ్యలోనే ఉత్పత్తిలో పాల్గొంటున్నారు. యుద్ధంలోనే ప్రాణ త్యాగాలు చేస్తున్నారు. మహిళలపై సామూహిక అత్యాచారాలు జరుగుతున్నా, గ్రామాలను పోలీసులు, సల్వాజుడుం గూండా మూకలు తగుల బెడుతున్నా, బూటకపు ఎన్‌కౌంటర్లలో పదుల సంఖ్యలో హత్యలు చేస్తున్నా ప్రజలు యుద్ధం సాగిస్తూనే వున్నారు. తాము సాధించిన ఫలితాలను, ప్రజా రాజ్యాధికారాన్ని పటిష్ట పరచి విస్తరించడానికి దృఢసంకల్పంతో పోరాడుతున్నారు.

అందువల్ల 68 సంవత్సరాల దోపిడీ పాలన నుంచి పొందిన అనుభవంతో రైతాంగం ఆత్మహత్యలు కాక ఆయుధం చేపట్టి పోరాడి సాధించుకునే మార్గంలో నడవాలి. అదే వ్యవసాయ విప్లవ మార్గం. రైతాంగం గురించి బాధ్యతగా ఆలోచించే ప్రజాస్వామికవాదులు, మేధావులు కూడ వారికి అటువంటి చైతన్యాన్ని, మద్దతునిస్తూ వారితో భుజం భుజం కలిపి నడవాలి. వ్యవసాయ విప్లవమే ఈ దేశంలో ప్రజలందరికి భూమి, భుక్తి, విముక్తి లభించే నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేస్తుంది. సమ సమాజాన్ని ఆవిష్కరిస్తుంది. ○

## సాంస్కృతిక విప్లవం 50వ వార్షికోత్సవాలను గొప్ప విప్లవోత్సాహంతో జరుపుకుందాం.

**కార్మికవర్గ పార్టీ తనలోని దాగిన బూర్జువా భావజాలాన్ని, ఏజెంట్లను బహిరంగంగానూ, సమగ్రంగానూ, కింది నుండి ఎండగట్టే విధంగా విశాల ప్రజాబాహుళ్యాన్ని జాగృతం చేయటం కోసం ఒక రూపాన్ని, పద్ధతిని కనుగొన్నది. అదే మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం. వందల, లక్షల ప్రజాబాహుళ్యం తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెలిబుచ్చేట్లుగా, పెద్ద పెద్ద పోస్టర్లను రాసేట్టుగా, గొప్ప చర్యలు నిర్వహించేట్టుగా వారిని జాగృతులను చేయాలి. అలా చేయటం ద్వారా మాత్రమే పార్టీలోకి చొరబడిన ప్రతీఘాతుకులను, శత్రు ఏజెంట్లను, అధికారంలోని పెట్టుబడిదారీ మార్గీయులను బట్టబయలు చేయగలుగుతాం. పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరించాలని ప్రయత్నించే వారి కుట్రల్ని ధ్వంసం చేయగలుగుతాం.**

**సాంస్కృతిక విప్లవం పెట్టుబడిదారీ పునరుద్ధరణకి వ్యతిరేకంగా జరిగిన పోరాటం నుండి అభివృద్ధి చెందిన సైద్ధాంతిక ఆయుధం.**

**గొప్ప శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం**
**16మే, 1966లో ప్రారంభమయ్యింది**

# బొట్టెం అమర వీరులకు అరుణారుణ జోహార్లు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పామేడ్ ఏరియాలో మార్చి ఒకటి 2016న బొట్టెం తోగు దగ్గర జరిగిన పోలీసు దాడిని ప్రతిఘటిస్తూ పీ.ఎల్.జీ.ఏ. బలగాలు వీరోచితంగా పోరాడారు. ఆ దాడిలో మన ప్రియతమ కామ్రేడ్స్ 9 మంది అమరులయ్యారు.


దండకారణ్యం గెరిల్లా బేస్‌లో క్రాంతికారీ జనతన సర్కార్‌లు నడుస్తున్న చోట పువ్వర్తి తర్వాత జరిగిన మరో పెద్ద సంఘటన బొట్టెం ఎన్‌కౌంటర్ ఘటన. శత్రువుపై గట్టి దెబ్బతీసి వెంటబడి తరిమిన 'కస్సల్‌పాదు' సంఘటనకు దగ్గరలోనే ఇది జరిగింది. ప్రజల అధికారానికి, దోపిడీ వర్గాల అధికారానికి మధ్య జరుగుతున్న వర్గయుద్ధంలో చిన్న, పెద్ద ఘటనలు జరిగి నష్టాలు కొనసాగడం దీర్ఘకాల ప్రజాయుద్ధంలో సాధారణమే. త్యాగాలు వెన్నంటే విజయాలుంటాయనేది చారిత్రక సత్యం.

తెలంగాణ గ్రేహౌండ్స్ బలగాలు, ఛత్తీస్‌గఢ్ బలగాలు, సీ.ఆర్.పీ.ఎఫ్. బలగాలు సంయుక్తంగా 'ఆపరేషన్ హరిభూషన్' పేరుతో జరిపిన బొట్టెం ఎన్‌కౌంటర్లో డీ.కే.ఎస్.జెడ్.సీ.ఎం. కామ్రేడ్ లచ్చన్న, దక్షిణ బస్తర్ డీ.వీ.సీ.ఎం. కా. సోనీ, 22వ ప్లాటూన్ కమాండర్ కా. చందు, సీ.ఆర్.సీ. 2వ కంపెనీ పీ.ఎల్.డిప్యూటీ కమాండర్ కా. మిన్కో తెలంగాణ కామ్రేడ్స్ ఏ.సీ.ఎం. కా. రాగో, పీ.ఎం. కా. అనిత, డీ.కే.కు చెందిన పార్టీ సభ్యులు గార్డ్ కా. రామె, కా. దెవె. కా. చైతు లు అమరులయ్యారు.

ప్రజలతో, కేడర్‌తో అమరుల అనుబంధం గొప్పది. వారి ఆశయాలు, ఆదర్శాలు మనల్ని నడిపిస్తాయి. వారి వయస్సు, బాధ్యతలు, అనుభవాలు, విద్య, నైపుణ్యాల్లాంటి విషయాల్లో తేడాలున్నాయి. వారి ప్రాంతాలు, భాషలు, అలవాట్లు వేరు వేరు. అయినప్పటికీ ప్రజలు, పార్టీ, విప్లవోద్యమం, ఎంచుకున్న లక్ష్యం ఎడల గల విశ్వాసం, చూపిన పట్టుదల, త్యాగ సంసిద్ధత, సమిష్టి తత్వం, సహకార గుణంలలో ఏమీ తేడాలు, హెచ్చు తగ్గులు కనబడవు. వాళ్ళు ఇంకా మన మధ్యన జీవించి ఉంటే ప్రజలందరినీ ఆసుగుణాలతో పరిపూర్ణం చేసే కృషి వేగంగా కొనసాగేది.

ఆ ఆపరేషన్‌లో 5గురు మహిళా కామ్రేడ్స్‌ను సజీవంగా పట్టుకుని చిత్రహింసలు పెట్టి హత్యచేసారు. నలుగురు కామ్రేడ్స్ శత్రువును ప్రతిఘటిస్తూ అమరులయ్యారు. 8 మంది కామ్రేడ్స్ శవాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కామ్రేడ్ మిన్కో శత్రువును ప్రతిఘటించే క్రమంలో గాయపడింది. కొద్ది దూరం క్రావెలింగ్‌లో వచ్చి ప్రాణాలు విడిచింది. ఆమె శవాన్ని, తుపాకిని విప్లవ ప్రజలే స్వాధీనం చేసుకున్నారు. విప్లవ సాంప్రదాయాలతో ఊరేగించి దహన సంస్కారాలు చేసారు. మిగిలిన కామ్రేడ్స్ శవాలను కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు కమిటీ కామ్రేడ్స్ తెచ్చి విప్లవ సాంప్రదాయాలతో ఊరేగించి, దహన సంస్కారాలు పూర్తి చేసారు. అమరుల ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిన బూనారు..

## కామ్రేడ్ గొట్టిముక్కల రమేష్ (లచ్చన్న)



కామ్రేడ్ గొట్టిముక్కల రమేష్ (ఎన్.జెడ్.సీ.ఎం.) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, గుంటూరు జిల్లా క్రోసూరు మండలం, పీసపాడు గ్రామంలో 50 సం॥రాల క్రితం ఈశ్వరమ్మ, బ్రహ్మాచారి దంపతులకు 5వ సంతానంగా జన్మించాడు. అనంతరం కా. లచ్చన్నను తన పినతల్లి మాణిక్యమ్మ దత్తత తీసుకొని పెంచి పెద్ద చేసింది. క్రోసూరులో పాఠశాల విద్య నుండి ఇంటర్మీడియెట్ వరకు పూర్తి చేశాడు. హైదరాబాద్, రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీ.ఎస్.సీ. (అగ్రికల్చర్)లో చేరాడు.

బీ.ఎస్.సీ.చదువుకుంటున్న సమయంలోనే రాడికల్ విద్యార్థి సంఘం నిర్వహిస్తున్న ఉద్యమాలకు ఆకర్షితుడై విద్యార్థి సంఘంలో చేరాడు. విద్యార్థి సమస్యలపై, ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలలో క్రియాశీలంగా పాల్గొన్నాడు. మతోన్మాద, భూస్వామ్య ముద్దు బిడ్డలైన ఏ.బీ.వీ.పీ. గూండాల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడుతూ, విప్లవ విద్యార్థులపై దాడులకు పాల్పడుతున్న గూండాలను ప్రతిఘటించే చర్యల్లో ముందు వరుసలో నిలబడ్డాడు. సామాజిక సమస్యలపై పోరాడుతున్న ప్రజలకు రాడికల్ విద్యార్థి సంఘంగా మద్దతు తెలియజేస్తూ, వారి పోరాటాలలో పాలు పంచుకున్నాడు. అనతి కాలంలోనే కా. రమేష్ తోటి విద్యార్థుల అభిమానాన్ని చూరగొన్నాడు.

పార్టీ యిచ్చిన పిలుపును అందుకొని 1990లో కా. రమేష్ పూర్తి కాలం కార్యకర్తగా విప్లవోద్యమంలోకి అడుగుపెట్టాడు. మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట దళంలో పని చేశాడు. కా. లచ్చాల్ అచ్చంపేటలో జరిగిన కరువు దాడుల్లో పాల్గొన్నాడు. 1991లో అచ్చంపేట టౌన్‌లో పని చేసాడు. అప్పర్ ప్లాట్ దళంలో డిప్యూటీ కమాండర్‌గా ఉన్నప్పుడు రత్న కుమార్ పేరుతో పని చేసాడు. అక్కడ చెంచులు, దళితుల్లో, తిండికి కష్టంగా ఉన్నా ఎన్నో రకాల కష్టాలకు ఓర్చుకుని ప్రజల్ని సంఘటితం చేసాడు. ఏ పని

చేసినా పద్ధతిగా, నిపుణతతో చేసేవాడు. డాక్టర్‌గా ప్రజలకు సేవలందించాడు. మంచి కామ్రేడ్‌గా పేరు తెచ్చుకున్నాడు. మహిళల పట్ల పద్ధతిగా, బాధ్యతగా ఉండేవాడు. సీ.పీ.ఐ., సీ.పీ.ఎం. రివిజనిస్టులతో జరిగిన గొడవల్లో పాల్గొన్నాడు.

తర్వాత కల్వకుర్తి దళానికి కమాండర్‌గా బాధ్యతలు చేపట్టాడు. దళ కమాండర్‌గా పీడిత ప్రజలను వ్యవసాయ విప్లవంలో సంఘటితపరచడంలో, సమస్యలపై పోరాటాలలో కదిలించడానికి కృషి చేసాడు. పోరాటాలలో కదులుతున్న ప్రజలపై, విప్లవోద్యమంపై భూస్వాములు, బీ.జే.పీ. గూండాలు చేస్తున్న దాడులను ప్రతిఘటించడంలో ముఖ్య పాత్ర పోషించాడు. అనతి కాలంలోనే నల్లమల చెంచులకు, పాలమూరు ప్రజలకు, సహచర కామ్రేడ్స్‌కు ఆత్మీయుడిగా మారాడు. పోలీసులు చేస్తున్న అనేక దాడుల నుండి తప్పుకుంటూ, తోటి కామ్రేడ్స్‌ను రక్షించాడు.

కా. లచ్చన్న కల్వకుర్తిలో కొన్ని యాక్షన్లలో చురుగ్గా పాల్గొన్నాడు. భూపోరాటాలకు నాయకత్వం వహించాడు. అజలాపురం భూస్వామికి వ్యతిరేకంగా ప్రజల్ని 3 గ్రామాల్లో సంఘటితం చేయడంతో 200 ఎకరాల భూముల్ని స్వాధీనం చేసుకుని పంచుకున్నారు. భూస్వామి ఇంటిమీద దాడి చేసి సంపదను జప్తు చేసుకుని ప్రజలకు పంచిపెట్టారు. తలకొండపల్లి భూస్వామి కృష్ణారెడ్డి ప్రజా పీడకుడు. పోలీసు ఇన్‌ఫార్మరు. వాడిని ఖతం చేయాలని నిర్ణయం జరిగింది. యాక్షన్ టీంలో ఉన్న లచ్చన్న షార్ప్ షూటర్ కావడంతో హైవే పై మోటర్ సైకిల్ మీద వెళుతున్న కృష్ణారెడ్డి తలకు గురిచూసి కాల్చాడు. వాడు అక్కడే కుప్పకూలి చచ్చాడు. ప్రజలు ఈ వార్త విని పండుగ చేసుకున్నారు. లచ్చాలు మిలిటరీ విషయాల్లో మంచి క్రమశిక్షణతో ఉండేవాడు.

కల్వకుర్తిలో ఆర్గనైజేషన్ పని అంతా రాత్రి పూట చేసుకోవాలి. రాత్రుళ్ళు నడవడం, గ్రామాలో సమావేశాలు జరపడంతో నిద్ర పోవడానికి సమయం వుండేది కాదు. పగలంతా ఇండ్లల్లోనే కదలకుండా ఉండాల్సి వచ్చేది. విద్యార్థి, యువకుల్ని, పెటీ బూర్జువా సెక్షన్స్‌ను ఆర్గనైజ్ చేయడంలో ఎక్కువ శ్రద్ధ పెట్టాడు. దళంలో క్రమం తప్పకుండా స్కూల్, సమిష్టి, పీ.టీ. జరిగేలా చూసేవాడు. తానే ప్రధానంగా స్కూల్, అధ్యయనం బాధ్యత తీసుకుని గుర్తుండేలా చెప్పేవాడు.

1997లో పానగల్ ఏరియాకు కమాండర్‌గా మారాడు. ఆ తర్వాత కొంతకాలం వనపర్తి టౌన్ ఆర్గనైజర్‌గా బాధ్యతలు చూసాడు. 1998లో జరిగిన మహబూబ్‌నగర్ జిల్లా పార్టీ మహాసభలో ప్రతినిధిగా పాల్గొన్నాడు. 1999లో మహబూబ్‌నగర్ జిల్లా ఉద్యమం నుండి రాష్ట్ర కమిటీ నిర్ణయించిన పనుల కోసం బదిలీ అయ్యాడు. దరిదాపు ఒక దశాబ్ద కాలం దక్షిణ తెలంగాణ ఉద్యమంలో, ప్రత్యేకించి మహబూబ్‌నగర్ ఉద్యమంతో కలిసి పనిచేసాడు.

1999 నుండి కా. లచ్చాల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ అధికార పత్రిక క్రాంతి కోసం ప్రింటింగ్, టెక్నికల్ పనులు బాధ్యతగా చూసేవాడు. పార్టీ నిర్ణయానికి అనుగుణంగా కా. సోనీతో 2000 సం॥లో పార్టీ కేడర్ సమక్షంలో విప్లవ పద్ధతుల్లో వివాహం జరిగింది. ఆ తర్వాత ఇద్దరూ రహస్యంగా ఉంటూ క్రాంతి పత్రిక పనుల్లో బాధ్యతలు చూసుండేవారు. నిర్బంధం తీవ్రం కావడంతో పత్రికను తీసుకురాలేని పరిస్థితి ఏర్పడి 2003లో తాత్కాలికంగా నిలుపు చేసారు. మరల 2006లో క్రాంతి పత్రికను పునరుద్దరించి సీ.ఆర్.బీ. నేతృత్వంలో తేవాలని నిర్ణయం జరిగింది. బయట ప్రింట్ చేసి నడపడంలో ఉన్న సమస్యల రీత్యా పత్రికను గెరిల్లా జోన్ ప్రాంతంలోనే నిర్వహించడంతో కా. లచ్చాల్, కా. సోనీ అటవీ ప్రాంతానికి వచ్చారు. అలా కామ్రేడ్ లచ్చాల్ క్రాంతి పనిలోనే తిరిగి కొనసాగడంతో పాటు క్రాంతి పత్రికకు రచనలు చేస్తూ సంపాదక వర్గంలో భాగమయ్యాడు. మరో 6 సం॥రాల పాటు (2012 వరకు) అదే పనిలో ఉంటూ పత్రికను రెగ్యులర్‌గా తీసుకురావడంతో తన శక్తినంతా ఉపయోగించాడు. ఇతర పత్రికలకు వ్యాసాలు రాయడం, పత్రికా ప్రకటనలు రాయడం, అనేక పుస్తకాలు తేవడం, అనువాదాలు చేయడంలో ముఖ్య పాత్ర పోషించాడు. 10 సం॥కు పైగా క్రాంతి పత్రికలో ఉండి లచ్చన్న నిర్వహించిన పాత్ర, పత్రికా రంగానికి చేసిన కృషి మరువలేనిది. **(ఇదే సంచికలో కామ్రేడ్ లచ్చాల్ రాసిన వ్యాసం "రైతాంగ ఆత్మహత్యలపై" అచ్చయింది. కా. లచ్చాల్ రాసిన చివరి వ్యాసం కూడా ఇదే.)** 2011లో కా. లచ్చాల్‌ను ఆర్.సీ.ఎం.గా ప్రమోట్ చేసింది పార్టీ.

సీ.ఆర్.బీ. ప్రెస్‌లో ఉన్నప్పుడు కా. లచ్చాల్ ప్రెస్ నిర్వహణతో పాటు ప్రొటెక్షన్ కామ్రేడ్స్‌కు అన్ని విధాల సహకరించాడు. వారికి విద్య, వైద్య విషయాల్లో పూర్తి మద్దతును అందించాడు. లచ్చన్న పనులు నిదానంగా జరిగినా పద్ధతి ప్రకారం ఉండేవి. ఎప్పుడూ క్రమశిక్షణతో ఉండడం, పరిశుభ్రంగా ఉండడం చేసేవాడు. పెద్దతరం వాళ్లతో సరదాగా కబుర్లు చెబుతూ ఉత్సాహపరుస్తూ ఉండేవాడు.

కామ్రేడ్ రమేష్ విప్లవ దీక్షతో బహుముఖంగా ఎదిగి 25 సం॥ పాటు చేసిన విప్లవ కృషి మనకు ఆదర్శం. లచ్చన్న రైతు బిడ్డ. జీవిత కాలమంతా రాజకీయ అధ్యయనం చేసి కేడర్‌కు రాజకీయ పాఠాలు చెప్పాడు. విద్యార్థి దశ నుండి కళారంగం

పట్ల అభిరుచితో ముఖ్యంగా నాటక రంగం మీద శ్రద్ధతో ఆనాడు నేర్చుకున్న మాయల పకీర్ ఏకపాత్రాభినయనం చేసి మెప్పించేవాడు. రచయితగా, పత్రికా రంగంలో క్రాంతి సంపాదకవర్గంలో బాధ్యతగా ఎంతో కృషి చేసాడు. మంచి నైపుణ్యం గల డాక్టర్‌గా పీ.ఎల్.జీ.ఏ. బలగాలకు, విప్లవ ప్రజలకు సేవలందించాడు. డీ.కే.లో మంచి టెక్నీషియన్‌గా, కంప్యూటర్ ఎక్స్‌ఫర్ట్‌గా పేరు తెచ్చుకున్నాడు. పత్రికా నిర్వహణలో ప్రముఖ పాత్ర వహించాడు. కరాటేలో బ్లాక్ బెల్ట్ సంపాదించిన లచ్చన్న పీ.ఎల్.జీ.ఏ. బలగాలకు మిలిటరీ క్యాంపుల్లో, అర్బన్ కంబాట్ ట్రైనింగ్‌లో మార్షల్ ఆర్ట్‌ను నేర్పేవాడు. ఇలా అనేక రంగాల్లో కృషి చేసిన కా. లచ్చన్న విప్లవ జీవితం విప్లవ శ్రేణులను ఉత్తేజ పరుస్తుంది.

కా. లచ్చాల్ 2012లో డీ.కే.లోని ప్రధాన బలగాలకు బదిలీ అయ్యాడు. అక్కడ బెటాలియన్ పార్టీ కమిటీ (బీ.ఎన్.పీ.సీ.)లో బాధ్యతలు చూస్తూ బలగాల రాజకీయ అభివృద్ధికి క్లాసులు చెప్పాడు. మోపోస్ టీచర్లకు మద్దతు ఇస్తూ వారి అభివృద్ధికి కృషి చేసాడు. అనేక పుస్తకాలు, పత్రికలు, సాహిత్యం ప్రింట్స్ తీసి కేడర్‌లో అధ్యయనం పట్ల శ్రద్ధ పెరిగేలా కృషి చేసాడు. మిలటరీ శిక్షణలో తనకు తెలిసిన మార్షల్ ఆర్ట్స్‌ను నేర్పాడు. బెటాలియన్‌లో మంచి వైద్యుడుగా పేరు తెచ్చుకున్నాడు. అక్కడి కేడర్ల అభిమానాన్ని చూరగొన్నాడు. 'విప్లవ తరంగం' అనే సీ.ఆర్.బీ. పరిధిలోని విప్లవోద్యమంపై తయారు చేసిన వీడియో చిత్రానికి స్క్రిప్ట్ రాయడంలో భాగమయ్యాడు.

2015 అక్టోబర్‌లో జరిగిన డీ.కే. ప్లీనంలో కా. లచ్చాల్‌ను ప్రత్యామ్నాయ రాష్ట్రకమిటీ మెంబర్‌గా ఎన్నుకున్నారు. పార్టీ అవసరాల రీత్యా బీ.ఎన్. నుండి, డీ.కే.జోన్ నుండి బదిలీ చేసారు. పార్టీ తనకిచ్చిన కొత్త బాధ్యతల్లోకి వెళ్లేముందు తెలంగాణ కామ్రేడ్స్‌ను కలవడానికి వచ్చాడు. అక్కడ వారితో కలిసి ఉన్న సమయంలో దాడి జరిగింది. శత్రువును ప్రతిఘటిస్తూ తన సహచరి సోనీని కాపాడే క్రమంలో తూటాలు తగిలి అక్కడే అమరుడయ్యాడు. అదే దాడిలో కా.సోనీ, మరి కొంతమంది కామ్రేడ్స్ అమరులయ్యారు.

25 సం॥లకు పైగా విప్లవోద్యమంలో నిబద్ధతతో, పట్టుదలగా పని చేసిన కా. లచ్చాల్ అనేక రంగాలలో విశేష కృషి చేసాడు. ఎక్కడ పనిచేసినా అన్ని చోట్ల కేడర్లలో, ప్రజల్లో విశ్వాసాన్ని నింపాడు. విప్లవ ఆదర్శంతో పని చేసి మనకు గురువుగా నిలిచాడు. అనారోగ్యంతో ఉన్న కా. సోనీతో సహచర జీవితాన్ని గొప్ప ఆదర్శంతో, ఎంతో సహకారంతో కొనసాగించాడు. విప్లవ కార్యాచరణలో ఆదర్శంగా నిలిచిన మంచి జంటగా మనకు సదా గుర్తుంటారు. ఒకరితో ఒకరు కలిసి మెలిసి ఉన్నారు. కన్‌సర్న్‌గా ఉన్నారు. హాయిగా, ఆనందంగా, నిండుగా, నిర్మలంగా, మనస్సు నిండా మమతతో స్వచ్ఛంగా, సౌమ్యంగా, సంతృప్తిగా ఉన్నారు. అలాగే అందరితో బాధ్యతగా ఉన్నారు. వాళ్ళు కార్మికవర్గంగా తీర్చిదిద్దబడుతూ అమరులయ్యారు.

## కామ్రేడ్ యూసుఫ్ బీ (సోని)



మార్చి 1న తెలంగాణ గ్రేహౌండ్స్, ఛత్తీస్‌గఢ్ బలగాలు సంయుక్తంగా చేపట్టిన మహా అభియాన్‌లో బొట్టెం గ్రామం వద్ద కా. యూసఫ్ బీ (భాగ్యక్క, సోని), కామ్రేడ్స్ అనిత, నవత, రామె, దేవెలతో పాటు శత్రువు చేత చిక్కి చిత్రహింసలకు గురై హత్య చేయబడ్డది.

కామ్రేడ్ యూసఫ్ బీ (సోని, డీ.వీ.సీ.ఎం.) తెలంగాణ రాష్ట్రం, మెదక్ జిల్లా, దౌల్తాబాద్ మండలం, మాచినపల్లి గ్రామంలో సుమారు 40 ఏళ్ల క్రితం హుస్సేన్ అహ్మద్, ఖుషుంబీ దంపతులకు జన్మించింది. సోనికి ఇద్దరు అన్నలు ఉన్నారు. వారిది విప్లవ రాజకీయాలతో ముడిపడి ఉన్న కుటుంబం. స్వంత గ్రామంలోనే మూడవ తరగతి వరకు చదువుకున్న కా. సోని విప్లవ రాజకీయాల పట్ల ఆకర్షితురాలయి 16 సం॥రాల వయస్సులోనే 1993లో పూర్తికాలం కార్యకర్తగా ఇందుప్రియాల్ దళంలో చేరింది. తరువాత గిరాయిపల్లి దళంలో పనిచేసింది.

దళ సభ్యురాలుగా చేరి, డిప్యూటీ దళ కమాండర్‌గా ఎదిగింది. కా. సోనీకి మున్నీ, భాగ్యక్క అని పేర్లున్నాయి. 1998లో సోనీకి వివాహం జరిగింది. అయితే 2 నెలలు గడువకుండానే సహచరుడు కా. మురళీ ఉద్యమంలో అమరుడయ్యాడు. కా. మురళీ గిరాయిపల్లి దళం కమాండర్. ఆ తర్వాత 2 సం॥రాలు గడిచాక పార్టీ నిర్ణయం మేరకు కామ్రేడ్ లచ్చన్నతో 2000 సం॥లో పెళ్లి జరిగింది. తరువాత క్రాంతి పత్రిక స్టాఫ్ మెంబర్‌గా టెక్ పనులను తన జీవిత సహచరుడు కా. లచ్చన్నతో కలిసి 2006 వరకు నగరాలలో పనిచేసింది.

కామ్రేడ్ సోని 2006లో దండకారణ్యంలోనికి వచ్చింది. దక్షిణ బస్తర్ డివిజన్ పామేడ్ ఏరియా కమిటీ సభ్యురాలిగా ఉంటూనే ఏరియా మోపోస్ టీచర్‌గా బాధ్యతలు చేపట్టింది. ప్రజలు పెట్టిన తిండిని ప్రేమగా తిన్నది. వాళ్ల యాస, భాషలను గౌరవించి గోండి భాషను నేర్చుకుంది. దక్షిణ బస్తర్‌లో చిన్న పిల్లల నుండి పెద్ద వయస్సు వారితో కూడ కా. సోనికి పరిచయాలుండేవి. ఇక్కడి ప్రజల తలలో నాలుకగా కలిసిపోయి, క్యాడర్‌తో కలివిడిగా ఉ

న్నది. తనలో వున్న నిరాడంబరత, ఓపిక, ప్రజలతో కలిసిపోయే మనస్తత్వం వలన ప్రజలకు, క్యాడర్‌కు తొందరగా సన్నిహితురాలయింది. జనతన సర్కార్ కమిటీలకు, క్యాడర్‌కు పార్టీ డాక్యుమెంట్లపై రాజకీయ క్లాసులు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతం చేయడానికి కృషి చేసింది. పార్టీ రాజకీయాలను ప్రజల్లోకి తీసుకపోయి దక్షిణ బస్తర్ ఒక పోరాట ప్రాంతంగా ఎదగడానికి కా. సోని చేసిన కృషి మరువలేనిది.

ఆదివాసీ పెత్తందార్ల అణచివేతకు, పితృస్వామ్యానికి, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యంవంతం చేయడంలో కా. సోని కృషి చేసింది. తెలుగులో వస్తున్న సాహిత్యాన్ని కోయలోకి అనువాదం చేయడం, స్థానిక పత్రికలలో రాయడం చేసేది. తను బాధ్యత రీత్యా సివిల్‌లో పని చేయవలసి వచ్చినప్పటికీ, తను దీర్ఘకాల పేషెంట్ అయినప్పటికీ ఏనాడు కూడ రెస్ట్‌ను కోరుకోలేదు. ఒక వైపు శత్రువు తలపెట్టిన సల్వాజుడుం, ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడుల్లో భాగంగా ఆదివాసీ గ్రామాలపై పడి ఇండ్లను ధ్వంసం చేయడం, మహిళలపై అత్యాచారాలు చేయడం, అక్రమంగా అరెస్టు చేయడం లాంటి అనేక చర్యలు సాగించినప్పటికీ అధైర్య పడకుండా ప్రజలల్లో ఒకరిగా కలిసి పని చేసింది. శత్రువు చేస్తున్న దౌర్జన్యాలను బయటి ప్రపంచానికి తెలుపడం కోసం పార్టీ చేపట్టిన కార్యక్రమాలలో పాల్గొన్నది. విలేఖర్లను, హక్కుల సంఘాల వాళ్లను, రచయితలను పిలిపించినపుడు వారికి ఒక గైడ్‌లాగా ఉంటూ కోయ భాషలో మాత్రమే చెప్పగలిగిన ప్రజల బాధలు, కష్టాలు తెలుగులోకి అనువదించేది. శత్రువు ప్రజలను, పార్టీని నిర్మూలించాలని చూస్తున్న కఠిన పరిస్థితుల్లో "ప్రజలే చరిత్ర నిర్మాతలు, ప్రజలు అజేయులు" అనే భావన కామ్రేడ్ సోనీలో వ్యక్తమయ్యేది. కామ్రేడ్ సోని అనేక ఆటంకాల మధ్యనే దాదాపు 8 సంవత్సరాలు పామేడ్ ఏరియా కమిటీ సభ్యురాలుగా సేవలందించింది.

కా. సోనీ విగ్రహం ఎంత నిండుగా ఉంటుందో అంత నిబ్బరంగా ఉండేది. రుమాటిక్ అర్థరైటిస్ ఉన్న కారణంగా శరీరంలో అన్ని జాయింట్స్ నొప్పి పెట్టేవి. థైరాయిడ్ సమస్య వలన ఉండే బాధలు ఉండేవి. ఇంకా ఇతర అనారోగ్య సమస్యలు ఎన్ని ఉన్నా ఓపికతో భరించింది. డీ.కే.కి వచ్చిన తర్వాత రెండు సార్లు చనిపోయే పరిస్థితి వచ్చింది. అటువంటి సందర్భాల్లో కేడర్, విప్లవ ప్రజలు ఎంతో ప్రేమగా, ఆప్యాయంగా చూసుకునేవారు. లచ్చాల్ ప్రత్యేక శ్రద్ధ చూపేవాడు. సోనీ ఎప్పుడూ హుషారుగా వుండేది. ఆమె ఉంటే అక్కడ ఆహ్లాదకరమైన మంచి వాతావరణం ఉంటుంది. ఆమె బాధ్యతగా అన్ని గ్రామాల్లో క్రాంతికారీ జనతన సర్కార్‌ల నాయకత్వాన్ని, సంఘాల నాయకత్వాన్ని రాజకీయంగా ఎదిగించింది. ప్రజల్లో విప్లవ చైతన్యాన్ని పెంచింది.

కామ్రేడ్ సోని 2013లో డివిజనల్ కమిటీ సభ్యురాలిగా ప్రమోట్ అయింది. తనకు డివిజన్ 'మోపోస్' టీచర్‌గా బాధ్యతలు ఇచ్చారు. ఇదే బాధ్యతలో 2015 వరకు పనిచేసింది. దాదాపు 22 సంవత్సరాలు విప్లవోద్యమంలో పనిచేసి ఆదర్శవంతమైన ప్రజా సేవకురాలిగా, నాయకురాలిగా ఎదిగింది. పార్టీ చేపట్టిన టీచర్ ట్రెనింగ్ క్యాంపెయిన్స్, ఫీల్డ్ ట్రెనింగ్ క్యాంపెయిన్, బోల్షివీకరణ క్యాంపెయిన్‌లలో ముఖ్య పాత్ర పోషించింది. 2015 డిసెంబర్ డివిజనల్ కమిటీ సమావేశంలో కామ్రేడ్ సోనిని పార్టీ అవసరాల రీత్యా డివిజన్ నుండి బదిలీ చేశారు. తను పుట్టి పెరిగిన తెలంగాణ, ఏ.పీ. ఉద్యమాన్ని వీడి దండకారణ్యానికి వచ్చినప్పుడు కూడా ఇంత బాధలేదు. కానీ ఈ రోజు దండకారణ్యం నాకు కన్న తల్లిలాంటిది. ఈలాంటి దండకారణ్యాన్ని వదులుతున్నందుకు బాధ ఉన్నప్పటికీ పార్టీ అవసరాల రీత్యా తప్పదనే నిర్ణయానికి వచ్చి క్యాడర్‌తో, ప్రజలందరితో వీడ్కోలు తీసుకున్నది.

## కామ్రేడ్ కిస్కె పాండ్రు (కమ్లు, చందు)



కామ్రేడ్ కిస్కె పాండ్రు (కమ్లు, చందు) ఏ.సీ.ఎం. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా బైరాన్‌గఢ్ బ్లాక్ ఊతుల గ్రామంలో 30 సంవత్సరాల క్రితం జన్మించాడు. కా. చందు కుటుంబం మొదట మాడ్ డివిజన్ ఇంద్రావతి ఏరియాలోని మెట్టపాడ్ గ్రామంలో ఉండేది. అక్కడ వారికి భూమి లేనందువల్ల బ్రతుకుదెరువు కోసం ఊతుల గ్రామంలో స్థిరపడ్డారు. ఊతుల గ్రామం పార్టీ రాజకీయాలకు బలంగా ఉంటుంది. దానితో కా. చందుకు చిన్నతనం నుండే విప్లవ రాజకీయాలతో పరిచయం ఉంది. గ్రామంలోని పెత్తందారుల ఆధిపత్యాన్ని, సమాజంలోని అసమానతలను అర్థం చేసుకొని 2002లో పార్టీలోకి పూర్తి కాలం కార్యకర్తగా వచ్చాడు.

ఇంద్రావతి ఎల్.ఓ.ఎస్.లో కొంతకాలం పనిచేసిన తర్వాత ఎల్.జీ.ఎస్.కు బదిలీ అయ్యాడు. 2004 సెప్టెంబర్‌లో 1వ కంపెనీకి బదిలీ అయ్యాడు. 1 కంపెనీలో ఉండగా దౌలా, కసంసూర్ ఘాటి, జార ఘాటి అంబుష్ దాడులలో పాల్గొన్నాడు. జారఘాటీ అంబూష్ దాడిలో 7గురు పోలీసులను చంపి, 7 తూపాకులు స్వాధీనం చేసుకున్న ఘటనలో పాల్గొన్నాడు. 2009లో నిబ్ కంపెనీకి బదిలీ అయ్యాడు. నిబ్ కంపెనీలో మిలిటరీ క్రమశిక్షణ, చొరవ, పట్టుదలతో బాధ్యతాయుతంగా పని చేయటాన్ని చూసి పీ.పీ.సీ.లోకి

తీసుకుని సెక్షన్ కమాండర్‌గానూ, ప్లాటూన్ డిప్యూటీ కమాండర్‌గానూ బాధ్యతలు ఇచ్చారు.

నిబ్ కంపెనీలో ఉండగా ముర్ముల్లా, లాహెరి అంబుష్‌లతో పాటు ఇంకా అనేక దాడులలో పాల్గొన్నాడు. 2009 లాహెరి దాడిలో 17 మంది పోలీసులు చనిపోయారు. 17 తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. కొంగెర, బామ్రాగఢ్ దాడులలో పాల్గొన్నాడు. తను మిలిటరీ రంగంలో పనిచేస్తున్నప్పటికీ, ఒక ఆర్గనైజర్ వలే మాడ్ డివిజన్ ప్రజలకు రాజకీయాలు బోధిస్తూ చైతన్య పరిచేవాడు. ప్రజలతో సంబంధాలను పెంచుకోవటంలో శ్రద్ధ చూపేవాడు. 2011 మార్చి లో కా. లక్ష్మిని పార్టీ పద్ధతులతో పెళ్లి చేసుకున్నాడు. వారి వైవాహిక జీవితంలో ఎలాంటి సమస్యలు రాకుండా వ్యవహరించాడు.

సెప్టెంబర్ 2013లో 22 పీ.ఎల్.కు కామ్రేడ్స్ చందు, లక్ష్మి లు ఇరువురు బదిలీ అయ్యారు. కా. చందు కమాండర్‌గా, కా. లక్ష్మి ఏ.సీ.మెంబర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2013 సెప్టెంబర్ నుండి తాను అమరుడయ్యే నాటికి 22 పీ.ఎల్. కు కమాండర్‌గా బాధ్యత వహించి నాయకత్వ కామ్రేడ్‌కు రక్షణగా, వారి పనులకు సహాయ పడ్డాడు. క్యాడర్‌తో కలిసిపోయి సమిష్టి పనులలో పాల్గొనేవాడు. క్యాడర్‌కు రక్షణ విషయాలలో జాగ్రత్తలు, మెలకువలు, మిలిటరీ శిక్షణ నిరంతరం ఇచ్చేవాడు. తనకు ఆసక్తి వున్న కమ్యూనికేషన్ క్లాసులో పాల్గొన్నాడు. రాజకీయంగా క్యాడర్‌ను అభివృద్ధి చేయడానికి కృషి చేసేవాడు.

తనది పేద కుటుంబం కావడంతో పార్టీలోకి వచ్చిన తర్వాతనే చదువు నేర్చుకున్నాడు. అలాగే 22 పీ.ఎల్.లోకి రావడంతో తెలుగు కూడా రాయడం, చదవడం నేర్చుకోవడానికి తీవ్ర ప్రయత్నం చేశాడు. జనవరి 11, 2016లో నేషనల్ పార్క్ ఏరియాలో తన జీవిత సహచరి కా. లక్ష్మి ఎన్‌కౌంటర్‌లో అమరత్వం చెందిననూ అధైర్యపడకుండా యుద్ధంలో ఇవి సహజమేనని నిబ్బరంగా తన బాధ్యతలు నిర్వహించాడు.

తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో టీ.సీ.ఓ.సీ.లో కలిసి ఉన్న సమయంలో సమాచార ఆధారంగా గ్రేహౌండ్స్, ఛత్తీస్‌గఢ్ బలగాలు సంయుక్తంగా చేపట్టిన అభియాన్‌లో బొట్టెం గ్రామం వద్ద మార్చి1, 2016న శత్రువు దాడి చేయగా ఈ దాడిలో చందు వీరోచితంగా పోరాడుతూ అమరుడయ్యాడు. కా. చందు స్వగ్రామం దూరంగా ఉండడంతో పామేడ్ విప్లవ ప్రజానీకం కా. రోషన్‌తో పాటు కా. చందును కూడ విప్లవ సాంప్రదాయాలతో దహన సంస్కారాలను చేశారు. కామ్రేడ్స్ చందు, రోషన్‌ల ఆశయాలను ముందుకు తీసుకపోదామని శపథం చేశారు.

## కామ్రేడ్ నోరోటి సన్నాయి (మిన్కో)

కామ్రేడ్ మిన్కో(ఏ.సీ.ఎం.) మహారాష్ట్రలోని గఢ్‌చిరోలి జిల్లా, కసంసూర్ బ్లాక్, కోయన్‌గూడ గ్రామంలో 35 సం॥రాల క్రితం నోరోటి కూలే, దంపతులకు జన్మించింది. తల్లిదండ్రులకు ఉన్న నలుగురు సంతానంలో కా. మిన్కో మూడవది, ఒక అక్క ఇద్దరు చెల్లెళ్లు వున్నారు. కా. మిన్కో తండ్రి, చెల్లెలు కూడా విప్లవోద్యమంలో అమరులయ్యారు. గఢ్‌చిరోలి జిల్లాలో పార్టీ బలంగా ఉన్న గ్రామాలలో కోయన్‌గూడ ఒకటి.

కామ్రేడ్ మిన్కో లోని చురుకుదనాన్ని, చొరవను గమనించిన సంఘం క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘంలో పెట్టి పని చేయించింది. కా. మిన్కో అనతికాలంలోనే ఆ సంఘానికి నాయకురాలిగా ఎదిగింది. 2003లో పూర్తి కాలం కార్యకర్తగా కసంసూర్ దళంలో చేరింది. వివిధ దళాలలో పని చేస్తున్న క్రమంలో కా. మిన్కోలోని మిలిటరీ క్రమశిక్షణ, పట్టుదల, చొరవను చూసి పార్టీ 2007లో సీ.ఆర్.సీ. 1వ కంపెనీకి బదిలీ చేసింది. సీ.ఆర్.సీ. 1వ కంపెనీ చేసిన నయాగఢ్ దాడిలో పాల్గొన్నది. ఈ దాడిలో 1200 తుపాకులు, 1లక్ష తూటాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న తుపాకులను రక్షించుకోవడంలో ముందున్నది. సీ.ఆర్.సీ. 1వ కంపెనీలో ఉన్నప్పుడే పీ.పీ.సీ.ఎం.గా ప్రమోటయ్యింది.

కా. మిన్కోను 2008లో సీ.ఆర్.సీ. 2వ కంపెనీకి సెక్షన్ కమాండర్‌గా బదిలీ చేశారు. కంపెనీ చేసిన అనేక దాడుల్లో తన సెక్షన్‌కు నాయకత్వం వహించింది. 2009లో దమన్‌జోడి (నాల్కో ఏ.వో.బీ.) దాడి, బంద అంబూష్ (డీ.కే.), ముకరం అంబూష్ (డీ.కే.), జీరంఘాటీ అంబూష్ (డీ.కే.)లో కాంగ్రెస్ నాయకుల కాన్వాయిపై దాడి, కుర్నపల్లి అపార్చునిటీ అంబూష్ (తెలంగాణ), సత్యానారాయణ పురం (తెలంగాణ) బ్యాంకుపై దాడి చేసి 10 లక్షల రూపాయలు స్వాధీనం చేసుకోవడంలో, ఏ.ఓ.బీ.లో విద్యుత్ కేంద్రంపై దాడి చేసి జనరేటర్లను స్వాధీనం చేసుకోవడం వంటి పెద్ద దాడులతో పాటు, గోవిందపల్లి దాడి, కోరాపుట్ (ఏ.వో.బీ) దాడిలో 303 తుపాకులను స్వాధీనం చేసుకోవటంలో, తేమల్‌వాడ్ అంబూష్ (డీ.కే.), పూజారిగూడ అంబూష్ (ఏ.వో.బీ.), శ్రీరాంపూర్ అంబూష్ (ఒడిషా), గీదం దాడి, జప్పూర్ అంబూష్ (డీ.కే.) వంటి పెద్ద దాడులతో పాటు అనేక దాడులలో పాల్గొన్నది. అనేక మంది హోంగార్డులు, ఇన్‌ఫార్మర్లను ఖతం చేయడంలో, ప్రభుత్వ, భూస్వాముల ఆస్థులను స్వాధీనం చేసుకొని ప్రజలకు పంచటంలో ముఖ్య పాత్ర పోషించింది. ప్రభుత్వ ఆస్థులు, మొబైల్ టవర్లు, భూస్వాముల ఆస్థులను ధ్వంసం చేసిన దాడులలో కా. మిన్కో పాల్గొన్నది. తను కమాండర్‌గా వుండి బంద లో 10 మంది

ఎస్.పీ.ఓ.లను చంపటంలో పాల్గొన్నది. కా. మిన్కోను 2012 లో ప్లాటూన్ డిప్యూటీ కమాండర్‌గా ప్రమోట్ చేసినప్పటి నుండి సెక్షన్ కమాండర్‌గానూ, ప్లాటూన్ డిప్యూటీ కమాండర్‌గాను వుంటూ రోజువారి పనులలో తాను పాల్గొంటూ సభ్యులను పాల్గొనేలా ప్రోత్సహించేది. కా. మిన్కో తనకు తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ అప్పగించిన పనులను బాధ్యతాయుతంగా చేసేది.

కా. మిన్కో 2015 చివరిలో తను పుట్టి పెరిగిన ప్రాంతానికి వెళ్లి అక్కడ అందరినీ కలిసి వచ్చింది. తనతో పాటు రిక్రూట్ అయిన కామ్రేడ్స్‌తో కొన్ని రోజులు ఉండి వారితో తన అనుభవాలను పంచుకుంది. ఉద్యమంలో, ప్రజా యుద్ధంలో, ప్రధాన బలగాల ప్రథమ కర్తవ్యంలో బాధ్యతగా ఉంటూ శత్రువును ప్రతిఘటిస్తూనే అమరత్వం పొందింది.

ఎన్‌కౌంటర్ జరిగిన చోటు నుండి మరుసటి రోజు కా. మిన్కో శవాన్ని ప్రజలు తీసుకొచ్చి విప్లవ సాంప్రదాయాలతో అంత్యక్రియలు చేశారు. ఇందులో అనేక గ్రామాల ప్రజలు, ప్రజా సంఘాలు, పీ.ఎల్.జీ.ఏ., పార్టీ పాల్గొని కా. మిన్కో ఆశయాలను తుదివరకు కొనసాగిద్దామని శపథం చేస్తూ, అంతిమ వీడ్కోలు పలికారు.

## కామ్రేడ్ కొత్తకొండ సృజన (రాగో, నవత)



కా. కొత్తకొండ సృజన (రాగో, నవత) ఏ.సీ.ఎం. వరంగల్ జిల్లా హన్మకొండ మండలం పైడిపల్లి గ్రామంలో 1990 అక్టోబర్ 26న నిరుపేద కుటుంబమైన కొత్తకొండ శాంతక్క, భీమన్న దంపతులకు జన్మించింది. కా. నవతకు ఒక అన్న, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. నవత తల్లి దండ్రులు కూడ విప్లవోద్యమంలో కొంత కాలం పని చేసి సాధారణ జీవితం గడుపుతున్నారు. అయినప్పటికీ విప్లవోద్యమం నుండి దూరం కాకుండా పార్టీని అంటిపెట్టుకొని వున్నారు.

కా. సృజనది విప్లవ కుటుంబమే కాకుండా వరంగల్ జిల్లా విప్లవోద్యమ నిర్మాణానికి బీజాలు వేసిన కా. జన్ను చిన్నాలుకు తను మేన కోడలు. కా. సృజన చిన్న తనం నుండే కా. చిన్నాలు యొక్క ప్రేరణతో, స్ఫూర్తితో విప్లవాన్ని ప్రేమించడం, చదవడం అలవాటు చేసుకున్నది. అలాగే గ్రామం కూడ పార్టీకి పెట్టని కోటగా పని చేయడం, తన తల్లి ప్రజాసంఘంలో క్రియాశీలంగా పని చేయడంతో కా. సృజనకు చిన్న తనం నుండే పార్టీ చరిత్ర, సాహిత్యం పరిచయమయ్యాయి. నవత ప్రాథమిక విద్య నుండి హైస్కూల్ విద్య వరకు తన స్వంత గ్రామమైన పైడిపల్లిలోనే చదువుకుంది. చిన్నతనం నుండే కా. సృజన ప్రజా సంఘాల కార్యకర్తలతో వివిధ సభలకు, సమావేశాలకు ముఖ్యంగా మహిళా సంఘాల కార్యక్రమాలకు, అమర వీరుల బంధు మిత్రుల సంఘం కార్యక్రమాలకు తన తల్లితో పాటు హాజరయ్యేది.

పై చదువుల (ఇంటర్మీడియట్) కోసం హైదరాబాద్ చేరుకుంది. నగరంలో, కాలేజీలలో మహిళలపై వేదింపులకు, అత్యాచారాలకు, వివక్షలకు వ్యతిరేకంగా పోరాడుతూనే ప్రజాస్వామిక తెలంగాణ కోసం జరుగుతున్న పోరాటంలో తన వంతు పాత్రను పోషించేది. ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతూనే కా. సృజన తన కార్యాచరణను మరింత విశాలం చేసుకోవడంలో భాగంగా 2006 అక్టోబర్‌లో పార్టీలోకి పూర్తికాలం కార్యకర్తగా వచ్చింది. ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో పోలీసులు కా. సృజనను అరెస్టు చేసి, చిత్రహింసలు పెట్టినప్పటికీ పార్టీ నాయకత్వాన్ని రక్షించడం కోసం తను ధైర్యంగా, మనో నిబ్బరంగా శత్రువుతో వ్యవహరించింది. దీనితో ఏమి చేయలేని శత్రువు సృజనను జైల్లో వేశాడు.

కా. సృజన అనారోగ్యంగా వుండగా శత్రువు పెట్టిన చిత్రహింసలు తనను మరింత అనారోగ్యం పాలు చేసినాయి. సంవత్సర కాలం జైలు జీవితాన్ని గడిపింది. ఆ సమయంలో జైలులో సీనియర్ నాయకత్వం వుండడంతో కామ్రేడ్ సృజనకు జైలు కూడా పోరు పాఠశాల అయింది. జైలులో విప్లవ పాఠాలు నేర్చుకుంటూనే జైలు అధికారుల దోపిడీకి, అవినీతికి వ్యతిరేకంగా, ఖైదీల హక్కులకై, జైలులోని మహిళా సమస్యలపై జరిగే పోరాటాలలో చురుకుగా పాల్గొన్నది.

2008 జనవరి నుండి ఏటూరు నాగారం-మహాదేవపూర్ ఏరియాలో తన కార్యాచరణను కొనసాగించింది. దళం అలసి పోయినప్పుడు తన కవితలతో దళాన్ని ఉత్తేజపరిచేది. ఈ ఏరియాలో దాదాపు 8 నెలలు పని చేసిన తరువాత పై కమిటీల పనులరీత్యా కా. సృజనను సీ.ఆర్.బీ. ప్రెస్‌కు బదిలీ చేశారు.

2008 సెప్టెంబర్‌లో సీ.ఆర్.బీ. ప్రెస్ యూనిట్‌కు వచ్చిన తరువాత తనకు పరిచయం లేని కంప్యూటర్ జ్ఞానాన్ని నేర్చుకొని సీ.ఆర్.బీ. పత్రిక అయిన క్రాంతి తీయడానికి రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసేది. అంతే కాకుండా కేంద్ర కమిటీ అందించే సాహిత్యాన్ని, సర్క్యులర్లను, కరపత్రాలను వివిధ రాష్ట్రాల క్యాడర్‌కు అందించడంలో తన పాత్ర కూడా వుంది. ప్రెస్ పనులు చేస్తూనే ఖాళీ సమయంలో సమిష్టి పనులు చేస్తూ ప్లాటూన్‌లో క్యాడర్‌తో కలిసిపోయేది. వారితో కలుపుగోలుగా వుంటూనే తనకు రాని గోండీ భాషను త్వరలోనే నేర్చుకొని తెలుగు పత్రికలను,

సమాచారాన్ని క్యాడర్‌కు కోయలో చెప్పగలిగేది. పీ.ఎల్.లో మంచి డాక్టర్‌గా కూడా తన సేవలను అందించింది.

శత్రు నిర్బంధ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పార్టీ నాయకత్వం తాత్కాలికంగా క్రాంతి పత్రికను 2013లో నిలిపి వేసింది. ఈ పరిస్థితులలో కా. సృజనను తిరిగి తెలంగాణ రాష్ట్ర కమిటీ పరిధిలోకి (స్టాఫ్‌గా) ఫిబ్రవరి 2014లో బదిలీ చేశారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రెస్ యూనిట్ ప్రారంభం కాగానే అందులో రెండు సంవత్సరాలు పని చేసింది. తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార పత్రికలు అయిన తెలంగాణ సమాచార బులెటిన్‌లు-రెండు, ప్రజా విముక్తి పత్రిక-1 రావడానికి తను కృషి చేసింది. డి.కే.లోని దక్షిణ బస్తర్, పశ్చిమ బస్తర్ ప్రజలలో కూడా చాల మందికి నవతతో పరిచయముంది. కా. రాగోది చిన్న పిల్ల మనస్తత్వం. సహకార ధోరణి, స్నేహ స్వభావం గల రాగోను అందరూ ఇష్టపడేవాళ్ళు. ఆమె ఎక్కడున్నా నవ్వుల పువ్వులు విరబూసేవి, సేలయేరు గలగలలు వినిపించేవి. అనారోగ్యంతో ఉన్న సహచరుడికి కొన్ని బిస్కెట్లు తినిపించి, సగం ప్యాకెట్ అక్కడే భద్రపరిచి బయటికి వెళ్లిన రాగో శత్రు చేత చిక్కి అమరురాలైంది.

కా. నవతలోని పట్టుదలను, కలిసిపోయే సుగుణాలను, అనారోగ్యాన్ని సహితం లెక్క చేయకుండా తుది శ్వాస విడిచే వరకు పోరాడిన త్యాగాన్ని ఎత్తిపడుదాం. కా. సృజన ఆశయాలను తుదివరకు కొనసాగిస్తామని శపథం చేద్దాం.

కా. రాగో, కా. లచ్చాల్‌ల శవాలను అమరుల బంధుమిత్రుల సంఘం పైడిపల్లికి తీసుకరాగా, గ్రామస్థులు వేలాది ప్రజల సమక్షంలో విప్లవ సాంప్రదాయంతో దహన సంస్కారం చేసారు. కా. లచ్చాల్‌ను కన్న, పెంచిన తల్లులిద్దరూ పైడిపల్లికి వచ్చి పాల్గొన్నారు. లచ్చాల్‌కు పైడిపల్లి మూడో తల్లి అయింది.

## కామ్రేడ్ దనసరి సారక్క (అనిత)

కామ్రేడ్ దనసరి సారక్క (అనిత, పీ.ఎం.) వరంగల్ జిల్లా కొత్తగూడ మండలంలోని మడగూడెం గ్రామంలో పేద ఆదివాసీ కుటుంబంలో 25 సం॥రాల క్రితం జన్మించింది. నలుగురు అక్కా చెల్లెళ్లు, ముగ్గురు అన్నదమ్ములు వున్నారు. పేదవారు కావడంతో చదువుకోలేదు. చిన్న తనంలోనే అదే మండలంలోని ఎర్రారం గ్రామస్థునితో తల్లి దండ్రులు వివాహం జరిపించారు. తన గ్రామం విప్లవ రాజకీయాలకు నెలవు కావడంతో ప్రజా పోరాటాలలో చురుకుగా పాల్గొన్నది. వేళ్లూనికొని వున్న పితృస్వామ్య వ్యవస్థకు, గృహహింస, సారా వ్యతిరేక ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీ.డీ.పీ. అధికారంలోకి వచ్చిన తర్వాత



మహిళా సంఘంలో పని చేస్తున్న క్రమంలో తమ నియోజకవర్గ ఎం.ఎల్.ఏ. అయిన సీతక్క అనుచరురాలిగా కొంతకాలం పని చేసిన తర్వాత ఏ బూర్జువా రాజకీయ పార్టీలు పేదవాళ్ల ఆకలిని తీర్చేవి కావని, పీడితులను మరింత దోచుకొని ఆస్థులను కూడబెట్టుకోవడానికేనని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలోని లోసుగులను గమనించింది. ఇలా సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను, మహిళలపై జరుగుతున్న హింస, అత్యాచారాలను సునిశిత దృష్టితో పరిశీలిస్తూ, అభ్యుదయంగా ఆలోచిస్తూ తన భర్తలో పేరుకుపోయిన పితృస్వామ్య భావజాలాన్ని ఎండగడుతూ, అతని అవలక్షణాలను నిరంతరం గుర్తుచేస్తూ, అభ్యుదయ ఆలోచనపరురాలిగా వ్యవహరిస్తున్న కా. సారక్కను తన భర్త నిరంతరం వేదించసాగాడు.

ఈ క్రమంలో కుటుంబ బంధనాలను తెంచుకొని అందుబాటులో వున్న సీ.పీ.ఐ.(ఎం.ఎల్.) న్యూ డెమోక్రసీ దళంలో చేరింది. అనతి కాలంలోనే కమ్యూనిస్టు ముసుగులో న్యూడెమోక్రసీ పార్టీ, దళ నాయకులు అవలంభించే విధానాలు, పద్ధతులు, సొంత ఆస్థులు కూడబెట్టుకోవడం, మహిళల పట్ల చిన్న చూపు, ప్రజల కోసం పని చేస్తున్నామనే భ్రమే తప్ప, వాస్తవం లేదని న్యూడెమోక్రసీ వర్గ సంకర రాజకీయాలను ఎండగడుతూ భారతదేశంలో పీడిత ప్రజల విముక్తి కోసం నిస్వార్థంతో పనిచేస్తున్న మావోయిస్టు పార్టీ వైపు అడుగులు వేసింది.

కా. దనసరి సారక్క 2014 ఆగస్టులో ఇల్లెందు-నర్సంపేట దళ సభ్యురాలిగా చేరింది. చిన్నతనం నుండి కష్టాలను అనుభవించిన కా. అనిత అందరితో కలివిడిగా ఉంటూ చదువు నేర్చుకొనుటకు నిరంతరం శ్రమించేది. 10 రోజులు జరిగిన మిలిటరీ క్యాంపులో ఉత్సాహంగా పాల్గొన్నది. ఏరియాలోకి దళం వెళ్లినపుడు తను స్థానికురాలు కావడంతో పైలట్‌గా, కోరియర్‌గా పని చేసేది. తెలంగాణలో విప్లవోద్యమ పునర్నిర్మాణానికి తన బంధువులను, మిత్రులను విప్లవోద్యమానికి పరిచయం చేస్తూ నిర్మాణాల పునాదిని పటిష్టం చేయడంలో ఎంతో కృషి చేసింది.

## కా. పద్దం చైతు (రోషన్)

కా. చైతు (పీ.ఎం.) ది బీజాపూర్ జిల్లా ఊసూరు బ్లాక్‌లోని పెద్ద భట్టుం గ్రామం. 22 సంవత్సరాల క్రితం ఒక మధ్య తరగతి ఆదివాసి కుటుంబంలో లక్కు, సోమె దంపతులకు మూడో సంతానంగా జన్మించాడు.

కా. చైతు బాల్యమంతా విప్లవ కార్యకలాపాల నడుమనే వికసిస్తూ వచ్చింది. బాలల సంఘంలో ఉంటూనే పంచాయితీ జనతన సర్కార్ పాఠశాలలో ప్రాథమిక విద్యనభ్యసించాడు. 16 ఏళ్ళ వయస్సు వచ్చాక దండకారణ్య ఆదివాసీ రైతుకూలీ సంఘంలో చేరాడు. ఆ తరువాత క్రమంలో జీ.ఆర్.డీ.లో వుంటూ మిలిటెంట్‌గా పని చేశాడు.



కా. చైతు పూర్తికాలం పార్టీలోకి 2012లో వచ్చాడు. గత నాలుగు సంవత్సరాలుగా కా. చైతు పార్టీలో మిలిటరీ రంగంలో పని చేశాడు. పామేడ్ ఏరియా పరిధిలో జరిగిన అనేక మిలిటరీ చర్యలలో, టీ.సీ.ఓ.సీ. కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నాడు. అనేక ఘటనలలో కా.చైతు గందరగోళ పడకుండా శత్రువుపై సాహసాన్ని, వీరత్వాన్ని ప్రదర్శించాడు. పార్టీ అతనిలోని పోరాట పటిమను, క్రమశిక్షణను గుర్తించి కా. చైతును నాయకత్వ కామ్రేడ్‌కు గార్డుగా నియమించింది. అయితే కొద్ది సమయంలోనే తను ఒక మిలిటరీ ట్రైనింగ్ క్యాంపులో ఒక నూతన సైనిక విన్యాసాన్ని నేర్చుకునే క్రమంలో గాయపడ్డాడు. చికిత్స చేయించుకొని త్వరలోనే తిరిగి తన పనుల్లో నిమగ్నమయ్యాడు.

2015లో ఒక ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా కా. చైతును స్థానిక పార్టీ కమిటీ తెలంగాణకు పంపింది. సంవత్సరన్నర కాలం తెలంగాణలోనే పని చేశాడు. కా. చైతు భవిష్యత్తుపై స్థానిక పార్టీ కమిటీ ఎన్నో ఆశలు పెట్టుకుంది. పీ.ఎల్.జీ.ఏ. క్యాడర్స్ " ఒక అలగా ఎగిసిపడ్డ ప్రతిఘటనా రూపాన్ని" కా. చైతులో చూసారు. కా. చైతులోని ఆదర్శాలు, పట్టుదల మనకందరికి ఆదర్శం. కా. చైతు శవాన్ని ప్రజలు అనేక కష్టాల మధ్యనే భద్రాచలం నుంచి తెచ్చుకొని విప్లవ సాంప్రదాయాలతో దహన సంస్కారాలు చేశారు. అంతిమయాత్రలో అనేక గ్రామాల ప్రజలు పాల్గొని తమ కన్నీటితో అంతిమ వీడ్కోలు పలికారు. కా. చైతు ఆశయమైన విప్లవాన్ని విజయవంతం చేద్దామని ప్రతిన బూనారు.

## కా. నూపో రామె

కా. రామె (పీ.ఎం.)ది బీజాపూర్ జిల్లా ఊసూరు బ్లాక్‌లోని నర్సాపురం గ్రామం. త్యాగాలకు పేరుగాంచిన, ప్రతిఘటనకు మరో రూపమున్న ఈ గ్రామం పది మంది విప్లవ వీరుల్ని విప్లవానికి అంకితమిచ్చింది. అందులో కా. రామె ఒకరు. కా. రామే పేద కుటుంబంలో తల్లి దండ్రులకు రెండో సంతానంగా 23 ఏళ్ల క్రితం జన్మించింది. రామెకు ఒక అక్క, ఇద్దరు తమ్ముళ్లు వున్నారు. చిరు ప్రాయంలోనే అమ్మ ప్రేమకు దూరమయింది. తండ్రిని పోలీసులు అరెస్టు చేసి జైల్లో వేసారు. తండ్రి అంధుడు. చిన్న వయసులోనే అక్కకు పెళ్లి అయింది. అప్పట్నుంచి రామె కుటుంబానికి పెద్ద దిక్కయింది.

2006లో కా. రామె ఇంటిని సల్వాజుడుం గూండాలు కాల్చివేయగా, సర్వం కోల్పోయి అనేక కష్టాలు పడ్డారు. కా. రామె జూలై 2012లో పీ.ఎల్.జీ.ఏ.లోకి రిక్రూట్ అయింది. అప్పటి నుండి తన చివరి శ్వాస వరకు కా. రామె ఉత్సాహంగా పార్టీ ఇచ్చిన పనుల్లో పాల్గొంది. త్వరగా చదువు నేర్చుకొని, ఇతరులకు కూడా చదువు చెప్పేది. సంవత్సరం పాటు పామేడ్ ఏరియా స్థానిక దళాలలో పని చేసింది. పార్టీ 2013లో కా. రామెను కా. సోని (తనతో అమరురాలైన) కి గార్డుగా నియమించింది. దీర్ఘకాలం అనారోగ్యంతో బాధపడుతున్న కా. సోనికి రామె బాధ్యతాయుతంగా గార్డుగా విధులు నిర్వహించింది. విప్లవ స్ఫూర్తితో సేవలందించింది.

కా. రామె ఎక్కువగా మాట్లాడేది కాదు. పనులలో మాత్రం ముందుండేది. సమస్యలు ఎదురైనప్పుడు ఊగిసలాటకు గురయ్యేది కాదు. తనలో జరిగే తప్పుల్ని సూచిస్తే నిజమైన కమ్యూనిస్టు చైతన్యంతో స్వీకరించేది. దొరికిన సమయాన్ని వినియోగించుకుని అధ్యయనం చేస్తూ తన రాజకీయ చైతన్యాన్ని పెంపొందించుకునేందుకు ప్రయత్నించేది. కా. సోనితో పాటే కా. రామె కూడా సజీవంగా పోలీసుల చేతికి చిక్కింది. పులి నోటికి చిక్కానని అర్థమయ్యి కూడా కా. రామె వర్గ రాజకీయాలను మరువలేదు. పోరు వారసత్వాన్ని విడువలేదు. శత్రువు చిత్రహింసల్ని వర్గ చైతన్యంతో ఓడించింది. ప్రాణాన్ని ఫణంగా పెట్టి అమరుల ఆశయాలను ఎత్తిపట్టింది. తనువు చాలించిన ఆ పోరు బిడ్డ అంతిమయాత్రకు వందల సంఖ్యలో ప్రజలు తరలివచ్చి కా. రామె ఆశయ సాధనకు అంకితమవుదామని శపథం చేసారు.

## కా. మాడివి దేవె

కా. దేవె (పీ.ఎం.)ది బీజాపూర్ జిల్లా ఊసూరు బ్లాక్‌లోని మెట్టగూడెం. దండకారణ్యంలో విప్లవోద్యమం తొలి అడుగులు పడ్డప్పటి నుండి చాల బలమైన విప్లవ రాజకీయాలతో, నిర్మాణాత్మక కార్యక్రమాలతో ముడిపడి వున్న పామేడ్ ఏరియాలోని మెట్టగూడెం గ్రామంలో ఒక పేద ఆదివాసీ కుటుంబంలో 18 సం॥రాల క్రితం జన్మించింది. కా. దేవె తల్లిదండ్రులు మాడివి జోగి, సుక్కాలు. దేవెకు ఒక అన్న, ఒక అక్క ఒక తమ్ముడు, ఒక చెల్లెలు వున్నారు. తమ అత్త మామలకు బిడ్డలు లేని కారణంగా చిన్న వయస్సు నుండే దేవెను పెంచుకున్నారు. అలా తన అత్త, మామల వద్దనే

ఎంతో కష్టపడుతూ వారికి తోడ్పటునందించింది. మెట్టగూడెం ఒక విప్లవ గ్రామం కావడంతో ఈ వాతావరణంలో పుట్టి పెరిగిన కా. దేవె సహజంగానే విప్లవోద్యమానికి ఆకర్షితురాలయింది. తన బాల్యంలోనే బాలల సంఘంలో పనిచేస్తూ, వయసు పెరిగిన క్రమంలో మిలీషియా, జీఆర్‌డీ లలో పని చేస్తూ ప్రజా కార్యక్రమాలకు శత్రువు ప్రమాదం నుండి రక్షణనిచ్చింది.



కా. మాడివి దేవె 2015 డిసెంబర్‌లో పీ.ఎల్.జీ.ఏ.లోకి రిక్రూట్ అయింది. తను పార్టీలోకి వచ్చేముందు కుటుంబ సభ్యులందరితో మాట్లాడి వాళ్ళందరూ కూడా తన ప్రతిపాదనను స్వీకరించేలా స్వయంగా తానే సిద్ధపరిచింది. అయితే నేడు ఇంత తక్కువ కాలంలోనే ఈ కుటుంబాన్నే కాకుండా, పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, విప్లవ ప్రజానికాన్ని విడిచి తను నమ్మిన విప్లవ లక్ష్య సాధన కోసం అమరురాలు కావడమనేది విప్లవ ప్రజానీకానికి దిగమింగుకోలేని దుఃఖమే. ఆ పోరులో గాయపడ్డ కా. దేవెను పోలీసు మృగాలు చిత్రహింసలు పెట్టి హత్యచేశారు. తనలోని వర్గకసే కా. దేవెను అమరుల వారసత్వాల సరసన నిలిపింది. కా. దేవె శవాన్ని భద్రాచలం నుండి తెచ్చుకోవడానికి ప్రజలందరూ ముఖ్యంగా మహిళలందరూ వీరోచితంగా పోరాడారు. తమ ఊరి, ఆ ప్రాంతపు పోరాట వారసత్వాన్ని తన అమరత్వంతో ఎత్తిపట్టిన కా. దేవె శవాన్ని వేలాది విప్లవ ప్రజానీకం దుఃఖ సముద్రంలోనే విప్లవ ఒరవడిలో అంత్యక్రియలు నిర్వహించారు. కా. దేవె ఆశయాలను నెరవేరుస్తామని శపథం చేసారు. ○

## కామ్రేడ్ జతీన్‌దాస్

**జైలులో రాజకీయ ఖైదీల హక్కుల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తూ అమరత్వం పొందిన రోజు**

సెప్టెంబర్ 13న జైలు ఖైదీల హక్కుల దినంగా పాటిద్దాం

- ★**జైలులో నిర్బంధాన్ని ఖండిస్తూ, ఖైదీల హక్కుల కోసం పోరాడి అమరులైన కామ్రేడ్స్‌కు జోహార్లు**
- ★**రాజకీయ ఖైదీల విడుదలకై పోరాడుదాం**
- ★**జైలులో రాజకీయ ఖైదీల పోరాటాలకు మద్దతు నిద్దాం**

***(39వ పేజీ తరువాయి)***

(ఒడిశా-ఎ.పి-చత్తీష్‌గడ్) డి.జి.పిలు, సి.ఆర్.పి.ఎఫ్, బి.ఎస్.ఎఫ్, డైరెక్టర్ జనరల్స్‌తో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ జరిపిన సమావేశంలో ఆమోద ముద్ర వేసారు. తత్ఫలితంగానే ఆంధ్రప్రదేశ్‌కు ఒక బెటాలియన్ సరిహద్దు భద్రతా బలగాలను కేటాయిస్తున్నట్టు ప్రకటించాడు. రాజ్యం తలపెట్టిన సాయుధ అణచివేత కార్యక్రమం ఇక్కడి పచ్చదనాన్ని పొట్టన బెట్టుకొని కోట్ల రూపాయలు గడించడానికే అనేది స్పష్టమే. బయటకు మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా కనిపిస్తున్నా, దాని వెనక ఆదివాసీ సమూహాల నిర్మూలన, స్థానభ్రంశం చేయడం అనంతరం బాక్సైట్ నిక్షేపాలను వెలికితీయడానికి మార్గం సుగమం చేయడం. వాటిని సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేయడం అనేది నిర్వివాదమైన అంశం.

**విశాఖ ఏజెన్సీ – కోరుకొండలో ఔట్‌పోస్టులకు వ్యతిరేకంగా ఆదివాసుల పోరాటం**

విశాఖ ఏజెన్సీలో మళ్లీ వాతావరణం వేడెక్కుతుంది. చింతపల్లి మండలం, బలపం పంచాయితీ ఆర్.జె. కొత్తూరులో నిర్మించ తలపెట్టిన పోలీస్ ఔట్ పోస్టుకు వ్యతిరేకంగా ఆదివాసులు కదం తొక్కారు. బలపం పంచాయితీ పరిధిలోని గ్రామాల వారితో పాటు ఒడిశా సరిహద్దు గ్రామాల గిరిజనులు ఆందోళనకు దిగారు. జిల్లా ఎస్.పి. కోయ ప్రవీణ్‌కుమార్ రాళ్ళగెడ్డ కొత్తూర్‌లో ఔట్‌పోస్టు నిర్మాణానికి స్థల పరిశీలన జరిపి, నిర్మాణానికి అవసరమైన కొలతలు తీసారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆదివాసులు తొలుత కోరుకొండ గ్రామంలో పెద్ద సంఖ్యలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంతబయలు నుండి కోరుకొండ జంక్షన్ వరకు పోలీస్ ఔట్‌పోస్ట్ ఎత్తివేయాలి! బాక్సైట్ తవ్వకాలు జీ.వో.నెం. 97 తక్షణమే రద్దు చేయాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేసారు. దీంతో కోరుకొండ గ్రామం ఒక్కసారిగా దద్దరిల్లింది. ర్యాలీ అనంతరం రాళ్లగెడ్డ కొత్తూరులో నిరసన చేపట్టేందుకు వెళ్లారు.

అమానవీయమైన చంద్రబాబు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తమ అస్థిత్వాన్ని కాపాడుకోవడానికి, ఆత్మగౌరవ పోరాటాల వారసత్వాన్ని కొనసాగిస్తూ జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికారంకై ప్రజలు సాయుధంగా సంఘటితంగా పోరాడుతున్నారు. ఈ పాలకవర్గాలు అభివృద్ధి ముసుగులో ఆదివాసీలను అంతం చేసే దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నాయి. 2 దశాబ్దాలుగా బాక్సైట్ గనులు తవ్వకుండా నిలువరిస్తున్న విప్లవోద్యమం ప్రజల మౌలిక సమస్యలతో ముడిపడి ఉన్న ఉద్యమం. నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం ద్వారా దోపిడీ వర్గాలను నాశనం చేసి, ఇటువంటి విస్తాపన సమస్యలను పరిష్కరించడమే కాక సమస్త ప్రకృతి సంపదను ప్రజల హక్కుగా నిలిపే సామ్యవాద వ్యవస్థను నిర్మిస్తుంది. ○

# బహుముఖ ప్రజ్ఞావంతుడు, దళిత, ప్రజాస్వామిక ఉద్యమాల నాయకుడు

# విప్లవోద్యమ మిత్రుడు బొజ్జా తారకంకు విప్లవ జోహార్లు

కామ్రేడ్ బొజ్జా తారకం తూర్పు గోదావరి జిల్లా కాట్రేనికోన మండలం కందికుప్ప గ్రామంలో 1940 సంIIలో జన్మించాడు. తండ్రి అప్పలస్వామి ఉపాధ్యాయుడు, అమలాపురం నియోజక వర్గం ఎం.ఎల్.ఏ.గా కూడా ఎన్నికైనాడు. భార్య విజయ భారతి ప్రముఖ దళిత కవి బోయి భీమన్న కూతురు, విద్యావంతురాలు. ఇటువంటి సామాజిక నేపథ్యం ఉన్న తారకం గారు మొదట కాకినాడలో కొంతకాలం న్యాయవాద వృత్తిని మొదలు పెట్టినా తర్వాత విజయ భారతి గారి ఉద్యోగం బదిలీ కావడంతో నిజామాబాద్‌కు వచ్చి లాయర్‌గా ప్రాక్టీస్ కొనసాగించారు.



నిజామాబాద్‌లోనే ప్రజాస్వామిక ఉద్యమాలలో పాల్గొంటూ దళితుల హక్కుల కోసం పోరాటాలను ప్రారంభించాడు. అంబేద్కర్ సంఘాన్ని ప్రారంభించి నడిపారు. పౌరహక్కుల సంఘంలో ఉపాధ్యక్షుడుగా పని చేసారు. ఆయనను ప్రభుత్వం ఎన్నో సార్లు అరెస్టు చేసి జైలులో నిర్బంధించింది. ఎమర్జెన్సీలో కూడా ఆయన కొన్ని నెలలు జైలు జీవితం గడిపారు. నిర్బంధంలో తన అనుభవాల ఆధారంగా రాసిన "పోలీసులు అరెస్టు చేస్తే" అనే రచన విస్తృత ప్రచారం పొందింది.లక్షకు పైగా కాపీలు అమ్ముడుపోయాయి. 30 వేల కాపీలను పోలీసులు కొని తగుల బెట్టారు. ఆ రచన తన జీవితంలో ఎన్నో సమస్యలకు దారి చూపించిందని తారకంగారు స్వయంగా చెప్పారు. అలాగే ఉద్యమం ఆయనకు సరైన దిశను చూపించిందన్నారు. దళిత ఉద్యమ నేతగా బొజ్జా తారకం గారికి బడుగు వర్గాల ప్రజల్లో మంచి గుర్తింపు ఉంది. సీ.పీ.ఐ. (ఎం.ఎల్.) తరపున లోకసభకు పోటీ చేసి ఓడిపోయారు. తారకం గారు అన్యాయాన్ని సహించరు. 1985లో కారంచేడులో దళితులపై జరిగిన మారణకాండకు నిరసనగా గవర్నమెంటు ప్లీడర్ పదవికి రాజీనామా చేసారు. అప్పుడే జడ్జి అయ్యే అవకాశం గురించి చర్చిస్తే "జడ్జి కావడం కన్నా ప్రజలు ముఖ్యం" అన్నారు. కత్తి పద్మారావు కార్యదర్శిగా దళిత మహాసభను స్థాపించారు. పునరావాస శిబిరానికి క్రియాశీల మద్దతునిచ్చారు. కారంచేడు ఘటనకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాపితంగా వచ్చిన ప్రజా కదలిక, దళితుల్లో కలిగిన చైతన్యంలో విప్లవోద్యమ చొరవను తారకం గారు ఆహ్వానించారు. ఆ ఉద్యమంతో పాటు వరుసనే జరిగిన చుండూరు, నీరుకొండ, పదిరికుప్పం, వేంపేట, లక్ష్మీపురం, వై. చెర్లోపల్లి లాంటి దళితులపై జరిగిన దారుణ మారణకాండలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాన్ని నిర్మించడంలో ప్రముఖ భూమికను నిర్వహించారు. తారకం గారు సంపాదకులుగా 1991 నుండి 1994 వరకు 4 సంIIల పాటు నలుపు పత్రికను నడిపారు. స్వయంగా కుల వివక్షను, వేదనను అనుభవించిన దళిత మేధావి తారకం గారు కుల నిర్మూలన కోసం అంబేద్కర్ సిద్ధాంతాన్ని స్వీకరించారు. దళితులకు రాజ్యాధికారం అవసరాన్ని గుర్తించి అంబేద్కర్ స్థాపించిన రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగారు. ఆ మేరకు ఆయన పరిమితులు పెట్టుకుని ఉండలేకపోయారు. అసమానతలున్న వర్గ సమాజంలో భూమి, భుక్తి, విముక్తి లక్ష్యంగా జరుగుతున్న విప్లవోద్యమంకు మద్దతుగా నిలిచారు. హై కోర్టు లాయర్‌గా, పౌరహక్కుల ఉద్యమ నేతగా, మంచి రచయితగా, మంచి వక్తగా సమాజాన్ని చైతన్య పరిచారు. యువతరాన్ని ఉత్తేజ పరిచాడు. వివిధ సామాజిక రంగాల్లో పని చేసారు. సామాజిక మార్పు కోసం విశేషంగా కృషి చేసారు. చుండూరు కేసును ప్రత్యేక కోర్టుకు బదిలి చేసినపుడు బి. చంద్రశేఖర్ జడ్జిగా, తారకం స్పెషల్ ప్రాసిక్యూటర్‌గా ప్రజల తరపున కేసులకు న్యాయం జరిగేలా విశేషంగా కృషి చేసారు. బొజ్జా తారకం అధ్యక్షుడుగా చుండూరు దళితుల న్యాయ పోరాట కమిటీని ఏర్పాటు చేసారు.

**పౌరహక్కుల నేతగా ప్రధాన భూమిక** – రాజ్యహింసకు, బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా పోరాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోజరిగిన ఎన్‌కౌంటర్లపై కోర్టుల్లో బాధితుల పక్షాన నిలబడి అవన్నీ బూటకపు ఎన్‌కౌంటర్లని నిరూపించడంలో కీలకపాత్ర వహించారు. ఎన్‌కౌంటర్లు జరిగిన ప్రాంతాలకు వెళ్ళే నిజ నిర్ధారణ కమిటీల్లో ఉండేవారు. పౌరహక్కుల సంఘం నాయకులు హత్యలకు గురయినపుడు తీవ్రంగా ప్రతిస్పందించారు. రాష్ట్రంలోను, దేశంలో రాజ్యహింసకు వ్యతిరేకంగా జరిగిన అనేక పౌరహక్కుల ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఖైదీల హక్కుల కోసం జరిగిన ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఉరిశిక్షను రద్దు చేయాలని పోరాడారు. కా. బొజ్జా తారకం గారు సీ.ఆర్.పీ.పీ. అధ్యక్షులుగా పనిచేసారు. కర్నాటక లోని తూనికూరు జైలు నుండి అనంతపూర్ జిల్లాకు చెందిన 20 మంది రాజకీయ ఖైదీలు విడుదల కావడానికి విశేషంగా కృషి చేసారు.

8 సంIIరాలు పౌరస్పందన వేదికలో పనిచేసిన తారకం గారు

చర్చల అనంతరం ప్రజా భూ కమీషన్ చైర్మెన్‌గా రాష్ట్రమంతా తిరిగి భూ సంబంధాలను అధ్యయనం చేసారు.

2004లో ప్రభుత్వం విప్లవ పార్టీలతో చర్చలు జరిపినపుడు మధ్యవర్తుల కమిటీలో ఉండి ప్రముఖ పాత్రను నిర్వహించారు. నాలుగు రోజులు చర్చల్లో భాగస్వామిగా ఉన్న తారకం గారు చివరలో సమీక్ష సందర్భంగా ప్రభుత్వం నిజాయితీ లేని విధానాన్ని బహిర్గతం చేస్తూ మాట్లాడడమే కాకుండా విప్లవ పార్టీలు ముందుకు తెచ్చిన భూమి, ప్రజాస్వామ్యం లాంటి ఏ సమస్యలకు సమాధానం చెప్పకుండా చీట్ చేసిందని ఆ మంత్రివర్గం ముందే ప్రభుత్వ విధానాన్ని నిశితంగా విమర్శించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం అండతో ఆదివాసీ ప్రజానీకంపై అమలు చేసిన సల్వాజుడుం హత్యాకాండను వ్యతిరేకించాడు. జూన్ 2012లో సార్కిన్‌గూడ మారణకాండపై వేసిన నిజనిర్ధారణ కమిటీలో నిజాలు వెల్లడించి ఆదివాసులకు అండగా నిలిచారు. గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా బీ.డీ.శర్మతో కలిసి దేశమంతా తిరిగి ప్రచారం చేసారు. 1/70 అమలు కోసం పోరాడిన తారకం గారు, 1989లో ఎన్.టీ.ఆర్. ప్రభుత్వం 1/70ని రద్దు చేయాలని చూస్తే తీవ్రంగా ప్రతిఘటించారు.

నిజాయితీ, నిర్మొహమాటం, సహకార ధోరణి, పీడిత ప్రజల పట్ల ప్రేమతో, ప్రజా ఉద్యమ చైతన్యంతో తారకం గారు అనేక రచనలు చేసారు. పోలీసులు అరెస్టు చేస్తే, నది పుట్టిన గొంతుక, నాలాగే గోదావరి, కులం-వర్గం, దళితుల రాజ్యం, పంచతంత్రం, "నేల, నాగలి మూడెద్దులు", 'చరిత్ర మార్చిన మనిషి-రుద్రాంధ్ర చరిత్ర' (2016) వంటి ఎన్నో రచనలు చేసారు. దోపిడీ వర్గ సమాజంలో కుల వివక్ష, మతోన్మాదం లపై చేసిన ముఖ్య రచనల ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేసారు. అణచివేత, ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా పోరాడారు.

తారకం గారు ముస్లిం మైనారిటీల హక్కుల కోసం పోరాడారు. వారిపై రాజ్యహింసను ఖండించారు. వికారుద్దీన్ లాంటి ఎన్నో బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండించారు. ఎన్‌కౌంటర్లను హత్యలుగా నమోదు చేయాలని హైకోర్టులో వాదించిన ప్రముఖుడు. ప్రత్యేక తెలంగాణ పోరాటాన్ని సమర్థించిన తారకంగారు నూతన రాష్ట్రంలో గ్రేహౌండ్స్ బలగాల గాలింపు చర్యలను, బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండించారు.

2016 సెప్టెంబర్ 16న శుక్రవారం రాత్రి కామ్రేడ్ బొజ్జా తారకం గారు అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. పీడిత ప్రజల పక్షాన నిలిచి పోరాడిన అమరునికి క్రాంతి పత్రిక వినమ్రంగా జోహార్లు చెబుతుంది.

తారకం గారు ఐదు దశాబ్దాల ఉద్యమకారుడు. నాలుగు దశాబ్దాల దళిత ఉద్యమ నాయకుడు. అట్టడుగు వర్గాల ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన ఉద్యమనేత. విప్లవ ప్రజలకు అండగా నిలిచిన హక్కుల నేత. అన్ని వర్గాల ప్రజలు, వివిధ రంగాలకు చెందిన ఆయా సంస్థల ప్రజా నాయకులు, ఆత్మీయులు, సహచరులు రెండు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చి అంతిమ యాత్రలో పాల్గొని నివాళులర్పించారు. ○

---

## మార్క్సిస్టు మహోపాధ్యాయుడు, విప్లవ నేత కామ్రేడ్ మావో సే - టుంగ్

### (జననం; డిసెంబర్ 26, 1893 - మరణం; సెప్టెంబర్ 9, 1976)

**కార్మికవర్గపు వర్గపోరాట ఎత్తుగడలను చైనా విప్లవ నిర్దిష్ట పరిస్థితులకు కా. మావో శాస్త్రీయంగా అన్వయింప చేశాడు. నూతన ప్రజాస్వామిక విప్లవంలో ఐక్యసంఘటన, సాయుధ పోరాటం, పార్టీ నిర్మాణం అనే మూడు మంత్రదండాలను గొప్పగా సమన్వయించాడు. ఐక్యసంఘటన అంటే సాయుధ పోరాటాన్ని నిర్వహించేందుకు ఉపయోగపడే ఐక్యసంఘటనగానూ, పార్టీ అంటే ఐక్యసంఘటన, ప్రజాసైన్యం అనే రెండు ఆయుధాలను ధరించిన వీరయోధగా మావో వివరించాడు.**

**కా. మావో 40వ వర్ధంతిని గొప్ప విప్లవోత్సాహంతో జరుపుకుందాం.**

# ఆమె జీవితమే పోరాటం-ఆదివాసులే ఆమె ఊపిరి
# అదే మహాశ్వేతాదేవి జీవిత మాధుర్యం

ఆమె నిండుగా ప్రవహించిన మహానది. ఆమె కలం నుండి జాలువారిన సాహిత్యం సృజనశీలంగా, సజీవంగా ఈ సమాజంలోని ఆటుపోటుల్ని స్పృశించింది, సృజించింది. మౌఖిక గాధలకు సాహితీ రూపం యిచ్చిన ఆమె ఆదివాసుల గొంతు, మహాందాయిగా చరిత్రలో నిలిచింది. మహాశ్వేతాదేవి బంగ్లాదేశ్ (అప్పటి తూర్పు బెంగాల్)లోని ఢాకా లో 1926లో జన్మించారు. తండ్రి మనీష్ ఘటక్ ప్రసిద్ధ కవి. తల్లి ధరిత్రిదేవి రచయిత్రి, సంఘ సేవకురాలు.



బాబాయ్ రుత్విక్ ఘటక్ భారతీయ సినిమాను మలుపు తిప్పిన గొప్ప దర్శకుడు. మేనమామలు ఒకరు ప్రఖ్యాత శిల్పి శంఖచౌదరి, మరొకరు సచిన్‌చౌదరి ఇ.పి.డబ్ల్యు. సంపాదకులు. అటువంటి కుటుంబ నేపథ్యం నుండి వచ్చిన మహాశ్వేతాదేవి ఢాకాలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. దేశ విభజన తరువాత ఆ కుటుంబం పశ్చిమ బెంగాల్‌కు తరలి వచ్చింది. ఆమె శాంతినికేతన్‌లో బి.ఎ. ఆనర్స్, కలకత్తా యూనివర్సిటీలో ఎమ్.ఎ. పూర్తి చేశారు. ప్రముఖ నాటక రచయిత బిజోన్ భట్టాచార్య (ఇప్టా వ్యవస్థాపకుల్లో ఒకరు) తో 1948లో వివాహం జరిగింది. వారి కుమారుడు నబరుణ్ భట్టాచార్య బెంగాలీ నవలాకారుల్లో సుప్రసిద్ధుడు. మహాశ్వేతాదేవి 1964లో బిజయ్‌గడ్ కాలేజీలో అధ్యాపక వృత్తిలో చేరారు.

చిన్న వయసులోనే 'గణనాట్య' అనే ధియేటర్ బృందంతో కలిసి పని చేశారు. బి.ఏ. చదువుతున్న రోజుల్లో మార్క్సిస్టు భావజాలం పట్ల ఆకర్షితురాలయ్యారు. కమ్యూనిస్టు అన్న ఆరోపణల కారణంగా 1950లో తపాలాశాఖలో ఉద్యోగాన్ని పోగొట్టుకున్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం ఆధారంగా 1956లో రాసిన "ఝాన్సీర్‌రాణి" తో రచనా జీవితం ప్రారంభించారు. ఈ రచన కోసం ఆమె గ్రంథాలయాలు, ఆర్కైవ్స్ పై ఆధారపడలేదు. ఆమె తొలి నుంచి మౌఖిక చరిత్రల్ని, జానపద జ్ఞానాన్ని గౌరవించారు. అమూల్యమైన చారిత్రక సమాచారం సామాన్య ప్రజల స్మృతుల్లోనే భద్రపరచబడి ఉంటుందని విశ్వసించారు. అందుకే ఝాన్సీ లక్ష్మీబాయి జీవించిన ప్రాంతాలన్నీ తిరిగి అక్కడ తర తరాలుగా ఆమెపై ప్రచారంలో వున్న కథల్ని స్థానిక మహిళల నుంచి సేకరించి రాశారు. ఈ పుస్తకం కోసం చేసిన ప్రయాణాలు ఆమెకు ప్రధాన స్రవంతి సమాజానికి ఆవలనే వుండిపోయిన జీవితాల పట్ల, వారి చరిత్రల పట్ల అనురక్తిని కలుగజేశాయి. అటు పిమ్మట ఆమె రచనా స్రవంతి మొత్తం ఆదిశగానే మళ్ళింది.

బ్రిటిష్ వారిపై పోరాడిన బిర్సాముండా అనే గిరిజన వీరుని జీవితం ఆధారంగా 1977లో ఆమె రాసిన 'అరణ్యేర్ అధికార్' నవల తొలిసారి ఆదివాసీల స్వరాన్ని నాగరిక సమాజానికి వినిపించింది. ఆదివాసీలు కూడా ఆమెను తమ గోడు వినిపించగల గొంతుగా గుర్తించారు. ఎంతో సాదరంగా తమలోకి స్వీకరించారు. తమ కథలు చెప్పుకోవటమే కాదు, ఆమె చెప్పిన తమ కథ 'అరణ్యేర్ అధికార్' ను ఆదివాసీ భాషలోకి అనువదించుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని గిరిజన తెగలైన లోధాలు, సాబర్స్ గురించి పరిశోధనాత్మక రచనలు చేశారు. అలాగే మహిళలు, దళితులు ఎదుర్కొంటున్న వివక్ష, సమస్యల గురించి ఎన్నో రచనలు చేశారు. బీహార్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో గిరిజనుల పోరాటాలకు వెన్నుదన్నుగా నిలిచారు. గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల గురించి ఎక్కువగా రాశారు.

చరిత్ర అనేది సామాన్యుల జీవితాల నుండే వస్తుందనీ, పీడిత తాడిత వర్గాలే తన రచనకి ఉత్ప్రేరణ అని, మనిషిని మనిషిగా చూసే సమాజం రావాలని, వర్గ పీడన నుంచి వర్గ పోరాటం ప్రారంభమయిందని తన రచనలు పీడిత వర్గాలకే అంకితమని మహాశ్వేతాదేవి ప్రకటించారు. ఆమె రాసిన వంద కథానికలు బెంగాలీ భాషలో 7 సంపుటాలుగా వెలువడ్డాయి. ఆమె రచనల్లో 'హజార్ చౌరసీయాకీమా', (1974), 'అగ్ని గర్భ' (1978), 'వివిక బిదార్ పలి గణేష్ మహిమ' (1981), సామాజిక హింసకు, విషాదానికి ఒక తిరుగులేని దాఖలాగా 'రుదాలీ' వంటి ఎన్నో అద్భుతమైన రచనలు వున్నాయి. ఆమె రచనల్లో కొన్నింటిని హిందీలో సినిమాలుగా తీశారు. ఆమె సాహిత్యాన్ని హిందీ, ఇంగ్లీష్‌ల్లోనే కాక, అనేక భారతీయ భాషల్లోకి అనువదించడం ద్వారా విస్తృతమైన పాటక జనంలోకి ఆమె రచనలు వెళ్ళాయి.

ఆమెకు లెక్కలేనన్ని అవార్డులు వచ్చాయి. కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు (1979), జ్ఞానపీఠ్ అవార్డు (1996), రామన్ మెగసేసే అవార్డు (1997) లాంటివి ఎన్నో వచ్చాయి.

అవార్డులన్నింటి కన్నా ప్రజల ఆదరణ, అభిమానమే తనకు ఎంతో ప్రియమైనవని పలు సందర్భాల్లో ఆమె పేర్కొన్నారు.

కలకత్తాలోని తన నివాసంలో ఆదివాసులు తయారు చేసిన వస్తువులు సేకరించి, అమ్మి వారికి సహాయం చేసింది. ఆమె ఆదివాసీ ప్రపంచ బందీ. ఆ పారవశ్యమే ఆమెకు జీవన మాధుర్యమైంది. నందిగ్రాం, సింగూర్ పోరాటాలతో ఆమె పోరాట ఆచరణ విస్తరించింది. లాల్‌గడ్ పోరాటం ఆమెలో నూతన విశ్వాసాన్ని రగిలించింది. కిషన్‌జీని మమతా ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపినప్పుడు భ్రమలన్నీ విడిపోయి సి.పి.ఎమ్. లాగే తృణమూల్ కాంగ్రెస్ కూడా ఫాసిస్టు పోకడలు పోతున్నదని విమర్శించారు.

1970 దశకం దేశాన్ని విప్లవ మార్గంలోకి నడిపిన నక్సలైట్ ఉద్యమం నేపథ్యంలో రచించిన 'హజార్ చౌరాసియాకీమా' (ఒక తల్లి పేరుతో వచ్చిన తెలుగు నవల)ను, 'రుడాలి' నవలను అవే పేర్లతోను 'గాంగోర్' అనే కథను 'చోలీకే పీఛే' అనే పేరుతోను హిందీలో తెరకెక్కించారు.

అంతరించి పోతున్న గిరిజన తెగలు, పలుకుబడులు, జన పదాలను గ్రంధస్థం చేయాల్సిన అవసరం ఉందని ఆమె తరచు స్పష్టం చేస్తుండేవారు. పరపీడన నుండి వర్గ పోరాటం ప్రారంభమైందన్నది ఆమె నిశ్చితాభిప్రాయం. అందుకే ఆ పోరాటాలకు మద్దతునిచ్చారు.

1959 లో భర్తతో విడాకులు తీసుకున్నారు. వృద్ధాప్యంలో కొడుకు కేన్సర్ వ్యాధితో చనిపోయాడు. వ్యక్తిగత జీవితంలో కొన్ని సమస్యలు వున్నా, ఆమె ఉద్యమ ప్రవాహ జీవితంలో ఆటు, పోటులు ఎన్ని ఎదురైనా ముందుకే పయనించారు. వెట్టి బతుకుల విషయంలోనూ, బ్రిటీషువాళ్ళు నేరస్థ జాతులుగా వెలివేసిన ఆదివాసీ తెగల గురించి ప్రత్యేక శ్రద్ధతో పట్టించుకుని పోరాడారు. వారి గురించి రచనలు చేశారు. సుదీర్ఘ అధ్యయనం, ఆచరణ, కార్యశీలత ఆమెను ఒక సృజనశీలిగా, చరిత్రలో నిలిచి పోయే మహా రచయిత్రిగా, మానవీయత నిండిన మహా మనిషిగా, ఆదర్శ ఆదివాసీ మాతగా మలిచాయి. మహాశ్వేతాదేవి చెమటను, నెత్తురును పట్టించుకుని శ్రమజీవికి పట్టం కట్టారు.

మహాశ్వేతాదేవి జూలై 28 మధ్యాహ్నం 3.15 నిముషాలకు తన 91వ యేట తుదిశ్వాస విడిచారు. ఆమె చేసిన విశేష కృషిని, ఆదివాసుల పట్ల వున్న అంకిత భావాన్ని శ్లాఘిస్తూ, క్రాంతి పత్రిక వినమ్రంగా జోహార్లు అర్పిస్తోంది. ○

***(26వ పేజీ తరువాయి)***

ఏర్పరుచుకుని ముందుకు సాగుతున్నారు. సంపూర్ణమైన విశ్వాసంతో స్వావలంబన కోసం కృషి చేస్తున్నారు. ఉత్పత్తిని పెంచటం కోసం సహకార పద్ధతిలో పని చేస్తున్నారు. విస్థాపనకు వ్యతిరేకంగా పోరాడటం వారి జీవితంలో ఒక భాగంగా మారింది. అనేక దశాబ్దాలుగా కాపాడుకుంటున్న అటవీ సంపద, ఖనిజ సంపద తమ చేతుల నుండి పోకుండా వుండాలంటే రాజ్యాధికారం తప్పనిసరి అని గుర్తిస్తున్నారు. ప్రజాయుద్ధంలో భాగం అవుతున్నారు. "ప్రాణాలైనా ఇస్తాం కానీ, భూములు యివ్వం", "ప్రాణాలు పోయినా సరే ఉద్యమాన్ని విడిచి పెట్టం", "ప్రాణాలున్నా, పోయినా పోరాటం చేద్దాం" అంటూ బోధ్‌ఘాట్, రావ్‌ఘాట్, చార్‌గాం, సూర్జాఘడ్, లోహండిగూడా, ఆముదాయి ఇలా అన్ని చోట్ల పోరాడుతునే వున్నారు. కాపాడుకుంటూనే వున్నారు. వారికి మద్దతుగా సామ్రాజ్యవాద బహుళ జాతి సంస్థలకు, భారత దళారీ పాలకుల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పని చేస్తున్న అనేకానేక ఉద్యమ సంస్థలు, పౌరహక్కుల సంస్థలు సంఘీభావం ప్రకటిస్తున్నాయి.

దండకారణ్యంలో క్రాంతికారీ జనతన సర్కార్లు అత్యధిక మెజారిటీ ప్రజలకు అనుగుణమైన నిజమైన అభివృద్ధి నమూనాను రూపొందిస్తున్నాయి. అందువలన దేశ భావితరాల భవిష్యత్తును పరిరక్షించుకోవాలన్నా, వారి కోసం ప్రాకృతిక సంపదలను, ఖనిజ సంపదలను మిగుల్చుకోవాలన్నా, క్రాంతికారీ జనతన సర్కార్లను కాపాడుకోవడం తప్పనిసరి. గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా, బస్తర్ మిషన్-2016కు వ్యతిరేకంగా దేశవ్యాపితంగా పోరాడాల్సి వుంటుంది.

పాలక వర్గాల అభివృద్ధి (విధ్వంసపు) నమూనా ప్రకృతి విధ్వంసానికి, ప్రజా జీవన విధ్వంసానికి దారి తీసింది. ప్రజలు విస్థాపనకు వ్యతిరేకంగా చేసే పోరాటాలు సారాంశంలో భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద పోరాటాల్లో అంతర్భాగమే. దేశ వ్యాప్త గ్రీన్‌హంట్‌ను, బస్తర్ మిషన్-2016ను ఓడించేందుకు అన్ని సెక్షన్ల ప్రజల సహకారం వివిధ రూపాల్లో అందిద్దాం. దండకారణ్య ప్రజలతో భుజం భుజం కలిపి పోరాడుదాం. దీర్ఘకాల ప్రజాయుద్ధం ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవమార్గాన్నే ప్రజలు అనుసరిస్తున్నారు. ప్రజలు చరిత్ర నిర్మాతలు. ప్రజలు అజేయులు.

○

*(చివరి పేజీ తరువాయి)*

ఒక అధ్యయన కేంద్రం ఏర్పడింది. ఆ సమయంలో శ్రీధర్ అదే కళాశాలలో బి.ఏ. రెండవ సంవత్సరం చదువుతున్నాడు. ఆయన ఈ స్టడీ సర్కిల్‌లోకి వచ్చాడు. ఎం.ఎల్.ఎం. మరియు మార్క్సిస్టు-లెనినిస్టు రాజకీయాలతో ప్రభావితం కావటమే గాక ఒక కార్యకర్తగా మారి అనేక కళాశాలలలోని విద్యార్థులను సంఘటితం చేయనారంభించాడు. విద్యార్థి ప్రగతి సంఘటన్ పేరుతో విద్యార్థులను సంఘటితం చేశారు. 1980 నాటికి వి.పి.ఎస్. వేగంగా అభివృద్ధి చెంది దానికి పూర్తికాలం పనిచేసే కార్యకర్తలు ఏర్పడ్డారు. ముంబాయి నగరంలో వి.పి.ఎస్. తన విప్లవకృషిని కొనసాగించే క్రమంలో కాంగ్రెస్ మరియు శివసేన విద్యార్థి సంఘాల గూండాగిరీని ప్రతిఘటించింది. 1979లో ఫీజుల పెంపుకు నిరసనగా విద్యార్థులు చేపట్టిన చారిత్రాత్మక "ముంబాయి విశ్వవిద్యాలయ స్వాధీన" పోరాటానికి నాయకత్వం వహించిన వారిలో కామ్రేడ్ శ్రీధర్ కూడా ఒకరు. ఈ అనుకూల విప్లవ వాతావరణంలో మహారాష్ట్రలో విప్లవ విద్యార్థి ఉద్యమం విస్తరించి ముంబాయి నగరంలోని చుట్టుప్రక్కల కళాశాలల్లో అనేక వి.పి.ఎస్. యూనిట్లు ఏర్పడ్డాయి. మహారాష్ట్రలోని వి.పి.ఎస్. ఉద్యమంతో ప్రభావితమై గోవాలో ఒక ప్రజాస్వామిక విద్యార్థి సంఘం ఏర్పడింది. ఈ విద్యార్థి సంఘాన్ని శ్రీధర్ గైడ్ చేశాడు. 1979లో సి.పి.ఐ.(ఎం.ఎల్.) ఆంధ్ర రాష్ట్రకమిటీ నాయకత్వంలోని జగిత్యాల రైతాంగ ఉద్యమంతో ప్రభావితమై మహారాష్ట్రలో కొత్తగా ఏర్పడిన ఎం.ఎల్. పార్టీకి చెందిన బొంబాయి సిటీ కమిటీ ఏ.పి. రాష్ట్రకమిటీ కాంటాక్టులోకి వచ్చింది. 1980 మేలో బొంబాయి సిటీ కమిటీ సి.పి.ఐ.(ఎం.ఎల్.)(పీపుల్స్‌వార్)లో విలీనమైంది.

1970లో వచ్చిన ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభం తీవ్రతరమై మరికొన్ని సంవత్సరాలు కొనసాగింది. గుత్త కార్పొరేట్ సంస్థలు ఈ సంక్షోభానికి పరిష్కారంగా చేపట్టిన కొన్ని చర్యల్లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా అధునాతన యంత్రసామగ్రినీ, పెట్టుబడి తీవ్రతతో కూడిన టెక్నిక్‌లను ప్రవేశ పెట్టాయి. దీని ప్రభావం అన్ని దేశాల్లోని కార్మికుల మీదా, వెనుకబడిన దేశాల మీదా పడి ఉద్యోగాలు కోల్పోవటమూ, జీతాల కోత, కఠినమైన పని పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఈ మార్పుల ప్రభావం దేశంలోని బొంబాయి వంటి పెద్ద పారిశ్రామిక కేంద్రాలలోని వస్త్రపరిశ్రమలో బాగా పడింది. పెద్ద బట్టల మిల్లుల యజమానులు సామ్రాజ్యవాదులతో మిలాఖతై ఆధునిక యంత్రాలను తెచ్చారు. ఈ మార్పులను అందుకోలేని చాలామంది చిన్న మిల్లుల వారు దివాళాలు తీసి తమ మిల్లులను మూతవేశారు. ఈ ఫ్యాక్టరీల మూసివేతతో ఆ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ బిజినెస్ ఊపందుకుంది. ఈ పరిస్థితి పెద్దసంఖ్యలో మిల్లు కార్మికులు నిరుద్యోగులై కార్మికవర్గంలో అశాంతి చోటు చేసుకుంది. కార్మిక యూనియన్లు సంఘటితమవుతూ, ముఖ్యంగా దత్తా సామంత్ నాయకత్వంలోని మిలిటెంట్ ట్రేడ్ యూనియన్ నాయకత్వంలో సమీకృతులవుతూ లాకౌట్లకు, రిట్రెంచ్‌మెంట్లకు వ్యతిరేకంగా పోరాడారు. ఈ పరిస్థితులలో ముంబాయిలో విప్లవ కార్యక్రమాలు ఊపందుకున్నాయి. మురికివాడల్లోని కార్మికులలో విప్లవ కృషి బాగా పెరిగింది. 1981లో నవ్ జవాన్ భారత్ సభను ఏర్పాటు చేసి దాని నాయకత్వంలో ప్రచారం, ఆందోళన ప్రారంభించారు. ఈ కార్యక్రమాలు పెరుగుతున్న క్రమంలో 1981లో ఏ.ఎం.కె.యు. అనే కార్మిక సంఘాన్ని ఏర్పరిచారు. ఏ.ఎం.కె.యు మరియు నవ్ జవాన్ భారత్ సభలు 1982లో జరిగిన చారిత్రాత్మక బట్టల మిల్లు కార్మికుల మిలిటెంట్ పోరాటాల్లో పాల్గొన్నాయి. కార్మికవర్గంలోని మిలిటెంట్ మరియు ప్రగతిశీల సెక్షన్లను ఈ సంఘాలు ఆకర్షించాయి. ఆ ఉద్యమాన్ని పురోగమింపజేయటంలో కామ్రేడ్ శ్రీధర్ దానికి ఆర్గనైజర్‌గా గొప్పగా పనిచేశాడు. ఆ ఉద్యమ సమయంలో ఆయన అనేక మిలిటెంట్ చర్యల్లో పాల్గొన్నాడు. పార్టీ నాయకత్వంలోని కొందరు మితవాద శక్తులు ఈ చర్యలను ఖండించి వీటిని మిలిటెంట్ ఆర్థికవాదమని విమర్శించారు. చురుకుగా అభివృద్ధి చెందుతున్న వీరిని విమర్శించారు. అయినప్పటికీ అనేక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ ఆ సమ్మె ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొని దేశంలోనే అత్యంత మిలిటెంట్ కార్మికవర్గ ఉద్యమంగా పేరు పొందింది. ఏ.ఎం.కె.యు. నాయకత్వం కింద ముంబాయితో పాటు మహారాష్ట్ర లోని థానే, భివాండీ, ఇతర పారిశ్రామిక ప్రాంతాల్లో కూడా కార్మికులు సంఘటితమయ్యారు. 1980 ప్రాంతాల్లో ముంబాయిలోని బట్టల మిల్లు కార్మికుల పోరాటానికి కొద్దిగా ముందే పార్టీ నాయకత్వంలో గడ్‌చిరోలిలో ఆదివాసీ రైతాంగ ఉద్యమం ప్రారంభమైంది. బొంబాయి సిటీ కమిటీ సి.పి.ఐ.(ఎం.ఎల్.)(పీపుల్స్‌వార్)లో విలీనమైన తర్వాత కేంద్ర కమిటీ మహారాష్ట్రలో దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని విస్తృతపరిచే వ్యూహంతో నాగపూర్, చంద్రపూర్, బల్హార్షా పట్టణాలతో పాటు విదర్భ పర్‌స్పెక్టివ్‌ని మహారాష్ట్ర కార్యకర్తలకు ఇచ్చి గ్రామీణ ప్రాంతంలో ఉద్యమాన్ని నిర్మాణం చేయాలనే ప్లాను రూపొందించారు. దీనిలో భాగంగా మహారాష్ట్ర స్టేట్ కమిటీ విదర్భ ప్రాంతానికి పి.ఆర్.లను పంపింది. విదర్భ ప్రాంతంలోని గ్రామీణ, భూమిలేని, పేద రైతాంగంలో విప్లవ రాజకీయాలను ప్రచారం చేసేందుకు వి.పి.ఎస్. 'గ్రామాలకు తరలండి' కేంపెయిన్‌ను చేపట్టింది. 1980లో ఈ ప్రచార కార్యక్రమాల్లో ఉండగా 10-12 మంది విద్యార్థులతో పాటు గడ్‌చిరోలి జిల్లాలోని సిరొంచలో శ్రీధర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆయన తల్లి ముంబాయి నుండి అక్కడకు వెళ్లి విద్యార్థులను విడిపించింది. 1984లో గడ్‌చిరోలి జిల్లాలోని కమలాపూర్ గ్రామంలో డి.ఏ.కె.ఎం.ఎస్. మొదటి జిల్లా మహాసభకు వెళుతున్న సందర్భంలో శ్రీధర్ మరోసారి అరెస్టయ్యాడు.

1985లో పార్టీలో సిద్ధాంత, రాజకీయ మరియు ఆర్గనైజేషనల్ సమస్యల మీద సంక్షోభం రావటంతో కేంద్రకమిటీ పనిచేయటం ఆగిపోయింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు అన్ని రాష్ట్రాల యూనిట్లు ప్లీనాలు నిర్వహించాలనే దానిలో భాగంగా 1986లో మహారాష్ట్ర స్టేట్ ప్లీనం నిర్వహించబడింది. ఆ ప్లీనంలో రీజినల్ కమిటీ కామ్రేడ్స్‌కూ, సి.సి. మహారాష్ట్ర స్టేట్ కోఆర్డినేటర్‌గా ఉన్న సి.సి. మెజారిటీ గ్రూపు సభ్యులకూ మధ్య తీవ్రంగా విభేదాలు ముందుకొచ్చాయి. ఇదే సమయంలో 1987లో మహారాష్ట్ర రాష్ట్ర యూనిట్ సి.పి.ఐ.(ఎం.ఎల్.)(పీపుల్స్‌వార్) నుంచి విడిపోయింది. ఈ పరిస్థితుల్లో 1987 సెప్టెంబర్‌లో రాష్ట్ర రెండవ కాన్ఫరెన్స్ జరిగింది. ఈ కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర కోఆర్డినేటర్‌చే ప్రవేశపెట్టబడిన డాక్యుమెంట్‌ని తిరస్కరించి శ్రీధర్ మరియు ఇతర కామ్రేడ్స్ తయారుచేసిన డాక్యుమెంట్‌ని ఆమోదించారు. కొత్త రాష్ట్రకమిటీ ఏర్పడి శ్రీధర్ దానికి కార్యదర్శిగా ఎన్నుకోబడ్డాడు. ఈ కాన్ఫరెన్స్ ప్రజాసంఘాలను బలోపేతం చేయాలనీ, వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయాలనీ, పార్టీని విస్తరించాలనీ, పురోగామి శక్తులను రిక్రూట్ చేసుకోవాలనీ పిలుపునిచ్చింది. కేంద్రకమిటీని రద్దుచేయటం సరైంది కాదని కాన్ఫరెన్స్ తీర్మానించింది. సి.పి.ఐ.(ఎం.ఎల్.)(పీపుల్స్‌వార్)తో

వెంటనే ఐక్యత కోసం పరుగులు తీయకుండా అన్ని రాష్ట్రాల యూనిట్లతో సౌహార్ద్ర సంబంధాలు కొనసాగించాలని నిర్ణయించింది. అఖిల భారత సంఘాలైన ఏ.ఐ.ఆర్.ఎస్.ఎఫ్., ఏ.ఐ.ఎల్.ఆర్.సి. వంటి సంస్థలలో చురుకుగా పాల్గొంటూ కార్యక్రమాలను ముందుకు తీసుకుపోవాలని నిర్ణయించారు.

నక్సల్బరీతో ప్రభావితులై మహారాష్ట్ర నుండి పార్టీలోకి వచ్చిన ఎందరో కామ్రేడ్స్‌పై పార్టీలో వచ్చిన సంక్షోభ ప్రభావం పడింది. ఆత్మవిశ్వాసం కొరవడి కొందరు వెళ్లిపోయారు. కొందరు తమ కార్యక్రమాలను తగ్గించుకున్నారు. ఈ పరిస్థితులలో ముంబాయిలోని ప్రజాసంఘాలు కొంత బలహీనపడ్డాయి. పార్టీని విస్తరించాలని కాన్ఫరెన్స్‌లో రూపొందించుకున్న ప్రణాళికలు దీనివల్ల అమలు కాలేదు. అయినప్పటికీ, శ్రీధర్, మరికొంతమంది కామ్రేడ్స్ పార్టీ పంథాకు కట్టుబడి, తప్పుడు పద్ధతులకు వ్యతిరేకంగా పోరాడారు. కఠినతరమైన పరిస్థితులలో కూడా పార్టీ పంథాకు దృఢంగా అంటిపెట్టుకున్న కామ్రేడ్స్‌లో శ్రీధర్ ముందున్నాడు. ఏటికెదురీది కఠిన పరిస్థితులను అధిగమించి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని వారు నిర్ణయించుకున్నారు.

## ఉద్యమ నిర్మాణానికి మళ్లీ ప్రయత్నాలు

1980ల తర్వాత కార్యకర్తలు తగ్గిపోయిన పరిస్థితీ, గడ్‌చిరోలి విప్లవోద్యమంపై నిర్బంధం తీవ్రమైన పరిస్థితీ, పైనుండి సి.సి. గైడెన్స్ లేని పరిస్థితినీ మహారాష్ట్ర రాష్ట్ర కమిటీ ఎదుర్కొన్నది. ఈ పరిస్థితులలో విదర్భలోని పర్‌స్పెక్టివ్ ఏరియాలో విప్లవ కృషిని విడిచిపెట్టాల్సి వచ్చింది. పార్టీ సంక్షోభం తర్వాత మిగిలిన కామ్రేడ్స్ మరియు రాష్ట్రకమిటీ మహారాష్ట్ర గ్రామీణ ప్రాంతంలో ఉద్యమ నిర్మాణం కోసం పశ్చిమ మహారాష్ట్ర గ్రామీణ పర్‌స్పెక్టివ్‌ని తయారు చేసింది. ఈ పర్‌స్పెక్టివ్‌లో నాసిక్ జిల్లా కేంద్రంగా పనిని ప్రారంభించాలని ప్లాన్ రూపొందించారు. ఈ ప్రాంతం వ్యూహాత్మకమైనదీ, అనేక అనుకూలతలను కలిగి ఉన్నదీ. 1980ల చివర రాజకీయ, ఆర్గనైజేషనల్ పనిని ప్రారంభించి నాలుగైదు సంవత్సరాల పాటు కొనసాగించారు. తీవ్రమైన కృషి జరిపి కొంత ప్రజాపునాదిని ఏర్పరచుకొని కొంత అనుభవాన్ని సంపాదించారు. నిర్బంధం తీవ్రతరమైన కారణంగానూ, అరెస్టులు జరిగిన కారణంగానూ నాయకత్వంలో ఒకరిద్దరు వెనక్కి పోవటంతో మరలా ఈ ప్రాంతంలో విప్లవ కార్యక్రమం కొనసాగించలేక పోయారు.

1992లో కామ్రేడ్ శ్రీధర్ విదర్భ రీజియన్‌లోని బొగ్గుగని కార్మికుల పోరాటం, ఇతర ఆందోళనలకు నాయకత్వం వహించేందుకు ఈ ప్రాంతం మీద కేంద్రీకరించాడు. ఇన్‌ఫార్మర్ల నిర్మూలనకు విదర్భ ఏరియాలో ఏర్పరచిన రెండు యాక్షన్ టీములకు నాయకత్వం వహించాడు. 1986 ప్లీనంలో తలెత్తిన రాజకీయ, నిర్మాణ సమస్యలను పరిష్కరించేందుకు 1992 సెప్టెంబర్‌లో మహారాష్ట్ర స్పెషల్ ప్లీనం జరపబడింది. ఈ ప్లీనం కొంతమంది నాయకత్వ కామ్రేడ్స్ ప్రవేశపెట్టిన ప్రత్యామ్నాయ డాక్యుమెంట్లను తిరస్కరించి, రాష్ట్రకమిటీ ప్రవేశపెట్టిన డాక్యుమెంట్లను ఆమోదించింది. సి.సి. రద్దయిపోయి 1987లో పీపుల్స్‌వార్ నుంచి విడివడిన తర్వాత 1988 చివరి నాటికి ఆంధ్ర రాష్ట్రకమిటీ, మహారాష్ట్ర కమిటీలు సంబంధాలను పునరుద్ధరించుకున్నాయి. అప్పటి నుండి రెండు యూనిట్ల మధ్య మంచి సంబంధాలు కొనసాగాయి. 1990 సెప్టెంబర్‌లో ఆంధ్ర, కర్నాటక, తమిళనాడు యూనిట్లతో కేంద్ర ప్లీనం జరిపి సి.పి.ఐ.(ఎం.ఎల్.) సి.ఓ.సి. ఎన్నికైంది. మహారాష్ట్ర కమిటీకి, సి.ఓ.సి.కి మధ్య సంబంధాలు కొనసాగాయి. ఈ మూడేళ్ల కాలంలో రెండు పార్టీల మధ్య అనేక విషయాలపై చర్చలు జరిగాయి. సి.సి. సంక్షోభం మీద, సి.సి. అవకాశవాద మెజారిటీ గ్రూప్‌కి వ్యతిరేకంగా మహారాష్ట్ర కామ్రేడ్స్ జరిపిన పోరాటం గురించీ, అంతర్గత పోరాటాన్ని పరిష్కరించటంలో మైనారిటీ గ్రూపు నుండి జరిగిన పొరపాట్ల గురించీ, సరైన విప్లవకారుల ఐక్యత గురించీ చర్చలు జరిగాయి. ఈ చర్చలలో సాధించిన ఏకాభిప్రాయాల ఫలితంగా 1994లో మహారాష్ట్ర స్టేట్ కమిటీ సి.పి.ఐ.(ఎం.ఎల్.)(పీపుల్స్‌వార్)లో విలీనమైంది. ఈ మొత్తం కార్యక్రమంలో కామ్రేడ్ శ్రీధర్ ప్రధాన పాత్ర పోషించాడు.

1994లో మహారాష్ట్ర పార్టీ సి.పి.ఐ.(ఎం.ఎల్.)(పీపుల్స్‌వార్) మహారాష్ట్ర స్టేట్ యూనిట్‌గా మారిన తర్వాత 1995 ఆలిండియా స్పెషల్ కాన్ఫరెన్స్ నిర్వహణలో భాగంగా అన్ని రాష్ట్ర యూనిట్లు తమతమ రాష్ట్ర మహాసభలు జరుపుకున్నాయి. పార్టీ గత అనుభవాన్ని సంశ్లేషిస్తూ ఉద్యమ పురోగమనానికి కొత్త కర్తవ్యాలను ఆలిండియా కాన్ఫరెన్స్ రూపొందించింది. ఈ కాన్ఫరెన్స్‌లో మహారాష్ట్ర కామ్రేడ్స్ చురుకైన పాత్రను పోషించారు. 1987లో సి.సి.ని రద్దు చేసే విషయంలో వారికున్న భిన్నాభిప్రాయాన్ని దృఢంగా కలిగి ఉండి ఈ విషయాన్ని అందరికీ అర్థం చేయించారు. ఈ మొత్తం ప్రక్రియలో కామ్రేడ్ శ్రీధర్ కీలకమైన పాత్రను పోషించాడు.

2001లో మునుపటి సి.పి.ఐ.(ఎం.ఎల్.)[పీపుల్స్‌వార్] 9వ కాంగ్రెస్ జరిగింది. భారత విప్లవోద్యమ చరిత్రలో ఈ కాంగ్రెస్‌కి విశేష ప్రాధాన్యత ఉంది. ఈ కాంగ్రెస్‌లో మొత్తం పార్టీ ఉద్యమ చరిత్రను సమీక్షించటం జరిగింది. దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాని మరింత సంపద్వంతం చేస్తూ కొన్ని కొత్త ఎత్తుగడలను, విధానాలను రూపొందించారు. ఈ చర్చల్లో కామ్రేడ్ శ్రీధర్ చురుకుగా పాల్గొన్నాడు. ఈ కాంగ్రెస్‌లో వామపక్ష దుస్సాహసికవాద లైన్‌ని ఓడించి పార్టీ పంథాను మరింత మెరుగుపర్చటంలో కామ్రేడ్ శ్రీధర్ సకారాత్మక పాత్రను పోషించాడు. ఈ కాంగ్రెస్‌లో ఆయన కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యాడు. కాంగ్రెస్ తర్వాత మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, కేరళం ప్రాంతాల్లోని దక్షిణ పశ్చిమ రీజినల్ బ్యూరోలో సభ్యునిగా కొనసాగాడు.

2001లో జరిగిన రాష్ట్ర కాన్ఫరెన్స్‌లో ఆనాటికున్న పరిస్థితుల్లో విదర్భ పర్‌స్పెక్టివ్‌ని మరికొంత అభివృద్ధి చేసి అమలుపరచాలనేది ఒకానొక తక్షణ కర్తవ్యంగా పెట్టుకున్నారు. ఈ పర్‌స్పెక్టివ్‌ని ముందుకు తీసుకెళ్లేదానిలో భాగంగా బాలాఘాట్-గోందియా డివిజన్‌ని మహారాష్ట్ర స్టేట్‌కమిటీ పరిధిలోకి తేవటం జరిగింది. అంతకు ముందు అది డి.కె. గెరిల్లాజోన్‌లో భాగంగా, డి.కె.ఎస్.జడ్.సి. నాయకత్వంలో ఉండింది. కామ్రేడ్ శ్రీధర్ రాష్ట్రకమిటీ కార్యదర్శిగానూ, కేంద్రకమిటీ సభ్యునిగానూ గ్రామీణ ఉద్యమాన్ని గైడ్ చేసే బాధ్యతను తీసుకున్నాడు. ఆ సమయంలో తీవ్ర నిర్బంధంతో పాటు ఉద్యమంలో కొన్ని సమస్యలు తలెత్తాయి. కార్యకర్తల మానసిక స్థైర్యాన్ని పెంచేందుకూ, ఉద్యమాన్ని పురోగమింపజేసేందుకు కామ్రేడ్ శ్రీధర్ చాలా కృషి చేశాడు. అనారోగ్య సమస్యలున్నప్పటికీ కఠినమైన టెర్రయిన్ గల ఆ ప్రాంతంలో పనిచేస్తున్న సమయంలో ప్రత్యేక సదుపాయాలు కోరలేదు. అక్కడ జరుగుతున్న అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటూ అక్కడి కార్యకర్తల విశ్వాసాన్ని చూరగొన్నాడు. ఉద్యమం నిలదొక్కుకోవటానికీ, పురోగమనానికీ శాయశక్తులా కృషి చేశాడు.

2004 సెప్టెంబర్‌లో ఎం.సి.సి.ఐ.,

సి.పి.ఐ.(ఎం.ఎల్.)[పీపుల్స్‌వార్]ల చారిత్రాత్మక విలీనం తర్వాత సి.పి.ఐ.(మావోయిస్టు) పార్టీ ఏర్పడింది. ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లటానికి నూతన పార్టీ ఏర్పాటు చేసిన కేంద్రకమిటీ(ప్రొవిజనల్)లో కామ్రేడ్ శ్రీధర్ కూడా సభ్యుడయ్యాడు. మహారాష్ట్రలో ఉద్యమం కొంత బలహీనంగా ఉన్న సమయంలోనే దేశాన్ని అమ్మివేసే వాజ్‌పేయి నాయకత్వంలోని ప్రభుత్వ పాలసీలకు, హిందూ బ్రాహ్మణవాద ఫాసిస్టు ధోరణులకు వ్యతిరేకంగా పెరుగుతున్న అసంతృప్తితో వచ్చిన కొన్ని సామాజిక ఉద్యమాలకు పార్టీ చేరువైంది. సి.పి.ఐ.(మావోయిస్టు) ఏర్పడటం, అదే సంవత్సరం ముంబాయి రెసిస్టెన్స్-2004 సమ్మేళనం జరగటం దేశ విప్లవోద్యమానికి, మహారాష్ట్ర ఉద్యమానికి గొప్ప ఊపునిచ్చింది. ఖైర్లాంజీలో దళిత కుటుంబం మీద జరిగిన దాడి విషయంలో అన్ని రాజకీయ పార్టీల రంగులు బహిర్గతం కాగా మన పార్టీ కుల సమస్య నిర్మూలన, కుల వివక్షతలకు సంబంధించి సరైన మార్గాన్ని దళితుల ముందుంచింది. దీనివల్ల మహారాష్ట్రలోని దళితుల్లో మన ఉద్యమం పట్ల ఆశలు పెరిగాయి. ఆ పరిస్థితుల్లో మిలిటెంట్‌గా కులవ్యతిరేక సంఘాన్ని ఏర్పరిచారు. ఆ సంఘం కింద దళితులంతా సమీకృతులయ్యారు. మహారాష్ట్రలోని అనేక జిల్లాల్లో దీని శాఖలు ఏర్పడ్డాయి. దళిత విద్యార్థులు, యువతరం ఈ సంఘంలోకి రావటం మొదలైంది. ఈ విధంగా మహారాష్ట్రలో నూతన మిలెన్నియంలో కొన్ని సంవత్సరాల పాటు విప్లవ పురోగమనానికి అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి.

పెరుగుతున్న విప్లవోద్యమాన్ని దెబ్బతీసేందుకూ, మైనారిటీలను అణచివేసేందుకూ పాలకవర్గాలు ఫాసిస్టు పద్ధతుల్లో పోటా వంటి దుర్మార్గమైన చట్టాలను ముందుకు తెచ్చారు. మన పార్టీ నాయకత్వాన్ని టార్గెట్ చేయటం, ప్రజాసంఘాలపై నిషేధాలు విధించటం, ఉద్యమ ప్రాంతాలపై సల్వాజుడుం, సేంద్ర వంటి ఫాసిస్టు సంస్థలచే దాడులు నిర్వహించటం మొదలైంది. ఈ పరిస్థితుల మధ్యనే సి.పి.ఐ.(మావోయిస్టు) 9వ కాంగ్రెస్ జయప్రదమైంది. ఈ కాంగ్రెస్‌లో జరిగిన రాజకీయ చర్చల్లో కామ్రేడ్ శ్రీధర్ చురుగ్గా పాల్గొని, అందులో తలెత్తిన వామపక్ష దుస్సాహసికవాద లైన్‌ని ఓడించటంలో కీలకపాత్ర పోషించాడు. కామ్రేడ్ శ్రీధర్ కాంగ్రెస్‌లో కేంద్రకమిటీ సభ్యునిగా ఎన్నుకోబడ్డాడు. అలాగే దక్షిణ-పశ్చిమ బ్యూరోలో సభ్యునిగా ఎన్నుకోబడ్డాడు. పార్టీ కాంగ్రెస్ విజయవంతం కావటంతో అమెరికా సామ్రాజ్యవాదుల గైడెన్స్‌లో నడుస్తున్న పాలకవర్గాలు గంగవెర్రులెత్తి విప్లవోద్యమంపై తీవ్రమైన అణచివేతను కొనసాగించారు. దేశవ్యాప్తంగా అనేకమంది పార్టీ నాయకులు, కార్యకర్తలు అమరులయ్యారు. ఈ అణచివేత దాడిలో మహారాష్ట్రలో మన ఉద్యమ శక్తులకు భారీగా నష్టం జరిగింది. ఈ పరిస్థితి శ్రీధర్‌కు వేదనను కలిగించింది. 2007 మధ్యలో ఆయన అరెస్టు కావడం ఉద్యమానికి భారీ నష్టం.

## అరెస్టు మరియు జైలు జీవితం

2007 ఆగస్టు 18వ తేదీ రాత్రి కుఖ్యాత ఆంధ్ర ఎస్.ఐ.బి. మరియు నక్సల్ వ్యతిరేక ముంబాయి పోలీసు టీంలు కలిసి కామ్రేడ్ శ్రీధర్‌ను ఆయన డెన్‌కు బయట అరెస్టు చేశారు. అనేక రోజుల తరబడి ఏ.పి.ఎస్.ఐ.బి., యాంటీ నక్సల్ ముంబాయి టీము, ఇంకా కేంద్ర, రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు ఇంటరాగేషన్ చేశారు. అవకాశాన్ని దొరకబుచ్చుకొని కామ్రేడ్ శ్రీధర్ కొన్ని నెలల తర్వాత జైలు నుండి పార్టీకి ఉత్తరం రాశాడు. ఆ లెటర్‌లో అరెస్టు, ఇంటరాగేషన్ పద్ధతుల్లో వచ్చిన టెక్నిక్‌లు, గూఢచర్య పద్ధతులు, శత్రువు అనుసరిస్తున్న ముఖ్యమైన పద్ధతుల గురించి కా. శ్రీధర్ రాశాడు. ఆ ఉత్తరంలోని విషయాలు శత్రువు అనుసరిస్తున్న పద్ధతుల గురించి పార్టీ అర్థం చేసుకోవటానికి తోడ్పడ్డాయి. సుదీర్ఘకాలం జైలులో ఉంచాలనే ఆలోచనతో శత్రువు ఆయనపై మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, గుజరాత్‌లలో 60కి పైగా తప్పుడు కేసులు మోపాడు. ఒక కేసులో ఆయనకు ఆరు సంవత్సరాల జైలు శిక్షను కూడా విధించారు. అప్పుడప్పుడు తన సోదరికి రాసిన ఉత్తరాలలో కా. శ్రీధర్ జైలు జీవితం గురించి వర్ణిస్తూ ఆవేదనను వెలిబుచ్చాడు. ఒక ఉత్తరంలో ఇలా రాశాడు. ''ఈ జైలు జీవితంలో అత్యంత ఘోరమైన విషయమేమంటే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కోల్పోవటం. నేనెల్లప్పుడూ ఈ విషయాలకు ఎక్కువ విలువ ఇచ్చేవాడిని. ప్రస్తుతం అవి రెండూ నేను వేయి రెట్లు కోల్పోయినట్లుగా ఉంది. అయితే నేను నిరాశలో కూరుకు పోవటం లేదు. దీన్నుంచి అనుభవం నేర్చుకొని మనోబలం పెంచుకునేందుకు చూస్తున్నాను. జైలులో నాకు అనేక మంది వ్యక్తుల ఆసక్తిదాయకమైన జీవితాల గురించి తెలుసుకునే అవకాశం వచ్చింది. మత్తుమందులు అమ్మేవారు, మత్తుమందుల డీలర్లు, రేపిస్టులు, చిల్లరమల్లర దొంగలు, అంతర్జాతీయ స్మగ్లర్లు, క్రిమినల్ గ్యాంగుల లీడర్లు మొదలైనవారు జైల్లో ఉన్నారు. వీరేగాక ఎంతోమంది పేదవారు, అమాయక అసహాయులైనవారూ ఉన్నారు. బయట సమాజానికి జైలు ఒక సాంద్రీకరించబడిన ప్రతిబింబమే. కలవాళ్లూ, లేనివాళ్లూ, పీడకులు, పీడితులు, హింస, విచ్ఛలవిడితనంతో పాటు మంచితనం తదితరాలన్నిటికీ ఈ జైలు ప్రతిబింబంగా ఉంది. లోపల జైలు గోడలపై జైలులోని వ్యక్తులను సంస్కరించాలంటూ ప్రచారం కోసం పెద్దపెద్ద అక్షరాలతో రాసిన నినాదాలను చూస్తే అవి జైలులోని వ్యక్తులను మార్చుతాయనేది కల్ల. జైలు బయట ఒక మనిషి నేరస్థుడయ్యేందుకు తోడ్పడిన పరిస్థితులు, జైలు లోపల కూడా ఉన్నప్పుడు ఆ మనిషిలో మార్పు రావటం ఎలా సంభవమౌతుంది?''

జైలు నుండి విడుదల కోసం ఎదురుచూస్తూనే జైలులో ఉన్న కాలంలో యువ కార్యకర్తలను రాజకీయంగా చైతన్యవంతం చేసేందుకు జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులపై కా. శ్రీధర్ విశేషంగా అధ్యయనం చేశాడు. అనేక రకాల ఇస్లామిక్ కార్యకర్తలతో చర్చించి వారి ఉద్యమాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాడు. ఇతర జైళ్లలోని కామ్రేడ్స్‌కు సుదీర్ఘమైన రాజకీయ ఉత్తరాలు రాశాడు. కామ్రేడ్ శ్రీధర్ మరియు ఇతర కామ్రేడ్స్ కొందరు పోలీసులు తయారుచేసిన ఛార్జ్‌షీట్లను లోతుగా అధ్యయనం చేసి డిఫెన్స్ వాదనలలో లాయర్లకు కొన్ని సలహాలిచ్చారు. కొందరు ఖైదీల విడుదలకు సహాయపడ్డారు. ప్రతిరోజు జైలులో వ్యాయామం చేసి తన ఆరోగ్యాన్ని రక్షించుకునేందుకు ప్రయత్నించాడు.

కామ్రేడ్ శ్రీధర్ మరియు ఇతర మహారాష్ట్ర కామ్రేడ్స్ జైలులో తమ హక్కుల కోసం మరియు ఇతర ఖైదీల హక్కుల కోసం పోరాటాలు చేశారు. జైలులో అనేక మంది కామ్రేడ్స్‌తో కలిసి నిరాహారదీక్షల్లో పాల్గొన్నారు. న్యాయశాస్త్ర విషయాలైన న్యాయతత్వశాస్త్రం, న్యాయవ్యవస్థ, ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ మొదలైన విషయాలను అధ్యయనం చేసి తమ అవగాహనను పెంచుకున్నారు. తన జైలు జీవితంలో న్యాయవ్యవస్థ, శిక్షావ్యవస్థలతో పాటు అర్ధవలస, అర్ధభూస్వామ్య భారతదేశంలోని పరిస్థితులను మరింత అర్థం చేసుకునేందుకు కృషి చేశాడు. జైలులో

సమయం వృధా చేయనప్పటికీ వర్గపోరాట ప్రాంతానికి రావాలని ఆతృతపడేవాడు. "ధృతరాష్ట్రుని వలే యుద్ధక్షేత్రపు వార్తలను పరోక్ష మార్గాల ద్వారా తెలుసుకోవాల్సి రావటం చాలా బాధాకరం. త్వరలోనే బయటికి వచ్చి ప్రజలకు సేవ చేసే పనిలోకి పోవాలని ఆకాంక్షిస్తున్నాను. దూరంగా సల్లయుద్ధ మేఘాలు అలుముకుంటున్నాయి. అప్పుడే అవి వర్షించటం కూడా మొదలైంది. అవి కేవలం కొద్ది సమయంలోనే పట్టణ ప్రాంతాల్లో మమ్ములను చుట్టుముట్టి మమ్మల్ని యాసిడ్ వర్షాలతో తడపవచ్చు. నా జైలు గదినుంచి చూస్తే నాకిదే కనిపిస్తోంది" అని కామ్రేడ్ శ్రీధర్ తన లాయర్‌కి ఉత్తరంలో రాశాడు.

ఆరున్నర సంవత్సరాల జైలు జీవితం తర్వాత 2013లో జైలు నుంచి కామ్రేడ్ శ్రీధర్ విడుదలయ్యాడు. త్వరగా వర్గపోరాట ప్రాంతానికి పోవాలనే కోరికతో ఉన్నాడు. ప్రభుత్వ నిఘావల్ల, మరలా అరెస్టయ్యే నిర్బంధ వాతావరణం వల్ల ఒకటిన్నర సంవత్సరం వేచి ఉండాల్సి వచ్చింది. ఈ కాలంలో జాతీయంగా, అంతర్జాతీయంగా మారుతున్న పరిస్థితులను అధ్యయనం చేశాడు. విప్లవోద్యమ పరిస్థితులలో వచ్చిన మార్పులు, శత్రువు అనుసరిస్తున్న పద్ధతుల్లో వచ్చిన మార్పులపై దేశంలోని మేధావులు, రచయితలు, వివిధ సెక్షన్ల పీడిత ప్రజలు ఎలా ఆలోచిస్తున్నారో తెలుసుకునేందుకు ప్రయత్నించాడు. ఇటీవల కాలంలో పెరుగుతున్న బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం గురించి అధ్యయనం చేశాడు. వాటితోపాటు జైలు రిపోర్టులను, ఇతర కొన్ని నిర్దిష్ట ప్రతిపాదనలను సి.సి. ముందుంచే పనిపై నిమగ్నమయ్యాడు. ఈ విధంగా ఉద్యమ భవిష్యత్తు గురించి తయారీలు చేస్తూ కష్టతరమైన ప్రయాణాన్ని చేసి 2015 నాటికి ఉద్యమ ప్రాంతానికి చేరుకున్నాడు. ఈ ప్రయాణం మధ్యలోనే 2015 ఆగస్టు 18న తన తుదిశ్వాసను విడిచాడు.

## ఒక ఆదర్శ కమ్యూనిస్టు విప్లవకారుడు

కామ్రేడ్ శ్రీధర్ 1970 చివర్ల నుండి 2006 వరకు విద్యార్థి కార్యకర్తగా, పి.ఆర్.గా, స్టేట్‌కమిటీ సభ్యునిగా, మహారాష్ట్ర స్టేట్‌కమిటీ కార్యదర్శిగా మరియు కేంద్రకమిటీ సభ్యునిగా మూడున్నర దశాబ్దాల పాటు వివిధ స్థాయిలలో ప్రభావవంతంగా విప్లవోద్యమానికి సేవ చేశాడు. అనేక కీలక మలుపుల్లోనూ, ఎగుడుదిగుళ్లలోనూ పార్టీ పంథాకు కట్టుబడి దానిని సృజనాత్మకంగా అన్వయించాడు. ప్రపంచ సోషలిస్టు విప్లవ విజయానికి ఎం.ఎల్.ఎం. కార్మికవర్గానికి శాస్త్రీయమైన సిద్ధాంతమని ఎత్తిపట్టాడు. ఆయా సందర్భాల్లో పార్టీలో తలెత్తిన రాజకీయ, సిద్ధాంతపరమైన తప్పుడు ధోరణులకు వ్యతిరేకంగా పోరాడి ఉద్యమ పురోగమనానికి తోడ్పడ్డాడు. మహారాష్ట్రలో ఉద్యమం కఠిన పరిస్థితిలో ఉన్న సమయంలో కూడా దృఢంగా నిలిచాడు. సి.సి. సమావేశాల్లోనూ, క్రింది కమిటీల సమావేశాల్లోనూ, తోటి కామ్రేడ్స్‌తో జరిగే చర్చల్లోనూ తన అభిప్రాయాలను స్పష్టంగా చెప్పేవాడు. సమయాన్ని వృధా చేసేవాడు కాదు. వ్యక్తిగత లక్షణాలైన విస్తృత అధ్యయనం, కార్మికవర్గ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటూ, పంథా పట్ల దృఢంగా ఉండేవాడు, సాదాసీదాగా ఉండటం, ఎల్లప్పుడూ చిరునవ్వుతో ఉండి తోటి కామ్రేడ్లతో మంచి సంబంధాల్ని కొనసాగించాడు. పార్టీ తనకిచ్చిన ఎటువంటి బాధ్యతనైనా అనారోగ్య సమస్యలున్నప్పటికీ ఎటువంటి శషభిషలు లేకుండా ఆచరణ ద్వారానే నేర్చుకోవాలనే బోల్షివిక్ స్పిరిట్‌తో స్వీకరించాడు. విప్లవోద్యమంలో ఎక్కువ కాలం కార్మికవర్గం, విద్యార్థి, యువజన మరియు మహారాష్ట్రలోని పట్టణ ప్రాంత కుల వ్యతిరేక ఉద్యమాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేశాడు. పట్టణ ప్రాంతాలలో ఉద్యమాభివృద్ధికి ఆయన చేసిన కృషి పార్టీకి విశేష అనుభవాన్నిచ్చింది. ఈ విధంగా నిరంతర రాజకీయ, ఆర్గనైజేషనల్ పనిలో విప్లవ నాయకునిగా నెగ్గి ఒక పరిణతి చెందిన కమ్యూనిస్టు నాయకునిగా ఎదిగాడు.

కేంద్రకమిటీ సభ్యునిగా ఉన్న కాలంలో శత్రువు ఆయనను విప్లవోద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొననీయకుండా ఎక్కువ కాలం జైలులో పెట్టాడు. జైలులో ఉన్న కాలంలోనూ, జైలు నుండి విడుదలైన తర్వాతా విప్లవోద్యమానికి ఎలా సేవ చేయాలనే దానిపై తీవ్రంగా ఆలోచించేవాడు. జైలు నుండి బయటకు వచ్చినపుడు ఆయన మనసులో భవిష్యత్ విప్లవోద్యమ యోజన గురించిన ఒక ప్లాను ఆయన దగ్గర ఉండింది. శత్రుబంధనాల నుండి బయటపడి గడ్డు స్థితిలో ఉన్న విప్లవోద్యమానికి ఉన్నత స్థాయిలో తన సేవలను అందించేందుకు వస్తున్న క్రమంలో క్రూరంగా వచ్చిన మరణం ఆయనను మన నుండి దూరం చేసింది.

**ఇతరులకు ఇవ్వడంలో తృప్తిని, ఉన్నదాన్ని ఇతరులతో పంచుకోవడంలో ఆనందాన్ని, ఇతరుల కష్టాల్లో భాగం కావడాన్ని, విభేదం ఉన్న వ్యక్తుల్ని కూడా ప్రేమగా కలుపుకోవడంలో ఔన్నత్యాన్ని ఆయన నుండి నేర్చుకోవాలి.**

ప్రపంచంలో మెజారిటీ ప్రజలు తమ గురించే ఆలోచిస్తారు. కొంతమంది సమాజం కోసం ఆలోచించి ప్రాణత్యాగం చేస్తారు. వారు వారి గురించి కాకుండా మొత్తం మానవాళి శ్రేయస్సు గురించి ఆలోచిస్తారు. ఈ పరిస్థితి అన్ని వర్గ సమాజాల్లో ఉండి నేటి పరిస్థితిలో మరింత సరైనదిగా ఉంది. నేటి సామ్రాజ్యవాద సంస్కృతి స్వార్థాన్ని, వ్యక్తివాదాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పీడిత ప్రజల సేవకు, వారి విముక్తికి అంకితమైన శ్రీధర్ వంటి వ్యక్యులు ఎక్కువ మంది నేటి పరిస్థితిలో కనిపించరు. ఒక మనిషిది ఏ వర్గం, ఏ కులం, ఏ రాష్ట్రం, మహిళా, పురుషుడా అనేది ముఖ్యం కాదు. దేనికోసం జీవించారు, దేనికోసం మరణించారు అనేది ముఖ్యం. జీవించిన కొద్దికాలంలో పై లక్ష్య సాధన కోసం జీవించటం అనేది ముఖ్యం. కామ్రేడ్ శ్రీధర్ పై విషయాలకు ప్రతీకగా నిలిచారు. తన మూడున్నర దశాబ్దాల విప్లవ జీవితంలో మహారాష్ట్రలోనూ, భారతదేశంలోనూ నూతన ప్రజాస్వామిక విప్లవ సాధనలో ఎదురైన కష్టనష్టాలను అధిగమించి తన జీవితాన్ని త్యాగం చేశాడు. ఆయన మనతో లేకపోయినా తోటి కామ్రేడ్స్‌తో ఉన్నప్పుడు కుటుంబ సభ్యులతోనూ, స్నేహితులతోనూ పంచుకున్నటువంటి మరిచిపోలేని గుర్తులు మనవద్ద ఉన్నాయి. ఆయనతో పరిచయమున్నవారు ఆ గుర్తులను చిరకాలం తమ మనసులో ఉంచుకుంటారు. ఆయన కృషి, ఆయన స్మృతులు పీడిత ప్రజల విముక్తి పోరాటంలో కొనసాగుతాయి. మొత్తం పార్టీ, పి.ఎల్.జి.ఏ., విప్లవ ప్రజాసంఘాల తరపున కేంద్రకమిటీ ఆయన అమరత్వానికి విప్లవ నివాళులర్పిస్తూ సోషలిజం, కమ్యూనిజం ఎర్రపతాకను ఎత్తిపట్టి, ఆయన అనుసరించిన కార్మికవర్గ విలువలను, ఎం.ఎల్.ఎం. సిద్ధాంతాన్ని, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ విప్లవ పోరాటాన్ని కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నది. ○

# విప్లవోద్యమ ఎగుడుదిగుళ్లలో దృఢంగా నిలిచి నాయకత్వాన్నందించిన కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ శ్రీధర్ మనందరికీ సదా ప్రేరణను ఇస్తూనే ఉంటారు !



సి.పి.ఐ.(మావోయిస్టు) కేంద్రకమిటీ సభ్యులు, మహారాష్ట్ర రాష్ట్రకమిటీకి గతంలో కార్యదర్శిగా ఉండిన కామ్రేడ్ శ్రీధర్ శ్రీనివాసన్ (విష్ణు, విజయ్) 2015 ఆగస్టు18వ తేదీ ఉదయం 9-45 నిముషాల ప్రాంతంలో తీవ్రమైన గుండెపోటు రావటంతో అమరులైనారు. మావోయిస్టు ఉద్యమ ప్రాంతంలో అనేక మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పి.ఎల్.జి.ఎ. గెరిల్లా యోధుల నడుమ ఆయన తుదిశ్వాసను విడిచారు. ఆయన వయస్సు కేవలం 57 సంవత్సరాలు మాత్రమే. ఉద్యమ ప్రాంతంలోకి రాకముందు బయట జరిగిన వైద్య పరీక్షలలో ఆయనకు ఇటువంటి ఆకస్మిక ప్రాణాంతక వ్యాధులున్నట్లు సూచనేమీ లేదు. గతంలో కూడా ఈ రకమైన సమస్యను ఎన్నడూ ఎదుర్కొలేదు. ఆయన ఊహించని విధంగా అకస్మాత్తుగా చనిపోయాడు. 2007లో అరెస్టు జరిగి, ఆరున్నర సంవత్సరాల జైలు జీవితం ఆయన ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపింది. 2013 ఆఖరులో జైలు నుండి విడుదలై సురక్షితంగా పార్టీ నాయకత్వాన్ని కలుసుకునేందుకు సంవత్సరంన్నర పాటు వేచి ఉన్న తర్వాత కఠినతరమైన ప్రయాణం చేసి ఉద్యమ ప్రాంతానికి పోవటానికి ఎటువంటి సంకోచాలు లేకుండా విప్లవ చైతన్యాన్ని ప్రదర్శించి ముందుకే సాగిపోయాడు. ఈ ప్రయాణ క్రమంలోనే ఆయన ఆకస్మిక అమరత్వం చోటు చేసుకుంది. పలువురు నాయకత్వ కామ్రేడ్స్, వివిధ కమిటీల సభ్యులు మరియు పి.ఎల్.జి.ఎ. యూనిట్ల నడుమ ఉద్యమ ప్రాంతంలో పార్టీ పద్ధతులలో ఆయన అంత్యక్రియలు జరిగాయి. ఆ సందర్భంలో ఉన్న కామ్రేడ్సందరినీ ఈ ఘటన కదిలించింది. బరువైన హృదయాలతో స్మారకసభను జరిపి ఆయనకు విప్లవ నివాళులర్పించారు. భారత నూతన ప్రజాస్వామిక విప్లవానికి ఆయన చేసిన కృషినీ, పీడిత ప్రజలకు అలుపు లేకుండా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన లోని కార్మికవర్గ దృఢత్వాన్నీ, కమ్యూనిస్టు ఆదర్శాలనూ స్వంతం చేసుకొని ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకెళ్తామని ప్రతిజ్ఞ చేశారు.

## విప్లవకారునిగా మారిన క్రమం

ఒక వ్యక్తి విప్లవకారునిగా మారటంలో దేశంలోని వస్తుగత విప్లవ పరిస్థితీ, దానికి తోడు ఒక విప్లవ పార్టీ కొనసాగటమూ, అనుకూలమైన ప్రజాస్వామిక సామాజిక పరిస్థితులలో ప్రగతిశీల ఉదారవాద భావాలున్న కుటుంబంలో ఉన్న వ్యక్తికి సహజంగానే విప్లవ భావాలు నాటుకోవటానికి అవకాశం ఉంది. అటువంటి ప్రగతిశీల దృక్పథం, ప్రజాస్వామిక వాతావరణం కలిగిన కుటుంబంలో కామ్రేడ్ శ్రీధర్ పెరిగాడు. పట్టణ మధ్యతరగతికి చెందిన వీరి కుటుంబంలో ఐదుగురు సంతానంలో ఈయన చిన్నవాడు. వీరి తల్లిదండ్రులు పిల్లలందరికీ చిన్నతనం నుండే పుస్తక పఠనాసక్తిని పెంచారు. శ్రీధర్ చిన్నతనం నుండీ పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పొందాలనే తనివి తీరని దాహంతో ఉండేవాడు. ఆయన పెద్దన్నయ్య ప్రభావంతో గణితం, విజ్ఞానశాస్త్రాలు, అంతరిక్ష భౌతిక శాస్త్రంలో విశేషమైన ఆసక్తిని ఏర్పరచుకున్నాడు. పిల్లల చదువుల పట్ల వీరి తల్లిదండ్రులకు ధ్యాస ఎక్కువ ఉండేది. అయినప్పటికీ వారి ఇష్టాలకు అనుగుణంగానే వారికి స్వేచ్ఛ ఇచ్చారు. అన్నదమ్ములకు భిన్నంగా శ్రీధర్ కాలేజీ చదువుల నుండి విప్లవోద్యమంలోకి పూర్తికాలం కార్యకర్తగా ఎం.ఎల్. పార్టీ సభ్యునిగా తయారైనప్పుడు ఈయన ఎంచుకున్న మార్గాన్ని కుటుంబం సమర్థించలేదు. ఐనప్పటికీ ఆయన సుదీర్ఘ విప్లవ జీవితంలో ఆయా సందర్భాలలో అవసరమైనప్పుడు కుటుంబ సభ్యులు ఆయనకు మద్దతు ఇచ్చారు.

## మహారాష్ట్ర విప్లవోద్యమంలో కీలకపాత్ర

భారత విప్లవోద్యమంలో మహారాష్ట్రకు, ముంబాయి నగరానికి ఒక ప్రత్యేకత ఉంది. ముంబాయి బూర్జువా వర్గానికి ఆర్థిక కేంద్రంగా ఉండి, దేశానికి వాణిజ్య రాజధానిగా ఉండి, విశాలమైన కార్మికవర్గాన్ని కలిగి ఉంది. అనేక మిలిటెంట్ కార్మికవర్గ, రైతాంగ పోరాటాలకు కేంద్రమైనప్పటికీ, రివిజనిజానికీ మరియు బ్రాహ్మణ హిందూ ఫాసిజానికి కోటగా కూడా ఉంది. గొప్ప దళిత ఉద్యమాలనూ, విప్లవ ఆదివాసీ ఉద్యమాన్ని కూడా కలిగి ఉంది. ఈ అన్ని రకాల ప్రత్యేకతలను కలిగి ఉండి కమ్యూనిస్టు విప్లవకారుల ముందు మహారాష్ట్ర మరియు ముంబాయి అనేక సవాళ్లనుంచింది. 1977 మార్చిలో ఫాసిస్టు ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ కారుమేఘాలు దేశమంతా కమ్మినప్పుడు దానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెల్లుబికిన రాజకీయ ఉద్యమాలలో మార్క్సిస్టు-లెనినిస్టు విప్లవకారులు కూడా నాయకత్వం వహించి పాల్గొన్నారు. ఎమర్జెన్సీ అనంతర రాజకీయ పరిస్థితిలో విద్యార్థులలో మార్క్సిజం వేడి వేడి చర్చనీయాంశంగా ముందుకొచ్చింది. నక్సల్బరీ ఆందోళనతో ప్రభావితులైన వారు ముంబాయి నగరంలో మార్క్సిస్టు అధ్యయన కేంద్రాలను ఏర్పరిచారు. దక్షిణ ముంబాయిలోని ఎల్ఫిన్‌స్టోన్ ప్రభుత్వ కాలేజీలో అటువంటి

*(మిగతాది 56వ పేజీలో...)*